రాఘవాచార్య, చక్రపురి

నలచరిత్రము : ద్విపదకావ్యము

Madras, 1916

Rāghavācārya, Cakrapuri

Nalacaritramu : dvipadakāvyamu

Madras, 1916

Record no. 316

Bibliographic Record Target

రాఘవాచార్య, చక్రపురి.

నలచరిత్రము : ద్విపదకావ్యము / రాఘవాచార్యవిరచితమగు ఈద్విపద కావ్యము త. తేవప్పెరుమాళ్లయ్యగారిచేఁబరిశోధితము.-1. కూర్పు.- Madras : వేమూరి వేంకటకృష్ణమసెట్టి & సన్సు, 1916.

(1), 3, 265 p. ;18 cm.

Record no. 316

Rāghavācārya, Cakrapuri.

Nalacaritramu : dvipadakāvyamu / Rāghavācāryaviracitamagu īdvipadakāvyamu Ta. Tēvapperumāḷlayyagāricēm̐bariśōdhitamu.- 1. kūrpu.- Madras : Vēmūri Vēṅkaṭakṛṣṇamaseṭṭi & Sansu, 1916.

(1), 3, 265 p. ;18 cm.

Record no. 316

నలచరిత్రము.

ద్విపదకావ్యము

PRINTED AT THE PROGRESSIVE PRESS, MADRAS.

శ్రీ ర స్తు.

శ్రీరాఘవాచార్యవిరచిత మగు

నలచరిత్రము.

ద్విపద కావ్యము

త. శేవప్పెరుమాళ్లయ్యగారిచేఁ

బరిశోధితము.

మొదటికూర్పు.

వేమూరు, వేంకటకృష్ణమశ్శెట్టి & సన్సువారిచేఁ

ప్రకటితము.

MADRAS.

1916

[As. **12.**

విజ్ఞప్తి.

ఈ నలచరిత్రము ద్విపదకావ్యమును రచించినకవి దీని తుదను తానె వ్రాసియున్న

'అనుచు వాధూలగోత్రాబ్ధి చంద్రుండు
చిరకీర్తిమంతుఁ డాశ్రితహితోదయుఁడు
రమణనే వరకవి రాఘవాహ్వయుఁడ'

ను వానింబట్టి వాధూలగోత్రుండును దొడ్డయాచార్యశిష్యుండును నగు చక్రపురి దొడ్డయాచార్యులకుఁ బుత్రుండగు రాఘవాచార్యులని తెలియుచున్నది. ఇంతకన్న నెక్కుడీకవిని గూర్చి కవిజీవితాదులందును గానరాదు. కాన కవినిగూర్చిన వృత్తాంత మింతకును సామాన్యముగాఁ దెలియకున్నది.

ఇందలి కవనము మృదువుగను మధురముగను నున్నది. మొత్తమునకు శైలి రసవంతమై రమణీయముగా నున్నది. కాని వ్యాకరణదుష్టములగు ప్రయోగములు పెక్కులు కానఁబడుచున్నవి. ఆదోషము లాయాయెడలఁ బుటల క్రిందనే రూపించి యుండుటచే నిట వేఱుగ నెత్తిచూపుట యనావశ్యకము.

ఈగ్రంథమును ముద్రితమగు ప్రతియందుఁ గొన్నిగ్రంథపాతములు కనఁబడఁగాఁ బ్రాచ్య లిఖితగ్రంథభండారమునందలి వ్రాఁతప్రతుల రెండొకటిని దోడుసేసికొని యయ్యె లుప్తభాగములను గూడఁజేర్చి యథామతి యథాశక్తిని దోషములం సవరింపించి ముద్రితము గావించినారము. ఇందలి దోషము లభిజ్ఞులు తెలుపుచుండేని కృతజ్ఞతతోఁ బునర్ముద్రణమున సవరించుకొనఁగలవారము.

ఇట్లు,
వే. వేంకట కృష్ణమసెట్టి&సన్సు.

విషయసూచిక.

ప్రథమభాగము.

ద్వితీయభాగము.

తృతీయభాగము.

చతుర్థభాగము.

పంచమభాగము.

నలచరిత్రము.

ద్విపద

దేవతాప్రార్థనాదులు.

శ్రీగణపతిని మహాత్ముని
నాగమసంవేద్యులైన హరుని భవానిన్
భోగీశశయుని లక్ష్మిని
బాగుగఁ బద్మజుని వాణిఁ బ్రస్తుతిసేతున్.

శ్రీశారదాధీశుఁ జిరకృపావేశు
వాసవనుతవేషు వరభక్తపోషుఁ
బరమదయాకల్పుఁ బన్నగతల్పుఁ
గరిరాజరక్షు శ్రీకౌస్తుభవక్షుఁ
గౌరవకులశిక్షుఁ గంజదళాక్షు

టీ॥ ఆగమ సంవేద్యులు = వేదములచేత మిక్కిలి తెలియఁదగినవారు_వేదములయందు ప్రతిపాదింపఁబడెడు వారనుట. భోగ + ఈశ శయుని = ఆదిశేషునిపై పవ్వళించు విష్ణుదేవుని, పద్మజున్ని = తామరయందు పుట్టిన బ్రహ్మను, శారదాధీశు = బ్రహ్మను, వాసవనుత = ఇంద్రునిచే స్తోత్రము చేయఁబడిన, దయా + ఆకల్పు = దయయే ఆభరణముగాఁ గలవాఁడు, పన్నగతల్పు = సర్పముపడుకగాఁ

వారిజాసనసేవ్య వర్ణితదివ్యుఁ
బరిపూర్ణశుభగాత్రుఁ బరమపవిత్రుఁ
బరమవైష్ణవహృద్యు భవరోగవైద్యు
దివిజకులాధీశు దీనమందారు
భవచాపహరణు భూభామినీరమణుఁ
బతగరాజతురంగుఁ బద్మాంతరంగు
సతతసద్గుణలోలు సత్యసంశీలు
దానవసంహారు ధర్మసంచారు
మానిమానసదీప్తు మహిసజ్జనాప్తు
నిరుపమజయబాణు నిత్యకల్యాణుఁ
గరుణారసోల్లాసు ఘటికాద్రివాసు
దేవాదిదేవు సందీప్తప్రభావు
గోవిందనాథేంద్రుఁ గొలిచి వేడుకను
క్షీరాబ్ధివరపుత్రి శ్రీజనయిత్రి
సారసనిభపాణి సైకతశ్రోణి
కామునితల్లి చక్కనికల్పవల్లి
రామాభిరామ నిర్భరపుణ్యధామ
యమితగుణోపేత యఖిలైకమాత

గలవాఁడు_విష్ణువు, వారిజాసన=బ్రహ్మ, హృద్యుఁడు= ఇంపయినవాఁడు, దివిజకుల=దేవతాసమూహము, భవచాపహరణు=శివునివిల్లు విఱిచినవాఁడు, పతగరాజ తురంగుఁడు=పక్షిరాజయిన గరుడుఁడు గుఱ్ఱముగా_అనఁగా వాహనముగాఁ_గలవాఁడు. పద్మ+అంతరంగుఁ=లక్ష్మికి కూర్చుచెలికాఁడు. సారసనిభపాణి=తామరలతో సాటియైన చేతులుగలది, సైకతశ్రోణి=ఇసుకదిన్నెవంటి పిఱుఁదులుగలది, ధామ=స్థానమైనది, ఇచట చోళంగిపురమం

యమృతవల్ల్యమ్మ మాయమ్మ పూబోమ్మ
చరణారవిందముల్ సన్నుతిఁ జేసి
యిరవొంద భూతపురీశు యతీశు
శేషావతారు సంచితదయాకారుఁ
బాషండకులదూరుఁ బాపసంహారు
సరస నాసూరి కేశవగురుపుత్రుఁ
జితకీర్తిగంభీరు శ్రీభాష్యకారు
మతిలోన నుతియించి మఱి ప్రస్తుతించి
యతిభక్తితో మ్రొక్కి యర్చించి కొలిచి
శ్రితజనాధారు సంచితకీర్తిహారు
సతతసద్గుణలోలు సత్యసంశీలుఁ
గందర్పసంకాశుఁ గరుణానివేశుఁ
గందాళగురుచంద్రు ఘనదయాసాంద్రుఁ
బరమదయాకారు భక్తమందారు
సురనగసమధీరు సుజనవిహారు
వరపుణ్యచారిత్రు వాధూలగోత్రు
దురితఖండనశౌర్య దొడ్డయాచార్యు
మఱవక సేవించి మదిఁ బ్రస్తుతించి
పరమయోగధ్యానపరులైన మాని
వరుల కెల్లను నేను వరుసతో మ్రొక్కి

దుండు నరసింహస్వామి, అమృతవల్లితాయారును స్తుతించుట తెలియుచున్నది. సంచితకీర్తిహారు=ఒప్పుచున్న కీర్తియనెడు హారముగలవాఁడు_ముత్తెపుహారమువలె తెల్లనయినకీర్తిగలవాఁడనుట. కందర్పసంకాశు=మన్మథునికిసాటియైన

కోరి పూర్వాచార్యకోటిఁ బూజించి
పరమవైష్ణవుల నేర్పడఁ బ్రస్తుతించి
సరసిజాసనురాణి జలజాతపాణి
సకలవిద్యల మాత సద్గుణోపేతఁ
బ్రకటితశారదాంబను బ్రస్తుతించి
వ్యాసవాల్మీకాది వరమునీశ్వరుల
భాసురమతితోడఁ బ్రస్తుతిసేసి
కవినాయకులనెల్లఁ గ్రమమునఁ దలఁచి
దివిజపాలునకు సుస్థిరదయాళునకుఁ
గమలవల్లభునకుఁ గమలనేత్రునకు
సమరారిహరునకు నాదిదేవునకు
జలధివంద్యునకు భూజనసేవితునకు
నలువయినఘటికాద్రి నారసింహునకు
నంకితంబుగఁ జేసి యవనిలోపలను
గొంకక నీకథఁ గోరిక సభల
వెలయఁ బ్రఖ్యాతిగా వేడ్కఁ జెన్నొంద
సలలితమతితోడ సజ్జనగోష్ఠిఁ
దెలిపెదనే నిది ద్విపదకావ్యమున
వల నొప్పునలచక్రవర్తిచారిత్ర
విరచింతు నానేర్చువిధమునఁ దెలియఁ
గర మొప్పఁ దత్కథాక్రమ మెట్టి దనినఁ

వాఁడు, సురనగ = మేరుగిరి. కమలవల్లభునకు = లక్ష్మియొక్క పెనిమిటికి.

అవతారిక.

పరమపావనుఁ డయినపాండునందనుఁడు
ధరయెల్లఁ గల్లజూదంబున నోడి
కౌరవాగ్రజుపాలు గావించి ద్వైత
ఘోరాటవులకుఁ బొక్కుచు నేఁగి యచటఁ
దనతమ్ములును దానుఁ దనకూర్మిసతియు
మునివేషములు దాల్చి మోదంబు దక్కి
విహరించుచుండిరి విధివశంబునను
మహిమతోడను భూతి మైనిండ నలఁది
యరుదైనరుద్రాక్షహారముల్ వేసి
యురవుకెంజడలెల్ల నొగిఁ జుట్టి కట్టి
పరఁగఁ గృష్ణాజినాంబరము ధరించి
కరమునఁ జెన్నొందఁగాఁ గమండలువు
ధరియించి జపమెన్న దండ చేనుంచి
పరువడి వరయోగపట్టె ధరించి
ఘనతరంబుగఁ బాదుకలుఁ వేడ్కఁ బెట్టి
మునినాథు లిరుపార్శ్వములఁ గొల్వరాఁగ

—* పాండవులయొద్దకుఁ బృహదశ్వుఁడువచ్చుట. *—

నరుదార బృహదశ్వుఁ డనుమునీశ్వరుఁడు
కరుణతో వేంచేయఁగాఁ జూచి పాండు

టీ. పాండునందనుఁడు = ధర్మరాజు. ఉరవుకెంజడలు = అధికమైనజటలు,

తనయుండు దమ్ములు దానును వేగ
చనుదెంచి యెదురుగా సంయమీశ్వరుని
చరణాంబుజములకుఁ జయ్యన మ్రొక్కి
యరుదుగా నర్ఘ్యపాద్యాదిసత్కర్మ
వితతులఁ బూజించి వినతులఁ జేసి
యతిభక్తిఁ గొనివచ్చి యర్హాసనమున
నునిచి చేతులు మోడ్చి యురుతరభక్తి
ననియె నమ్మునితోడ నారాజవిభుఁడు
'పరమయోగధ్యాన పావనస్థాన
చిరదయానిధి మీకు క్షేమమే' యనిన
విని మునీంద్రుఁడు ధరావిభున కిట్లనియె
'జననాథ! నీవంటిసత్యసంధుండు
గలుగుట క్షేమంబ కలుగునుగాక
యిల శ్రమమ్ములు మించి యేటికి వచ్చు
ధరణీతలేశ నీతమ్ములు నీవుఁ
బరిణామమే'యని పరికించి యడుగ
మనమునఁ జింతించి మఱి పాండుసుతుఁడు
తనమది నొచ్చి యత్తపసి కిట్లనియె
'దేవ! దయాసాంద్ర! దేవేంద్రవంద్య!
ఈవేళ మాసౌఖ్య మేమన వినుము
కపటజూదంబునఁ గౌరవేంద్రునకు
విపులసంపదలెల్ల విడువంగఁ గలిగె

వితతులన్ = సమూహములచే, ఉరుతర = చాలగొప్పదియైన, విపుల = అధికమగు,

నదియాదిగాఁగ నీ యారణ్యభూమి
ముదములఁ దక్కి యాముదితతోఁ గూడి
తమ్ములు నేనును దపసివేషంబు
నిమ్ముల ధరియించి యిట్లుండఁ గలిగె
నాఁకటివేళకు నన్నంబు లేక
నాకులుకాయలు నలసి భక్షించి
దినమొక్కయేఁడుగా దీనతఁబొంది
యెనసి యీయడవిలో నిట్లుండఁ గలిగెఁ
బరతెంచు నష్టదిక్పతులనునైన
ధరలోన సాధింపఁ దగినసోదరులు
శూరత్వములు మాని సుఖములు డించి
ఘోరాటవులలోనఁ గూర్చుండఁ గలిగె
ద్రుపదనందన యిట్టిదుర్దశ నొంది
విపులశోకంబున వేఁగింపఁ గలిగెఁ
జిత్రశయ్యలయందుఁ జెలఁగి నిద్రించి
పత్రశయ్యలయందుఁ బవళింపఁ గలిగె
సంగీతవిద్యా ఘోషంబు లాలించి
సింగంబుకూఁతకుఁ జెవియొగ్గఁ గలిగె
నారామసీమల నలర వర్తించి
యారణ్యసీమల నడలంగఁ గలిగె
హితవుగ నతపురోహితులతో నుండి
మితిలేనిమృగముల మెలఁగంగఁ గలిగె
వెల లేనికపురంపు వీడెముల్ చేసి

నలపి యాకులువేళ్లు వమలంగఁ గలిగె
జాతిగంధము మేన సరవితోఁ బూసి
భూతిగంధము మేనఁ బూయంగఁగలిగె
నిటువంటిసుఖముల కిరవైతి వయ్య
కటకటా! దయలేక కౌరవాగ్రజుఁడు
నెఱుఁగక యిటుసేసె నేమన వచ్చుఁ
బరమయోగీంద్ర నాభాగ్య మిట్లుండెఁ
బుట్టిపోయినవారు పుట్టినవారు
పుట్టఁబోయెడివారు భూలోకమునను
దాయాదివారిచే ధరయెల్ల నోడి
పోయి మావలె వనభూమిలో నిట్లు
పొంది యీవెతలను బొందినవార
లెందైనఁగలరె మీ రెఱిఁగినయెడల'
ననవుడు మునిచంద్రుఁ డారాజుఁ జూచి
ఘనకృపారస మొలుకంగ నిట్లనియె
'ఇదియేమి! జననాథ! ఇంతగా నీవు
మదిలోన నిట్లాడ మఱచితి నీతి
పోపొమ్ము మఱియేమి బుద్ధులు మీకుఁ
బ్రాపించెఁ జింతింపఁ బనిలేదు వినుము
తొల్లి చేసినయట్టిదుష్టకర్మముల
నెల్లఁ బొందక విధియేల పోనిచ్చుఁ
గమలారిధరునకుఁ గమలగర్భునకుఁ

జాతిగంధము = మేలయినగంధము, సరవి = క్రమము, ఇరవు=చోటు_ఆస్పదము. కమలారిధరునకుఁ=చంద్రునిధరించినశివునకు, కమలగర్భునకుఁ=

గమలేశునకు శతక్రతునకు నైనఁ
గొన్నాళ్లు దుఃఖంబు కొన్నాళ్లు సుఖము
కొన్నాళ్లులేమియుఁ గొన్నాళ్లుకలిమి
వసుమతి సమముగా వర్తించుచుండు
వసుమతీశ్వర యింతవగ పేల నీకు
నదిగాక యేదుఃఖ మందితి రిలను
ముదమొప్ప మావంటిమునులు మీకడకుఁ
జనుదెంచి నిత్యము సకలశాస్త్రములు
వినిపించెదరు మీకు వేర్వేఱ యింకఁ
దమ్ములఁ బాసితో తరుణిఁ బాసితివో
సమ్మతి గానివేషమును జెందితివొ
కరిపురంబున నీవు క్రమముతోనున్న
వరుసతో నిచటికి వత్తుము మేము
పుణ్యవేళలయందుఁ బుణ్యతీర్థములఁ
బుణ్యుఁడై క్రుంకుచుఁ బుణ్యముల్ సేసి
పితృవేళలందును బితృకార్యములను
నతిభక్తితోఁ జేసి యఘములు ద్రోచి
యిటువంటిసుఖముల కిరవుగా నుండి
కటకటా! నీవు శోకముఁ జెందఁ దగునె
వసుధ నాపదఁ బడ్డవారలలోనఁ
బొసఁగ నేయాపదఁ బొందితి విపుడు
జననాథ! నీకింత సంతాపమేల
వినుముచెప్పెద నీకు విశదంబుగాను

బ్రహ్మకు; కమలా+ఈశునకుఁ = లక్ష్మీపతియైన విష్ణువునకు, శతక్రతుఁ

నవనిలో నలనాథుఁ డనుమహారాజు
ప్రవిమలసత్యసంపన్నుఁడు ఘనుఁడు
వినుతి కెక్కినబాహువిక్రమోన్నతుఁడు
వినయభూషణుఁ డతివిమలమానసుఁడు
గురుభక్తినిరతుండు గుణవిశారదుఁడు
కరుణాపయోనిధి గాంభీర్యధనుఁడు
ధరణి షోడశమహాదానవినోది
యరుదైనసకలశాస్త్రార్థకోవిదుఁడు
చిరపుణ్యమతి వీరసేనునిసుతుఁడు
తరణివంశజుఁడు కందర్పసన్నిభుఁడు
నిరుపమవిజయుండు నిషధేశ్వరుండు
పరమపావనుఁడు శ్రీపతిభక్తియుతుఁడు
సురరాజనిభుఁడు భూసురవర్ణనీయుఁ
డరిబలగహనమహానలుం డరయ
నలునిపట్టపురాణి నలినాయతాక్షి
యలివేణి దమయంతి యనియెడియింతి
పరమపతివ్రత బహుగుణాభరణ
కరిరాజగమన చక్కనిచంద్రవదన
తనయుఁడు వంశవర్ధనుఁ డొక్కరుండు
మనుజేశ్వరునకు గొమార్తయు నొకతె
యిలయేడుదీవుల నేలెడురాజు

డు=ఇంద్రుఁడు. వసుమతి=భూమి. కరిపురంబు= హస్తినాపురము. తరణివంశ
జుఁడు=సూర్యవంశమున పుట్టినవాఁడు. అరిబలగహన మహానలుఁడు=శత్రువుల

వలనొప్పఁ బుష్కరవసుధేశుతోడ
నవనీశ నీవలె నన్యాయజూద
మవిరళంబుగ నాడి యట మోసపోయి
పురవరం బెడఁబాసి భూములఁ బాసి,
తురగంబులను బాసి దొరలను బాసి
ఘనరథంబులఁ బాసి గజములఁ బాసి
ధనములఁ బాసి ప్రధానులఁ బాసి
వరపుత్రులను బాసి వనితను బాసి
పరమాప్తులను బాసి భటకోటిఁ బాసి
సకలబంధులఁ బాసి సకలంబుఁ బాసి
చకితాటవుల కేఁగి చానతోఁగూడి
కట్టఁ బుట్టములేక కాంతపైకొంగు
కట్టుక నడవిలోఁ గడుదుఃఖ మంది
యాఁకటిచేఁ జాల నలజడిపడుచు
నాకులుఁ గాయలు నలము భక్షించి
కలిరాజు పన్నినఘనమైనమాయ
తెలియ కిద్దఱు రెండుతెరువులుపట్టి
తరళాక్షి నెడఁ బాసి ధరణీశుఁ డడల
ధరణీశు నెడఁబాసి తరలాక్షి యడలఁ
దమ్ముఁ గొల్చినవారిఁ దాము సేవించి
యిమ్ముల నుండిరి యిలఁ గొంతకాల
మరిగినపిదప శ్రీహరికృపచేత

సైన్యమనెడు అడవికి పెద్దనిప్పయినవాఁడు. చకిత=భయపడిన-భయంకర

నురురాజ్యసుఖమున నుండిరి తొల్లి.
అందు సహస్రాంశ మైనను గలదె
యిందువంశజ నీకు నెనసినకష్ట
మనవు డత్యాశ్చర్య మంది యా రాజు
ఘనభక్తి మునిరాజుఁ గనుఁగొని పలికె
వరమునినాథ! నావలె నలాధిపుఁడు
ధరయెల్లఁ గల్లజూదంబున నోడి
యిటువంటియడవికి నెబ్బంగిఁ బోయెఁ
దటుకున నిట్టిజూదంబులు మున్ను
గలిగియుండుటఁ బూనెఁ గౌరవాధిపుఁడుఁ
దలఁచి పల్మఱు దూఱఁ దగ దింక నలుని
చారిత్రమంతయు సాంగంబుగాను
గారవంబున వినఁ గడువేడ్క పుట్టె
వినిపింపు'మనిన భూవిభుఁ జూచి మౌని
తనమదిలో బృహదశ్వమహర్షి
యానందమును బొంది యందంద మెచ్చి
ధ్యానించి నలునిసత్కథఁ జెప్పఁదొడఁగె.

శ్లో. కర్కోటకస్య నాగస్య దమయంత్యా నలస్యచ
ఋతుపర్ణస్య రాజర్షేః కీర్తనం కలినాశనమ్.

మైనయనుట. పుట్టము=వస్త్రము. ఇందువంశజ=చంద్రవంశమున పుట్టినవాడా. ఎనసిన=పొందిన.

కథారంభము.

ప్రథమభాగము.

—* బృహదశ్వుఁడు పాండవులకు నలునిచరిత్రము చెప్పుట. *—

నిరుపమగతి నొప్పునిషధాపురంబు
నరయఁగ నుతికెక్కినట్టి పట్టణము
శ్రీకరనవహేమచిత్రగేహములు
ప్రాకారగోపురప్రాసాదతతులు
కనకంపుమేడలు ఘనమంటపములు
వినుతింపఁ దగునట్టి విపణిమార్గములు
కోటలు నట్టళ్లు కొలువుకూటములు
నాటకశాలలు నలినదీర్ఘికలు
కేలికావనములు కృతకాచలములు
బాలానిలంబులు బహుపుష్పతతులు
మహనీయదేవతామంటపంబులును
బహుచిత్రగతులచేఁ బరఁగుహర్మ్యములు
శృంగారవనములు చెఱకుతోఁటలును
సంగీతనిలయముల్ సరసులు మఱియు

టీ. హేమ=బంగారు, గేహములు=ఇండ్లు, ప్రాసాద=ఉప్పరిగలు, విపణి=అంగడివీథి, నలినదీర్ఘికలు= తామరలనడబావులు, కృతక+అచలములు= శిల్పముచేతపన్నినకొండలు. బాల+అనిలంబులు = శీతగాడ్పులు.

రంగు మీఱినయట్టి రజతశైలములు
చెంగావిటెక్కెముల్ చిత్రశాలలును
కోమరారు ముత్యాలగొడుగులు మఱియుఁ
గమనీయవజ్రసంగతకవాటములు
వారణశాలలు వాజిశాలలును
మేరుశైలముకన్న మించుతేరులును
బచ్చతోరణములు బహువిలాసములు
నచ్చుగా గొప్పముత్యములముగ్గులును
విమలభూషణములు విహరించుహరులు
నమరభూజములతో నమరినతరులు
వారాశి కిరవైనవరతటాకములు
చారురత్నంబుల సౌధవాటికలు
వేద శాస్త్ర పురాణ విద్య లన్నిటికి
నాదిమై వర్తించు నట్టిభూసురులు
రాజులు బలపరాక్రములు రాహుతులు
భూజన నుతులైనబుధులు బాంధవులు
ధనదుని పురినైన ధరయెల్లఁ జూఱ
గొని దాఁపఁ గలవైశ్యకోటి చెన్నొంద
హరిభక్తియుతులైనయట్టిశూద్రులును
సరసులు సత్కవీశ్వరులు పాఠకులు
కాముకులును వారకాంతాజనంబు

వారణ=ఏనుఁగు. వాజి=గుఱ్ఱము. అమరభూజములు = దేవతావృక్షములు. తరులు=వృక్షములు. సౌధవాటికలు=మేడలవరుసలు. భూసురులు=బ్రాహ్మ

కామితార్థము లెల్లఁ గలుగునంగళ్లు
నానావినోదముల్ నడుపునాటకులు
మానితపతిభక్తిమతులైనసతులు
మదనుని మించినమగలును మిగుల
మదగజంబుల నిల్పుమల్లులుఁ గలిగి
పురుహూతుఁ డేలెడి పురమొక్కొ యనఁగ
ధరణిదేవికి ముఖదర్పణం బనఁగఁ
బురముల కెల్లను భూషణం బగుచు
నిరుపమగతి నొప్పు నిషధాపురంబు.
ఆపురాధీశ్వరుఁ డమలమానసుఁడు
భూపాలచంద్రుఁడు భుజబలోన్నతుఁడు
గర్వితరిపుగజకంఠీరవుండు
సర్వజ్ఞుఁ డత్యంతసాహసోన్నతుఁడు
నాకేశసుతకీర్తి నలచక్రవర్తి
యేకచక్రంబుగా నేలుచు నుండె
వారక నెల మూఁడు వర్షముల్ గురియు
జారులు లే రనాచారులు లేరు
విరసంబు తిరిపంబు వెతకిన లేదు
వరుసతోఁ గలహించువారును లేరు.
అంగహీనులును లే రరసి చూడఁగను
నంగజుకైవడి నమరి యుండుదురు

ణులు. మదనుని=మన్మథుని. పురుహూతుఁడు=ఇంద్రుఁడు. గర్విత...కంఠీరవుఁడు=గర్వించినశత్రువులు అనెడుఏనుఁగులకు సింహమైనవాఁడు. నాకేశ=

నూఱు మాడలకు మున్నుగ రూక వడ్డి
యేరు కిర్వది నాలుగెద్దులు దున్న
పదిపాళ్ల కొకపాలు పార్థివేంద్రునకుఁ
గొదవ తొమ్మిది పాళ్లు కొనుఁ బంటకాఁపు.
ఒలయుచుఁ బుట్టికి నొకరూక పన్ను
గలిగి వర్తించు నాకాలంబునందు
నిల నవగ్రహదోష మెన్నఁడు లేదు
పలుమాఱు దున్నక పండు సస్యములు
గోవులు పితుకక కురియుచు నుండు
నేవేళ భూమి పాలేఱులు గలిగి
కూర్మి సస్యంబులఁ గూడి రహించు
ధర్మము నాల్గుపాదమ్ముల నడచు
హరి హర బ్రహ్మాదు లద్భుతం బంద
హరువుగా నేఁబది యాఱు దేశముల
ధరణీశ్వరులచేతఁ దగినకప్పముల
నిరవొందఁ గైకొని యిలయేడు దీవు
లెఱుఁగ గాయక పురోహితులు నాశ్రితులుఁ
బరమపావను లైన బ్రాహ్మణోత్తములు
మతిమంతు లైనట్టి మంత్రిపుంగవులు
నతిభక్తితోఁ గొల్వ నావిష్ణుచక్ర
మరయుచుఁ బంపు సేయఁగ నలాధిపుఁడు
చిరలీల రాజ్యంబుఁ జేయుచు నుండె

ఇంద్రుఁడు. ఏరు = మడక. హరువుగాన్ = అందముగా. పంపు = ఆజ్ఞ.

నంతట నాదేశ మం దొక్కయెద్దు
వింతగా నడవిలో విహరించు చుండఁ
గనుఁగొని యొక్కవ్యాఘ్రం బోర్వ లేక
మనమునఁ గోపంబు మల్లడి గొనఁగఁ
బలికె 'నోహో! యింతభయమును లేక
వెలయ నాయడవిలో విహరించు టెట్లు?
చెలరేఁగి యేను గర్జించితినేని
యిల మృగసంఘంబు లెల్ల భీతిల్లు
నీ బాహుబలమెంత! నీవార లెంత!
నా బాహుబలిమికి నరు లెంతవారు!
కలఁగక నన్నింతఁ గైకొన కీవు
నలరెదు బలివైతె యందుల కేమి?
ధారుణి నలు నిమిత్తంబునఁ గాదె
యీ రీతి గర్వించి తిది యెంత నాకు
నలరాజు సత్య మెన్నాళ్లు వర్ధిల్లు
నిల నిట్టిరాజేంద్రు లెందఱో తొల్లి
యేలి పోయినవార లీనలుం డెంత
కాలంబు రాజ్యభోగమున వర్తించు
నేవిధంబున నైన నే నిన్నుఁ బట్టి
వావిరి నా గోళ్ల వడి డొక్కఁ జించి
గొబ్బునఁ గుత్తుకఁ గొఱికి రక్తంబు
నబ్బుచు మత్క్రోలకున్న నే పులికి

మల్లడిగొనఁగన్ = పెనఁగొనఁగా. బలివి = బలవంతుఁడవు. కుత్తుక = గొంతు.

బుట్టినవాఁడనే పొందుగా నీకుఁ
బుట్టినవాఁడ నమ్మము మహోక్షమ్మ'
యని యిట్లు పులి పల్కి నంతలోపలను
ఘనగిరు లదర దిక్కరు లెల్ల బెదర
సుర లరుదంద రక్షోతతి గుంద
నరులు చింతిల్ల కిన్నరులు భీతిల్ల
దివిజులు వెఱఁగంది దివినుండి చూడ
భువి యెల్లఁ గదల నంబుధు లెల్లఁ గలఁగఁ
బెనుపర్వుతోడ గంభీరంబుతోడ
వినువీథిఁ బఱతెంచి విస్మయంబుగను
సరగున నావిష్ణుచక్రంబు తొల్లి
కరిఁ గాచి నక్రంబు ఖండించినట్లు
తక్కక వ్యాఘ్రంబుతల ద్రుంచి వైచి
గ్రక్కునఁ గమలాత్మకడకు నేతెంచె
నటుగాన యారాజు నతులసత్యమునఁ
బటుగతి దోషముల్ ప్రబలంగ నీక
నతివేడ్క రాజసూయాశ్వమేధాది
క్రతువులు చేసియుఁ గమలాసనాది
దేవత లెల్లఁ గీర్తింప శోభిల్లి
యీ విధంబున జగం బేలుచు నుండె

మహోక్షమ్మ=గొప్పయెద్దా. దివిజులు=దేవతలు. వెఱఁగు అంది = ఆశ్చర్యము పొంది. అంబుధులు=సముద్రములు. వినువీథి=ఆకాశమార్గము. పఱతెంచి=వచ్చి, కరి=ఏనుఁగును. నక్రంబున్=మొసలిని. 'అతివేడ్క' 'బాహుబలిమి' ఇట సాంస్కృతికావ్యయాదులతో శుద్ధాంధ్రము సమసించుట విచార్యము. నక్రం-

నంతటఁ గొన్నాళ్ల కతిచిత్రముగను
సంతతగతిని వసంతకాలంబు
చనుదెంచె మందార జంబీరములును
బనస పిప్పల నింబ పారిభద్రములుఁ
జందన పున్నాగ సహకారములును
గుంద కురంటక కోవిదారములు
లుంగ లవంగ మాలూరవృక్షములు
సంగత ఖర్జూర చంపకంబులును
సురపొన్నలును మంచి చూతపోతములు
కురవకంబులు గేదఁగులు నశోకములు
పుల్లమామిళ్లు కర్పూరభూజములు
నల్లనియరఁటులు నారికేళములు
నారద పాటలీ నాగ తింత్రిణులు
గోరంట లరఁటులు కుటజభూరుహము
లాదిగాఁ గలిగినయారామభూమి
పాదుగా నప్పు డేర్పఱుపంగ నాకు
రాలి యొక్కట నతిరమ్యమై యుండ
నాలోనఁ జిగురించె నంతలోఁ గాచెఁ
బూచె ఫలించెఁ బుప్పొడి చల్ల గాలిఁ

బున్=మొసలిని. పారిభద్రములు=దేవదారువులు. పున్నాగ=పొన్నచెట్లు. సహకారములు=తియ్యమామిడిచెట్లు. కుంద=మల్లెలు. కురంటక=పువ్వులగోరంటలు. కోవిదారము =కానుగు. లుంగ=పుల్లమాదీఫలము. మాలూరములు=మారేడు లేక వెలఁగ. కురవక=ఎఱ్ఱగోరంట. నారద = నారింజ. పాటలీ = కలిగొట్టుచెట్టు. కుటజ=కొండమల్లె, ఆరామభూమి = ఉద్యానవనము.

వీచ నేలను వ్రాలె వింత వింతగను
బలుమాఱుఁ బలుమాఱు పంచవన్నియల
చిలుకలు తేనియల్ చిందఁ బల్కుచును
గోరి కోకిల లెల్లఁ గుమిగూడి ముద్దు
గారవవిధములఁ గలయఁ గూయుచును
నళులు జుమ్మనుచు నెయ్యమున మ్రోయుచును
నలరుల తేనియ లంది క్రోలుచును
శారికల్ గుమిగూడి సామగానములు
తిరుగ నందంద తెలియఁ బల్కుచును
జెలువొప్పఁ జూడ విచిత్రమై యిట్లు
వెలసిన నారామవీథి వినోద
మంతయుఁ జూడ నాయవనీశ్వరుండు
సంతసంబున మంత్రిజనులు బాంధవులు
హితులు గాయక పురోహితులు నాశ్రితులు
హితబుద్ధిఁ గొల్వంగ నేతెంచి వనము
గలయంగఁ గనుఁగొని కలకలధ్వనులఁ

బలికెడి రాచిల్కపలుకు లాలించి
కలకంఠ వర శారికా క్రౌంచు లాది
గలపక్షి సంతతిఁ గనుఁగొని మెచ్చి
విరుల తేనెలరతి విలసిల్లి పుష్ప
తరుల కేఁగెడితుమ్మెదల నంతఁ జూచి
కన్నుల పండువుగా నొక్కపొన్న

శారికల్ =గోరువంకలు. కలకంఠ = కోవెలలు. క్రౌంచులు = ఆఁడుకొంచలు.

పన్నుగాఁ జలువపూఁ బొన్నయిన రీతి
విలసిల్లఁగాఁ జూచి విభుఁడు మోదించి
యలరంగఁ బూపాను పచట వేయించి
చనుదెంచి కూర్చుండఁ జయ్యననంత
మనమున సంతోష మహిమ శోభిల్ల
మలయమారుతరాజి మఱినలరాజు
వలనొప్పఁ బొడఁగన వచ్చెనోయనఁగ

మందంబుగా వీచె మహిఁ జల్లగాలి
చందంబుఁ జూచి యజ్జననాయకుండు
తనమంత్రినరునితో దయతోడఁ బలికెఁ
'గనుఁగొంటివే యిందుఁ గలవిశేషంబు
లనురక్తితోఁ జూడ నాశ్చర్యమయ్యెఁ
బుడమి వసంతునిపూజ గావింపఁ
గడువేడ్క పుట్టె నిక్కంబ నామదికి'
ననవుడు విని మంత్రి యారాజుఁజూచి
'జననాథ ! నీవు వసంతోత్సవంబు
సేయఁ దలంచితేఁ జేసెద' ననుచుఁ

బాయ కక్కడఁ జల్లపందిరి నైచి
పచ్చతోరణముల బాగుగాఁ గట్టి
చెచ్చెరఁ బన్నీరు చిలికించి మంచి
కమ్మని జవ్వాది గలయంగ నలఁది
సమ్మతిఁ బుప్పొడి చల్లి నిండార

రాజి = సమూహము: తలంచితేఁ = తలంచినయెడ. కమ్మని=పరిమళముగల.

నచ్చుగా నాణిముత్తెము ముగ్గుదీర్చి
పచ్చకప్పురదిన్నెఁ బరపించి జిలుఁగు
చెంగావిచెక్కుముల్ చెలువందఁ గట్టి
సంగడిఁ గదళికాస్తంభముల్ నిలిపి
కరమొప్ప మఱి మేలుకట్లు గట్టించి
విరిసరంబులు నిండ వ్రేలాడ విడిచి
కుదురుగాఁ బట్టుచుంగులు చుట్టుఁగట్టి
కమ్మనిపన్నీటఁ గలపి కస్తూరి
బొమ్మ వసంతునిపోలికఁ జేసి
నిలిపి కుంకుమపూవు నీట మేదించి
తిలకంబు చక్కఁగా దిద్ది యాసక్తి
విరిసరంబులు నిండ వింతగా వైచి
పరిమళద్రవ్య సంపదలచే నించి
సరిలేని రత్నభూషణములు పెట్టి
పరువడి ధూపదీపములఁ బూజించి
యారాజవల్లభుఁ డామహీనాథుఁ
డారయ నైవేద్య మప్పు డర్పించి
భూసురావలి భక్తిఁ బూజించి వారి
యాసలు దీర మహాదాన మొసఁగి
సరవితో నిట్లు వసంతునిపూజ
లరుదుగాఁ జేసె నయ్యవనీశ్వరుండు
సచివునితో నిష్టసంభాషణంబు
లుచితోక్తితోఁ బల్కుచున్న యవ్వేళఁ
బవడంపుఁజాయఁ జొప్పడునాసికమును

నవహేమమయ మగునవ్యపక్షములు
విమలస్వరంబును విమలనేత్రములు
నమరంగ ధవళమయం బగుమేను
నరుదుగాఁ గల్గి యా యవనీశ్వరుండు
సరసతఁ జేయు వసంతునిపూజఁ
గడు వేడ్కతోఁ జూడగా వచ్చె ననఁగ
నుడుతతి దివి నుండ నొల్లక యిపుడు
వసుమతిపై నుండ వచ్చెనో యనఁగఁ
బొసఁగ నంబరలక్ష్మి పూను ముత్యాల
హారంబు జాఱెనో యవనికి ననఁగ
క్షీరాబ్ధితరగలచెన్ను వహించి
యాకాశమున నుండి హంసలపిండు
భూకాంతుముందఱఁ బొదలుచు వ్రాలె
వ్రాలినఁ జూచి భూవరుఁడు హర్షాబ్ధిఁ
దేలుచు నపుడు మంత్రికి నిట్టు లనియె
"యెందుండి వచ్చెనో యీ రాజహంస
లందంబుఁ జూచిన నతివేడ్క పుట్టె
నొకయంచఁ బట్టుక నూరక మనము
నకలంకగతిని ముద్దాడుద" మనుచు
నతివేడ్క లేచి యయ్యంచల కడకుఁ
గుతలేశుఁ డేఁగిన గొబ్బున నెగసి
యవ్వల వ్రాలిన నపుడు పో నీక

ఉడుతతి=చుక్కలసమూహము, అంబరలక్ష్మి=ఆకాశలక్ష్మి, క్షీరాబ్ధితరగలు=పాలసముద్రముయొక్కఅలలు. చెన్ను=అందము. హర్షాబ్ధి = ఆనందసముద్ర

నవ్విధంబున నైన నేఁబట్టెద నని
కదిసి మిక్కిలి కుతుకం బుల్లసిల్లఁ
బొదలినమతిఁ బొంచి పొంచి పోవంగఁ
గని పక్షు లన్నియుఁ గడుభీతిఁ బొంది
చని యొకవ్రృక్షానిపైఁ జయ్యన వ్రాలె
వానిసంగడిఁ జూచి వసుధేశ్వరుండు
'వీనిఁ బట్టఁగ నెద్ది వెర వింక మనకుఁ
దలఁకక తొలఁగక తనరెడు నేర్పు
దొలఁగక మ్రాఁ నెక్కి తోలుము నీవు
పనుపడ నే నట్టె పట్టెద' ననుచు
ననిన నాసచివుండు నాభూజ మెక్కి
యనురక్తిఁ బక్షుల నదలింప నవియు
మనమున బెదరుచు మహిమీఁద వ్రాలె
వ్రాలినఁ గనుఁగొని వసుమతీశ్వరుఁడు
పాలించి తన మంత్రిపతిమోముఁ జూచి
'దిగి వచ్చి నీ వొకదిక్కున నుండి
తగిలినపులుఁగుల దయతోడఁ బట్టు'
మనవు డాభూరుహ మాతండు డిగ్గి
గొనకొని యొక్కదిక్కున నుండి దండి
యనురక్తిఁ బక్షుల కడ్డమై నిలువ
మనుజేశ్వరుఁడు వాని మఱి పోవ నీక
నల్ల నల్లన మహి నరుదెంచి పొంచి

ము, సచివుఁడు=మంత్రి. దండి = మిక్కిలియైన, భూరుహము = చెట్టు.

మెల్లన యొకదానిమెడఁ బట్టుకొనియెఁ
గడువేగమున లేచి కడమ రాయంచ
లడలుచు నొకభూరుహంబున వ్రాలెఁ
జెలువంద నలరాజుచేఁ జిక్కు వడ్డ
పులుఁగులరాజు సొం పుడిగి భీతిల్లి
పలుమాఱుఁ దల్లపోసి భావంబులోనఁ
గలఁగుచు 'మేము నిక్కడికి నేతెంచి
తటుకున వీనిచేఁ దగులంగఁ గలిగె.
కటకటా! యీ రీతిగాఁ జేసినట్టి
బలు వైననాఁత ఫలము నేమందుఁ
జలమున నను రాజసంబున నృపతి
యేమేమి సేయునో యెఱుఁగంగ రాదు
ఏ మైన మే లింక నే మన వచ్చు'
నని గడుఁ జింతచే నడలఁగా నాతఁ
డనురక్తితో రాజహంసను జూచి
కొనగోర దువ్వి మక్కువ ముద్దుఁ బెట్టి
యొనరంగఁ గన్నుల నొత్తి లాలించి
యక్కునఁ జేర్చి తియ్యని మాటలాడి
చెక్కిలి నొక్కి మచ్చికఁ జేయు చుండఁ
గనుఁగొని [1]సంతోషకరమగు నట్టు
మనుజేశుతో వచోమధురతఁ బలికె

[1]'సంతోషకరము పుట్టంగ'నని వ్రా.ప్ర. సంతోషమనెడియర్థమున సంతోషకరము నికవి ప్రయోగించియున్నాఁడు. అక్కునక్=ఱొమ్మునందు. మచ్చిక = ప్రీతి.

'నవనీశ దమయంతి యనియెడుకాంత
నువిదఁ జేసెద నీకు నొగినన్ను విడువు
తగునీకు దమయంతి దమయంతి కీవు
తగుదువు నామాట దబ్బర గాదు
సారసభవుఁడు నీ సౌందర్యమునకు
బోరన భువి దానిఁ బుట్టించె మున్నె
యే గతి నైన నాయింతిని జేరి
భోగదేవేంద్ర నీపొలఁతిఁ జేసెదను
దలకొని [1]వేళకుఁ దగినట్టిమాటఁ
బలికి పోఁ జూచెడి పక్షిని గాను
ఈ పక్షిచేత ని దే మా నటంచు
భూపాలచంద్ర నీబుద్ధి నుంపకుము
నీ చక్కఁదనమును నీ విలాసమును
నాచకోరాక్షికి సమరు భూనాథ
నామాట నిజముగా నమ్ముము మదిని
గామిని నీ సొమ్ముగాఁ జేయనేర్తు
దమయంతి నీ చక్కఁదనమును దలఁచి
సుమబాణవేదన స్రుక్కి యున్నదియు
నీ పాదపద్మముల్ నిరతంబుఁ గొలువ
నాపద్మగంధిని నతివఁ జేసెదను
గమలాక్షు నాన నా కన్నులయాన
దమయంతి నీ యింతి తప్ప దీమాట'
నావుడు ముద మంది నరలోకనాథుఁ

1 'ఈవేళఁ దగినట్టి మాట' పాఠ. సుమబాణవేదన=మన్మథవేదన. స్రుక్కి=వాడి.

డా వేళ నాశ్చర్య మంది యా పక్షి
నతివేగ విడిచి నెయ్యమున ని ట్లనియె
'నతివేడ్కతోడ నీ వాడినమాట
వినఁగ నా చెవులకు విందయ్యె నేఁడు
నెనయ నా దమయంతి నేగతి నీవు
నెఱుఁగుదు వవనిలో నేరాజ పుత్రి
తెఱఁగొప్ప వనములోఁ దిరిగెడు మీరు
రాజకన్యకలవర్తన మెఱుంగుదురె
రాజ హంసోత్తమ రమణీలలామ
నెలమి నా యింతిగా నెట్లు చేసెదవు
తెలియఁగఁ జెప్పు మా తెఱఁగెల్ల మాకు
హంసరూపంబున నరుదెంచి మున్ను
కంసారి జలజాక్షిఁ గరుణించి నట్లు
హంస రూపంబున నతివేడ్క నాకు
హంసయానను గూర్ప నరుగుదెంచితివొ
పాలును నీరు నేర్పఱుపంగ నేర్పు
చాలిన పక్షిరాజవు గావె నీవు
మనుజభాషలరీతి మహిలోనఁ బక్షు
లెనయంగఁ బలుకునే యెక్కడ నైనఁ
బక్షివి గావు నాపాలి దేవతవు
యీ క్షితిలోన నాయెలనాగ జనన
మంతయు నెఱిఁగింపుఁ' మనవుడుఁ బక్షి
వింతగా నారాజ విభున కిట్లనియె

"ధరణీశ వినుము విదర్భ పురంబు
కరమర్థి జగతిఁ బ్రఖ్యాతమై యుండు
నాపురాధీశ్వరుఁ డమల మానసుఁడు
భూపాలచంద్రుఁడు పుణ్య వర్తనుఁడు
భీమ భూపాలుఁ డభేద్యుఁ డుత్తముఁడు
శ్రీమించ రాజ్యంబు సేయుచు నుండె
ధరణీశ్వరునకు సంతానంబు లేక
ధరణీ సురార్చన తప్పక సేసి
తపములు జపములు తగిన దానములు
నుపవాసములు పెక్కు లొనరించి యలసి
కడ లేని దుఃఖసాగరమున మునిఁగి
పుడమిఱేఁ డాస్థానమునకు నేతెంచి
యరు దై నరత్నసింహాసనోపరిని
నిరవందఁ గూర్చుండి హిత పురోహితుల
గాయక వంది మాగధ మంత్రివరుల
నాయతమతిఁ జూచి యప్పు డిట్లనియె
'వినుఁడు సంతాన మేవిధమునఁ గలుగు
నని భూసురావళి కఖిలదానముల
నొనరించితిని మఱి యుచిత మార్గమునఁ
దనరి యెందులను సంతతి లేక పోయె
నిరవంద సంతాన హీనుఁడై నట్టి
నరునకు దూర మా నాకేశ పదవి ·

ధరణీసురఅర్చన=బ్రాహ్మణపూజ, కంజాతగర్భుఁడు=బ్రహ్మ. నాకేశ=ఇంద్ర.

సుతులను బడసినఁ జూచి యఁదంద
పితృదేవతలును సంప్రీతిఁ బొందెదరు
వసుధ యీతనువు లెవ్వారు నమ్మినారు
పొసగిన యీరాజ్య భోగంబు లేల
మనమారఁ దనయుల మధురవాక్యముల
వినఁగ నేర్చినయట్టివిమలాత్ములకును
వీణామృదంగాదివివిధ స్వరములు
వేణునాదము లైన విన నింపు గావు
విడువ కిప్పుడు మునివేషంబు దాల్చి
తడయక నేను సంతానార్థి నగుచుఁ
దరుణితోఁ గూడుక తపమున కరిగి
పరగంగఁ బుత్రులఁ బడసి వచ్చెదను
మంత్రకోవిదులార మహిమ నారాజ్య
తంత్రంబు నడపుఁడు తగ నేను వచ్చు
నందాఁక' నని పల్కి యపుడు భూసురుల
నందఱ రావించి యతిభక్తి మ్రొక్కి
భటపరిచారకప్రకరంబులకును
దటుకునఁ దనదువృత్తాంతంబుఁ జెప్పి
పుడమికాఁపులకు నేర్పడ బుద్ధి సెప్పి
పడఁతియు దానును బరమహర్షమునఁ
జెలువు మీఱఁగ నారచీరలు గట్టి ·
తెలిభూతి మైనిండఁ దిరముగా నలఁది
కురు లెల్ల జడలుగాఁ గూడంగఁ జేసి

పురమువారెల్ల గుంపులు గట్టి చూచి
యౌరా! యనంగ ఘోరారణ్యమునకు
ధారుణీభర్త మోదంబున నరిగె
ఫలములు దళములు భక్షించి కొండ
బిలముల విలసిల్లి భీతిల్ల కిట్లు
కొన్నిదినంబులు ఘోరాటవులను
గ్రన్నన విహరింపఁగా నొక్క నాఁడు
తనశిష్యులును దాను దమనమునీంద్రుఁ
డనురక్తి మీఱఁగా నచటికి వచ్చె
వచ్చినమునిఁ గాంచి వసుమతీనాథుఁ
డచ్చుగా సాష్టాంగ మప్పు డర్పించి
పలుమాఱు మునినాథుఁ బ్రస్తుతి సేయఁ
దలఁపున మెచ్చి యా తపసి యిట్లనియె
'నెక్కడ విహరింతు రెప్పుడు మిమ్ము
నిక్కాననంబున నెన్నఁడుఁ గానఁ
దలపోసి చూచినఁ దాపస వృత్తి
గలిగి యున్నది రాజకళలు మీయందు
నమరి యున్నవి మీర లడవిలో నిట్లు
క్రమమున విహరింపఁగా నేల మీర
లెవ్వరో' యనిన భూమీశుఁ డాతపసి
కవ్విధం బంత్యయు నట చెప్పఁ దొడఁగెఁ
'దాపసవర్య విదర్భ పురంబు
నేపార మీ దయ నేలెడు వాఁడ

నీ పద్మగంధి నా యింతియై మెలఁగు
నాపేరు ధర భీమనరనాథుఁ డండ్రు
పరఁగ సంతానసంపద లేక నాకు
ధరణి పాలింపంగఁ దగ దటు గాన
తపసివేషముఁ దాల్చి తరుణితోఁ గూడఁ
దపము సేయఁగ మదిఁ దలఁచి వచ్చితిమి'
నావుడు విని మునినాథుఁ డా భీమ
భూవల్లభునిఁ జూచి పొలుపొందఁ బలికె
'భూమీశ మా వనంబునకు నేతెమ్ము
తామసింపక నేను దపము గావించి
వనజాసనాదిదేవతల చే వరము
కొని వచ్చి యిచ్చెదఁ గొదువలేకుండ
ధరణీశ యంత సంతానంబు వడసి
యిరవొందఁ బురమున కేఁగుదు గాక'
యని తోడుకొనుచు నిజాశ్రమభూమి
కనురక్తిఁ జనుదెంచి యతిఘోరతపము
గావింపఁగా మెచ్చి కంజాతగర్భుఁ
డావేళఁ దనకుఁ బ్రత్యక్షమై నిలువ
మునికులచంద్రుండు ముద మంది బ్రహ్మఁ
గని సన్నుతులు సేయఁ గమలజుఁ డనియె
'నిది యేమి మునినాథ యింతగా నీవు
పదపడి ఘోరతపంబు గావింప
నేమి కార్యము వచ్చె నెఱిఁగింపు' మనిన

భీమనాముం డనుప్రియ శిష్యుం డొకండు
లోకేశ కలండు భూలోకనాయకుండు
ప్రాకటం బైన సంపద లెల్లం బాసి
సంతతి లేని విచారంబుతోడ
నింతియుం దాను మా యెడ కేంగుదెంచె
నతనికి సంతాన మర్థితో నిచ్చి
యతివేడ్క రక్షింపు' మనవుడు బ్రహ్మ
'పొలుపు మీఱంగ నొక్కపుత్రి పుత్రుండుం
గల'రంచుం జెప్పి వేగంబున నరిగె
నంతట దమనమహామునీశ్వరుండు
వింతగా భీమభూవిభుని వీక్షించి
'కుతలేంద్ర నీ కొక్క కూంతురుం గొడుకు
నతివేడ్కం గల్గుదు రరుగుము పురికి'
ననవుడు సంతోష మంది యా రాజు
మునినాథునకు వేడ్క మ్రొక్కి యిట్లనియె
'దమనమునీంద్ర నీ దయచేత నాకుం
గ్రమమున సంతతి కలిమియుం గలిగె'
నని సన్నుతులు సేసి యవనీశ్వరుండు
తనసతితోం గూడం దనపురి కరిగి
ధర నేలుచున్నను దదనంతరంబ
బరువడి యా రాజపత్ని గర్భంబు
ధరియించి ముందఱం దనయునిం గాంచెం
దెఱంగొప్ప మఱికొన్ని దినముల వెనుకం

తనయనుగాంచె నాతరలాయ తాక్షి
జననాథచంద్రుండు సంతోష మంది
దమనాఖ్య డను పేరు తనయున కొసంగి
దమయంతి యనిపేరు తనయకు నొసంగి
కొడుకు కన్నను ముద్దుకూంతురి మీందం
బుడమీశుం డతివేడ్కం బొలు పొందుచుండె
క్షీరాబ్ధికన్నియ చెలువందినట్లు
మీఱి భూధరపుత్రి మెలంగుచున్నట్లు
తరుణి వర్తించె సౌందర్యసంపదను
ధరణీశ యిబ్బంగి దమయంతి పుట్టు
నెఱుంగుదు మున్న నే నేగతి నైన
నిరవంద దాని నీ యింతిం జేసెదను
మానవాధీశ యా మగువ నీ సొమ్ము
నే నాడుమాటలు నిజ మని నమ్ము'
మని యంచ వలికిన నంతయు రాజు
విని మనంబునం జాల విస్మయం బంది
బలువిడి నానందబాష్పముల్ చాలం
బలుమాఱుం దొరుంగ నప్పక్షివల్లభునిం
జేకొని కవుంగిటం జేర్చి ముద్దాడి
భూకాంతుం డప్పు డాపొలంతి దగ్గఱకు
నతివేగ పోయి రమ్మని వీడుకొలుప

తనయ=కూంతురు. తరల ఆయత అక్షి=చలించుచున్న విశాలములయిన నేత్రములుగలది-క్షీరాబ్ధికన్నియ = పాలసముద్రునికూంతురు-లక్ష్మి. భూధరపుత్రి= పర్వతపు కూంతురయిన పార్వతి. ఇరవంద = అనువుపడునట్లుగా.

శతపత్రములఁ గ్రీడసలుపు హంసలను
రయమున నాహంసరాజు కూడుకొని
పయనమై యా త్రోవపైనంబు నిలుపు
సేయక నలుని కాచెలి గూర్చుతలఁపు
ద్రోయక భూమికాంతుని మీఁది భక్తిఁ
బాయక నాకటఁ బడి తమ్మి తూండ్లు
మేయక నీడల మెలఁగక వేగ
భూ వలయంబునఁ బొలుపొందునట్టి
యా విదర్భపురికి నరుగుచు నుండ
నచ్చట దమయంతి యతివలఁ దాను
విచ్చలవిడి వనవీథికి వచ్చి

దమయంతి వనవిహారం బొనర్చుట.

కలయంగ శుక శారికలు మయూరములుఁ
బలుకు చుండఁగ వాని పలుకులు వినుచుఁ
బూచి కాచిన మంచి పుష్పవృక్షములఁ
జూచి యింతులకును జూపి నవ్వుచును
నలరుల దేనియ లంది క్రోలుచును
నలరు పూఁజిగురుల నరసి నవ్వుచును
జల్లనిగాలికి సంతోషపడుచుఁ
బల్లవంబులనెల్లఁ బరికించుకొనెడు
చెలులలోన ఘటారి చికిలి కటారి
చెలువుల వంకి వాసనల పూశెంకి
చెలియల మేల్బంతి చిత్తజు దంతి

చిత్తజుదంతి=మన్మథునియేనుఁగు.

వలపులదొంతి చేమంతిపూబంతి
మరుని పట్టపుఁ జిల్క మరువంపు మొల్క
యరుదు పుప్పొడి తిన్నె యమృతంపు గిన్నె
కమ్మతావులతావు కళలకు నెళవు
కమ్మదేనియబావి కపురంపుఁగ్రోవి
సొగసువజ్రపుఁదళ్కు సొబగుల బెళ్కు
పగడంపులతకూన పన్నీటి సోన
చిలుకలకొల్కి యా చిగురాకుముల్కి
కులుకుముద్దులగుమ్మ గొజ్జంగిరెమ్మ
యని చాలఁ గొనియాడ నన్నిటఁ దగిన
వనజాక్షి శృంగారవనములోపలను
గదిసి కెంపులు రవల్ కాంతులఁజిమ్ము
నుదుటుబంగరు సొమ్ము లొడలను మెఱయ
జలజలోచన లగుసఖులును గొలువ
నలరుచు దమయంతి యతివేడ్క మేను
తెలియనిగతి వినోదించుచు నుండఁ
గలహంస లపుడు వేగంబున వచ్చి
రమణులతోడ సంభ్రమకేళి నుండు
దమయంతి యెదుట నందము మీఱ వ్రాలె
నెలఁత చే నడపులు నేర్చుకోఁ దలఁచి
కలహంస లీరీతిఁ గదిసెనో యనఁగ

తావు = స్థానము. నెలవు=చోటు. సోన=వాన. ఉదుటుబంగరు = మేలిబంగారు. రమణులు=స్త్రీలు.

వ్రాలినయంచల వలనొప్పఁ జూచి
మేలని దమయంతి మెలఁతలుఁ దాను
నప్పుడు గనుఁగొని యాశ్చర్య మంద
నొప్పుల కుప్పలై యొప్పి చెలంగు
నారాజహంసల నపుడు పోనీక
బోరనఁ దఱుముక పోయి యందంద
పొలఁతు లందఱు పొంచి పొంచి పోనీక
చలమున నన్నియంచలఁ బట్టి రంత
నారాజనందన యారాజ రాజు
కోరి పట్టినయంచ గొబ్బునఁ బట్టి
యక్కునఁ గదియించి యాదల నివిరి
చెక్కిలి నొక్కి మచ్చిక ముద్దువెట్టి
మెల్లన దువ్వుచు మృదులోక్తు లాడ
నల్లనఁ గనుఁగొని యాయంచ వలికె
మానవభాషల మధురమై యలర
"మానిని! నీ కొక్కమాట చెప్పెదను
విడువుము నను నీకు వేడుక గలుగుఁ
బడఁతి నీరూపుసంపదఁ జూచి నాకుఁ
గడు వేడ్క పుట్టె నిక్కముగ నా మదికి
నుడుగక వినుము నీ కొకటి చెప్పెదను
రం గయిననిషధాపురం బేలురాజు
శృంగారవంతుఁ డూర్జిత సత్యధనుఁడు

మెలఁతలు = స్త్రీలు. ఊర్జితసత్యధనుఁడు = దృఢమయిన సత్యమే ధనముగాఁగల

నరలోకనుతకీర్తి నలచక్రవర్తి
కరమొప్ప విష్ణుచక్రము పంపుసేయ
నిల నేడుదీవుల నేలెడురాజు
నలకూబరునికన్న నన విల్తుకన్న
సరసిజభవుకన్న జలజాప్తుకన్న
హరుకన్న బలిదైత్యహరుకన్న మించి
ధరణిఁ జెన్నొందును దరళాక్షి నీకు
సరియైనవాఁడమ్మ సౌందర్యరేఖ
రమణ నేఁ జూడనిరాజులు లేరు
రమణిరో యటువంటి రాజును గానఁ
గలకంఠి నీవంటికామినీమణికి
వెలయంగ నలరాజు విభుఁడు గావలెనె
నాకుఁ జూడంగ నోనలినాయతాక్షి
చేకొను నలుని నీచెలువుఁడు గాఁగ
నలుని కన్నను మంచినాథుండు లేఁడు
నలు వలరఁగఁ బదు నాల్గు లోకముల
వనిత దబ్బరలాడువారము గాము
కని వచ్చి తిటకు నాకన్నుల యాన
వానికిఁ దగు దీవు వర్ణింప నేల
మానిని నీ రూపమహిమకుఁ దగిన
వాఁడు గావుననిట్లు వర్ణింపవలసె
నేఁడు నీ దగ్గఱ నెలఁతరో వానిఁ

వాఁడు. సరసిజభవుఁడు=బ్రహ్మ. జలజాప్తుఁడు=సూర్యుఁడు, హరుఁడు=శివుఁడు. బలిదైత్యహరుఁడు=విష్ణుఁడు. కలకంఠి=మధురమయినకంఠస్వరముగ్గలది.

బొసఁగిన బంగారు బొమ్మను దెచ్చి
మసి పాఁత గట్టుట మాకు సమ్మతమె
ధరలోన నోములు తగిన దానములు
చిరభక్తిఁ బూజలు సేతురు మంచి
పతులు గావలె నంచు భామినీమణులు
అతివరో నీదు భాగ్యమ్మున కేమి
కొదువె నీ నాథు డీకువలయాధీశుఁ
డదిగాక వినవమ్మ యవనిలోపలను
వలరాజుఁ జక్కని వాఁడంద్రు జనులు
చెలి యాయనంగు మించినవాఁడు నలుఁడు
కలికి మారుఁడు నీటు కాఁడను టెంతె
తలఁపు లోపల వానిఁ దలఁచి చూచినను
దురితకర్ముఁడు శివద్రోహి దుర్జనుఁడు
హరి కుమారుఁడుగాన నతనికిఁ జెల్లు
నదిగాక వినవమ్మ యామహీశ్వరుఁడు
పదపడి హరిహర బ్రహ్మాదిసురలు
దీవింప నిలయేడు దీవుల నేలు
కావున వానిచక్కఁదనంబుఁ దెలుప
నాపంకరుహయోని కైన శక్యంబె
యోపద్మనయన నీకొప్పు నాఘనుఁడు
పతి గోరి యతి సురూపమున జన్మించు
సతి వానిఁ బొందని జన్మమేమిటికి
నారాజవరున కిల్లాల వైతేని

వలరాజు=మన్మథుఁడు. అనంగుఁడు = మన్మథుఁడు. పంకరుహయోని=బ్రహ్మ.

యోరాజ వదన నీ యునికికిఁ దగును
యలివేణి యేగతినైనను నలుని
వెలయంగ నీ ప్రాణవిభునిఁగాఁ జేయు'
మని యివ్విధంబున నా నలాధిపుని
వెనుకొన్న భక్తితో వేవేల గతులఁ
దలపోసి వర్ణింప దమయంతి యంచ
పలుకుల కానందపరవశయగుచుఁ
గన్నుల బాష్పంబు కణములు పొడమి
చన్నుఁగుబ్బలమీఁద జలజల దొరుఁగఁ
దన మేను పులకింపఁ దలయూఁచి యెంచి
యనురక్తి విడిచి నెయ్యమున నిట్లనియె
'రా యంచ రాజ యా రాజదేవేంద్రుఁ
డేయెడ నుండు నీ నెల్లెఱుంగుదువు
పులుఁగుల రాజవు భూపాలుఁ డతఁడు
తలపోయ నీకు నాతనికిఁ జుట్టఱిక
మే గతిఁ గలిగె నా కింతయుఁ దెలియ
వేగంబ చెప్పుమా వీనులు దనియ'
ననవుడు రాయంచ యా యంచ గమనఁ
గనుఁగొని సంతోష కలితయై పలికె
'వినవమ్మ చెప్పెద విశదంబు గాను
జనలోక నుతుఁడు సజ్జనలోక హితుఁడు
భాను వంశంబున బ్బలుఁడైన వీర
సేనున కుదయించి చిరకీర్తి నెలయ
రమణతో నిషధాపురంబున నుండి

కమలాయతాక్షు చక్రము పంపు సేయ
యొనయ దీవుల నేడి యేలుచు నుండి
మనుజేశుఁ డొక నాఁడు మంత్రులుఁ దాను
వరుసతో శృంగార వనము లోపలను
జరియించు చుండ నాసఖులును నేను
భూమీశు దగ్గఱఁ బోయి వ్రాలితిమి
యామీఁద మమ్ముఁ జూచి యా చక్రవర్తి
కరుణారసముఁ జింద గా నన్నుఁబట్టి
కరమొప్ప లాలింపఁ గా నామహీశు
చక్కఁదనంబును జవ్వనం బతని
మక్కువ సుగుణ సంపత్తి భాగ్యమును
చూచి నా మనసున శుభము రెట్టింప
యీ చక్కఁదనమున కిల్లాలు వలయు
ననుచు నీరాజున కనుకూల యైన
వనిత దెచ్చెద నంచు వసుధపై నొప్పు
తరుణీమణుల చక్కఁదన మెల్లఁ జూచి
సరి పోవ కిచటికిఁ జనుదెంచి నీదు
వర రూప విభవ లావణ్య సంపదలు
సరవిఁ జూడఁగ మాకు సంతోష మయ్యె
నదిగాన నలునివృత్తాంతంబు నెల్ల
విదితంబుగా నీకు వివరించి తిపుడు
నెలఁత యెట్లున్నదో నీ చిత్తవృత్తి

కమలాయతాక్షు చక్రము=విష్ణునిసుదర్శనచక్రము. పంపు=ఆజ్ఞ.

తెలియఁగా రాదమ్మ దేవ సన్నిభుని
నలుని వరించి మన్నవ గాంచి తేని
నలరునఁ దావియు నలరి నట్లుండు
నర లోకమందు నానరనాథు వంటి
నరనాయకులు లేరు నరనాథ పుత్రి
కల్లలు పలుక నా కన్నుల యాన
పల్లవపాణి నీ పాదంబు లాన
సత్యంబు నామాట సత్యంబు సుమ్ము
సత్యమే జయమని సకల యత్నములఁ
బలుకుదు రిలలోనఁ బావన మతులు
తలపోసి చూడు మోతరలాయతాక్షి'
యనవుడు మదిరాక్షి యా పక్షిరాజుఁ
గని విస్మయానంద కలితయై పలికె
'నో పక్షిరాజేంద్ర యో దయాసాంద్ర
నా పాలిశ్రీరామ నాథుండ నీవె
రక్షింపఁగా నెంచి రయమున వచ్చి
యా క్షితీశ్వరుని నర్యమకులాధిపుని
నలరాజచంద్రుని నా నాథుఁ గాఁగఁ
జెలువందఁ జేసి రక్షింపవే నన్ను
నిరవొంద నీ మాట నే జవ దాఁట

అలరునన్ తావియు = పువ్వునందువాసన. విస్మయ ఆనంద కలిత=ఆశ్చర్యముతోను సంతోషముతోను ఒప్పునది. దయాసాంద్ర = దయచేత దట్టమయిన వాఁడా, అర్యమకులాధిపునిన్ =సూర్యవంశపురాజును-నలుఁడు చంద్రవంశపు వాఁడు ఇట సూర్యవంశ్యుఁడనుట చింత్యము.

నరుదార నా రూప మంతయు రాజ
వరునితోఁ బలుమాఱు వర్ణించి చెప్పి
సరస నీ విచటికిఁ జనుదెమ్ము పొమ్ము
చెలఁగి నీ వింతగాఁ జెప్పుచుండఁగను
తలపోసి యేను నింతకు నొడంబడితి
నిఁక నొక్కమాట నీ కెఱిఁగింతు వినుము
ప్రకటితగతి నేను బ్రతిన నొనర్చి
నలునకు మనువొండె నలుఁడొల్ల ననిన
వెలయ నీ ప్రాణంబు విడుచుట యొండె
ఘనతరబుద్ధిఁ ద్రికరణంబు గాను
బని పూని పలికితిఁ బడఁతి నా మాట
పూనికతో నన్య భూముల నేలు
మానవాధిపుఁ గూడి మనుదానఁ గాను
యింతేసి పనులకు నెడము గా నీక
కంతుని శరముల గాసిల్ల నీక
కుసుమాస్త్రు కేళికిఁ గుందంగ నీక
వసుమతీపతికి నా వర్తమానంబు
తేటతెల్లంబుగాఁ దెలియంగఁ బలికి
మాటలు నీతిగా మఱి కొన్ని చెప్పి
యే విధినైన నా యినకులాధిపుని
వేవేగ నా ప్రాణ విభునిఁగాఁ జేయు'

నలునకు......విడుచుటయొండె. నలునివరించుటయో లేక నలుఁడు సమ్మతింపని యెడ నా ప్రాణములు విడిచిపెట్టుటయో కాని యీ రెండు తప్ప వేఱుగలుగదని యర్థము, వసుమతీపతికి=రాజునకు. ఇనకుల=సూర్యవంశము.

మని ప్రియ వాక్యంబు లంతంతఁ బలుక
వనితను జూచి యవ్వాలఁ బక్షి పలికె
'కలకంఠి నీ వింతగాఁ బల్కనేల
తలఁప నీ కార్య మంతయు నాది గాదె
వలనొప్ప నలచక్రవర్తికిఁ దగిన
కలికి నెన్నఁడుఁ జూడఁ గలుగునో యనుచుఁ
దలఁచుచు నుందు నో తరలాయతాక్షి
పలు మాఱు నినుఁ జూడ భాగ్యంబు గలిగె
నటు గాన పలు మాఱు నడల నేమిటికిఁ
దటుకున నలుని నీ ధవునిఁ జేసెదను
ఒద్దిక మీ కార్య మొనఁ గూర్చు దనుక
నిద్దుర యే డదే నెలఁతరో నాకు
వనిత మే మటువంటి వారము గాము
మనమునఁ గుందకు మనుజేశుఁ గూర్తు'
నని చెప్పి 'తనవారి నందంద విడువు'
మని 'నీవు విరహాగ్ని నడలంగ వలదు
చనుదెంతు మరల నిచ్చటి' కంచుఁ దెలిపి
వినువీథి నరిగె నా విహగేంద్రుఁ డచట
ధరణీశ్వరుఁడు భీమతనయను దలఁచి
విరులవిల్తుని యంపవేదన కులికి
విరహాగ్ని చేఁ గుంది వేసట నొంది
సురపొన్ననీడ భాసురముగా నొక్క

ధవునిన్ = మగనిని. వినువీథిన్ = ఆకాశమార్గమునన్. విహగఇంద్రుఁడు= పక్షిరాజు. అంపవేదన=బాణములబాధ.

చలువ పూఁపందిరి సరగ వేయించి
పొలుపొందఁ బచ్చకర్పూరంపుఁ దిన్నె
పఱపించి దానిపైఁ బన్నీరు చల్లి
పఱపుగాఁ జిగురాకుపాన్పు గావించి
క్రొత్తకస్తురి పున్గు గూర్చిన నుంచి
మెత్తని గంధంబు మెయి నిండఁ బూసి
తావి పన్నీటను దడిపిన పచ్చ
సేమంతి పూసరుల్ చెచ్చెరఁ బూని
మరు వేఢ కోర్వక మఱి మఱి కలఁగి
పరతెంచి యా పాన్పుపై పవ్వళించి
తనువెల్లఁ బొగులఁ జింతా వార్ధి మునిఁగి
తనలోన నిట్లని తలపోయఁ దొడఁగె
'అంచలు ఫ్రాయిన యంత నుండియును
బంచబాణుఁడు నాకు పగదాయ యయ్యొ
నేమి సేయుదు నింక నిటమీఁద నాకు
వామాక్షికడకు నెవ్వరిఁ బంపువాఁడ
జలజారి భ్రమియింపఁ జాలిన ముద్దు
నలినాక్షి ముఖము నెన్నఁడు చూడఁ గల్గు
నుడుగక తేనియ లొలుకంగఁ బలుకు
పడఁతితో నెన్నఁడు భాషింపఁ గలుగు
నలివేణి తియ్యని యధరామృతంబు
నలఁత దీరఁగ నెన్నఁ డానంగఁ గల్గు

జలజారి=చంద్రుఁడు. అలివేణి=తుమ్మెదలవంటి జడగలది. అధర=మోవి.

ముదమొప్ప మదిలోని ముచ్చట దీర
ముదిత యెన్నఁడు నాకు ముద్దిడఁ గల్గు
యలర నాచేతులయాసలు దీరఁ
బొలఁతి పాలిండ్ల నెప్పుడు పట్టఁ గలుగుఁ
గవగూడి రతికేళిఁ గాంక్ష లుప్పొంగ
సువిద కౌఁగిట నెన్నఁ డుండంగఁ గల్గు
శ్రీనాథ యని యిట్లు క్షితినాయకుండు
మానక యడలి క్రమ్మఱ నంచఁ దలఁచి
పొరలుచు నెక్కడఁ బోయెనో యంచ
సరసుల కాంచనాబ్జంబులు గాంచి
మరిగి యంతట నన్ను మదిలోన మఱచి
యొరసి భక్షించుచు నున్నదో యంచ
యమరంగఁ దామేఁగు నట్టి త్రోవలను
దమవారిఁ గని నన్నుఁ దలఁపదో యంచ
తొయ్యలితో నేర్పుతోడ భాషించి
యొయ్యన వచ్చుచు నున్నదో యంచ
తరమిడి నామీఁద దయ నేఁగుచుండి
పరువడి యడవిలోఁ బడలెనో యంచ
యేమియుఁ దెలియరా దిందాఁకఁ బక్షి
యేమఱి యిచటికి నేలరా కుండు'
నని వెచ్చనూర్చుచు హారమానాథ
యని తలంచుచు నుండ నప్పుడా యంచ

పొలఁతి=స్త్రీ. దమయంతియనుట. కాంచన అబ్జములు=బంగారుతామరలు.
అంచతొయ్యలి=హంసస్త్రీ. రమానాథ=లక్ష్మీపతీ.

చనుదెంచి సఖులతోఁ జయ్యన వ్రాలి
ఘనభక్తి నలరాజుఁ గనుఁగొని పల్కె
'నమర నీయానతి నచ్చోటికేఁగి
దమయంతిఁ గనుఁగొని తరలి వచ్చితిమి
దానిచక్కఁదనంబు తలఁప నచ్చెరువు
భూనాథ వినుము నేర్పున విన్నవింతు
మెఱుఁగు నీలపుసరుల్ మించినకురులు
పరిపూర్ణసోముని బడలించు మోము
తిలపుష్పముల టెక్కు దెగడెడు ముక్కు
నలినాస్త్రువిలు హొయల్ నవ్వుకన్బొమలు
హరిణంబుల జయించు నక్షులసంచు
మెఱుఁగుటద్దముఁ బోలు మించుచెక్కిళ్లు
యలరుబింబము తీవి నడఁగించు మోవి
చెలువు శ్రీకారముల్ చెలియ కర్ణములు
ఘనమైనశంఖంబుఁగవయు కంఠంబు
కనకంపుఁ దీఁగలఁ గడపు బాహువులు
మృదుపల్లవంబుల మిగులు హస్తములు
కుదురు కల్వాల మీఱు గోర్షుల తీగు

మెఱుఁగునీలపుసరుల్ = నిగనిగమని మెఱయునట్టి నీలమణుల సరములు, కురులు = తలవెండ్రుకలు, సోముని=చంద్రుని, తిలపుష్పములు = నువ్వుపువ్వులు, టెక్కు = సొగసు, తెగడెడు = నిందించెడు. నళిన+అస్త్రు) – మన్మథుని, హొయల్ = విలాసము, హరిణంబులన్ =లేళ్లను. అక్షులసంచు=కన్నులతీరు- బింబముతీవి = దొండపండుయొక్కయందమును, శ్రీకారముల్ = 'శ్రీ' యనెడు అక్షరములు. కనకంపు=బంగారపు. మృదుపల్లవంబులన్ =మెత్తనిచిగుళ్లను,

వలుఁద బంగరు చెండ్లు వనిత పాలిండ్లు
చెలువైన నీలంపుఁజికిలి రజంపు
నురవడితోఁ బోరు నువిద నూఁగారు
ధరఁ బొన్నపూ శోభితముసుమీ నాభి
వసుధ సింగముతోను వాదించుఁ గౌను
నిసుకదిబ్బలపొందు నెసఁగుఁ బిఱుందు
లరఁటికంబంబుల నడఁకించుఁ దొడలు
మరుని నిషంగసామ్యములు జంఘికలు
కెందమ్మిరేకులఁ గేరు పాదములు
నందంపుఁ దాబేళ్ల నడఁచు మీఁగాళ్లు
వనితకు నిదియెల్ల వర్ణన గాదు
మనుజేశ నేఁ గొంత మాత్రమెంచితిని
నీరాజతేజంబు నీ ప్రతాపంబు
నీ రూపవిభవంబు నీ విలాసంబు
నా మదిరాక్షికి నామదవతికి
నామోహనాంగికి నాసఖీ మణికి
నాపద్మగంధికి నాపుణ్యవతికి
నాపువ్వుబోఁడికి నాగుణవతికి
నాదమయంతికి నందంద యేను
మోదించి మదిలోని ముచ్చట దీర

వలుఁద = విరివియైన, నీలంపుచికిలి రజంబు=నీలమణులు ప్రకాశించుచున్నదూళి. కౌను=నడుము. నిషంగసామ్యములు =అంపపొదులతోడి సమానత్వముగలవి– ఆపొదులకు సమానములయినవి యనుట.

వరుస వేవిధముల వర్ణించి చెప్పి
తరుణికి నీమీఁది తలఁపుఁ బుట్టించి
చెలిని నీసొమ్ముగాఁ జేసి వచ్చితి
నెలమి రాజేంద్ర నీ కిఁకఁ జింతవలదు
నీకుఁ గావలెనంచు నీరజయోని
యాకంజలోచన నవనిఁ బుట్టించె
నింతయు నిజమని యెంచి భూనాథ
సంతోషమలర రాజ్యము సేయుమనుచుఁ
బలికి హంసము విదర్భకుఁ బోవుతఱిని
దలఁపున నప్పు డాదమయంతికన్య
పలుమాఱు నలమహీపాలునిఁ దలఁచి
యలరువిల్తుని పువ్వుటమ్ముల కులికి
ఘనమైన మోహసాగరమున మునిఁగి
తనప్రాణసఖులను దప్పక చూచి
రాయంచ యేలొకో రాఁ దడవాయె
నాయవనీశుఁ డేమనియెనో కాక
పాయక తమజాతి పక్షులఁ గూడి
పోయెనో కొలఁకులఁ బొందెనో లేక
నుపవనంబులలోన నున్నదో' యంచుఁ
జపలాక్షి యిట్లు విచారంబు నొంద
నిదిమంచి సమయ మీయింతి నీవేళఁ
గదిసి నాపగదీర్తు కడువడి ననుచుఁ

నీరజయోని = బ్రహ్మ. కంజలోచన=తామరలవంటి కన్నులుగలది. అలరువిల్తుని పువ్వుటమ్ములు = మన్మథునిపుష్పబాణములు.

దమ్మితుపాకి కెందలిరాకుపంకి
కమ్మనివిల్లు చెంగల్వ నేజయును
జాజిపూబాకు గొజ్జఁగపెద్దకత్తి
రాజిల్లుచిలుకల రథముపై నెక్కి
యలరుతుమ్మెదలసైన్యము మున్నెనడవఁ
బలుమాఱు పంతముల్ పలుకు కోవెలలు
పరపుమీఱఁ జకోర బలములు గొలువ
మరుఁడు దండెత్తి యామానిని మీఁదఁ
జలమునఁ జనుదెంచి సరగునఁ గదిసి
యలరువింటను బువ్వుటలుగు లెక్కించి
కరమునఁ దెగదీసి కలికి పాలిండ్లు
గుఱిజేసి వడి నేసి కోయని యార్వ
నప్పుడా పూబోఁడి యంతరంగమున
ముప్పిరిగొను తాపమున కోర్వలేక
ధృతిదూలి మిగులఁ గుందెడితఱి నంచ
యతిరయంబున వచ్చి యతివ కిట్లనియె
'నోరాజవదన యాయుర్వీశు కడకు
బోరనఁ బోయి నేర్పున నీ గుణంబు
భావంబు రూపంబు భక్తియుఁ బ్రియము
వావిరి వర్ణించి వర్ణించి వాని

తమ్మితుపాకి = తామరపూవు తుపాకి, కెందలిరాకుపంకి = ఎఱ్ఱనిచిగురు వంకర బాకు. కమ్మనివిల్లు = కమ్మనయిన చెఱకు విల్లు. చెంగల్వ నేజ = ఎఱ్ఱగలువ చిల్లకోల. ఇవియెల్ల మన్మథుని సన్నాహమునకయిన పరికరములు. ముప్పిరిగొను = దట్టమగు

మనమున దయపుట్టు మాటలు చెప్పి
వనిత నీపై మేలువానిఁ గావించి
వచ్చితి నీ వింక నరయింపు మతని
మచ్చిక సకల సామ్రాజ్యవైభవము
లనుభవించుచు నుండు మతివేడ్కతోడ
వనిత మే మింకఁ బోయివచ్చెద మమ్ము
మఱవక దయనుంచు మా మీఁద' ననుచు
బరువడి పలికి యాపక్షులు సనియె

నలుని విరహతాపము.

నంత నక్కడ నలుం డతివను దలఁచి
కంతునిశరముల గాసిల్లి యులికి
యాహార ముడిగి నిద్రాపేక్ష మాని
యాహారిఁ బాడుచు హా హారీ యనుచుఁ
దన లోన దమయంతి దమయంతి యింతి
యనుచుఁ బల్కుచు వెఱఁగంది చూచుచును
మంత్రులఁ జూడక మహనీయ రాజ్య
తంత్రంబు నడపక తన రెడు కొల్వు
కూటంబునకు రాక కూర్మిఁ జెన్నొందు
హాటక రత్న సింహాస నోపరిని
గూర్మిఁ గూర్చుండక కొలుచు వారలకుఁ
బేర్మి సంబళము లిప్పింపక జనుల
మనవులు వినక బ్రాహ్మణులకు ధర్మ

మేలువాని=కలపుగలవాని-కామించినవానిననుట. హాటక=బంగారు.

మొనరింపక ననుంగు లొసఁగు కప్రంపు
విడియంబుఁ జేయక వేఁటకై నగరు
వెడలక సంగీత వీణా మృదంగ
నినదముల్ వినక చిన్నెల వేశ్య లాడు
ఘనమగు నాట్య సంగతిఁ జూడ కాత్మ
దమయంతి యతుల సౌందర్యంబు దలఁచి
సముచిత గతి నాప్తజనులతో ముచ్చ
టాడక రా నేర్చు నట్టి పదంబుఁ
బాడక విరహ తాపంబున నలుఁడు
దిన మొక్క యేడుగా దీనత నొంది
యొనర వర్తించుచు నుండ నవ్వేళ
సచివోత్తముఁడు మానసమునఁ జింతించి
యుచిత వాక్కుల విభు నూరార్చి పలికె
'నలధారుణీ తలనాథ నీ విపుడు
తలఁపున దమయంతి దమయంతి యనుచుఁ
బలు మాఱు విరహ తాపమునఁ గుందినను
నలి రేఁగి భూజనుల్ నవ్వరే నిన్ను
నరనాథ సామాన్య నరుని కై వడిని
దరలాక్షిఁ బలు మాఱుఁ దలఁపంగఁ దగునె
వినుము నీ వంటి భూ విభునకు నిట్లు
వనితకై ధైర్యంబు వదలింపఁ దగునె
మది లోన నీబుద్ధి మఱచి యీ రీతి

అనుంగులు = ప్రియులు. సచివోత్తముఁడు = మంత్రిశ్రేష్ఠుఁడు. రుచిత వాక్కులన్ =తగినమాటలచేత.

సుదతికై పలుమాఱు శోకింపఁ దగునె
యిది యెంత కార్య మే నిప్పు డిచ్చోటు
కదలి భీమ నృపాలు కడ కేఁగి యతని
నడిగి యా దమయంతి ననుకూల పఱిచి
కడు వేగ వచ్చెదఁ గలఁగకు మింక
మచ్చికతో సభా మంటపంబునకు
విచ్చేయు' మని వేడి విభునిఁ దోడ్కొనుచు
సంతసం బలర నాస్థానంబుఁ జేరె

దమయంతి విరహతాపము.

నంతనక్కడ రాజ హంసలు చనిన
యంత నుండియును భీమావనీశ్వరుని
సంతతి పుత్త్రి భూ జననుతగాత్త్రి
దమయంతి మదన వేదనఁ జెంది కుంది
శమియింప నేరక సంతాప మంది
నల రాజ చంద్రుని నర లోక విభునిఁ
బలుమాఱుఁ బలుమాఱు భావంబు లోనఁ
దలపోసి తలపోసి తలయూఁచి మేను
పులకించి పులకించి పొలఁతి మోహించి
తిలకించి తిలకించి తెలియ వర్ణించి
చెలరేఁగి చెలరేఁగి చెలియ వేనోళ్ల
వినుతించి వినుతించి వెలఁదులఁ జూచి
'వనజాక్షులార నా వల్లభుఁ డిటకు
రాఁడొకో మీరైన రయమునఁ బోయి
వేఁడుకో రాదె నా విధమెల్లఁ జెప్పి

తోడుక రారాదె దోసమా మీకు
వేడుక గాదె నా విభుఁడును నేను
జోడు వాయక యుండి సురత సౌఖ్యములఁ
గూడి యుండఁగఁ గనుంగొన లేరె మీకు
కటకటా నే నింత గాసిఁ జెందంగ
నెటులు చూచెదరు మీ రెంత నిర్దయులె
పసిబాల నిటు సేయఁ బాడి గాదంచుఁ
గుసుమబాణుని వేడుకొనరమ్మ మీర
లళులకుఁ జెప్పరే యలివేణులార
నెలఁత నీగతిఁ జేయ నీతి గాదంచు
వలనొప్పఁ జెప్పరే వడిఁ గోవెలలకుఁ
గల కంఠి ని ట్లేఁచఁగా రా దటంచుఁ
బడఁతి నీగతిఁ జేయఁ బాడియే యనుచు
వడిఁ జకోరాప్తుని వారింప రమ్మ
కలికి నీవైఖరిఁ గారింప కనుచుఁ
దొలుత వసంతుని తోఁ జెప్ప రమ్మ'
యని పల్కి హానాథ యని మూర్ఛ వోయి
మనమునఁ దెలిసి మన్మథుఁడు నా మీఁద
నిటు సేయఁ దనకు నే నేమి చేసితిని'
గటకటా యని లేచు కన్నీరు నించుఁ
జలి గాలి విసరిఁ జ్వాల వడంకు
నలరులు రాలిన సంకంద వెఱచుఁ

చకోరాప్తునిఁ=చంద్రుని. కారింపకు=బాధింపకుము. అలరులు=పువ్వులు.

గడువేగ లేచి యా కామినీ మణుల
తొడల పైఁ బవళించి దుఃఖంబుఁ బెంచుఁ
బతి రాక యిపుడు నా ప్రాణంబు లుండ
వతివెలారా యని యవని మూర్ఛిల్లి
యొక కొంత ప్రొద్దున కొయ్యనఁ దెలిసి
యొక చోటు గోరి వేఱొక చోటఁ జేరు
నొక చెలి పేర వేఱొక చెలిఁ బిలుచు
నొక పని కనుచు వేఱొక పని దలఁచు
నొక మాట లాడి వేఱొక మాట లాడు
నొక చెలిఁ బట్టు వేఱొక చెలిఁ దిట్టు
నొకపరి దెగడు వేఱొకపరి బెగడు
నొకపరి వెఱఁగందు నొకపరి గుందుఁ
జెలులను జూచి 'యో చెలులార చఱకు
విలుకాఁ డదిగో నన్ను వేయుచున్నాఁడు
మీర లందఱుఁ గూడి మెల్లనే పొంచి
పాఱి పోవఁగ నీక పట్టి గట్టిగను
విఱిచి కట్టుక రండు వేగమె పొండు
వెఱచిన వారల వెఱపింతు నుర్వి
ననుమాట నిజమాయె నతనుని వలన'
నని యిట్లు భ్రమమాట లాడఁగఁ జెలులు
వెఱఁగంది దిగులొంది వేదనఁ బొంది
మరుని దూషించి క్రమ్మఱ వివేకించి
'మరు నననేల తామర తూండ్ల మెసఁగ

ఒకపఁ=ఒకసారి. వెఱఁగు—ఆశ్చర్యము. బెగడు=భయపడు.

నరుదెంచి కాంచి రాయంచ లీ రీతి
నలుఁడు నలుం డని నయముగాఁ జెప్పి
పొలఁతి నీగతిఁ జేసి పోయి యుండంగ
నేమి సేయుద మింక నిటు మీఁద మగువ
కేమిటు మాననో యీ మరు తాప'
మని చాలఁ జింతించి యలి వేణిఁ గాంచి

చెలులు దమయంతి కూఱటఁ జెప్పి తేర్చుట.

గొనకొని దగ్గఱఁ గూర్చుండి కలికి
కన్నుల నిండారఁ గారెడు నీరు
మన్ననఁ దుడిచి యా మదిరాక్షి గుబ్బ
చన్నుల పైఁ గొంగు చక్కఁగా వైచి
వెన్నున సందంద విరిసి చిక్కైన
నెరి కురుల్ కొప్పుగా నిగిడిచి తొడల
మురువున నిడి ముద్దు మోమున మోముఁ
గదియించి లాలించి కౌఁగిట నుంచి
'యిది యేమి నెలఁత నీకిటువలె నలఁత
యిది యేమి చెలియ నే కిటువలె సొలయ
నిది యేమి లలన నీకిటువలెఁ జలన
మిది యేమి మగువ నీకిటువలె వగవ
నిది యేమి తెఱఁగు నీకిటువలె మఱఁగ
నిది యేమి వింత నీకిటువలెఁ జింత
యిది యేమి యబల నీకిటువలె బడల
నిది యేమి కన్నె నీకిటువలెఁ జిన్నె
యిది యేమి పొలఁతి నీకిటువలెఁ దలఁచి

యిది యేమి భామ నీకిటువలెఁ బ్రేమ
యిది యేమి కొమ్మ నీ కిటువలె వెమ్మ
నిది యేమి తరళాక్షి యింతనీ మదికి
నిది యేమి మమత నీకిటువలెఁ గలఁత
యిది యేమి మదిరాక్షి యింత పాల్మార్ప
నిది యేమి యింతి నీకింత విభ్రాంతి
వెఱవకు మావంటి వెలఁదు లుండఁగను
దరలాక్షి నీకింత తాపంబు తగునె'
యని యూఱడించి తియ్యని మాటలాడి
కనుఁగవ నీహారకణములఁ దుడిచి
చలువపన్నీటను జలకంబు లార్చి
కలికి గుబ్బల మీఁదఁ గస్తూరిఁ బూసి
యొనరఁగఁ బూని శైత్యోపచారముల
నొనరించి యుండిరి యువిదకు నంత

సూర్యాస్తమయవర్ణనము.

నాకాశలక్ష్మి కర్ణావతంసంబు
ప్రాకటంబుగ జాఱి పడినచందమున
నరుణ మౌ కిరణంబు లల్పంబు లగుచుఁ
దరణి పశ్చిమపర్వతంబున కరిగెఁ
గ్రమమున సాంధ్యరాగము దశ దిశల
రమణ శోభిలెఁ దామరలు ముకుళించెఁ
గలువలు చెలఁగెఁ జీఁకటి విస్తరిల్లె

నీహారకణములన్ = మంచుబొట్లచేత-లేక పన్నీటిచేత ననుట. కర్ణావతంసంబు=చెవి పూవు. తరణి=సూర్యుఁడు.

బలవైరి నిత్యోత్సవమున కై ధువల్లు
చిలికించు ముత్యాల సేసలో యనఁగఁ
దిలకించి తారలు దివినుండి చెలఁగెఁ
గవవాసి చక్రవాకంబులు కలఁగెఁ
దివిరి గేహంబుల దీపముల్ చెలఁగెఁ
గోరి చకోరపక్షులు సంత సిల్లె
జారచోరులు సంతసము నొంది రంత

చంద్రోదయవర్ణనము.

సురరాజు దేవి భాసుర లీలతోను
ధరియించు కర్పూర తాటంక మనఁగఁ
గలువలు నవ్వ జక్కవలు చింతింపఁ
దలఁచుచు విరహులు తల్లడ మంద
ఘనతతో పూర్వదిగ్వామాక్షి నొందఁ
జనుదెంచెనో యనఁ జంద్రుండు వొడిచె
జాడ నెల్లెడఁ బిండి చల్లిన యట్లు
వేడుకతో మంచి వెన్నెల గాయ
నంతలో దమయంతి యది యోర్వ లేక
చింతించి మదనాగ్ని శిఖలు చెన్నొందఁ
బలుమాఱు వెన్నెల బయటి కేతెంచి
నెలచల్వ రాతిపై నెలఁత కూర్చుండి
తలయెత్తి ద్విజరాజు తప్పకఁ జూచి

బలవైరి=ఇంద్రుఁడు. కర్పూరతాటంకము=కప్పురపుకమ్మ. పూర్వదిగ్వామాక్షిన్=తూర్పుదిక్కు అనెడు స్త్రీని. నెల చల్వరాతిపై = చంద్రకాంతశిల మీఁద. ద్విజరాజున్=చంద్రుని

చంద్ర దూషణాదులు.

‘నలరాజుఁ దలఁచితే ననవింటిరాజు
ననుఁ బట్టి యీరీతి నలినలి సేయఁ
దన కిప్పు డేనేమి తప్పుఁ జేసితిని
వలదంచు నీవైన వారింపరాదె
యలరువిల్కాఁడు నీ కల్లుండు గాఁడె
వేవేలగతుల మానెలఁదులు నేను
భావించి పలుమాఱు ప్రస్తుతి సేయఁ
దనజాడ మానఁడు ధర్మమే తనకు
నొనరంగ మఱియుతఁ డొక్కఁడు గాఁడు
తులలేని యలవసంతుండుఁ గోకిలలు
మలయ మారుతముఁ గోమల శారికలును
జిలుకలు మొదలుగాఁ జేరి నన్నింత
గలఁచు చుండఁగఁ దాళఁ గలదె యీ మేను
మగువ గదా యని మనసున లేక
పగ చాటు ‘దేపాటి పౌరుషం బోయి’
యని పల్కుచుండంగ నంతకంతకును
వనజారి వేఁడిమి వడి మూర్ఛ వోయి
తెలిసి దిగ్గన లేచి దివి రాజుఁ జూచి
కలఁగుచు ‘మది దయ గలవాఁడ వనుచు
నరులవిల్తుని చేఁత లన్నియు నీకుఁ
దెలుప వచ్చిన మంచి తెఱఁగుఁ జేసితివి
నీ వెక్కఁడవె కాదు నీ వార లెల్ల

ననవింటిరాజు=మన్మథుఁడు. నలినలి=బాధ. శారికలు=గోరవంకలు.

నీవిధమే కాదె యెంచి చూచినను
వేషముల్ చూచిన వేడుక పుట్టు
దోషకారులు గురుద్రోహులు ఖలులు
దురితకర్ములు శివ ద్రోహులు వావి
వరుస లెంచని దుష్టవర్తను లంగ
హీనులు మఱి కాంతి హీనులు చెడిన
మేనులుఁ గలిగి యిమ్మేదిని లోన
విరహిణీ స్త్రీలను వెఱపించుకొనుచుఁ
గరుణయు లేక రేగాముల వలెను
దిరుగుదు రిది మహా ధీరత్వ మనుచు
పరుసతో నవ్వెడి వారల నెఱుఁగ’
రని పల్కి వీరి నొయ్యనఁ జూచి నపుడె
ఘనతరంబుగఁ బాతకమ్ము సిద్ధించు
నని తన తల వంచి యతివలఁ గాంచి
‘వనజాక్షులార నా వల్లభు నింక
నెవరు తోడుక వత్తురేమి సేయుదును
భువి నేను జేసిన పుణ్యమి ట్లుండె

దోషకారులు గురుద్రోహులు = దోషము లాచరించువారు గురువునకు ద్రోహము చేయువారని చంద్రదూషణము. దోషయనఁగా రాత్రి-రాత్రిని జేయువాఁడనియు గురువయిన బృహస్పతి భార్యను బొందినవాఁడనియు భావము. శివద్రోహులు=శివునికి ద్రోహము చేసినవాఁడని మన్మథ దూషణము. అంగహీనులు=మన్మథున కంగము లేదనుట-కాంతిహీనులు = కోకిలాదులకుఁ గాంతి లేదనుట. రేగాములు=రాత్రిగ్రహములు.

నని కొంత గుంది హా యని దుఃఖ మొంది
మనమున బ్రమయుఁ గ్రమ్మఱ నంతఁ దెలియుఁ
నలునిఁ దలంచుఁ గ్రన్నన సంతసించుఁ

జెలులను బిలుచు రాచిల్కలఁ దలఁచుఁ
గిలకిల దెగడుఁ గోకిలలకు బెగడుఁ
గలకల పలుకు భృంగములకు నులుకు
ముట్టదు వీణెయు ముదిత సొమ్ములను
బెట్టదు విరి బంతిఁ బెంపారు కేలఁ
బట్టదు తొడుగదు పాటించి అయిక
గట్టదు చక్కగాఁ గాంచనాంబరము
పూయదు పరిమళంబులు మేన వేడ్కఁ
జేయదు విడియంబు చింతతోఁ గన్ను
మూయదు చెలులతో మునుపటి రీతిఁ
సేయదు చన విట్లు చింతచే నుదుటఁ
దీర్పదు తిలకంబు తెఱఁగొప్ప గోటఁ
గూర్పదు జల కేళిఁ గూడఁగా సఖులఁ
దీర్పదు చెలులు వాదించిన తగవు
పేర్చిన వన కేళి విహరింపఁ జనదు
ముడువదు కురులక్రొమ్ముడి మోద మలర
విడువదు చెక్కిలి వెస నాను కరము
నొడువదు నలుని నెన్నుట దక్క నొరునిఁ
దుడువదు కన్నీరు దొరుఁగఁ గేమియును
నాడదు సరసంబు లబలల తోడ

భృంగములు—తుమ్మెదలు. కాంచనాంబరము=బంగరువస్త్రము.

పీడదు మనమున విభుమీఁది చింత
పాడదు తా నేర్చు పాటలు మనసు
తోడను దెలివలతో మాట లాడ
దీవిధంబున నున్న యింతి నీక్షించి
'వేవేగ భీమ భూ విభున కీకార్య
మెఱిఁగింప కుండిన నిది లెస్స గాదు
సరగున నలరాజచంద్రుఁ డిచ్చటికిఁ
దఱియ వచ్చినఁ గాని దమయంతి నిపుడు
విరిశరంబుల నేయు వెడవిల్తుఁ డాత్మ
ధను వెక్కుడింపఁడు తరలాక్షులార'
యనవుడు మన కేల యని యిందువదన
లప్పుడు గొనివచ్చి యంతఃపురమున
నొప్పుగా విరిశయ్య నుంచి రయ్యెడను

ప్రాతఃకాల వర్ణనము

బొలుపొంద రవివంశమునఁ బుట్టినట్టి
నలునిఁ గోరిన భీమనందన విరహ
వేదన నుడిగింప వేవేగ నినుఁడు
రాఁ దలంచినరీతిఁ బ్రాగ్దిశాకాంత
యనుపుముంగర ముత్తియంబో యనంగఁ
గనుపట్టె ప్రాచిఁ జక్కని వేగుఁజుక్క
మెల్లనె చంద్రుఁడు మెఱుఁగెల్లఁ దక్కి
తెల్లనై పడమటి దెస కేఁగుచుండెఁ
దార లభ్రమున నెంతయుఁ గాంతిమాసె

విరిశయ్య=పూలపానుపు. ప్రాగ్దిశాకాంత=తూర్పుదిక్కనెడు స్త్రీ.

జారచోర సమూహ సంచార ముడిగె
నలరాజు తనవింటి వడినెక్కు డించి
పొలుపొంద బాణముల్ పొదిలోన నుంచెఁ
గదిసియుండినయట్టికాంతలుఁ బురుషు
లదిమినకౌఁగిళు లందంద వదలెఁ
గలువలు చింతించె కమలముల్ మించె
నిలఁ బుష్పజాలంబు లెల్లను వెలసె
సరగున సర్పముల్ చారంబు లుడిగి
యిరవులలోఁ జేరె నింపు సొంపారఁ
గోకిల లందంద కూయంగఁ దొడఁగె
మూకలై పులుగు లిమ్ముల మేఁత కరిగెఁ
దిమిరముల్ తామున్న దిశలకే పోయెఁ
గొమరొప్ప నాల్గుదిక్కులు తెల్లవారెఁ
దనయుని పెండ్లికి ధరణీ ధరారి
ఘనతఁ గట్టినమేలు కట్టో యనంగ
నిందీవరాక్షితో నెలమి జయంతుఁ
డంది వసంతంబు లాడెనో యనఁగ
నిల ధరేంద్రములతో నింద్రుండు పోరి
జలజలరక్తంబుఁ జల్లెనో యనఁగ
నరుణోదయం బయ్యె నంత లోపలను

—సూర్యోదయము.—

వరవైభవంబున వాసవుఁ డిడిన

తిమిరముల్=చీఁకట్లు. ధరణీధరారి=ఇంద్రుఁడు. ఇంద్రుఁడుతనకొడుకయిన జయంతుని పెండ్లికిఁ గట్టినమేలుకట్టువలెఁ దూర్పుదిక్కున నరుణోదయముండె ననియర్థము. ధరేంద్రములు=పర్వతశ్రేష్ఠములు. వాసవుఁడు=ఇంద్రుఁడు.

కొలువులో జగజంపు గొడుగో యనంగఁ
జెలువొప్పుపూర్వాద్రి శిఖరంబు మీఁదఁ
జలమున హరివేయు చక్రమో యనఁగ
జలరాశిపుట్టంబు సతి ధరియించు
పొలుపొందుపాపట బొట్టో యనంగ
బలభేది మెడనున్న పతకమో యనఁగ
నటనతో నింద్రుని నాతిపైనున్న
పటువైన చెంగల్వ బంతియో యనఁగ
భానుఁ డప్పుడు తూర్పు పర్వతంబునకు
మానుగాఁ జనుదెంచె మహి యెల్లఁ బొగడ
నంతట దమయంతి యనుఁగు వయస్య
లంతఃపురంబున కరిగి యాభీమ
ధరణీశ్వరునిఁ గాంచి దమయంతి తెఱఁగు
పరువడిఁ దగ విన్నపము నిట్లు చేసి

—చెలులు దమయంతి మన్మథావస్థను భీమునకుఁ దెలుపుట—

'రో రాజ దేవేంద్ర యోదయా సాంద్ర
వారక నీపుత్రి వార్త లాలింపు
మొకనాఁడు దమయంతి యుద్యానవాటి
సకియలతోఁ గ్రీడ సలుపుచు నుండ
వనమున కెందుండి వచ్చెనో యెఱుఁగ
మనురక్తితోడ రాయంచ లెన్నేని
చనుదెంచి దమయంతి సంగడి క్రాలెఁ

జగజంపు గొడుగో=మేలయిన ఛత్రమో. బలభేది=ఇంద్రుఁడు. ఇంద్రునినాతి=

దను గట్టుటకుఁ ద్రాళ్లు తాఁ దెచ్చుకొన్న
యనువున నొక యంచ నందంద పట్టి
కొని పోవు నంత నీ కూఁతును జూచి
పలుమాఱు మానవ భాష నయ్యంచ
నలుని రూపము తద్గుణముల సంపత్తి
యలఘుత నసమంబు లనుచు వర్ణించి
వలపుఁ బుట్టింప భావజుఁడు కోపించి
విరహంబుం బుట్టించి వేవేగ పోయెఁ
దరుణి యంతట నుండి ధరణీశ నలునిఁ
దలఁచి చింతించు మోదంబున నెంచుఁ
బలుమాఱు దిగు లొందుఁ బరితాప మందు
మముఁ జూచి చీఱు నమ్మదనుని దూఱుఁ
గమలారిఁ దిట్టు తక్కక మమ్ముఁ గొట్టు
హా యని మతి దూలు నవని పైఁ వ్రాలుఁ
బాయక మూర్ఛిల్లుఁ బడి నేలఁ బొర్లు
మనుజేశ యిటువంటి మదన తాపంబు
కని విని యెఱుఁగ మెక్కడ నైన మేము
మరు బాణ వేదన మానునో యంచు
సరసతఁ జేసిన శైత్యోపచార
మంత యింతని చెప్ప నలవియుఁ గాదు
వింతలు నున్నవి విపరీతుం మన్ని
యిగురు పానుపు మీఁద నింతిని జేర్పఁ

శచీదేవి. భావజుఁడు = మన్మథుఁడు. కమలారి=చంద్రుఁడు. ఇగురు=చిగురు.
కుసుమాస్త్రవహ్ని=మన్మథాగ్ని.

జిగురాకు లన్నియుఁ జెచ్చెరఁ గమలెఁ
దలఁచి తామర పూల తల్పంబు నందుఁ
బొలఁతుక నుంచినఁ బొగలుగా నెగసెఁ
జల్లని నీటిలో సఖియ నుంచినను
గల్ల గాదది వెచ్చగా నయ్యె జలము
ముత్తెపు సరములు ముదితకు నిడినఁ
గ్రొత్త నీలము లాయెఁ గుసుమాస్త్రవహ్ని
జందనం బలఁదిన జలజాక్షి మేనఁ
గంది యాక్షణమునఁ గస్తూరి యయ్యెఁ
బన్నీరు కడవలఁ బట్టి తెప్పించి
వెన్నునఁ బోసిన వెలఁది శోషించు
మా చేతఁ గాదింక మగువఁ బోషింప
నాచెలి బ్రతుకఁ నీఁ డామన్మథుండు
నెలనాగ సంగతి నీక దాఁచ నేల
వలనొప్పఁ బుత్త్రి గావలసి యుండినను
నలుని రప్పింపుమా నలుఁడు రాకున్న
జలజాక్షి బ్రతుకదు సత్య మీ మాట
యిన్ని నాళ్లీ తెఱఁ గేర్పడ మీకు
విన్నపం బొనరింప వెఱచి యుండితిమి
జాగు సేయఁగ నింకఁ జనదు భూ నాథ
వేగమే నల మహీవిభుని రప్పింపు'
మనవుడుఁ దల యూఁచి యతివలఁ జూచి
మనమునఁ జింతించి మనుజేశుఁ డనియె

'నాఁడు బిడ్డలఁ గన్న యట్టి మానవుని
పాడి పంతంబులు పౌరుషంబులును
జెడు నంచు పెద్దలు చెప్పిన మాట
తడయక నిజమాయె దమయంతి వలన
నేమి సేయుదు నింక నిట మీఁద నేను
నామహీపతిఁ బిల్వ నంపుట యెట్టు
లా రాజుఁ బిల్వంగ నలవియే నాకు
నా రాజుఁ బిలిచిన నతఁ డేల వచ్చు
నలుఁ డనఁగా నుర్వి నారాయణుండు
నలుని రప్పింపఁగా నాచేత నౌనె
బలవంతమున నియ్యఁ బాడి గా దిలను
బలవంతు రప్పింప బలిమియు లేదు
నా మహీశునిఁ గోర నాతికిఁ దగునె
బలువిడి మఱి మహీపాలురు లేరె'
యని తలపోయుచు నాత్మజ కడకుఁ
జనుదెంచి సుత యున్న చందంబుఁ జూచి
వెఱఁగంది యప్పుడు వేవేగ వచ్చి
వెరవొప్ప సంధ్యాది విధులెల్లఁ దీర్చి

భీష్ముఁడు సభ్యులతో నాలోచించి దమయంతీ స్వయంవరము చాటుట.

కొలువు చావడికి గ్రక్కున నేగుదెంచి
నలువైన సింహాసనమునఁ గూర్చుండి

నలువైన=సొగసైన. ఉర్వినారాయణుండు=భూలోకవిష్ణువు.

హితుల గాయక పురోహిత మంత్రి వరుల
నతివేగ రప్పించి యప్పు డిట్లనియె
'మన దమయంతి కోమలులతోఁ గూడి
యొనరంగ నొక్క నాఁ డుద్యాన వనిని
వేడుక లలరంగ విహరించు చుండ
నాడకు రాయంచ లరుదెంచి నలుని
వర్ణ రూప లావణ్య వైభవ స్ఫురణ
వరుసతో వర్ణించి వదరుచుఁ బోయె
నంతట నుండి తొయ్యలి దమయంతి
చింతించి నలుని పైఁ జిత్తంబుఁ జేర్చి
కంతుని చేఁ జాల గాసిల్లె ననుచు
నింతులు చెప్పిరి యిందు కేమనిన
విని సభ వారెల్ల విభుని వీక్షించి
'జననాథ యిందుకు సంతాప మంద
నేల మే మొక కార్య మెఱిఁగింతు మిపుడు
భూ లోకమున నున్న భూ నాయకులకు
వనరుహాక్షికి స్వయంవర మహోత్సవము
అని చెప్పి పంపిన నప్పు డా నలుఁడు
చనుదెంచు సకల రాజన్యులు వత్తు'
రన విని యిది కార్య మౌనని చెప్పి
రయమునఁ జారుల రప్పించి చూచి
ప్రియము రెట్టింపంగ భీముఁ డిట్లనియె

ఉద్యానవనిని=పూఁదోఁటయందు. చారుల్=వేగులవారిని.

'నరుదార నిషధేశుఁ డాదిగాఁ గల్గు
ధర నీశ్వరుల నెల్లఁ దప్పక కాంచి
కలకంఠి దమయంతి కన్యక కిపుడు
వలను మీఱఁగ స్వయంవర మని చెప్పి
చనుదెండు పొం'డని జనపతి పలుక
విని వార లప్పుడు వేవేగ చనిరి
భూమీశుఁ డప్పు 'డాపుర వరం బెల్లఁ
బ్రేమ మీఱ నలంకరింపుఁ' డటంచుఁ
దలవరులకుఁ జెప్పి తగఁ జాటఁ బనిచెఁ
దలవరు లప్పు డాధరణీశు మీఁద
నానఁబెట్టుచు పురం బటు వీథి వీథిఁ
బూనుక తమ్మటంబులు వేసికొనుచు
సరగున హా యని చాటించి రంతఁ
బురము వారెల్ల నప్పుడు వాడవాడఁ
గమ్మని కస్తూరి కలిపి పన్నీట
గమ్మని వాసింపఁ గలయంపిఁ జల్లి
పచ్చ తోరణములు బాగుగాఁ గట్టి
మెచ్చిబంగరు వ్రాత మేల్కట్లు గట్టి
కదళికా స్తంభముల్ కడు వేడ్క నిలిపి
ముదమొప్ప ముత్యాల ముగ్గులు పెట్టి
చెంగావి టెక్కెముల్ చేర్చి యింటింట
సంగతిఁ దెలి దమ్మిసరములు విడిచి

కదళికా స్తంభముల్=అరఁటి కంబములు. విడిచి=వ్రేలఁగట్టి

కుంకుమ పన్నీట గోడలు పూసి
పొంకంబుగాఁ జిత్రపుత్రికల్ వ్రాసి
చెలువ మందిన యట్లు చిత్రవైఖరులు
గలుగ నప్పురము శృంగారించు చుండి
రంతిలోపలఁ జారు లానలాధిపుని
సంతసంబునఁ గాంచి సద్భక్తి మ్రొక్కి
'ధరణీతలేశ విదర్భావనీశు
వరనందనకు స్వయంవర మహోత్సవము
గావున దమయంతి కల్యాణమునకు
వేవేగ దేవర వేంచేయ వలయు'
నని చెప్పి సకలలోకాధీశ్వరులకు
వినిపించి యాభీమవిభు పురి కరిగి
రంతట నిషధేశుఁ డానంద మంది
కుంతల బర్బర కోసల పాండ్య
మాళవ ద్రవిళాంధ్ర మగధ కాశ్మీర
కాళింగ కాంభోజ కర్ణాట లాట
మరహాట కరహాట మత్స్య సౌరాష్ట్ర
కురు సింధు ఘూర్జర కుకుర సౌవీర
గౌళ నేపాళ బంగాళ పాంచాల
చోళాది నాథులు సుముఖులై కొలువ
నాదిత్య రథ సమంబైన తేరెక్కి
భూదేవ సచివాప్తబంధులతోఁ గూడి

ఆదిత్యరథసమంబు=సూర్యునిరథముతో సాటియైనది. భూదేవ సచివ ఆప్త బంధులు=బ్రాహ్మణులు, మంత్రులు, హితులు, పండితులు.

బహుగజ హయరథ భటచతురంగ
సహితుండై యెదుట వేశ్యాతాళమాన
సంగీత నాట్య ఘోషంబులు సెలఁగ
మంగళవాద్య సమ్మర్దంబు గలిగి
మహితాతపత్ర చామరములు మించు
మహిపచ్చవన్నె పావడలు రంజిల్లఁ
గంచుకొమ్ములు బూరగలు నాగసరము
లంచిత పటహ కాహళములు నమర
భేరీ మృదంగ గంభీరవాద్యములు
బోరుకల్లఁగ మ్రోసె భూనభోంతరము
నలుఁ డీగతి విదర్భ నగరమార్గమునఁ
బొలుపొంద మెల్లనఁ బోవుచు నుండె.

ప్రథమభాగము సమాప్తము.

మహితఆత పత్ర=గొప్పగొడుగులు. సమ్మర్దము=క్రందు, ఒరపిడి.

నలచరిత్రము.

ద్విపదకావ్యము.

ద్వితీయభాగము.

పరమ పావనుఁడు శ్రీపతి భక్తి యుతుఁడు
సుర మునీశ్వరుఁడు భాసుర గుణోజ్జ్వలుఁడు
తల నిండ గెంజడల్ దళముగాఁ జుట్టి
నలునందు కృష్ణాజినముఁ జంకఁ బెట్టి
రహి ద్వాదశోర్ధ్వపుండ్రములను బట్టి
మహతి మూఁపునఁ జేర్చి మానస వేగ
యోగ వాహము లెక్కి యొగి నారదుండు
బాగుగా శ్రీపతిఁ బాడి సొక్కుచును
ధరణిఁ జరించుచు దమయంతి చంద
మెఱిఁగి యా వృత్తాంత మెల్ల వేవేగ
పురుహూతునకుఁ జెప్ప బోరన దివికి
నరిగిన వాని నల్లంతటఁ జూచి
కిన్నర గంధర్వ ఖేచర గరుడ
పన్నగ దేవ దిక్పాలకుల్ గొలువ
నలరి నృత్యంబు రంభా ద్యప్సరసలు

మహతి=నారదునివీణె పేరు.

నలుప బంగరు గద్దె చయ్యన డిగ్గి
యెదు రేఁగి భక్తి దేవేంద్రుండు మౌని
పదముల కెఱఁగి శుభ ప్రాప్తి కర్ఘ్య
పాద్యంబు లొసఁగి క్రొం బసిడి పీఠమున
విద్యా నిధిని యోగి విభు నుంచి భక్తిఁ
బూజించి చేతులు మొగిచిన నింద్రు
నాజటీంద్రుఁడు చూచి యపు డిట్టులనియె
'సురనాథ విను మొక శుభ వార్త నిపుడు
ధరలోన నొక విచిత్రము పుట్టె వినుము
భీమ భూపాలుఁ డభేద్య విక్రముఁడు
సోమార్క నిభుఁడు భాసుర గుణోజ్జ్వలుఁడు
ఇల విదర్భ పురంబు నేలెడు రాజు
వలనొప్పనతనికి వర పుత్త్రియైన
యలివేణి దమయంతి యను కన్య గలదు
తలఁపున దాని సౌందర్య సంపదలు
వనజాసనున కైన వర్ణింప రాదు
వినుము నే చూడని వెలఁదులు లేరు
చూచితిఁ బార్వతిఁ జూచితి లక్ష్మిఁ
జూచితి భారతిఁ జూచితి రతిని
జూచితి దారను చూచితి శచిని
జూచితి మేనకఁ జూచితి రంభ
నెక్కడఁ గని విని యెఱుఁగ నెన్నండు
నక్కమలాక్షి నలా వనీశ్వరుని
మది లోనఁ గోరి మన్మథ బాణ వేధ

బెదరి కృశింపఁగా భీమ భూ విభుఁడు
నలునిఁ దెచ్చుటకు భూ నాథుల నెల్ల
నల దమయంతీ స్వయంవరంబునకు
రండని భటులఁ చే రావింప నిషధ
మండలాధిపుఁడును మానవేశ్వరులు
హయ కుంజర స్యందనారూఢు లగుచు
రయమున నావిదర్భ పురంబుఁ జేరఁ
బోవుచున్నా రదె భూలోక వార్త
దేవేంద్ర నీకు నేఁ దెలుప వచ్చితిని
దగు నీకు దమయంతి తగ దన్యులకును

—* ఇంద్రుఁడు, అగ్నియు, యముఁడును, వరుణుఁడును దమయంతిని వరించుటకై స్వయంవరమునకు వచ్చుట. *—

నగ భేది' యని చెప్పి నారదుం డరిగె
సురనాథుఁ డధిక తేజో మూర్తులైన
వరుణ కృతాంత పావకుల మువ్వురను
గనుఁగొని సంతోష కలితుఁడై పలికె
'మనము నల్వురము నెమ్మది మర్త్యమునకుఁ
బోయి యందు విదర్భ పుర మర్థిఁ జొచ్చి
యా యింతిఁ గనుఁగొందఁ' మని పల్క వారు
పరతేర నలువు రప్పట్టణోపరిని
బుర లక్ష్మి వైభవంబును జూచుచుండ
నరపతుల్ గొలువ సేనలు చుట్టు నిలువ
నరుదెంచి పురవీథి నరుగు చున్నట్టి

పౌరస్త్రీలు నలునిఁ జూచి వర్ణించుట.

నలునిఁ గన్గొనఁగఁ దన్నగర భామినులు
పొలుపొందు ప్రాసాదముల గోపురములఁ
దలవాకిళుల నున్నతంపు మిద్దియల
నిలిచి యన్నల ధారుణీ విభుఁ జూచి
కోమరొంప నందంద గుంపులు గూడి
ప్రమద లొండొరులతో భాషించి రిట్లు
'చూడరే యీ రాజు సొంపును బెంపు
వేడుకలయ్యెడు వెసఁ జూడఁ జూడఁ
దనియ దీతని చక్కఁదనము యౌవనముఁ
దనరారె నిట్టి యందంబుఁ జందంబుఁ
పొలుపొందు నే యోఁదు భువియందు నివియుఁ
గలవె లోకముల నెక్కడ విచారింపఁ
గంతుఁడో శ్రీరమా కాంతుఁడో యల జ
యంతుఁడో కాక మోహన వసంతుఁడో
యీ మనుజేశ్వరుం డినుఁడో చంద్రుఁడో
యీ మహామహుఁడు దేవేంద్రుఁడో హరుఁడో
ననవిల్లు పుష్ప బాణము లుండెనేని
మనసిజుం డని వీని మదిఁ జెప్ప వచ్చుఁ
గరముల శంఖచక్రము లుండెనేని
పరఁగ నీతని రమా పతి యన వచ్చు
మూడు కన్నులు ముఖంబునఁ గల్గెనేని
వేడుక పార్వతీ విభుఁ డన వచ్చు
వేయి కన్నులు మేన విలసిల్లెనేని

యా యమరాధిపుఁ డని చెప్పవచ్చు'
నని వితర్కింప భీమావని విభుఁడు
వినుతింపఁ దగినట్టి విడిదిఁ జూపుటయు
నలుఁ డందు విడిసి యందఱ నప్పు డన్ని
నెలవుల విడియించి నిష్ఠ నున్నంత

ఇంద్రాదులు నలుని దమయంతి యొద్దకు దూతగాఁ బోవవేఁడుట.*

హరిహయాదులు తమయరదంబు లన్యు
లెఱుఁగ కుండఁగ నొక్క యిక్కను డాఁచి
పొలుపొంద నిజరూపములతోడ వచ్చి
నలరాజు నెదుటఁ గ్రన్నన వచ్చి నిలువఁ
గనుఁగొని నల మహీకాంతుఁడు దివిజు
లనుచు దిగ్గన లేచి యతిభక్తితోడ
నెదురుగాఁ జనుదెంచి యిలఁ జాఁగి మ్రొక్కి
ముదమంది వేవిధమ్ములఁ బ్రస్తుతించి
యనురక్తిఁ గొనివచ్చి హైమాసనముల
నునిచి చేతులు మోడ్చి యురుభక్తిఁ బలికె
'నమరేశ శిఖి శమ నాంబుపులార
కొమరొప్ప నాల్గు దిక్కులయందు నిలిచి
కరమొప్ప సకలలోకముల రక్షించు
పరమాత్ములార నాభాగ్యమూలమునఁ
జనుదెంచినారు మీసందర్శనమున
ఘన పుణ్యమతి నైతిఁ గాదె లోకములఁ
గరుణ మీ రిటకు నిక్కము వచ్చి నట్టి
తెఱఁ గెఱింగింపుఁడు తెలియంగ నేఁడు

ఘన మూర్తులార మీ కార్య మంతయును
ననుకూల మొనరింతు’ ననుడు వాసవుఁడు
విని నలోర్వీశుని వీక్షించి పలికె
‘జననాథచంద్ర నీ సత్యశీలంబు
పటుగతి సకలభూ భాగంబు నిండె
నటు గాన నిన్నుఁ జూడ నభిలాషఁ బుట్టి
చనుదెంచినాము నీ చంద మంతయును
గనుఁగొన సంతోషకరమయ్యె మాకుఁ
దరలాయతాక్షికి దమయంతి కన్య
కరయ స్వయంవర మని విని నేఁడు
నలువుర మరుదెంచి నా ఖంతిఁ గోరి
నలినాప్తకులజ యా నాతి దగ్గఱకుఁ
జని వేడ్క నీమది సరిపోవు రీతి
ననుకూల పఱిచి చయ్యన రమ్ము పొమ్ము
చనువిధం బెట్లని జాలిఁ బొందకుము
మనుజేశ నీకన్న మఱి లేదు మాకు
వసుధేశు లెందఱో వచ్చి యున్నారు
పొసఁగ నీసరి సేయఁబోలునే వారి
మా కార్యమంతయు మనుకులాధీశ
నీకార్య మని చూడ నేర్తువు గాన
నీకు నేఁ జెప్పితి నిషధేశ నీవు
పోకున్న నిపుడు మా బుద్ధియుఁ గలఁగు’
నావుడుఁ జిఱునవ్వు నవ్వి భూవిభుఁడు
దేవేంద్రుఁ గనుఁగొని ధీరుఁడై పలికె

‘నిది యేమి దేవ నీ కిటువంటి మాట
యదయునివలె నిట్లు లాడంగఁ దగునె
యుండంద భూనాథు లందఱు వచ్చు
చుందాన నేనును జనుదెంచి నేఁడ
నాకంజలోచన ననుకూల పఱుప
నాకుఁ జెప్పఁగ నీకు న్యాయమా దేవ
ముందర వెనుకను ముదితను గాంచి
చెందిన వేడ్క భాషించి యున్నానె
పొలుపొంద నట్లయినఁ బోయి వచ్చినను
వెలఁదుక నా మాట వినునె కా దనక
పన్నగా నిటువంటి పనులకుఁ బోవఁ
గన్నది విన్నది కలదె మీరలును
బాయక యిటువంటి పనులు నాచేతఁ
జేయుట గాదు మీసేవఁ గావింతు
నింతయె కాని యా యింతిని మీకు
సంతసంబున బుద్ధి చాలదు పూర్వఁ
జేరి యీ పనులు నేర్చిన వారిఁ బనిచి
యా రమణీ మణి నర్థి వరింపుఁ’
డనవుడుఁ బురుహూతుఁ డా రాజుఁ జూచి
ఘన కృపా రస, మొల్కఁగా నిట్టు లనియె
‘నిన కులాధీశ నీవే కార్యమైన
ననుకూల పఱిచెదనంటివి యిపుడు
పనివడి మేమొక్క పనికిఁ బొమ్మనిన

కంజలోచన=తామరలవంటి కన్నులు గలది. పురుహూతుఁడు=ఇంద్రుఁడు.

వినయముల్ వల్కుచు వెలఁదుక కడకుఁ
బో లేక యిప్పుడే బొంకితి వనినఁ
బోలించి యే మనఁ బోయెద మింకఁ
బరువడి సత్య సంపన్నుండ వనుచు
సురలు చెప్పఁగ నిన్నుఁ జూడ వచ్చితిమి
కర మొప్ప దబ్బజకాఁప వటంచు
నెఱిఁగితే మే మేల యిందు వచ్చెదము
జగతి నిక్ష్వాకు వంశజు లెల్ల మున్ను
పొగడిన కీర్తులు పొందిరి తొల్లి
యట్టి వారల వంశమందుల నీవు
పుట్టి దబ్బఱలకు పుట్టిల్ల వైతి
వీ మేలుఁ జేసిన నెన్నటి కైన
మా మనంబుల నిన్ను మఱవంగ లేము
నల రాజు సురరాజునకుఁ బెండ్లిఁ జేసె
నలి వేణి దమయంతి నని రమా నాథుఁ
డెఱిఁగితే నిను మెచ్చు టిది పెద్ద గాదె
ధరణీతలేశ యా దనుజారి యైన
మా కార్య మనినఁ దామస మింత లేక
చేకొని కరుణతోఁ జేసి రక్షించు
ధరణీశ మామీఁద దయ లేదు మీఁద
నెఱిఁగెద విందుల కేమి గా నిమ్ము
చనియెద మింక'ని చర్చించి పలుక
విని చాల మది లోన వెలువెలఁబాఱి
కరములు ముకుళించి ఘన భక్తి మీఱ

ధరణీశుఁ డా పురందరున కిట్లనియె
'నోనర నీ బంట నై యుండెడు వాఁడ
నన ఘాత్మ నామీఁద నత్యంత కరుణ
గలిగి వచ్చితి వటు గాన నే నిపుడు
నెలమిని నా దమయంతి దగ్గఱకు
నేరయఁగ నేగతి నరుగఁదు ననుచు
గరుణా సముద్ర యీ గతిని బల్కితిని
అకట యా దమయంతి యంతఃపురంబు
నకుఁ బోతుటీఁగ నైనను బొంద రాదు
గావున నిప్పుడీ కార్య మేరీతిఁ
గావింతు నీమాట కపటంబు గాదు
తడయక దాని యంతఃపురంబునకు
నడుప నుపాయంబు నాకెఱింగింపుఁ'
డన విని శైలారి యాత్మ మోదించి
మనుజేశ్వరునిఁ జూచి మఱియు నిట్లనియె
'దమయంతి కన్యకు దాని యింతులకుఁ
గ్రమమున నీ రూపు గనిపించుఁ గాక
నితరుల కెవ్వరి కెఱుఁగంగ రాదు
సతి తోన భాషించి చనుదెంచు దనుక'
నని యొప్ప వర మిచ్చి యరుగు మటంచుఁ

పురందరుఁడు=ఇంద్రుఁడు. శైలారి=ఇంద్రుఁడు.

నలుఁడు దమయంతియొద్దకు దూతగాఁబోయి యింద్రాదులలో నొక్కనిని వరింపుమని చెప్పుట.

బనిచిన వారికి భక్తితో మ్రొక్కి
చనిచని యా భీమ జన నాయకుండు
వెనుపొంద హితులతోఁ బేరోలగమున
నామెడఁ గూర్చుండి యాలోచనంబు
సేయంగ నొక కొంత సేపుండి చూచి
యరుదైన కనక హర్మ్యంబులు గడచి
మెఱసెడి బంగారు మేడలు గడచి
సరస చిత్తరువుల చవికలు గడచి
వరుసతోఁ బగడంపు వాకిళ్లు గడచి
యక్కడక్కడ సిల్చి యంతఃపురంబు
నక్కజంబుగ దాఁటి యా దమయంతి
యువిదతోఁ గూడుక నొనరంగ నొక్క.
నవ రత్న మయమైన నగరిలో నుండఁ
గనుఁగొని దాని దగ్గఱఁ బోయి నిలువ
వనజాక్షుఁ జూచి భావజుఁ డంచు బెదరి
భ్రమ నొంది ధర మీఁదఁ బడి మూర్ఛ వోయి
కమలాక్షి యంతలో గ్రక్కునఁ దెలిసి
కనుఁగొని నల రాజు గాఁబోలు నంచు
మనమునఁ దెలిసి హేమ స్తంభ మొకటి
చాటుగా నిలిచి యచ్చట నున్న తనదు

పేరోలగము=నిండుకొలువు. భావజుఁడు=మన్మథుఁడు. హేమ=బంగారు.

చేటిని సైగఁ జేసిన నది వేడ్క
జననాథుఁ గని పల్కె సరస వాక్యముల
'నొనరంగ నెక్కడ నుండి వచ్చితివి
నీ వెవ్వఁడవు మఱి నీకుఁ బేరేమి
యే విధమ్మున వచ్చి తిటకు నీ కార్య
మెఱిఁగింపు నీ పురం బెయ్యది నీవు
విరులవిల్తుని రీతి వెలయుచున్నాఁడ'
వనవుఁడు రాజేంద్రుఁ డా దమయంతిఁ
గనుఁగొని సంతోష కలితుండై పలికె

నలుఁడు దమయంతితో నింద్రాదులను వరింపు మనుట.

'రమణ నే నిషధ పురం బేలువాఁడ
నమర నలాధిపుఁ డను పేరివాఁడ
సరసత నిటకు నిర్జర దూత నగుచుఁ
బరతెంచినాఁడ నాపని యెల్ల వినుమ
యమరాధిపతియును ననలుండు మఱియు
శమనుండు వరుణుండు సరసత వీరు
నలువురు నినుఁ గోరి నాకడఁ జేరి
తలఁపు లెఱింగించి తమలోన నొకని
ననుకూల పఱచి రమ్మని పంచినారు
వనజాక్షి యిట్టి దేవతలకు నీవు
తెలివిచేఁ బట్టపు దేవిగా నుండఁ
గలిగెను నీదు భాగ్యము నెంచఁదగియె
వారిజానన యేను వరుసతో నిపుడు
వారి ప్రభావముల్ వర్ణింతు వినుము

బలభేది సకల సామ్రాజ్య సంపదలఁ
దెలివి నొందిన తూర్పు దిశ నేలు రాజు
మఱివక జముఁడు ధర్మము విచారించి
తిరముగా దక్షిణ దిశ నేలు రాజు
భూ వలయంబునఁ బొలుపొంద వరుణ
దేవుఁడు పశ్చిమ దిశ నేలు రాజు
కేళిమై నగ్ని యాగ్నేయపు దిక్కు
నేలెడి వాఁడు యజ్ఞేశ్వరాహ్వయుఁడు
వారు పుణ్యాత్ములు వార లుత్తములు
వారు శ్రీమంతులు వారు పావనులు
వార లభేద్యులు వా రనిమిషులు
వారలు నినుఁ గోరివచ్చిన యపుడె
యలివేణి యెంతభాగ్యముఁ జేసినావొ
తెలియంగఁ దరమె యాదివిజ వల్లభుల
నలువురలోన మానస మేరియందు
నిలుచునో నీవు వాని వరించితేని
యనిమిష నాయకు లహివరుల్ నరులు
మునులును ఋషులును ముద మందఁగాను
గరుడ ఖేచర యక్ష గంధర్వవరులు
హరి హర బ్రహ్మాదు లందఱు నిన్ను
నరసి ప్రస్తుతిచేతు రది మేలు గాదె
నరకామినివి నీవు నాకులు వారు

బలభేది=ఇంద్రుఁడు. సామ్రాజ్య=రాజరాజత్వము. జముఁడు=యముఁడు. అనిమిషులు=దేవతలు. నరకామినివి=మనుష్యస్త్రీవి. నాకులు=దేవతలు.

వనజాక్షి యెవ్వరి వరియించె దీవు
వినిపించు వీనులవిందుగా నాకు
ననురక్తి దేవత లంప వచ్చితిని
ననుఁ జిన్నఁబుచ్చుట న్యాయంబు గాద'
యనవుడు దమయంతి యామాట లెల్ల
విని నవ్వి యారాజవిభున కిట్లనియె

దమయంతి యింద్రాదులను వరింప ననుట.

'నవునోయి మంచికార్యము చేసినావు
కువలయేశ్వర నిన్నుఁ గోరినందులకుఁ
బురుషులు గోరుట పుడమిలోఁ దగును
తరుణులు గోరుట తగ దనుమాట
నిజ మయ్యె నామీఁది నేరంబు గాదె
యజుఁడును సరివార లందఱిలోన
నగుఁబాటు చేసెనే నరనాథ నేఁడు
మిగుల మాటలు వల్క మీకెట్లు చెల్లు
రాయంచపులుఁగులు రయమున వచ్చి
పాయక మదనునిబారిని ద్రోచి
యరిగిన వెనుక నిన్నన నేల నాకుఁ
బరువడి నావ్రతఫల మిట్టు లుండ
నమరాధిపతు లేడ నకట నే నేడ
తముఁ గోరు మని చెప్పఁ దగునె వారలకు
వారికి బిడ్డ నై వర్తింతు నిటను

కువలయేశ్వర=రాజా. అజుఁడు=బ్రహ్మ. రాయంచపులుఁగులు=రాజహంసపక్షులు.

వారిని వరియింప వచ్చుదోషంబు
కుతలేశ మును నిన్నుఁ గోరిన వెనుక
మతిలోన వేఱొక్కమగనిఁ గోరుమనె
నీవె వరింపుము నీవు కాదనిన
వేవేగ ప్రాణముల్ విడుతు నంతటనె
వారును నీవును వరుస మెచ్చెదరు
ధారుణీవల్లభ తప్పదీమాట
నావుడు చిఱునవ్వు నవ్వి భూవిభుఁడు
వావిరి భీమభూవరపుత్రి కనియె
'సురనాయకులు గూడి సుందరి నిన్ను
వరియింప వచ్చినవారిఁ గాదనుచు
నరుని వరించిన నగరె లోకముల
ధరలోన నోములుఁ దగినదానములు
నుపవాసములుఁ బెక్కు లొనరంగఁ జేసి
యెపుడును గందు రాయింద్రపదంబు
నాసించి యుండుమహాత్ముల కైన
వాసవలోకనివాస మానరుదు
వరుసతో నీపుణ్యవశమున సురలు
వరియింప వచ్చిరి వరవైభవమున
నట్టివారల నొల్ల నని నీవు నన్ను
నెట్టు పెండ్లాడెద విది బుద్ధి గాదు
వనిత వారలు గోరివచ్చిన వెనుక

కుతలేశ=రాజా.

నిను వరింపఁగ నాకు నీతి గాదింక
నినవంశజుఁడఁ గాని యితరుఁడఁ గాను
బనిఁ బూని వారలబంటనై వచ్చి
వెలఁది నిన్ను వరింప వెఱతు నే' ననిన
నెలుఁగెత్తి హా యని యేడ్చి 'భూనాథ
నీవు రావలె నంచు నిఖిలభూవిభుల
రావించె మాతండ్రి రయమున మీకుఁ
బంతమా యిటువంటి పలుకులు పలుక
సంతసంబున విను జననాథచంద్ర
బలసూదనుం డైనఁ బావకుం డైన
జలదేవుఁ డైనను సమవర్తి యైన
జలజసంభవుఁ డైన జలజాప్తుఁ డైన
జలజారి యైనను జలజాక్షుఁ డైన
వరియింప నొల్లనో వసుధేశ నన్ను
నెరవున వరియింప వెఱచితి వేని
సన్నుతి వారల సన్నిధి నుండి
నిన్ను నే వరియింతు నీ కేల భయము
కాదని యీరీతిగాఁ జేయకున్న
మేదినీశ్వర నీవు మెచ్చకు నన్ను
నని పల్కుచుండ నయ్యమరవల్లభులుఁ
జని యదృశ్యత నిల్చి జనపతి పలుకు

ఇనవంశజుఁడ=సూర్యవంశమునఁ బుట్టినవాఁడను. బలసూదనుఁడు=ఇంద్రుఁడు. పావకుఁడు=అగ్ని. జలదేవుఁడు=వరుణుఁడు. సమవర్తి=యముఁడు. జలజసంభవుఁడు=బ్రహ్మ. జలజాప్తుఁడు=సూర్యుఁడు.

లాలించి మెచ్చుచు నరిగిరి మున్ను
భూలోకవిభుఁ డంతఁ బొలఁతి చిత్తంబు
తెలిసి వేగమె చనుదెంచి దేవతల
నలరుచుఁ జూచి సాష్టాంగ మర్పించి
కరములు ముకుళించి కడు భక్తిఁ బలికె

నలుఁడు దేవతలకు దమయంతి వరింప దనిచెప్పుట.

'నరిగితి భీమరాజాత్మజకడకు
నెనయంగ మీ రానతిచ్చిన క్రమము
వినిపించితిని మిమ్ము వినుతిఁ జేసితిని
బరమ పావనులార భవ దూరులార
వర రూపవతి మిమ్ము వరియింప ననియె'
ననవుడు దేవేంద్రుఁ డారాజచంద్రుఁ

దేవతలు నలునిదాత్యాగును బొగడుట.

గనుఁగొని 'మామాట కాదన లేక
వేడుకతోఁ బోయి వెలఁదితో మాట
లాడి వచ్చితివి గా యవనీతలేశ
నీయంత గుణశాలి నిఖిలంబులోన
నేయెడఁ గని విని యెఱుఁగ మెన్నండు
నిట్టి సత్యవ్రత మిట్టి గాంభీర్య
మిట్టి యౌదార్యంబు నిట్టి సద్గుణము
గలిగినవాఁ డ వెక్కుఁ డవె లోకముల
నల మహీనాథ యానలినాక్షి నిప్పు
డతి వేడ్కతోఁ బెండ్లియాడు మీ నీవు
మతిలోన నీమేలు మఱువ మెన్నండు'

నని పల్కి యానల్వురచ్చోటు వాసి
ఘనమాయఁ దర్లి చక్కఁగ నొక్కచోట
నుతు తర మూర్తు లన్యులకు నెవ్వరికి
గుఱు తిడ రాకుండఁ గూర్చుండి రంత
నంతట భీమగోత్రాధిపుఁ డలరి
వింతగాఁ దనమంత్రి విభుల భూవిభుల
హితుల మంత్రుల పురోహితుల సమ్మతిని
నతివేడ్క శుభలగ్న మటు నిశ్చయించి
నలుఁ డాదిగాఁ గల్గునరనాథవరులఁ
బిలిపించి వారికిఁ బ్రియముఁ బుట్టించి
సరసతోఁ దన కొల్వుచావడి కెదుటఁ
బఱపైన చలువ చప్పరముల నునిచి
తన పుత్రి యున్న యంతఃపురంబునకు
జననాథ చంద్రుండు సమ్మతి నరిగె
నప్పుడు దేవత లానంద మొంది
యెప్పుడు నరులకు నెఱుఁగ రాకుండ
నలుని రూపంబులు నలువురు దాల్చి
కొలువున నలుచెంతఁ గూర్చుండి రంత
భీముండు దాదులఁ బిలిచి 'మీ రింకఁ
గామిని దమయంతి కన్యకామణినిఁ
గడువేడ్క మీఱ శృంగారించి వరను
లడు గంగ దేవాలయంబున కరిగి
శ్రీ రమాపతిని బూజింపఁగఁ జేసి

కోరి చయ్యనఁ దోడుకొనుచు రా నలయు
ననుటయు దమయంతి కాయిందు ముఖులు

దమయంతి కలంకారము సేయుట.

చని తేట పన్నీట జలకంబు లార్చి
మెఱవడిజిలుఁగుతో మెయితడి యొత్తి
కురు లార్చి వింతగాఁ గొప్పుఁ గీలించి
వర చంద్రకావిపావడమీఁద మించి
వరలు సన్నపుఁజల్వవలువ బా గొప్ప
గట్టి గుబ్బల మీఁదఁ గనకంపుఁబూల
పట్టు కంచుకమును బాగుగాఁ దొడిగి
తిరుగా మృగనాభితిలకంబు దీర్చి
కోరి జవ్వాజితోఁ గూర్చిన మంచి
హరిచందనము వేన నందంద పూసి
విరిసగుల్ గొప్పున వింతగాఁ దుఱిమి
పటు సూర్య చంద్రుల పాపటబొట్టు
నిటలంబుపై వ్రాల నిలిపి కర్ణములఁ
గర మొప్ప బంగారుకమ్మలు పెట్టి
కరముల వజ్రాల కడియముల్ పెట్టి
నీలంపు ముంగర నీటుగాఁ బెట్టి
లాలితంబుగను బిళ్లల నూ లమర్చి
కరముల ముద్దు టుంగరములు పెట్టి
మెఱయుహారంబులు మెడ నిండ నుంచి

మెఱవడిజిలుఁగు=ప్రకాశించుచున్న సన్ననివస్త్రము. మృగనాభితిలకము=కస్తూరిబొట్టు. సన్నపుచల్వవలువ=తెల్లనిసెల్లా

తెలి దమ్మి రేకులఁ దెగడెడు ముద్దు
కలికి కన్నుల మంచి కాటుకఁ బెట్టి
ఘన తర నవరత్న కాంతులచేతఁ
దనరిన జిగి సందిదండలుఁ బెట్టి
పల్లేరు పువ్వులు పసిఁడితీఁగెయును
మొల్లమి గాజులు ముంగా మురుగులు
తిలకంబు పసిఁడి యందియ లాది గాఁగఁ
గలభూషణంబులు కన్యకామణిని
ధరియించి వేడ్క శ్రీధరు మందిరమున
కను దండఁ దోడ్కొని యరిగిన నింతి
కరములు ముకుళించి కన్యా లలామ
పరమాత్ముఁ డైన శ్రీపతిని దర్శించి
భయ భక్తి మీఱ నేర్పునఁ బ్రస్తుతించె
'జయ భక్త మందార జయ మహోదార
జయ నిత్యకళ్యాణ జయ జగత్త్రాణ
జయ పద్మ దళ నేత్ర జయ నీల గాత్ర
జయ కరుణాపాంగ జయ కీర్తితాంగ
జయ పాప సంహార జయ శుభాకార
జయ బాహు బల ధుర్య జయ దేవ వర్య
జయ భోగసుత్రామ జయ గుణోద్దామ
జయ రమా హృదయేశ జయ చిత్ప్రకాశ

ధరియించి=ధరియింపఁజేసి. శ్రీధరు=విష్ణుదేవుని. మందార=కల్పవృక్షము. జగత్త్రాణ=లోకరక్షకా. అపాంగ=కడకంటిచూపు. భోగసుత్రామ = వైభవమందు ఇంద్రుఁడైనవాఁడా.

జయ పరమానంద జయ పుణ్య బృంద
యని నినుఁగొని యాడ నలవియే నాకు
ననుఁ గరుణింపుము నాకాధిపతులు
నలుగురు చనుదెంచి నను గేలి సేయఁ
దలఁచి యున్నారు నాథవునిఁగా నలునిఁ
జేసి రక్షింపుము శ్రీ నాథ' యనుచు
భాసురమతితోడఁ బ్రస్తుతించుచును
జనుదెంచె దమయంతి సఖులతోఁగూడి
తనతండ్రికడకు నా ధరణీశ్వరుండు
పర పైనపచ్చల పల్లకిలోన
వరపుత్రి నునిచి వే వసుధామరులను
గనుఁగొని 'మీరు భూ కాంతుల నెల్ల
వినుత వాక్యంబుల వేర్వేఱఁ జూపుఁ'
డని పుత్రిఁ గనుఁగొని 'యమ్మ మాయమ్మ
యనురక్తి రాజుల నందఱఁ జూచి
మనమునఁ దలఁచిన మనుజేశు కంఠ
మునఁ బుష్పమాలిక ముదమున వైవు'
మని చెప్పి ధరణీశు డంత నైదువల
ననుపమగతిఁ గూర్చి యతివల కెల్ల
హెచ్చరికలు చెప్పి యే తేరఁ బనిచి
యచ్చుగా సకల సైన్యంబులు గొలువఁ
దనకుమారుని నొక్కతావున నునిచి

ధవునిఁగా=భర్తగా. వసుధామరులను=బ్రాహ్మణులను.

యొనరంగఁ బదిలులై యుండుఁ డటంచు
బలముల నలుగడ బలువిడి నునిచి
యలఘుఁడు సకలాయుధాన్వితుఁ డగుచు
బలియుఁడై తా నుండెఁ బార్థివేశ్వరుఁడు
నలివేణి దమయంతి యపుడు దోడ్కొనుచుఁ
జెలికత్తె లిరుగడఁ జేఁ బూని రాఁగ
వలనొప్ప నారాజ వరుల వేర్వేఱ
నరయుచు వసుదేవుఁ డను విప్రవరుఁడు
సురుచిర మతితోడఁ జూపంగఁ దొణఁగెఁ

వసుదేవుఁడను బ్రాహ్మణుఁడు దమయంతికి రాజులను వేఱువేఱఁజూపి చెప్పుట.

'గలకంఠి యీతఁడు గౌళభూనాథుఁ
డలివేణి యితఁడు మహారాష్ట్రవిభుఁడు
లలన యీఘనుఁడు మాళవమహీశ్వరుఁడు
నెలఁత యీ నరపతి నేపాళవిభుఁడు
కలికి యీశూరుండు కరహాటధవుఁడు
వెలఁది యీరాజు ద్రావిడ దేశ భర్త
కొమ్మ యీనాథుండు కుకుర ధాత్రీశుఁ
డమ్మ యీ రాజేంద్రుఁ డంగ భూవరుఁడు
మదిరాక్షి యీతండు మత్స్యవల్లభుఁడు
సుదతి యీనృపమౌళి చోళదేశేశుఁ
డెలనాగ కురుధరాధీశుఁ డీనృపతి
మెలఁత యీతండు కాశ్మీర రాజన్యుఁ

డలరుభోఁడి యితండు వంగభూ విభుఁడు
చెలియ యీధీరుండు సింధు భూ నాథుఁ'
డని యిట్లు రాజుల నందఱఁ జూపి
వనితతో నిషధ భూ వరుఁజేరఁ బోయి
నలరాజు దగ్గఱ నలువు మీఱంగ
నలునిరూపంబున నలువు రుండఁగను
బరికించి చూచి యా భూసురుం డపుడు
నరుదెంచి యేమియు నన కూర కుండె
నది చూచి దమయంతి యతివలఁ జూచి
'యిది దేవతుల మాయ యిందు కేమందు
నేవురు నిషధేశు లెందైనఁ గలరె
యీవట్టి వేషంబు లేల వీరలకు
నక్కటా నేనొల్ల నని పల్కు చుండఁ
దక్కక నిటు సేయఁ దగునె వీరలకుఁ
దమవంటివారికిఁ దగుదునే యేను
దమకులాంగనల నెంతటిరూపు దానఁ
గరుణ యింతయు లేక కటకటా వీరు
సరసత నామీఁదఁ జలపోరఁ దగునె'
యనుచు బల్లకి డిగ్గి యమరేశ్వరులకు
మునుకొని చే యెత్తి మ్రొక్కి యిట్లనియె

—* దమయంతి నలరూపములతో నున్న దేవతలను బ్రార్థించుట. *—

'నిది యేల యయ్యా మీ కిటువంటి పనులు
కొదుకక చేయ మీకూఁతురఁ గానె

చలపోరఁ=హఠముపట్టుట.

నైజ రూపులఁ దాల్చి నరు లంద ఱెఱుఁగ
రాజిల్ల నను గృపా రస మొల్కఁ గాంచి
నాకాధిపతులార నలునికి నన్ను
వే కూర్చి పెండ్లి గావించి యీవేళఁ
గన్నులారఁగఁ జూచి కరుణతో నలుని
నన్ను దీవించి మన్ననఁ జేసి మీరు
వేంచేయరయ్యా నావెఱపెల్ల మాన్పి'
యంచు వేఁడిన మెచ్చి యతి దయా మతిని
బ్రముదితచిత్తులై బలభేది వహ్ని
జముఁడును వరుణుఁడు సత్వరంబునను
దమతమరూపముల్ తప్పక దాల్చి
యమరంగఁ గన బడి రందఱు నప్పు

—●●◆ దమయంతి నలుని వరించుట. ◆●●—

డాలోన నలుని నొయ్యనఁ జేరి పుష్ప
మాలిక ధరియించె మగువ కంఠమున
దివినుండి ఘోషించె దేవ దుందుభులు
భువిమీఁదఁ గురిసెను బువ్వుల వాన
పాడిరి గంధర్వ పతులు మోదమున
నాడిరి నెదుర రంభాది కామినులు
నిరృతి వాయు కుబేర నీల గళాది
హరిదధీశులు నిఖి లామరుల్ దివిని

నాక=దేవలోకము. ప్రముదితచిత్తులై=మిక్కిలి సంతోషించిన మనస్సులుగలవారై. ధరియించె=ధరింపఁజేసెను. 'ధరించు' ప్రేరణార్థమునందీకవి ప్రయోగించుట చింత్యము. హరిత్ అధీశులు=దిక్పాలకులు.

వాస వానల యమ వరుణులు భువిని
వాసి కెక్కిన నలావనినాథుఁ బొగడి
రలఘుసద్భక్తి భీమావనీశ్వరుఁడు
నలునిఁ గీర్తించె నున్నతి మీఱ నపుడు
వెలయంగ దేశాధి విభు లెల్ల వచ్చి
నల మహీశ్వరునకు నయముగా మ్రొక్కి
పొలుపొందఁ దమ పురంబుల కేఁగి రంత
నలరుచు దమయంతి నాత్మలో నెన్ని
పాకశాసనుఁడు దిక్పతులతో వచ్చి
చేకొని నల రాజశేఖరు నపుడు

దేవతలు వేఱువేఱ నలునకు వరములిచ్చుట.

గ్రుచ్చి కౌఁగిటఁ జేర్చి 'కువలయాధీశ
యచ్చుగా నీవు మా యాప్తుఁడ విలను
జిరభక్తితో నీవు చేయు జన్నంబు
కరుణ మీఱఁగ నేను గైకొనువాఁడ
మఱవకు మామీఁద మక్కువ' లనుచు
'ధరణీ తలంబు నెంతయుఁ జిరకాల
మనురక్తిఁ బాలింపు' మని యాన తిచ్చె
ననలుఁ డంతట వచ్చి 'యవనీతలేశ
నీవు నన్నెయ్యెడ నెమ్మిఁ బ్రార్థింప
నావంక నిలిచెద' నని వరం బిచ్చె
జముఁ డంత నేతెంచి 'జననాథచంద్ర

పాకశాసనుఁడు=ఇంద్రుఁడు.

రమణ నీ వెంత ధర్మము సేయఁ దలఁతు
వారూఢి నే నిత్తు' నని వరం బిచ్చె
నైరృతి యట వచ్చి 'నర లోక నాథ
నిరుపమ శౌర్యంబు నీకొక్కకొలఁది
నరయంగ నే నిత్తు' నని వరం బిచ్చె
వరుణుఁ డంతట వచ్చి 'వసుధా తలేంద్ర
చిరకాల మేలు మీక్షితి' నని పలికె
వాయుదేవుఁడు వచ్చి 'వసుధేశ నీకు
నాయంత గతి వేగ మబ్బుఁ గా కనియె
ధనపతి వచ్చి 'యో ధరణీశ నీవు
ధన మెంతఁ గోరినఁ దా నిత్తు' ననియె
మృడుఁ డరుదెంచి 'యో మేదినీ నాథ
యడిగిన మహి నిత్తు' నని వరం బిచ్చె
నప్పుడు ముద మంది యమ్మహీశ్వరుఁడు
తప్పక వారికి దండముల్ పెట్టి
వినుతింప వారలు వినువీధి కెగసి
చనిరి వేగమున నిర్జర లోకమునకు
నల్లుని కూఁతును నట దోడుకొనుచు
మెల్లనె నగరికి మేదినీశ్వరుఁడు

నలదమయంతీ కల్యాణము.

తిర మైన పెండ్లి పందిటి కేఁగుదెంచె
గర మొప్ప నవరత్న ఖచిత మైనట్టి
బంగారుపీఁటలపై వధూ వరుల

నంగన లటు నిల్పి హారతు లొసఁగ
నవని సురాంగన లతివేడ్కతోడ
ధవళముల్ పాడంగ దండి వాద్యములు
పటహ ధ్వనులు నభో భాగంబు నిండఁ
దటుకున భేరీ మృదంగ గంభీర
రవమున ధారా ధరములు ఘూర్ణిల్లఁ
గవగూడి వంది మాగధులు కీర్తింప
సంగతిగా నాగసరములు పాడ
సంగీత వాద్య ఘోషంబులు చెలఁగ
బూరగల్ కంచుకొమ్ములు కాహళములు
బోరుకొల్పుటకు నంబుధు లెల్లఁ గలఁగ
వేత్తలై హోమముల్ వేల్పించి భూసు
రోత్తము లక్షత లొసఁగి దీవింప
నెలమి వారాంగనల్ నృత్తముల్ సలుపఁ
జెలఁగి పుణ్యస్త్రీలు సేసలఁ జల్లి
పలు దెఱంగులను శోభనములు పాడఁ
జెలువందఁ బెద్ద లాశీర్వాద మొసఁగఁ
దరలాయతాక్షిని దమయంతి నపుడు
నరపతి నలరాజునకు ధార వోసె
హరుఁడు పార్వతియును నమరినయట్లు
సరసిజాక్షుఁడు రమాజలజాక్షి యట్లు
సరసిజాసనుఁడును శారద యట్లు

ధారాధరములు ఘూర్ణిల్లక్ =పర్వతములు తిరుగుడువడఁగా. బోరుకొల్పుటకు=
ఘోషఁగఁజేయుటకు—ప్రమోయుధ్వనికి.

నెఱి శశాంకుఁడు రోహిణీ దేవి యట్లు
క్షితిధరాహితుఁడు శచీదేవి యట్లు
లతివిభారవియు ఛాయాదేవి యట్లు
తిలకించి రట పెండ్లి దినములు గడపి
నల నొప్పఁ బెండ్లికి వచ్చిన వారి
భోజనంబులఁ దృప్తిఁ బొందించి మిగుల
రాజిల్లు నవ హేమ రజతాంబరములఁ
దనరు భూషణములఁ దనిపి వీడ్కొలిపి
ఘన లీల వంది మాగధ కవీంద్రులకుఁ
దొడవులు మాడలు దొరలవస్త్రములు
తడయక బహురత్న తతుల నొసంగి
వేడుక మీఱ నివ్విధమునఁ బెండ్లి
పోడిమి జను లెన్నఁ బొలుపొందఁ జేసి
నిరుపమా నానూన నిత్య సంపత్తి
సుర యక్ష పన్నగుల్ చుట్టును గొలువఁ
నురుతర సుఖ లీల నుండి రంతటను
గలకంఠి దమయంతి కన్యకామణికి

కలి దమయంతిని బెండ్లాడుటకువచ్చుట.

నలనొప్ప మును స్వయంవర మను వార్త
విని కలి నాఁ బాపవిభుఁడు వేవేగ
తనలోన నతుల సంతాపంబు నొంది
యపుడు పెండ్లాడఁగా నాత్మలోఁ గోరి

శశాంకుఁడు=చంద్రుఁడు ధరాహితుఁడు = ఇంద్రుఁడు. హేమ = బంగారు.
రజత= వెండి. పోడిమి=ఒప్పు. ఆత్మలో=మనస్సునందు.

విపరీత బుద్ధులు వివరించుకొనుచుఁ
దలవెంద్రుకలు వీడఁ దత్తఱించుచును
జల జల మసి ఘర్మజలబిందు లురులఁ
బరువున నేతెంచి బలసి దిక్పతులు
గరుడ ఖేచర యక్ష గంధర్వ సిద్ధ
సరస విద్యాధర చారణ సాధ్య
సురయక్ష పన్నగుల్ చుట్టును గొలువ
గొలువున్న యింద్రుని గొబ్బునఁ గదిసి

ఇంద్రకలిసంభాషణము.

'బలవైరి మా కొక్కపని గల దదియు
వినుము చెప్పెద ధరా విభు పుత్రి యొకతె
వనజాయతాక్షి భావజు మేటిదంతి
దమయంతి యనియెడు తరలాక్షి కలదు
క్రమ మొప్ప దానికిఁ గడువేడ్కతోడ
నరయ స్వయంవర మని వింటి నేఁడు
ధరయందు దానిసౌందర్య సంపదకు
సరి రారు రంభాది సౌర కామినులుఁ
దరము గా దాచక్కఁదనము వర్ణింప
సరగునఁ జని యేను సతిని వరించి
తిరిగి రావలయు నేతెఱఁగున నైన
వనిత కెప్పుడు స్వయంవర మొకో యనుచు
దినము లెంచుక యేను దిరుగుచున్నాఁడ
నేఁడు మీధర్మాన నెఱవేఱఁ గలిగె

ఘర్మజలబిందువులు=చెమటనీటిబొట్లు. బలసి=చుట్టుకొని. బలవైరి=ఇంద్రుఁడు.

వాఁడిచేఁ బెండ్లాడ వచ్చెద ననుచుఁ
గడఁగి దుశ్శకునముల్ గనిపింప నిటకు
నడచితి నటు గాన నావివాహమున
కే కీడు పుట్టునో యెఱుఁగంగ రాదు
నాకేశ మీతోడ నయ మలరంగ
నిలిచి మాటాడంగ నేఁడు నామనసు
కొలుపదు నీ కేమి కోపమో యెఱుఁగఁ
గరమర్థి దమయంతి కన్నియ నిటకు
వరియించి తెత్తునో వాసవ నాకుఁ
గరుణతో నొక యుపకారంబు సేయు
మరసి సురేశ నీ కది విన్నవింతు
నందన వనములో నలినాక్షిఁ గూడి
పొందిక రతికేళి భోగింప వలయు'
ననవుడు దేవేంద్రుఁ డపుడు దిక్పతులఁ
గనుఁగొని నవ్వి యాకలి కిట్టు లనియె

ఇంద్రుఁడు దమయంతి నలుని వరించుటను జెప్పి కలిని పోఁవలదని వారించుట.

'నేటికి మహికిఁ బోయెదు తద్విధంబు
తేట తెల్లంబుగాఁ దెలిపెద నోయి
యాదమయంతి స్వయంవర క్రమము
నాదిని విని యీహుతాశన శమన
వరుణులఁ గూడి నే వసుధకు డిగ్గి

హుతాశన,శమన,వరుణులన్-అగ్ని,యమ, వరుణులను. వసుధకున్=భూమికి.

గరితచిత్తం బెన్నిగతులనో యరయ
మమ్మెల్లఁ దండ్రులమాఱుగా నెన్ని
సమ్మతి నలుఁ బ్రాణసఖుఁగా వరించెఁ
గావున నాసలఁ గడసేసి మరల
దేవలోకమున కేతెంచితి మీవుఁ
బోలుపొంద నట కేల పోయెద' వనినఁ
గలఁగి వితర్కించి కలి పురుషుండు
మొగమున జేవుఱు మురువు నటింప
భుగ భుగ నిగిడి నిప్పుల పొగ లెగయఁ
జోట చోటఁ జెమటలు సోనలై కురియఁ
దట తట మని ఒమ్ము తడఁబడుచుండఁ
గటకటా యని యౌడు కఱచి కన్నులను
దొటతొట నిప్పులు దొరుఁగ హుమ్మనుచుఁ
గాలాగ్నిరుద్రుఁడో కాలభైరవుఁడో
కాల సూర్యుఁడో లయ కాలుఁడోయనఁగ
గర్జించి భీషణాకారుఁడై యపుడు
నిర్జరుల్ వడఁకంగ నిలిచి యిట్లనియె

కలి కోపించి నలుని భార్యను రాజ్యాదులను బాపునట్లు ప్రతిజ్ఞ సేయుట.

'నిన్నాళ్లనుండి యా యెలనాగ గోరి

ప్రాణసఖుఁగాన్ = పెనిమిటిగా. ఆసలన్ కడసేసి = ఆశలను దూరముచేసి-ఆశలుమానియనుట. జేవుఱు=ఎఱు-పు మురువునటింపన్ = సొగసు,గులుకఁగా. కాలభైరవుఁడో=ప్రళయకాల భైరవుఁడో. కాలసూర్యుఁడో=ప్రలయకాల సూర్యుఁడో. లయకాలుఁడో=ప్రలయకాలపుయముఁడో, భీషణఆకారుఁడు=భయంకరమైన ఆకృతిగలవాఁడు. నిర్జరుల్=దేవతలు.

యున్న నే నుండంగ నూరక తాను
నన్నుఁ గాదని యార నలుఁ డెంతవాఁడు
క్రన్నన నాయింతిఁ గైకొని పోవ
నాకేశ నీ వేఁగునాఁ డొక్క మాట
నాకుఁ జెప్పక పోవ న్యాయమా నీకుఁ
బోయినచోట నాపాలఁటి వరించి
యీయెడ కేతేర కెట్లు వచ్చితిరి
నరులలో సురల మానముఁ గోలుపుచ్చి
వరియింప వచ్చిన వాఁ డానలుండు
నమరులు వచ్చినా రని తాను బోక
దమయంతి వరియింపఁ దా నెంత ఘనుఁడో
మంచి దంపుల కేమి మదిరాక్షిఁ గూడి
యెంచి తాఁ గాఁపురం బెట్లు చేసెడినో
చూచెద' ననవుడు సురరాజు పలికె
భూచక్ర మెల్ల నేర్పున విష్ణుచక్ర
మెలమితోఁ బని సేయ నేలెడు బలియుఁ
డిల వాని సత్య మీరేడు లోకముల
నారూఢి నెంతయు నాక్రమించినది
యా రాజ వరునిపై నలుగంగ వలదు
మహిలోన నతఁడు సామాన్యుండు గాఁడు
మిహిర కులాగ్రణి మేదినీశ్వరుఁడు
సంతత శ్రీ మూర్తి సరస సత్కీర్తి

మిహిరకుల=సూర్యవంశము.

వంతుండు నాచార వంతుండు ఘనుఁడు
వాని సత్య మెఱింగి వచ్చితి మిటకు
నా నర నాయకుం డవని లోపలను
నీకు సాధ్యుఁడు గాఁడు నీ కసాధ్యుండె
యో కలిరాజ నీ వూఱడు మింకఁ
గోపంబు వానిపైఁగూడ చామాట
పాపంబు వచ్చు నీ పని సేయఁగూడ'
దన విని మఱియు రౌద్రాకారుఁ డగుచు
ననిమిష పతితోడ ననియె నాతండు
'కనలి యీ రేడు లోకముల నాకన్న
ఘనుఁ డెవ్వఁ డున్నాఁడు కంటివే నీవు
వెర వెప్ప నా పేరు విన్న మాత్రమున
హరి హర బ్రహ్మాదు లంతటి వారు
వెఱచి చుట్టును గాక వేచి యుండుదురు
గరుడ ఖేచర యక్ష గంధర్వ ఖచర
వరు లైన నా మాయ వర్ణింప లేరు
సుర నాథ నా నేర్పుఁ జూచెద వింక
నలుఁ డనియెడి యొక నరుఁడు నావద్ద
నిలిచి యుండునె చూడు నీవు మెచ్చెదవు
దమయంతి నాచేతఁ దాఁ బడు పాటు
రమణి యెవ్వతె పడు రాజ్యంబులోన
నేను గోరినయట్టి నెలఁతను వచ్చి
తాను గైకొని పోవఁ దా నెంత ఘనుఁడొ

కనలి=కోపించి. ఈరేడు=పదునాల్గు

వానితోఁ జలపోరి వాని నేఁ బట్టి
పూని జూదం బాడ బుద్ధి పుట్టించి
మాయలు చేసి యా మహి నెడఁబాపి
పాయక పై నున్న బట్టఁ బోఁ జేసి
గారించి యిల గోఁచిగానిఁ గావించి
యారణ్య భూముల నలయంగఁ జేసి
మానిని నెడఁబాపి మనసు నొప్పించి
దీనత నొందించి తెలివి దప్పించి
మారు రూపముఁ జేసి మహిమ దప్పించి
కారించి యమిత దుఃఖముల నొందించి
కుండ గ్రోఁకరిఁ జేసి కువల యేశులకు
వండి పెట్టఁగఁ జేసి వాని నీరీతిఁ
జీకాకు పడ మాయఁ జేయక యున్న
నాకేశ వినుము నే నలునికి బంట
నౌదుఁ దర్కింపఁగా నందాఁకఁ గలిని
గా' దని యీ రీతిగా మహా ప్రతినఁ
బలికి యింద్రుని తోడఁ బరువున నపుడు
నిలిచిన చోటను నిలువంగ లేక
ప్రాకటంబుగ విదర్భ పురంబుఁ జొచ్చి
యా కోపమున నిషధాధీశుఁ డైన

కలి నలునియందుఁ జొచ్చుటకు తెఱపి వెదకుచుండుట.

నల రాజ చంద్రునిఁ నయముగాఁ జూచి
కలి యెంత మాత్రముఁ గదియఁ బో వెఱచి

కుండగ్రోఁకరి=వంటలవాఁడు. కువల యేశులకు=రాజులకు.

యాతని సత్యంబు నాతని శౌచ
మాతని యాకార మంతయుఁ దెలిసి
కుత లాధిపునిఁ జేరఁగూడ దటంచు
నతఁ డెందుఁ దిరిగిన నది యెల్లఁ గనుచు
నక్క డక్కడఁగూడి యందంద తిరిగి
కక్కస పడుచు శోకముఁ జెందు చుండ
నంతటఁ గొన్నినా ళ్లరిగిన నలుఁడు
సంతసంబున భీమ జన నాథుఁ గాంచి
'యిఁక మాపురంబున కేఁగంగ వలయు
నకలంక నీపుత్త్రి నంపించు' మనిన
'నటువలెఁ జేయుదు మనసీశ తిలక
కుటిల కుంతలి తోడుకొని పోవ కిచట
నుండు మన్నను మీర లుందురే' యనుచు
వెండియుఁ బలికి భూవిభుఁడు కుమారి
నాయెడఁ బొడ గాంచి యంత నిట్లనియె
'నో యమ్మ నీమగఁ డొగిఁ బురంబునకుఁ
బో వలె నని నీవు పోయి ర'మ్మనిన
వావిరి దమయంతి వగచుచు నపుడు
తల్లి యొద్దకు వచ్చి తన మానసమునఁ
దల్లడించుచుఁ బల్కెఁ 'దండ్రి నన్నిపుడు
తనయల్లుఁ డూరికిఁ దర్లి పోఁ దలఁచి
నను వెంట నంపు మన్నా రది గాన

కుతలాధిపునిన్ = రాజయిన నలుని. కుటిలకుంతలి=వంకరలయినకురులు గలది.

నాతని వెనువెంట నంపుదు ననుచు
నాతోడ నెఱిఁగించి నాఁడె యో యమ్మ'
యనవుఁడుఁ దనపుత్త్రి నతివ కౌఁగిటను
నునిచి హా యని యేడ్చి 'యో యమ్మ' యనుచు
'ననుఁ బాసి పోయెదే నాముద్దులాఁడి'
యని తల్లి పుత్త్రియు నందంద యేడ్వ
దమయంతి దాదులు దాస జనంబు
గుమి గూడి యందఱుఁ గోయని యేడ్వఁ
జనుదెంచి భీమ భూ జన నాయకుండు
తన పుత్త్రి నూరార్చి తన యింతిఁ దెలిపి
దాదుల వారించి దమయంతిఁ జూచి
యాదరంబునఁ బల్కె 'నది యేమె తల్లి
యేల యేడ్చెదవు నీ కేమిటఁ గొదువ
లాలిత సౌందర్య లక్షణాన్వయుఁడు
నిల యేడు దీవుల నేలెడు రాజు
నల రాజ చంద్రుండు నరలోక నాథుఁ
డట్టిభూనాయకుం డతివరో నిన్ను
నెట్టన చేపట్టె నీ కేల వగవ
నర లోక నుతుఁ డైన నల చక్రవర్తి
యరయ నిన్నుంచి నా కల్లుఁ డై యొప్పెఁ
బెక్కు కాలము నాకు బిడ్డలు లేక
మక్కువ నిన్నుఁ గాంచి మాన్యుండ నైతి

లాలిత...ణాన్వయుఁడు=మనోజ్ఞమయిన చక్కఁదనము శుభలక్షణములును గొప్పవంశమును గలవాఁడు.

సుర నాయకుల నేఁడు చూడంగఁ గలిగెఁ'
గర మొప్పఁ జిరకీర్తి గలుగుటఁ జేసి
యిందీవరాక్షి నీ విందును నందుఁ
బొందుగా వచ్చుచుఁ బోవుచు నుండు
మమ్మరో నీ యన్న నంపుదు వెంట
సమ్మదంబునఁ బోయి చనుదెమ్ము నీవు
మనమున దుఃఖంబు మాను మోయమ్మ
నినుఁ జూడ కెన్నాళ్లు నిర్వహించు దునె
పెను పొంద వెంటనే పిలువ నంపింతు'
నని బుజ్జగించుచు నాదర బుద్ధిఁ
దనపుత్రి నలునకుఁ దగ నొప్పగించి
తనయకు నరణంబు తనియంగ నిచ్చి
'పోయి ర' మ్మని పల్కఁ బొలఁతి శోకమునఁ
బాయక తమ తల్లి పదముల వ్రాలఁ
గ్రుచ్చి కౌఁగిట జేర్చి కోర్కి దీవించి

తల్లి దమయంతికి బుద్ధులుచెప్పుట.

చెచ్చెర బుద్ధులు సెప్పంగఁ దొడఁగె
'మదిలోన గురుభక్తి మాన కెల్లపుడు
సతత పతివ్రతా చర్యల విడకు
పతి మాట నడచుచుఁ బరిచర్యఁ జేసి
పతిని శ్రీపతి గాఁగ భావింపవమ్మ
వసుమతి మన సరివారలలోనఁ
బొసఁగ సత్కీర్తులు పుట్టింప వమ్మ
సుదిరాక్షి చెలువంద మన వంశమునకు

వదలక మఱి యొకవన్నె దేవమ్మ
కుసుమ కోమలి బంధుకోటి కీర్తింప
వసుమతీశుఁడు మెచ్చ వర్తింప వమ్మ
సరసత నాథుండు చన విచ్చు నపుడు
నఱిముఱిఁ బలు మాట లాడకు మమ్మ'
యని ముద్దుఁ బెట్టి చయ్యన బుద్ధి చెప్పి
మునుకొని మోమున మోమును జేర్చి
'నాయమ్మ నా కూన నా ముద్దు చిలుక
పోయి ర' మ్మనవుడుఁ బోయి తండ్రికిని
మ్రొక్కిన దీవించి మొగి బుద్ధిఁ జెప్పి

నలుఁడు దమయంతితోడ నిషధకువచ్చుట.

గ్రక్కున నవరత్న ఖచిత మాశిబిక
లోలోన నీరేజలోచన నునుప
నాలోన నలుఁ డొక్క యరదంబు నెక్కి
మామను వీడ్కొని మగువయుఁ దానుఁ
బ్రేమతో దమనుండు వెంబడి రాఁగఁ
గరి రథ భట ఘోటకంబులు గొలువ
వరుస ముప్పది రెండు వాద్యముల్ మ్రోయ
వారక భటులు కైవారంబు సేయ
వార కామిను లిరు వంకల నాడఁ
జేరి పుణ్యాంగనల్ సేసలఁ జల్ల

ఒకవన్నె దేవమ్మ = ఒకశోభకలిగింపవమ్మ- అఱిముఱిఁ = సంభ్రమముతో— తొందరపడియనుట. ఘోటకములు=గుఱ్ఱములు. కైవారము=స్తోత్రము. వార కామినులు=వేశ్యలు.

ధారుణీ సురులు బాంధవులుఁ గీర్తింప
దివినుండి దేవతల్ దీవించుచుండ
నవనిఁ బువ్వుల వాన లంతటఁ గురియ
మనుజేంద్రుఁ డిటువంటి మహిమ శోభిల్లఁ
జను దేర నప్పుడు సంభ్రమం బెసఁగఁ
బురము వారెల్ల నుప్పొంగుచుఁ గూడి
వరుసతో నెదురుగా వచ్చి వీక్షింపఁ
బరివార జనములు భక్తి సేవింప
నరపతి తనపట్టణముఁ బ్రవేశింపఁ
బురసతీ జనము లప్పుడు నేడ్కలలర
గురుతర ప్రీతిచే గుంపులు గూడి
దమయంతిఁ గనుఁగొని తమలోనె తాము
ప్రమద మెలర్పఁగా బలికి రిట్లనుచు

పుర స్త్రీలు దమయంతిని జూచి వర్ణించుట.

‘నీ మానినీ మణి నిదె చూడ రమ్మ
రామాభిరామ నిర్భర పుణ్యసీమ
సీమ గాదిది మంచి చెలువైన లేమ
లేమ గాదిది మంచి లేమావి కొమ్మ
కొమ్మ గాదిది మంచి కులుకు కెందమ్మి
తమ్మి గాదిది మంచి తావి పూ లతిక
లతిక గాదిది మంచి లావణ్య ప్రతిమ
ప్రతిమ గాదిది పుష్ప బాణుని దంతి

ధారుణీసురులు=బ్రాహ్మణులు-

దంతి గాదిది రతి తగ మెచ్చు కాంత
కాంత గాదిది నీటు గల భోగి కన్నె
కన్నె గాదిది మెచ్చు కపురంపుఁ దిన్నె
తిన్నె గాదిది తావి తేట పన్నీరు
నీరు గాదిది చిన్ని నెల రాజు తీరు
తీరు గాదమ్మ యీ దేవి లావణ్య
మెంతయు వర్ణింప నలవి యే మనకు
వింత గా' దని యిట్లు వే విధంబులను
వినుతింప నల మహీవిభుఁ డివ్విధమునఁ
దనరారు శుభ ముహూర్తంబునఁ దనదు
నగరు ప్రవేశించె నాతియుఁ దాను
జగదీశులును మహాజనులు బాంధవులు
హితులు మంత్రులు పురోహితులును దదను
మతి నేఁగి రట తమ మందిరంబులకు
నంతట దమనాఖ్యుఁ డా మహీశునకు
సంతసంబున మ్రొక్కి జననాథ యేను
బొలుపొంద నారికిఁ బోయి వచ్చెదను
గలకంఠి దమయంతి కన్యకా మణికి
వయసు మిక్కిలి లేదు వసుధా తలేశ
దయ నేలుకొమ్ము బిత్తరిని మన్నించి'
యని విన్నపముఁ జేసి యా దమయంతిఁ
గనుఁగొని 'మది బుద్ధి గలిగి భూ విభుని
మర్మంబు లెఱిఁగి సమ్మతి భక్తి వెలయ

తదనుమతిన్=ఆనలుని యనుజ్ఞచేత.

నర్తిలి నడువుము నయముతో నీవు
నరయంగ నూరికి సరిగాద' ననినఁ
దరలాక్షి దమ యన్నఁ దప్పక చూచి
కన్నులఁ గడుఁ బాష్ప కణములు దొరుఁగ
'నిన్నాళ్ళవలె నుండ కిఁక బుద్ధి గలిగి
మన్ననఁ బ్రజలెల్ల మహి మెచ్చి పొగడ
నన్ని కార్యంబుల నరసి సద్భక్తిఁ
దల్లిదండ్రుల మాట దాఁటక రాజ్య
మెల్ల నేలుము ప్రజ లెద సంతసిల్ల
మెచ్చు కీర్తులచేత మెలఁగ నొయ్యన్న
విచ్చేయు' మనుడు వే వేగంబె యతఁడు
తన బలంబులు గొల్వఁ దనపురి కరిగి
తనతండ్రిఁ గూడి భూతల మేలు చుండె
నంతట నిషధేశుఁ డా దమయంతి
సంతసంబునఁ గూడి సరసులయందుఁ
గేళీవనములందుఁ గృతకాద్రులందు
మేలిమి పొదలందు మేడలయందు
నిరుపమాన విభూతి నిరతంబు నిట్లు
సురత భాసుర కేళిఁ జొక్కి సోలుచును
శ్రీరామచంద్రుని రీతి సంప్రీతి
ధారుణీ చక్రంబు తగ నేలు చుండె
నని యిట్లు బృహదశ్వుఁ డా ధర్మజునకుఁ
బెనుపొంద మున్ను దా విన్న మార్గమున

కృతక అద్రులందుఁ గ్రీడార్థము మనుష్యులచేత చేయఁబడిన పర్వతములందు.

వరుసతో నలచక్రవర్తి చరిత్ర
సరసులు మెచ్చ విస్తారంబు గాఁగ
వినుత వాక్యంబుల వెలయఁగఁ జెప్పె
ననుచు వాధూల గోత్రాబ్ధిచంద్రుండు
చిరకీర్తి వంతుఁ డాశ్రిత కల్ప తరువు
కరుణా పయోనిధి కందాళదొడ్డ
య్యాచార్యునకు శిష్యుఁ డైనట్టి వైష్ణ
వాచార తత్పరుఁ డతిదయాపరుఁడు
పొలుపు మీఱినచక్రపురి విహారుండు
వలనొప్ప నతనికి వర కుమారుండు
అకలంక మానసుం డమితపుణ్యుండు
సకల వైష్ణవ పాద సంసేవకుండు
రంగనామాత్యుండు రాజ పూజితుఁడు
సంగీత సాహిత్య సత్కళా విదుఁడు
సరస సత్కవి వర సద్భూషణుండు
అరయంగ నాతని కనుఁగు సోదరుఁ
తనరిన యాంధ్ర విద్యా ప్రవీణుండు
జన లోక విదితుండు సజ్జన హితుఁడు
తిరువేంగళార్యుండు ధీ రాగ్రగణ్యుఁ
డరయ నాతని పుత్రుఁ డబ్ధి గంభీరుఁ
డమల మానసుఁడ విద్యా విశారదుఁడ
రమణ నే వరకవి రాఘ వాహ్వయుఁడ
నర హరి ఘటికాద్రినాథుని పేరఁ
బరువడి నే నాంధ్ర భాషలఁ దెలియ

నవని శ్రీహరి దాసులై నట్టి సరస
కవుల సత్కృప నాకుఁ గలుగుటఁ జేసి
యీ నలకథయందు నిది పూర్వభాగ
మేను రచించితి నీచరిత్రంబు
నెవ్వరుఁ జదివిన నెవ్వరు వినిన
నెవ్వరు వ్రాసిన నీశుని కరుణ
నాయు రారోగ్యంబు లైశ్వర్యములను
బాయకుండఁగఁ బుత్రపౌత్ర సంపదల
నాచంద్ర తారార్కులై యుందు రెలమి
భూచక్రమున మఱి పూజితు లగుచు.

ద్వితీయభాగము. సమాప్తము.

నలచరిత్రము.

ద్విపదకావ్యము.

తృతీయభాగము.

శ్రీకరచారిత్ర శృంగారగాత్ర
పాకశాసనవేద్య భవరోగవైద్య
చిరపుణ్యకీర్తి యాశ్రితమతకీర్తి
కరుణానివేశ శ్రీ ఘటికాద్రివాస
యవధరింపుము పాండవాగ్రతనూజుఁ
డవిరళమతితోడ నాదమయంతి
పరిణయక్రమ మెల్ల భక్తి శోభిల్ల
నరిమురి విని విస్మయానందుఁ డగుచుఁ
గరములు ముకుళించి 'ఘనయోగిచంద్ర!
యెఱిఁగింపు మటమీఁదివృత్తాంత మెల్ల'
ననవుడు బృహదశ్వుఁ డారాజుఁ జూచి
వినుమని వేడ్కతో వివరింపఁదొడఁగె
నంతటఁ గొన్నాళ్ళ కాదమయంతి
కాంతాలలామంబు గర్భంబు దాల్పఁ
బరిపూర్ణసోముని బడలించుమోము
దొరకొని వేగుచంద్రునిరీతి నుండె
ననవిల్తుపూచెండ్లనం దగుచనుల
మొనల నల్లనివర్ణములు గానిపించె

మృదుబింబములవన్నె మెచ్చనిమోవి
కదిసిన మలినంబు గప్పినట్లుండె
బడలికల్ మేనునఁ బర్వె నందంద
నడు మమందం బాయె నాభి గన్పడియె
సవరనినల్లపూసలపేరుఁబోలె
నవిరళం బగుచు నూఁగారుఁ జూపట్టె.
కలికిచూపులచంద్రికల్ పర్వె ననఁగఁ
బలుకఁబాఱెను గండపాలికాయుగళి
మలివేణి ముఖచంద్రుఁ డమృతంపు రసము
చిలుకుచందంబునఁ జిట్టెము లెసఁగె.
గగనభాగంబు సాకార మై యొప్పు
పగిదిఁ గాఁదీఁగె చూపట్టె నానాఁట.
పొలుపొంద నవమాసములు పూర్ణమైన
నలర సమస్తగ్రహంబులు వరుస
తప్పక తమతమతావుల నుండ
నప్పుణ్యలగ్నంబునందు నయ్యింతి
మరునిభుం డైనకుమారునిఁ గనియె.
పురుహూతసమునిఁ దత్పుత్త్రునిఁ జూచి
గురుతరమతి తనకులగురు వైన
గురువు వసిష్ఠునిఁ గోరి రప్పించి
ధారుణీసురుల బాంధవుల నాగరులఁ
గూరిమి నందఱఁ గూడ రప్పించి
యంతట గురునాథుననుమతంబునను

సంతోషచిత్తుఁ డై జాతకర్మంబు
నలరంగఁ జేయించి యపుడు పుత్త్రునకు.
చెలువు మీఱఁగ నింద్రసేనాహ్వయంబు
నొనరంగఁ బెట్టి పుత్రోత్సవం బెల్ల
ననురక్తిఁ జేయించె నపుడె భూసురుల
కాదిభూదాన కన్యాదానములను
గోదానములఁ జేసి కుతుకం బెలర్పఁ
దక్కినవారి కందఱ కభీష్టముల
మక్కువ నొసఁగి యిమ్మహి నేలుచుండె.
అది యెల్లఁ గనుఁగొని యాకలిపురుషుఁ
డెదలోనఁ జింతాసమేతుఁ డై యపుడు
“దమయంతితోఁగూడ ధారుణీశ్వరుఁడు
కొమరునిఁ బడసి యీకుంభిని నెల్ల
నేలుచున్నాఁడు నే నిట వచ్చి యెంత
కాల మాయెనొ యింతఘనుఁ డౌట నెఱుఁగ.
ఎఱిఁగితే నే నేల యిందు వచ్చెదను ?
హరి హర బ్రహ్మాదు లంతటివారి
నామాయఁ బడవైతు నరులు నా కెంత?
ఏమి సేయుదు నింక నేవిచారంబు?
కొమరువల్లను జెడ్డకోమటివలెను
దెమలక నే వెంటఁ దిరుగఁ బోయెదను ?
వనజాక్షికిని స్వయంవర మన్నమాట
విని దాని వరియింతు వే వేగ మనుచుఁ

బురుహూతుకడ కేలపోయి చెప్పితివి?
సురనాయకుఁడు 'మున్ను సుదతిని గోరి
పోతి నే నీవేల పోయెద' వనుచు
నాతోడ నతఁడేల నవ్వుచుఁ జెప్పె?
కోపించి యప్పు డాకుధరారితోడ
'నేపునఁ జలపట్టి యేగతి నైనఁ
గలఁచి కారించెదఁ గాక నే' ననుచుఁ
బలుదెఱంగుల నేల పంతమాడితివి?
పురుహూతుఁ డప్పుడు పోవ ద్దటంచు
సరసతఁ బలుమాఱుఁ జాటించి చెప్పె
వీఁకతో నామాట వినక వచ్చితిని.
నాకేశుఁడే మని నవ్వునో యెఱుఁగ.
ఇతఁ డనాచారంబు లెన్నఁడు సేయు
నతివేగ నే నెప్పుడంటఁబోయెదను.
తనవల్లఁ బొసఁగనితప్పులుఁ గలవె."
యని యని తలపోసి యంతలో రోసి
'ఇంతకాలము గాచి యిఁక నేను బోవఁ
బంతంబు గా ది దేపట్టున నైనఁ
జేరి యీ ప్రతిన నేఁ జెల్లింపకున్న
నారయ నన్నుఁ గాదండ్రు లోకముల'
నని యిట్లు మదిలోన నందంద తలఁచు
చును గాచియుండె నశుద్ధిఁ గోరుచును.
అంతటఁ గొన్నాళ్లఁ గాదమయంతి

కాంతాలలామంబు గర్భంబు దాల్చి
సానఁ బట్టినమరుశరమో యనంగ
మానుగా నొక్కకుమారిని గనియె
ధరణీశుఁ డప్పుడు తనతనూభవకు
నరుదార జాతకర్మాదుల నెల్ల
నేత్రోత్సవంబుగా నిఖిలంబు దీర్చె.
పుత్త్రికోత్సవ మట్లు బుధు లెన్న నడపి
చేన్నుమీఱఁగ నింద్రసేనాహ్వయంబు
కన్నియ కిడె ధరాకాంతుఁడు వేడ్క.
అట నశ్వమేధాది యజనముల్ చేసి
కుటిలుల నడఁచి సద్గుణుల రక్షించి
యాచారవంతుఁడై యతిధర్మబుద్ధి
భూచక్రమెల్ల నేర్పున నేలుచుండె.
ఆమాడ్కి నట్లుండి యట నొకనాఁడు
వేమాఱు దా శౌచవిధి సల్పునపుడు
మడిమ నొక్కించుకమాత్రంబు నీటఁ
దడియక పడియున్న ధర్మేతరుండు
ముదమున నది దెల్లముగ నిరీక్షించి
యుదయుఁడై 'తనకార్యమంత యీడేఱె,'
నని పొంగి తనదుమే నంతయు దాఁచి
పదపడి సూక్ష్మరూపమ్ము ధరించి
యెడలను భారమై యుండఁగ నెప్పు
డుడుగక యచ్చోట యూఁతగా నిలిచె.

అది గాన శేడయ్యె నవనీశ్వరుండు
విదితసత్కర్మముల్ వేగ దీర్చుచును
నిర్మలచిత్తుండై నెలంతయుం దాను
ధర్మంబు దప్పక ధర నేలుచుండె.
ఒకనాఁడు నలవిభుం డుత్సాహి యగుచు
నకలంక రత్నసింహాసనంబునను
నిరుగడ హితపురోహిత మంత్రి వంశ
గురులు గొల్వంగ సిండుకొలు వున్న వేళఁ
గలి తనరూపంబు కఠినరూపంబు
గల యొకబోయ యై కనుపట్టె నపుడు
కుఱుచ వెండ్రుకలపై కుళ్లాయఁ బెట్టి
గుఱుతుగాఁ జిగురుటాకులు కొన్ని పట్టి
సారెకు ముదురుమీసముల నుల్చుచును
బోరనఁ జనుదెంచి భూనాథుఁ గాంచి
చెలువంద మింటికిఁ జేయెత్తి మ్రొక్కి
మలకల తనజాతి మాటల ననియె
'విను సామిగా! చిన్నవిన్నపం బొకటి
ఘన మైనదేవర ఘనమై నదొరవు
మే మున్నపురమున మృగములు పెక్కు
సామి కైన గణింప శక్యంబుగాదు
మన్నుఁబోతులు మఱి మదపుటేనుఁగులు
దున్నలు సింగముల్ తోలుఁగ్గక యుండు
లేడిపిల్లలు దుప్పు లే నూఱుకోట్లు

కూడి మిన్నులదాఁక కుప్పించి దాఁటు
పందులు నదుల వెల్వడి త్రవ్వుచుండు.
కుందేటి గుంపులు గుప్పించి దాఁటు
నెలుఁగులు చీమల నెగఁబీల్చు పుట్ట
బిలముల. గుహలందు బెబ్బులుల్ చిఱుత
పులులు గోండ్రిలుచుండు. భూరుహాగ్రముల
బెళగువ్వలును గండభేరుండములును
'లావుకల్ చిలుకలు లకుముకుల్ జిలుఁగు
పావురంబులు సాళువపుడేగ గుములు
పొలుపొందు. బహుమృగంబులు ఖగంబులును
గల విట్లు మే మున్న కాంతారభూమి
నావింత లన్ని యే మని విన్నవింతు
భావించి కన్నులపండువు గాఁగ
మేటిఘోటక మెక్కి మృగములతోడి
వేఁట లాడఁగ మీరు వేంచేయవలయు'
ననవుడు మోదించి యాత్మ నూహించి
యొనరంగ వానికి నుడుగర లిచ్చి
'అరుగుము రేపటి కాలాగ మేము
నరుదెంచెదము వేఁటలాడంగ' ననిన
విని బోయవాఁ డంత వేవేగ కదలి
చని పురి వెడలి యిచ్చ నదృశ్యుఁ డయ్యె
మనుజేంద్రుఁ డంతట మంత్రిని జూచి
'అనురక్తితో వేఁట లాడంగవలయు

మనము రేపటికి సమ్మదము దైవాఱ'
నని పల్కుచుండఁగా నంతలోపలను
విపులతేజము మాని వెసఁ గప్పుమీఱ
నపరభాగంబున నర్కుండు గ్రుంక
జగతీశ్వరుఁడు కొల్వు చాలించి లేచి
నగరిలోపలి కేఁగె నయమార్గమునను.
నలి రేఁగి యంతలో నాల్గుదిక్కులను
బలు వైనచీకటుల్ పర్వె నందంద.
కలువలు వికసించెఁ గమలముల్ ముగిడె.
తలతల వినువీథిఁ దారలుఁ బొడమె.
అంతఁ జంద్రోదయం బైన నిద్ధాత్రి
నెంతయు వెన్నెల లెసఁగె నాపిదపఁ
గమలబాంధవుఁడు నిక్కముగ నిశకు
నమరంగ నిదె వచ్చు నని పల్కవచ్చు
వేగువాఁడును బోలె వెలి వేగుఁజుక్క
బాగుగాఁ బూర్వదిగ్భాగంబునందుఁ
జూపట్టె; నంతలోఁ జుక్కలు మాసె.
ఏపు మీఱఁగఁ బక్షు లెలుఁగించి కూసె.
తఱిఁగెఁ గేళీగృహాంతర దీపరుచులు.
పోరిఁబోరిఁ గుక్కుటంబులు కూయఁ దొడఁగె
ముదమంది తామరల్ ముఖములు విచ్చె.
పొదలక కల్వగుంపులు చింతనొందె.
పోరిఁబోరిఁ బాములు పుట్టలఁ జేరె.

తఱుచైనభూతముల్ తలసూప వెఱచె.
దనరినయింద్రనందనవనంబునను
ఘనతఁ బూచినకింశుకంబో యనంగ
నరుణోదయం బయ్యె నంతలోపలను
ధరణీసురులచేతఁ దాఁ బూజఁ గొనుచుఁ
దపములమెచ్చు నెత్తమ్ములహెచ్చు
తపనుండు పూర్వభూధర మెక్కె నంత
నలరాజు మేల్కని నగరు వెల్వడలి
వెలయంగ సంధ్యావిధు లొప్పఁ దీర్చి
కుంకుముపన్నీరుఁ గూర్చినగంధ
పంకంబు తనమేన బాగుగా నలఁది
నలువుగాఁ గస్తూరి నామంబు దీర్చి
చెలఁగుచు విరిసరుల్ సిగనిండఁ దుఱిమి
బురుసవన్నె రుమాలె పొందుగాఁ జుట్టి
సరిలేని రత్నభూషణములు పెట్టి
వరుస బంగరువ్రాఁత వ్రాసిన జిలుఁగు
సరిగదుప్పటిమొల సరగునఁ దాల్చి
పాటించి కన్నులపండువు గాఁగ
వేఁటశృంగారంబు వెలయంగ మించి
విపరీతముగ భేరి వ్రేయించె నంత.
అపుడె యీబ్రహ్మాండ మదరినట్లయ్యె
భూతల మదరె నభోవీథి బెదరె
భీతిల్లె గ్రహములు బెగడె భూతములు

జలధులు గలఁగె నక్షత్రముల్ రాలె.
కులగిరుల్ గదలె దిక్కులు వ్రీలె నపుడు
శత్రురాజన్యులు సకలంబు డించి
మిత్రుల డించి నమ్మినవారి డించి
హయముల డించి భటావళి డించి
రయమున వారణ రథముల డించి
కొండలు కొండల గురుతరాటవులఁ
గొందఱుఁ బట్టిరి గుండెలు చెదరి.
చపలతఁ బ్రజలు మూర్ఛల నొందిరంత
నపరిమితోత్సాహులై వేఁటకాండ్రు
కుఱుచమీసమ్ములు గుజ్జురూపములు
బిరుసైన మేనులు పెద్దపిక్కలును
చిఱుతపీనులు నెఱ్ఱజీర్ల కన్నులును
గురువెంపపూసలఁ గొమరొప్పుపేర్లు
నెఱిమించఁ దిలకించునీలిదట్టులను
గుఱుచకాసెల చెంగు కొనల బిగించి
పట్టుచుంగులుమీఁదఁ బ్రబలినచలువ
చుట్టుకాసెల నిండ సురియలు చెక్కి
పిడెములు మొలనిక్క బిరుదుమాస్టీలు
బెడఁగొందు వీనుల బిల్లలుగట్టి
కడిఁదిమెకంబులు కలవకయుండఁ
దడఁబడఁ బాములు దఱుమకయుండ
వలనైన బదనికల్ వాకట్టువేళ్లు

తలముళ్లఁ దిరముగాఁ దాల్చిమేనులకుఁ
దఱుచుగా మించు దంతపు బిళ్లలమరు
చిఱుతకాసెలు వలచెంపల నమర
వలలబండ్లను పోగువాఱుమోకులును
బలువాఁడిమీఱిన పందిబల్లెములు
జిగురుకోలలు మేటిచిక్కము లురులు
తెగనీలిమబ్బుల త్రిప్పుడు త్రాళ్లు
పిగిలిచెం డ్లమరినపెద్దయీఁటెలును
జిగివెండిపట్లచేఁ జెలఁగు సింగిణులు
మెలఁగ సింగంబులమీఁదను గదియఁ
గలిగిన వేఁటకుక్కలను బంగారు
గొలుసులఁ బట్టించి ఘోరాననములు
గలిగి భయంకరాకారులై వెడలి
రంతట నలవసుధాధీశుఁ డధిక
సంతోషమున మణిస్యందనం బందుఁ
దనయుండు మంత్రియుఁ దనకూర్మిసతియుఁ
దనుఁ గొల్వఁగాఁ బ్రమోదంబున నెక్కి
భేరి వేయించెను బృథివి గంపింప.
షారక దొర లిరువంకలఁ గొలువ
జనవల్లభుఁడు వేఁట చనుదెంచెనపుడు.
కొనకొని నల్లనికొండలో యనఁగఁ
గరమొప్ప నవ్వేఁటకాండ్రు వేవేగ
యరదంబుముందఱ నందంద రాఁగ

బలుసింగముల నైనఁ బాఱి పోనీక
చలమున గుండియల్ జాఱఁ గ్రుమ్మెదము.
పులినైన గవిఁ జొచ్చి పోట్లెలివలెనె
యిలమీఁదఁ బడఁ గ్రుమ్మి యీడ్చి తెచ్చెదము.
మదగజంబుల నైన మదము లడంచి
పదపడి విడువక పట్టి తెచ్చెదము.
దొరసి మిన్నులఁ బాఱు దుప్పులనైన
బిరబిర ఖండించి పెటికి తెచ్చెదము
హరివరాహంబుల నందంద తఱిమి
జిరజిర కండలు చెండి తెచ్చెదము.
పులులఁ గాననములఁ బోనీకచేసి
బలిమి బల్లెంబులపాలు చేసెదము.
ధరణీశ' యనుచుఁ బంతము లాడుకొనుచు
నరుగుచో నెదుట నింపయి మాతులుంగ
భల్లాతకీ పారిభద్ర మధూక
పల్లకీ కురవక సాల హింతాల
బదరి తింత్రిణి బిల్వ పాటలీ క్రముక
కదళీ వటాశ్వత్థ ఖర్జూర లుంగ
పనస పిప్పల నింబ బంధూక సరళ
ఘనసార తాళ మాకం దాది తరులు
ఘనపదం బంటి చుక్కల రాయుచుండఁ
గొనకొని ముప్పిరిగొనుచు నేలాది
మల్లికాదికలతల్ మహీజకుంజముల

నల్లిన రవిరశ్మి యడరని యిరుల
యడవిఁ బ్రవేశించి యారాజవిభుఁడు
గడువడి మేఘముల్ గర్జించినట్లు
ముదమెుప్ప శింజిని మ్రోయించె నపుడు
బెదరి మృగావళి భీతిల్లి కలఁగి
పిలపిల చెవులెల్ల బిక్కరించుకొని
సొలసి నల్ దిక్కులు చూచుచు నుండఁ
బిడుగులకంటెను బెడిదమైనట్టి
కడువాఁడితూపు లొక్కట నలుం జేయఁ
దనువుల నాటినఁ దత్తఱించుచును
గొనప్రాణములఁ దన్నుకొనెడి యేనుఁగులు
విలవిలఁ బ్రాణముల్ విడుచు సింగములు
బలునెత్తురులఁ దోఁగి పడెడు బెబ్బులులు
వడి మెడల్ దెగి నేల వ్రాలు దుప్పులును
బడిబడి పోలేక పడు గండకములు
నురములు దెగిపడు నురుఖడ్గములును
శిరములు దెగిపడు సింగిలీకములు.
పలుమాఱుఁ గూయుచుఁ బడెడు జింకలును
దెలియక భయమునఁ ద్రెళ్లు నక్కలును.
అవనిపైఁ బడి పొరలాడు పందులును
దవిలిన పొదలలో దాఁగుకుందేళ్లు
నీరీతి మృగముల నేపడగించి
ధారుణీశ్వరుఁ డంత దయఁదాల్చి నిల్చి

వేఁట చాలించిన వేఁటకాండ్రడవి
దాఁటించి మది దప్పిదాఁటిన యట్టి
ఘనమృగంబులమీఁదఁ గదియుచు భీతి
గొనఁగ వేఁపుల నుసిగొలిపి బాణములఁ
బదములు ఖండించి పార్శ్వముల్ నఱికి
రదములు గడపి కరంబులు ద్రుంచి
నఖములు దునిమి కర్ణములు భేదించి
ముఖములు చెక్కి కొమ్ములు నుగ్గుఁజేసి
నడుములు నఱికి చూర్ణంబు గావించి
తొడలు చెండాడి కుత్తుక లుత్తరించి
ముక్కులు చెక్కులు మూఁపులు తలలుఁ
బక్కలుఁ బిక్కలు బరులును దఱులుఁ
గరములు నురములుఁ గాళ్లును వ్రేళ్లు
శిరములు పిఱుఁదులుఁ జెవులు ఫాలమ్ము
లత్తఱి నిదియది యని చెప్పరాక
కత్తులపచ్చడిగాఁ గోసి రట్టు
తుత్తుమురై రూపు దోఁపక కలసి
నెత్తురు మడుఁగులు నెఱిఁ దేలియాడ
వలలొడ్డి యురులొడ్డి వాఁగులుగట్టి
కలయ మచ్చులు జల్లి కనుమలు గట్టి
యేజాతిపక్షులే యేరీతిఁ బలుకు
నాజాడ పలుకుల నపుడు పిల్చుచును
దిర మగు త్రాళ్లను దెఱఁగొప్పఁ గట్టి

యురులొడ్డి జిగురుల నుమటుగాలముల
సాళువంబుల మేటి జక్కవంబులను
లాలన నాడెడు లావుకంబులను
గముఁజులఁ జిలుకలఁ గ్రౌంచపక్షులను
బ్రమయించు పూరేళ్లఁ బావురంబులను
బెళగువ్వలను గొంగపిండుల నిట్లు
పులుఁగుల నన్నిటి బోరనఁబట్టి
వేఁట చాలించి యాపృథ్వీశుకడకు
మేటిదంతంబులు మేటిపిల్లులును
కరిశిరంబులలోని ఘనమౌక్తికములు
వరుసతోఁ బునుఁగు జవ్వాది కస్తూరి
కడువేడ్కఁ గొనితెచ్చి కానుక లియ్యఁ
దడయక నవి యెల్ల దమయంతి కిచ్చి
పరఁగంగ వారికి బహుమాన మిచ్చి
మురువునఁ దనమంత్రిమోము వీక్షించి
'తలఁపున నీవేఁట తమకంబుకతన
తలకొని మనమెంత దవ్వు వచ్చితిమొ'
యనుచును దనపురి కరుదెంచునెడను
దనరిన వనదేవతలు వేడ్కఁజూచు
బాగైనవ్రటపు స్ఫటికదర్పణము
లాగున నీలోత్పలంబులచేతఁ
దఱుచైన కమ్మగందమ్ములచేత
మెఱుఁగు నీలపుగుండ్లు మెచ్చగు తీరు

మెఱయించు మేటితుమ్మెదగుంపుచేతఁ
గర మొప్పు మంచిచెంగల్వలచేతఁ
బైఁడి ఱెక్కలు గల పక్షులచేత
వాఁడి గోరుల గోరువంకలచేత
బలువుగా నున్నట్టి బకములచేత
సలలితం బగుక్రౌంచసంఘంబుచేతఁ
గ్రమమొప్పఁ జక్రవాకంబులచేత
రమణీయ మై తటారామ సీరంధ్రి
కలకలశబ్ద సంగత మైనయొక్క-
కొలను గనుంగొని కువలయేశ్వరుఁడు
తరుణియుఁ దాను నత్తఱిఁ దేరు డిగ్గి
కరతలంబున మంత్రి కర మూఁడికొనుచు
జలజాకరముఁ జొచ్చి జలములఁ గ్రోలి
యలరంగ నచ్చోట నతిచిత్రముగను
జలువ మీఱఁగ జగజంపుగాఁ బ్రబలి
విలసిల్లు సహకారవృక్షంబు నీడ
సరసిజపత్రముల్ జాఱంగ నెరపి
యొఱపుగాఁ దలిరాకు లొనరంగఁ జేర్చి
పఱచిన మృదువైనపాన్పుమీఁద
ధరణీశుఁ డధికమోదంబు తోడుతను
దళుకొత్తుదనయింతి దమయంతితోడలు
తలగడగాఁ జేసి తతి విశ్రమింప
గఱతుగా మరువంపుఁగొనలను వచ్చు

సురఁటి వట్టువ గాలి సుడియంగఁ ద్రిప్ప
నలఁతతోఁ గనుమోడ్చు నంతలోపలను
గలఁగి యొప్పని కల గని మేలు కాంచి
దిగ్గన లేచి నల్దిక్కులఁ జూచి
యగ్గలం బగుభీతి నందంద నమఁక
నమ్మానవాధిపు నప్పుడు సూచి
యమ్మానినీమణి యతిభక్తితోడ
నరుదైన కెందమ్మి నలఁచుముద్దు
కరమునఁ జెలువందఁగా పిఁపుఁ జఱచి
రమణీయ మగునవరత్నకంకణము
రమణున కప్పుడు రక్షగాఁ గట్టి
‘ఇది యేమి వెఱచితి యినకులాధీశ
మదిలోన నీవు సామాన్యునివలెను?
వక్రంబు నీభూమి వసియింప నిక
చక్రంబు పనిసేయ జగము నేలుదువు.
ఘనుఁడవు సకలలక్షణగుణోన్నతుఁడ
వనుపమజయశీలి వర్కవంశజుఁడ
వని తన్నుఁ దెలిపిన యాపువ్వుఁబోఁడిఁ
గనుఁగొని నలమహీకాంతుఁ డిట్లనియె
‘ఎలనాఁగ యేమని యెఱుఁగంగ రాదు
కలఁగకు కొఱగానికల గంటి నిపుడు.
తెలియఁజెప్పెద దానితెఱఁగెల్ల వినవె.’
అలివేణి యీరాజ్య మంతయు మనము

విడిచినగతిఁ బొంది విపినంబులోన
నుడుగక నిద్దఱ మొకచీర గట్టి
పరువడి బాధలఁ బడి కొంతకాల
మరిగినపిదప శ్రీహరికటాక్షమున
మనము రాజ్యసుఖాప్తి మనఁగంటి మప్పు'
డని యిట్లు దుస్స్వప్న మధిపతి చెప్ప
వెఱచి తా వేఱవని విధమునఁ బలికె
'అరయంగ దీనికి నడల నేమిటికి?
అందుల కేమి శ్రీహరియాజ్ఞ మీఱి
పొందునే దుఃఖంబు భూతలాధీశ?
సత్యమే జయ మని సకలశాస్త్రములు
నిత్యంబుగాఁ బల్కు నిఖిలంబులోన.
అటు గాన సత్యంబ యధికధర్మంబుఁ
బటుగతి భాగ్యసంపదఁ గూర్చు మనకు'
నని యిట్లు పలుకంగ నట వివేకించి
తనబల మంతయుఁ దద్దయుఁ గొలువ
భేరీరవంబులు పెల్లుగా మ్రోయ
ధారుణీనాథుండు తనపురి కరిగి
వెలయుచుఁ గలిమాయ వేఱొక్కవేళఁ
దెలిసియుఁ దెలియనితెరువున నుండ
భీమునివరపుత్త్రి బిసరుహనేత్త్రి
భామాలలామ నిర్భరగుణోద్దామ
పరమపతివ్రత బహుధర్మనిరత
వరరూప విభవ లావణ్య విహార

దమయంతి సత్యంబుఁ దరలంగ నీక
యమరిన వేడ్కతో నప్పటప్పటికిఁ
దనప్రాణవిభునకు ధర్మశాస్త్రముల
ననురక్తిఁ జెప్పఁగా నతఁడు సత్యమునఁ
జెలువంద రాజ్యంబుఁ జేయుచునుండె.
కలిరాజు మఱి కొంతకాలంబు వెనుక
మనమునఁ దలఁచి 'యిమ్మనుజనాయకుని
ఘనముగా నేఁ బన్ను కపటజూదమునఁ
గలరాజ్య మెల్ల నొక్కటన యోడించి
త్రోలఁగి పోఁ జేసెదఁ దొలుతఁ గానలకు.
అలనాఁడు ధరణీధరారాతితోడఁ
బలికిన పంతంబు ప్రబలఁ జెల్లింతు'
నని యొక్క చెనఁటిబ్రాహ్మణురూపుఁ దాల్చి
తనుఁ జూచువార లందఱు నవ్వుచుండఁ
గఱకు నల్లనిమేను కఠిన స్వరంబు
కుఱుచపాదంబులు క్రూరదంష్ట్రలును
విల్లువంకలకాళ్లు విరిసినబొమలు
పల్లమీసంబు లొప్పనిగుంటకనులు
నరసినగడ్డంబు నడ్డి నాసికయు
బరువుగాఁ బెట్టినపట్టెవర్ధనము
కడిఁది బింబోష్ఠంబు కడు బొక్కినోరు
నిడు పైనమెడయును నిక్కినఱొమ్ము
బలువుగా మాసిన ప్రాఁతదోవతియు
వెలయంగఁ జే నొక్కవేణుదండంబు

వలనుగాఁ జిడిముడి పైఁచుఁజఁ డెంబు
కలిగి భయంకరాకారుఁడై నలుని
దాయ పుష్కరుఁ డను ధారుణీ నాథుఁ
డా యెడఁ దనవార లందఱుఁ గొలువఁ
బొలుపొందఁ దనపురంబునఁ ఛత్రమలరఁ
గొలువున్న యత్తఱి గొబ్బునఁ బోయి
భుజగంబుకై వడిఁ బొడగాంచి యతని
'విజయోస్తు' అనుచు దీవించి యిట్లనియె
'నన్నెవ్వఁడో' యని నరనాథ బుద్ధి
నెన్నకు కలి యని యెఱుఁగుము నన్ను.
దురితకర్మములకు దొర నగునాకు
సరియయినవాఁడు ముజ్జగముల లేఁడు

— శనైశ్చరుండు పుష్కరునితో నలునియొద్దకేగి జూదంబాడు మనుట. —

హరిహర బ్రహ్మ శక్రాదుల నైనఁ
దరలక పెక్కుబాధలఁ బెట్టువాఁడ.
మనుజేశ నన్ను సామాన్యుఁడ నంచు
నొనర నీమదిలోన నుంపకు మెపుడు.
విరసత నితఁడేమి వెతఁబెట్టఁ దలఁచి
యరుదెంచెనో యని యడలకు మీవు.
పన్నుగా నీ కొక్కపనిఁ జెప్పఁ దలఁచి
క్రన్నన నేను నీకడకు వచ్చితిని.
అరిమురి వేవేగ యాపని సేయు
మరి నీవు వినకున్న మాచిత్త మొదలు.
అవనీశ యాకార్యమంతయు నిపుడు

వివరంబుగా నీకు వివరింతు నింక
అలివేణి దమయంతి యనియెడు కాంత
గల దొక్కయువతి చక్కని ముద్దుగుమ్మ
నలినాక్షి పుట్టిననాఁటనుండియును
నలరుచు నేఁ బెండ్లి యాడెద ననుచుఁ
గాచుకుండఁగ నన్నుఁ గాదని మిగుల
నాచంద్రముఖిఁ బెండ్లి యాడి మాణిక్య
ములవంటి యిద్దఱు ముద్దు బిడ్డలను
నలరంగఁ గాంచి యీ యవని రాజ్యంబు
నేలుచున్నాఁడు నన్నెంచక నలుఁడు.
తాలిమి గొనను చిత్తం బిట్టిపనులు
సరిపోయి యుండునే జగతి నేరికిని.
అరుదెంచి నేఁ బెండ్లి యాడెడుదాని
నెలమిఁ దాను వరింప నెంతటివాఁడు?
బలభేది కన్న దిక్పాలుర కన్న
నరనాథ ధారుణీనాథుల కన్న
సరసత నాకన్నఁ జక్కని వాఁడె
నలుఁ డంచు వాని నానాతి వరించె.
ఇలతలాధీశ నీకిది సమ్మతంబె?
ఎంతైన నలుఁడు నా యిష్ట మారయక
యింత కార్యము సేసె నింకఁ జూడు మైన
నేమాఱు వేవేగ యేఁగి జూదంబు
నామహీశునితోడ నాడుము నీవు.
చెలువొంద వానిపాచికలలో నుండి

నిలిచి రోడింతు నే నిఖిలరాజ్యంబు-
ఏకచక్రంబుగా నీయిల నెల్లఁ
జేకొని నేను నీచేత నేలింతు
అన్ని కార్యంబుల కలరుచు నేన
యున్నాఁడ నీకేమి యుర్వీశ భీతి?'
యనవుడు సంతోష మంది పుష్కరుఁడు
వినయంబుచేఁ గలి వేల్పున కనియె
'పొసఁగంగ నేను నీ బుద్ధులు దాఁట
వసుమతిలో నెంతవాఁడ నోదేవ.
ఆరూఢి జూదంబు నాడెద ననుచు
నా రాజు కడకు నే నరిగితి నేని
సరసత ననుఁ దనసముఁడ నటంచు
నెఱిఁగి నాతోఁ బందె మిడి భ్రష్టు నట్టు
లాడునే జూదంబు నతఁడు వల్దనక
వేడుకతోడుత విను మేను జనిన'
ననవుడు 'నే వాని యాత్మలో నుండి
యనురక్తితో జూద మాడెడు బుద్ధిఁ
బుట్టింతు వేవేగ పొమ్ము నీకేల
యిట్టి విచారంబు లేగతి నైన
వానితోఁ జలపోరి వాని రాజ్యంబు
పూని నీ కియ్యక పోను నీయాన.
చెలువంద రాజ్యంబు సేయు' మటంచుఁ
బలికి యదృశ్యుఁడై పాపవల్లభుఁడు
చనియె నా నలమహీశ్వరుఁ డొక్కనాఁడు

మన మెలర్పఁగ సభా మంటపంబునకు
చనుదెంచి సకల రాజన్యులు భటులు
ఘనమైన మంత్రి పుంగవులు బాంధవులు
హితులు గాయకపురోహితులు నాశ్రితులు
నతివేడ్కఁ గొలువ సింహాసనమందుఁ
నమరంగఁ గూర్చుండి యతివేడ్కతోడ
రమణులు వింజామరంబులు వీవ
వారక భటులు కైవారముల్ సేయ
సారెకు సజ్జనుల్ సన్నుతిఁ జేయ
కవి వంది మాగధుల్ గడఁగి కీర్తింపఁ
బ్రవిమల సకల సంపదలచే నిట్లు
దివిజులతో నున్న దేవేంద్రుపగిదిఁ
గువలయేశుఁడు నిండుకొలు వున్న వేళ
జననాథుకడకుఁ బుష్కరభూవిభుండు
తనవార లెల్ల మోదంబునఁ గొలువఁ
జనుదెంచి యతనికి సద్భక్తి మ్రొక్కి
వినుతులు సేయ నవ్విభుఁడు పుష్కరుని
ననుపమగతి నొక్కయర్హాసనమున
నునిచిన మోదించి యుచితవాక్యములఁ
'బరిణామ' మే యని పార్థివు నడుగ
'హరికటాక్షంబున నందంద మాకు
ఘనతరసౌఖ్యంబు గలుగు నెల్లపుడు
మనుజాధినాయక మఱినీకు శుభమె'
యనవుడు 'నీదయ నవనీతలేశ

యనుపమ సుఖము గా కసుఖంబు గలదే?'
యనవుడు నిషధధరాధీశుఁ డనియె
నెనయ నా పుష్కరాధీశునిఁ జూచి
'ధరణీశ! నీవేమి తలఁపును దలఁచి
కర మొప్ప నేఁడు మాకడకు వచ్చితివి?
ఎన్నఁడు రావు నీ వేతెంచు టరిది.
క్రన్నన వచ్చిన కార్యంబు చెప్పు'
మనవుడుఁ బుష్కరుఁ డవనీశుఁ జూచి
'గొనకొని నినుఁ జూడఁ గోరి వచ్చితిని.
ఇది యింతె కాని యొండేమియు లేదు
ముదమంద మదిలోన ముచ్చట దీర
మన మిద్దఱము గూడి మఱి వేడ్క జూద
మనురక్తి మీఱంగ నాడుద' మనిన
ధరణీతలేశుండు తలయూఁచి పలికె
'ధరలోన మాకు జూదంబాడఁ దగదు.
ప్రవిమల సత్య సంపదఁ బాసిపోవు,
అవివేక మొలయు దురాగ్రహం బొదవు.
అటుగాన జూదంబు లాడంగఁ దగదు.
అటువంటిపని సేయ నర్హమే మనకు'
నని పల్కుచుండఁగా నప్పుడు కలియు
మనమును బ్రేరేప నుదిజూద మాడఁ
గోరికి పొడమి యుక్కు వలయాధిపుని
గారవించి నలుండు కడకు సిట్లనియె
'పగడసా లాడంగఁ బ్రమదంబు నొందె

జగతీశ యిచటికిఁ జనుదెంచినపుడు
నినుఁ జిన్నఁ బుచ్చుట నీతి గా దింక
ననురక్తి నొకయాట యాడుద' మనుచు
మేలిమి పైఁడి నిర్మించిన పగడ
సాల దెప్పించి యచ్చటఁ జక్కఁబఱచి
తిర మొప్పఁగా నాల్గు దిక్కులయందు
సరగున సారెలు చక్కఁగా నిలిపి
'యెనయంగఁ బందెమే మిడె' దని యాతఁ
డన విని పుష్కరుం డనియె నవ్వుచును
'ఇనకులాధీశ్వర యే నోడితేని
పనిఁబూని యేను మీబంట నయ్యెదను.
నేరుపు నెఱుఁగక నీ వోడితేని
నీ రాజ్యమంతయు నెమ్మి నా కొసఁగు'
మనె నిట్టి యొడఁబాటు నాత్మలో మెచ్చి
వెనుకొన్న వేడ్కతో వెలయఁ బుష్కరునిఁ
దొడరి జూదం బాడఁ దొడఁగి నలుండు
తడయక మేటిదంతపుఁ బాచికలను
నమరించి యొకబార యనుచు దొర్లించి
సమము గా దుగ దచ్చి చొవంచ పగడ
యిత్తిగ యని వార లిరువురు నాడ
నత్తఱిఁ బాచికలం దుండి మఱియుఁ
గలి నలధారుణీకాంతుని చేతఁ
బలుమాఱు పందెంబు పడకుండఁ జేయ
నలుఁ డది చూచి వింతగదా యటంచుఁ

జలముఁ గోపంబు రోషంబు నీమూఁదు
ముప్పిరిగొనఁగ నామురువున నాడ
నప్పుడు కలిమాయ యని కాన లేక
సరిలేని మత్తగజంబుల నోడె.
కరకరి గలతురంగంబుల నోడె.
తడఁబడ కరుగురథంబుల నోడె.
కడఁగి నిండిన ధాన్యకణజంబు లోడె.
పస గల్గుబంగారు పల్లకీ లోడె
మసలక ఛత్ర చామరముల నోడె.
రంగైనదివ్యాంబరంబుల నోడె
సంగీతములఁ బాడు సకియల నోడె.
కోమరారు ముత్యాల గొడుగుల నోడె.
రమణీయ మగుధనరాసుల నోడె.
వారక భటజన వర్గంబు నోడె.
తేరుల నోడె. మేదిని యోహుతఱిని
సచివుండు మదిలోన సంతాప మంది
యుచిత వాక్యంబుల నుర్వీశుతోడ
ననియె 'నీధారుణియందు నోదేవ
యనఘుల కిట్టిదుర్వ్యసనంబు గలదె.
ఇది యేమి పనియని యిప్పుడు దోఁచె.
మదిలోన నిట్లాడ మఱచితే నీతి?
ఈజూదమాడుట యేమిపౌరుషము ?
రాజేంద్ర నగరికి రండు పోవలయు.
అదె నిన్నుఁ జెలులు రమ్మని పిలిచెదరు.

ఇది వేళ గాదు నీ వింతట నిలుపు.
ధరణీశ యాఁకలి దప్పులు మఱచి
తరలక యాడంగ ధర్మంబు గాదు.
లేలెమ్ము; ఆట చాలింపుము. వెనుక
నాలాగె వేంచేసి యాడెదు గాక'
యని పల్కి చెయివట్టి యవలికిఁ బెనఁగఁ
గనుల నెఱ్ఱఁగఁజేసి కరిఁ గాంచి సింహ
ముఱక చూచినరీతి నూరక చూచి
పరువడి గర్జించి పలికె భూవిభుఁడు
'నీ కేల యిటువంటినీతులు చెప్ప ?
చేకొని యెవ్వరు చెప్పి రమ్మనిరి?
విడువిడు ' మని చేయి విడిపించు కొనుచు
నుడుఁగక కలి మాయ నొగి యాడఁదొడఁగె.
అప్పుడు చింతించి యామంత్రివరుఁడు
తప్పక నలుఁడు జూదం బాడు తెఱఁగు
చేరి వల్దని బుద్ధి చెప్పిన విధము
ధారుణి నొక్కటి దక్క నంతయును
యురువడితోడుత నోడిన తెఱఁగు
కెరలి యాతఁడు కోపగించిన తెఱఁగు
దమయంతి కప్పుడు తగఁజెప్పి పనిచె.
దమయంతి యపుడు సంతాపంబు నొంది
'ఇది యేమి పని వచ్చె! ఇఁక నేమి సేతు!
వదలక తనమంత్రి వాక్యంబు వినక
యదయుఁడై యారీతి నాడిన యపుడె

యిది దైవమాయ యొం డేమియుఁ గాదు.
మదిలోన నింక ననుమానంబు నలవ
దిది యాదిగా నింక నెట్టి దుఃఖంబు
పొదవి యేగతి మమ్ముఁ బొంద నున్నదియో!
పదపడి దుస్స్వప్నఫల మెల్ల నిప్పు
డది యేల పోనిచ్చు ననుభవింపకయ.
నుదుట నేమని వ్రాసెనో మున్ను బ్రహ్మ!
తను చేయుపూర్వకృత్యంబులు దాఁట
వనజాసనాది దేవతలకు వశమె?
ఇటువంటిజూదంబు లెవ్వరైన మున్ను
తటుకున నాడిరే ధరణిలో ననుచు
నప్పుడు వార్ష్ణేయుఁ డనెడుసారథిని
దప్పక రప్పించి 'తగినంతఁ జెప్పి
కొడుకును గూఁతును గొని వేగ నీవు
తడయక మాతల్లితండ్రులవద్ద
విడిచి యిక్కడ నున్నవృత్తాంత మెల్లఁ
గడువేగ నెఱిఁగించి కదలి రమ్మనిన
నరు దైనయొకమేటిరథంబుమీఁద
నిరువుర బిడ్డల నెలమి నెక్కించి
పరువునఁ దోడ్కొని వార్ష్ణేయుఁ డపుడు
పరఁగంగ నావిదర్భపురంబుఁ జేరె.
అప్పుడు పురమువా రందఱుఁ గూడి
తప్పక తమలోనఁ దాము చింతించి

తలపోయఁ దొడఁగిరి 'ధారుణీశ్వరుఁడు
చెలువంద రాజ్యంబుఁ జేయుచుండఁగను
సకల జనావళి సంప్రీతిఁ బొందె.
ఇఁక నెట్లొకో యిది యెఱుఁగంగ రాదు.
పోఁడిమి మనమైనఁ బోయి జూదంబు
నాడంగ వల దని యరసి చెప్పదము.
మనమునఁ దనమంత్రిమాటలు వినని
మనుజనాథుఁడు మనమాటలు వినునె?
పూని శుభాశుభంబులు రెండు తనవి
యని యని తెలియక నాడుచున్నాఁడు.
జూదంబు నాడెడు చోరపుష్కరుని
వాదించి పోఁదోలువారు లేరైరో!
అలరి భూపతి జూద మాడంగఁ బోవ
వల దంచుఁ బెద్ద లెవ్వరుఁ జెప్పరైరో!
అవనీశ యీజూద మాడ రా దనుచు
నెవరైన భూజను లెఱిఁగింపరైరో!
ఘన మైనకర్మముల్ గదిసిన వెనుక
వినవచ్చునే యది విష్ణున కైన.
ఐనను మన మిప్పు డంద ఱివ్వేళ
మానుమీ జూదంబు మనుజేశ యనుచుఁ
బలుదెఱంగులఁ జేరి పలుకుద మొగిని.
చెలరేఁగి మన మేమి సేయఁబోయెదము.
జూద మాడుట వసిష్ఠుఁ డెఱింగియున్నఁ
గాదని మాన్పఁడే కష్టజూదంబు.

ఇక నైన నమ్మాని యిట కేఁగుదెంచి
యకలంకమతితోడ నారాజుఁ గాంచి
యాడఁగూడదు జూద మాడకు మంచు
నేఁడు చెప్పినఁగాని నిలుచునే రాజు.
మన మాట నిపుడు సమ్మదమున వినునె'
యని పౌరజను లెల్ల ననుమానమునను
జని చని నలరాజచంద్రునిఁ గాంచి
మునుకొని భయమున మ్రొక్కి యిట్లనిరి
'మానవాధీశ్వర మమ్ముఁ గావలసి
మాను మీజూదంబు మది నమ్మరాదు.
కపటమైయున్నది గాన యీజూద
మిపుడు చాలింపుమా యిందఱితోడు.
ప్రయివచ్చు పని సేయఁ బంతంబు గాదు
ప్రయి రానిపని సేయ వలయు నేరికిని.
అవనీశ గెల్పు లేదయ్యె నింతైనఁ
దవిలి యోటమి మించెఁ దగ దింక విడువు'
మనవుడు వారల నపుడాగ్రహించి
కనుఁగొని చేయెత్తి గర్జించి పలికి
'చేరి నాకును బుద్ధిఁ జెప్ప మటన్న
వారెవ్వ' రనుచు దుర్వారోగ్రుఁ డగుచుఁ
గలియుక్తుఁ డగుచు నాఁకలి గొన్నయట్టి
పులివోలె గర్జించి పోఁ దోలెఁ బ్రజల.
ఈరీతిఁ బ్రజ లంద ఱేఁగిన వెనుక
నారాజు మఱి జూద మాడుచు వరుసఁ

దన దైనరాజ్య మంతయు నొడ్డఁ బెట్టి
వెనుకొన్న కలిమాయ వెతచేత నోడె.
ఛప్పన్న దేశ రాజన్యులు మున్ను
కప్పంబు దెచ్చిన కానుక లోడె.
నవఖండ భూమి మండలముల నోడె
నవ లక్షపర్వత నందుల నోడె.
నలువంద నోడెను నాల్గుదిక్కులను.
ఇల నేడుదీవుల నెల్లను నోడె.
కట్టుచీరలతోడఁ గరమర్థి నిలిచి
యట్టిట్టుఁ దొలఁగక యున్నలుఁ డున్న
నతనిఁ గన్గొని పుష్కరాఖ్యుఁ డానలుని
సతికి నవ్వార్త నిచ్చలుఁ జెప్పి పనుప
దమయంతి యదివిని తనమనంబునను
గ్రమమొప్పఁ జింతతోఁ గడు వెఱఁ గంది
యంతఃపురంబును నప్పుడు వెడలె
కాంతలు పురజనుల్ గడు వెఱఁగంది
చూచుచుండంగ నాసుందరి సభకు
రాచధర్మము మాని రయమున వచ్చి
'ఇదియేమి భూనాథ యీచోద్య' మనిన
నదయుఁడై యేమన కతఁ డూరకుండె.
అప్పుడు పుష్కరుం డది చూచి నలునిఁ
దప్పక నిప్పుడే తరుణితోఁ గూడి
యీరాజ్యమున నుండ కెకాన నైనఁ
జేరఁబొ' మ్మనిన నాక్షితిపతిఁ జూచి

నలుఁ డిట్టు లనియె 'నో నరనాథచంద్ర
సలలితంబుగ మేము చనియెద మింకఁ
గలిరాజు మమ్మింత గాసిపెట్టఁగను
నెలమిఁ గో నడవికి నేము వోయెదము.
నీవింక నిర్ధారుణని నేలు మకట
యావిధి చేసె నేమం దింక' ననుచుఁ
'బ్రవిమలంబుగ మంత్రి పాటించి తెలియ
వివరింప నే నేల వినక పోయితిని.
కర్మ మేమిటి నైనఁ గావించుఁ గాన
కర్మమె మేలు సూ కర్మమే కీడు.
కర్మమే సుఖదుఃఖ కారణం బగును.
కర్మంబు వచ్చినఁ గైకొన కిపుడు
పొమ్మన్నఁ బోవునా పూర్వకృతంబు?
తమ్మి చూలికి నైన ధర వైరి కైన
హరి కైన సతిమనోహరునకు నైన
సురల కైనను మనుష్యు లనంగ నెంత
అనుభవింపక తీరదది యెల్ల నిక్క'
మని యిట్లు తలపోసి యపు డాత్మపత్నిఁ
గనుఁగొని పలికెను గ్రమముతో నలను
'మనము కానలకు సమ్మతిఁ బోవ వలయు
మనమున నీకఁ జింత మాని రమ్మనిన
విని యా సతీమణి విభుని వాక్యంబు
జవదాఁట కప్పుడే సమ్మతి నెఱపె.
అవనీశుఁ డింతితో నడవికిఁ జనుట

పుర జను లాలించి పురపురఁ బొక్కి
వెఱచుచుఁ దమ తమ వీథుల నిలిచి
గుంపులు గూడుక గుజగుజ రాజ
దంపతులను జూచి తహతహఁ బలికి
'రక్కటా యిట్టి మహా పుణ్యమతుల
కిక్కష్టమును బొందు టేటికిఁ గలిగె?
ఇటువంటి యాపద లేటికి వచ్చె?
ఎటువలెఁ బోవునో యేమి సేయుదము.
వీరు పుణ్యాత్ములు వీరు సజ్జనులు
వీరికి నాపద విడుచు నెద్దాన'
నని యిట్లు పుర జను లలమట పడుచుఁ
దను జూడ వారలఁ దాను జూడక యె
తలవంచుకొనుచును దగు సిగ్గుతోడఁ
గలివేధ దగిలిన కతమున నిట్లు
పురవీథు లప్పుడు పొందుగా వెడలి
పురపురఁ బొక్కుచుఁ బురి నిర్గమించి
కరముఁ జింతించుచుఁ గాంతతోఁ గూడ
దొరకొని దైవంబు దూఱుచుఁ జనియె.
అక్కడఁ బుర జను లందఱు నపుడు
రక్కసి పుష్కరగా జని వెఱచి
దమయంతితో నల ధరణీశ్వరుండు
తముఁ బాసి చనుట కాత్మనె కుంది రంద
అప్పుడు నిషధేశుఁ డాపురి వెడలి

తప్పక దమయంతిఁ దగఁ జూచి యనియె
'నేమి సేయుదు కార్య మిఁకఁ దప్పి వచ్చె.
కామిని మన మింకఁ గానలయందు
దైవతంత్రమున నిత్తఱి నుండ వలసె.
దైవంబు నన నేల తమకర్మ మిట్లు
బాధించు చుండంగఁ బగఁబట్టి నట్లు.
వేధించి పుష్కరవిభుఁడు జూదంబు
నాడించి సంపద లన్నిటిఁ గొనియె.
పోఁడిమి చెడి యిట్లు పొగులంగ వలసె.
ధర్మమార్గంబునఁ దనరుట మనకు
నిర్మల మగుబుద్ధి నెక్కొనుచుండు'
నని యిట్లు దమయంతి నతఁ డూరడించి
పనివడి పురసమీపంబునఁ దనరు
నొకపర్వతముఁ గాంచి యురువివేకమున
నకలంకచిత్తుఁడై యప్పు డిద్దఱును
నుపవాసమున నుండి యుదయమైనంత
నపరిమితాయాసుఁడై త్రోవఁ బట్టి
రా వనభూమిలో నప్పు డిద్దఱును
బోవంగఁ బోవంగఁ బొదరిండ్లనడుమ
బ్రహ్మ సమానుండు బ్రహ్మర్షి వరుఁడు
బ్రహ్మలోకము నుంచి వచ్చి నట్లున్న
యావసిష్ఠునిఁ గాంచి యంత మోదమున
సావధానముతోడ సారెకు మ్రొక్కి
నలరాజ చంద్రుండు నయము మీఱంగఁ

కులకాంతతోఁ గూడ గురుభక్తియుక్తి
మ్రొక్కినఁ గనుఁగొని మునినాయకుండు
నక్కజంబుగఁ జూచి యప్పు డిట్లనియె.
'ఇది యేమి జననాథ యిందు వచ్చితివి
ముదితతోఁ గూడ నీ ముద మెల్లఁ దొలఁగి?
ఈవిధిఁ జను దేర నేమిటఁ గల్గె'
నని ముని పలుకంగ నవనీవిభుండు
కనుఁగొని సంతోష కలితుఁడై పలికె
'ఓ వసిష్ఠమునీంద్ర యో దయాసాంద్ర
నావిన్నపం బెల్ల నయముగా వినుము
గతజన్మ కర్మ సంస్కార ఫలంబు
కతన నీదురవస్థ గలిగె మా కిప్పు
డెఱిఁగి యెఱింగి యిట్లేల నన్నడుగ?
అరుదంద నేల నే నైన విన్నవింతు.
తొడరి పుష్కరరాజుతో జూదమాడి
పుడమిని సంపత్తిఁ బోరిఁబోరి నోడి
మానినితోడ సమ్మదమున నిపుడు
కానన భూమికిఁ గదలి పోయెదను.
పరమయోగీంద్ర నీపాద పద్మములు
కర మొప్ప సేవింపఁ గలిగె భాగ్యములు,
అనవుడు 'హా' యని యమ్మునీశ్వరుఁడు
తనమనోదృష్టిచేఁ దప్పక చూచి
వెఱఁగంది యమ్మహావిభున కిట్లనియె
'ధరణీశ మున్ను నీదమయంతిఁ బెండ్లి

యాడిన నీమీఁద నది నెప మెన్ని
పోఁడిమిచెడఁ గలిపురుషుఁ డి ల్లేఁచె.
మంచి దండుల కేమి మహిమ శోభిల్ల
మించిన సత్కీర్తి మెఱసెద వీవు.
కర్మవశంబునఁ గలుగు బాధలకు
ధర్మంబు వదలకు తలఁపకు సుఖము
మదిలోన సత్యంబు మఱవకు మెపుడు.
పొదవిన సౌఖ్యంబు పొందెద వీవు.
ఖగపతిపై నెక్కి కమలావిభుండు
వగపెల్ల మాన్చి ప్రోవఁగఁ జూచె నిన్ను.
'వెఱవకు'మని పల్కి విభుని వీడ్కొలిపి
సరగున ముని నిజాశ్రమమున కరిగె.
అంతట జననాథుఁ డాసమీపమున
వంతలఁ గుందుచు వాసరత్రయము
నుపవాసముల నుండె నువిదయుఁ దాను.
చపలపుష్కరభీతిఁ జన రెవ్వ రటకు.
భూకాంతుఁ డప్పు డాపొలఁతుకఁ జూచి
యాఁకటిపెల్లున నందంద పలికె.
'నలినాక్షి పూర్వజన్మంబున మనము
తెలియక మఱి మూఁడుదినముల నెవరి
నుపవాసములఁగుంద నుండఁ జేసితిమొ!
చపలాక్షి మనకు నీజన్మంబునందు
నూరి ముందఱికాన నుపవాసగతుల
నూరక మూఁడునాళ్లుండంగఁగలిగె.

పెట్టినవారికిఁ బెట్టు దైవంబు
పెట్టని వారికిఁ బెట్టను సుమ్ము.
జలజాక్షి కలిమియే చక్కఁదనంబు.
కలిమి గల్గిననాఁడు కలరు బంధువులు.
కలిమియే సౌఖ్యంబు కలిమియే సుఖము.
కలిమియే చుట్టాలు కలిమియే సఖులు.
కలిమియే సకలంబు కలిమాయవలనఁ
గలిమిపోయిన వెన్కఁ గడఁగి చుట్టంబు
లెలనాఁగ యొకరైన నింపు రారైరి.
పుడమి సౌఖ్యంబులఁ బొందినవారు
చెడినయప్పుడు చెంతఁ జేరంగ నియ్య
రలరుచుఁ బుష్కరుఁ డాడు జూదంబు
చెలియరో యది చూడఁ జిత్ర మయ్యెడిని.
ఇది దైవ మాయ యొండేమియు లేదు.
మదిలోన నొకచింత మఱి పోల దింక.
విపినభూములలోన విహరింప వలయు.
ఇపుడు నీకొకబుద్ధి నెఱిఁగింతు వినుము.
శృంగారవనములోఁ గ్రీడింప లేని
యంగన వని నెట్టు లట చరించెదవు?
మును సౌధసోపానముల నెక్కలేని
వనిత యె ట్లెక్కెదు వసుధాధరముల.
స్ఫటికంపు మేల్కట్ల పై నెక్కలేని
కుటిలకుంతలి యెట్లు గుట్ట లెక్కెదవో?
అరుదైనరత్న దేహాళి దాఁటలేని

గఱిత యేగతిఁ దాఁటఁ గలవు ఘట్టముల?
నావెంటనది గాక నడువంగ లేవు.
వావిరి బిడ్డలవద్దకుఁ బోయి
నీతల్లిదండ్రుల నిలయమం దుండు.
నాతి నీవేడ కాననభూము లేడ!
ఏతెఱంగున నిర్వహింతు వట్లాట
నీమహాటవులకు నేల వచ్చెదవు?
కోమలి నామేలు గోరుచు నిపుడు
కలఁగక పుట్టింటికడ 'కేఁగు'మనిన
నెలుఁగెత్తి బెట్టుగా నేడ్చి 'భూనాథ
యిటువంటి మాటల నిపు డాడఁ దగునె?
కటకటా నే నంతకడుఁ బాపమతినె!
అఱిముఱి నడవి మీ రడలుచు నుండ
నరనాథ పురమున నా కుండఁ దగునె?
కలఁగి మీ రడవులఁ గాయలు నమలఁ
జెలఁగి నేనన్నంబు చేముట్టఁ దగునె?
పర్ణశాలల నీవు పవళించి యున్న
స్వర్ణగేహంబుల శయనింపఁదగునె?
నగములపై నీవు నవసి వర్తింపఁ
దగినమేడల నుండఁదగునయ్య నాకు?
మృగములలో నీవు మెలసి వర్తింప
మగువలలో నాకు మఱి యుండఁదగునె?
గిరిగృహంబుల నీవు క్రీడించుచుండ
విరులపాన్పున నాకు విహరింపఁదగునె?

నినుఁ బాసి నిమిషంబు నిలువంగఁజాల
ననుఁ బాసి పో మ్మన న్యాయమా నీకు?
ఎఱిఁగి యెగ్గనిగతి నిటు వల్కఁ దగునె?
నరనాథ నిన్నరణ్యంబున కనిచి
తగిలి బిడ్డలఁ జేరఁ దగునయ్య నాకు?
జగతీశ నీపరిచర్యఁ జాలించి
[1]భయదాటవుల నిన్నుఁ బాసిన వెనుకఁ
బ్రియ మొప్ప నాకును బిడ్డ లేమిటికి?
తరమిడి మాతల్లిదండ్రు లేమిటికి?
[2]సురుచిరం బైనట్టిశుభము లేమిటికి?
పరగంగఁ దనువునఁ బ్రాణ మేమిటికి?
నరనాథ' యనుచు మానక యేడ్చుచుండె.
కన్నుల నిండారఁ గాఱెడునీరు
మన్ననఁ దుడిచి యామహీపతి తనదు
కన్నులఁ గడుబాష్పకణములు దొరుఁగ
నన్నులవేణితో నప్పు డి ట్లనియె.
'ఏణాక్షి నిన్ను నే నెడఁబాసి నపుడె
ప్రాణముల్ మేనిలోపల నుండఁగలవె?
ఎడమీనియడవిలో నిడుమల నీవు
పడఁజాల వని యిట్లు పలికితిఁ గాని.
ఎలనాఁగ యిపుడు నీ వేల యేడ్చెదవు?
కలఁగకు నినుఁ బాయఁగల నటే నేను'

1. భ...వులఁ=భయంకరమైన అడవులందు. 2. సురుచిరంబు=మిక్కి— ఒప్పయినది.

అని యూరడించి తొయ్యలిఁ దోడుకొనుచుఁ
జనుచున్న మిక్కిలి సాధింపఁ దలఁచి
యప్పుడు కలి వార లరిగెడుత్రోవఁ
దప్పించి ఘనపర్వతంబుల శిలలఁ
గట్టుల గుట్టల ఘనమైన పొదల
ఘట్టంబులను [1]మహాకంటక చయము
నంతంతఁ గల్పించి [2]యత్యూష్మ మగుచు
సంతాప మొనరింపఁ జాలినయెండ
నంతటఁ గల్పించి యలసట గొలిపి
యంత కంతకు నీడ లగపడ నీక
మడుఁగుల నున్న నిర్మల సలిలంబు
లెడపక నన్నియు నింకి పోఁజేసి
యాఁకటి పెల్లున నలసి యేమైనఁ
జేకొని తిన నది చేఁదు గావించి
తెరువులఁ దప్పించి తెలివి దూలించి
పరువుల నలయించి భయముఁ బట్టించి
నడపుల సొలయించి నయముఁ దూలించి
తడఁబాటు దప్పించి దప్పిఁ బుట్టించి
యీరీతిఁ గావింప నినకులాధిపుఁడు
బోరన నది దాఁటిపోవ నయ్యెడను
మగువ క్రొమ్ముడి త్రోవ మలయు కంపలను
దగిలినఁ దనచేతఁ దప్పించుకొనుచు
మురువు దూలినవాఁడి ముండ్లచేఁ దీయ

1. మ...యము=పెద్దముండ్లగుంపు. 2. అత్యూష్మము=మిక్కిలి ఉక్క.

వెఱచి మెల్లనె తీసి వెలువెలఁ బాఱి
పరతెంచి కంపలఁ బయ్యెద కొంగు
నఱిముఱిఁ దగిలిన నవి దీయలేక
తను వాఁడిగలఱాలు దాఁకి పాదముల
[1]కనుమల నెత్తురు గాఱ నందంద
కన్నుల ముత్యాల కైవడి నీరు
చన్నుగట్టులమీఁద జలజల రాల
జాఱిన వెండ్రుకల్ సరిపడఁ గేల
సారెకు సారెకుఁ జక్కఁ జేయుచును
గదలిపోవుచు [2]వట్టు గట్టిన తనదు
పెదవులఁ దడపుచు బెగడుచు నవని
నడుగిడ లేక హా యనుచు శోకింపఁ
బుడమిఱేఁ డాత్మలోఁ బురపురఁ బొక్కి
'పరిపూర్ణకళ సోము బడలించు మోము
చరణముల్ [3]ధూళిధూసరము లై యున్న
యీపాతకంబున కేమి సేయుదును?
పాపపుదైవ మీపగిదిఁ గావించె.
కటకటా నేఁ బాపకర్మవర్తనుఁడ.
అటుగాన నీదుఃఖ మందె నీ యింతి.
మటుమాయ కలిఁబట్టి మగువను నన్నుఁ
బటుగతి నీరీతి బాధించుచున్న'
దని తలపోయుచు నాయింతిఁ గదిసి

1. కనుమలఁ=సందులందు. 2. వట్టుగట్టిన=ఎండిన. 3. ధూ...సము=దుమ్ముచే బూడిదవన్నె పాతినది.

యనునయించుచుఁ దనహస్తంబు చేత
నెలమిమై నూఁతగా నిచ్చి తోడ్కొనుచు
లలనయుఁ దాను మెల్లనె కొంతదూర
మరుగుచు నున్న విహంగముల్ రెండు
మఱవఁ గూడని కలిమాయచే నెలమి
నవరత్న ఖచిత మహానవ్య [1]పక్షములు
పవడంపుఁ జాయచేఁ బరఁగు నాసికయుఁ
బసిమిఁ మించులఁ బోలి ప్రబలు చూపులును
నసమాన రుచి తేట నలరురూపములుఁ
గలిగి ముద్దులు మూటగట్టినయట్లు
కలిమాయచే నొప్పి గగనమం దుండి
కపటంపుఁబక్షులు కవకవ మనుచు
విపులేశు ముందఱ వెఱవక వ్రాలె.
వ్రాలినఁ గనుఁగొని వసుమతీనాథుఁ
డాలోలనేత్రితో ననియె నిట్లనుచు
'అలివేణి మన కిప్పు డాఁకటిచేత
బలహీన మగుటకుఁ బరమేశ్వరుండు
మనమీఁద దయగల్గి మఱి వినిఁ బనిచె.
పనిఁబూని యీరెండుపక్షులఁ బట్టి
యనురక్తి భక్షింత మతివ యిద్దఱము'
నని పల్కి పక్షుల నపుడు పోనీక
కదియఁ బోయినఁ జూచి కపటంపుఁబక్షు
లదిరినగతి వేగ యవ్వలి కెగయ

1, పక్షములు=ఱెక్కలు.

మెల్లనె చని చని మేదినీనాథుఁ
డల్ల నల్లన యప్పు డటు పొంచి పొంచి
పట్టి చేతులు రెండు పాఱఁజాఁచుటయు
నట్టె చివ్వున లేచి యావల నిలువ
మఱిమఱి వానివెంబడిఁ బడి తఱిమి
తఱిమి దగ్గఱఁ బోయి దక్కన ట్లుండి
యవ్వలి కెగిరిన నారాజవిభుఁడు
'క్రొవ్వడంచెదఁ గాక గొబ్బున వీని
నేనేర్పుచే నైన నిటు వెంటఁ దగిలి
పోనీక పట్టెదఁ బాదివి యే నిప్పు'
డని యిట్లు మది నిశ్చయం బొనరించి
నసఁబోఁడి నందుంచి నలమహీవిభుఁడు
పట్టఁ బోయిన మిట్టిపడి వెన్క నిలుచు.
పట్టకుండిన నేల [1]బాతర లాడు.
తగిలినగతి నుండుఁ దగులకపోవు.
దిగులొంది నట్లుండు దిక్కులఁ జూచు.
వేసారి మరలిన వెస నొద్ద వ్రాలు.
గాసిల్లి పట్ట డగ్గఱినను దొలఁగు.
దవ్వుల కేఁగును దగ్గఱవచ్చు.
ఇవ్విధంబునఁ బక్షు లెంతయు నలుని
నలయించి యలయించి యధికదూరమునఁ
జలమునఁ గొనిపోవఁ జనలోకనాథుఁ
డలసి చింతించియు నట పోక నిలిచె.

1. బాతరలాడు=నటించును.

వలనొప్పఁ బులుఁగులు వచ్చి భూవిభుని
దగ్గఱ వ్రాలినఁ దనమొల వల్వ
డిగ్గనఁ బైఁబడఁ దిగిచి వైచినను
బంచఁ దా మెత్తుక పక్షులు దివికి
నంచలంబున నేఁగి యందుండి పలికె
'ధర నీవు నాఁడు జూదం బాడువేళ
గఱిమఁ బుష్కరుపాసికలలోన నుండి
నీరాజ్య మంతయు నెఱి నాఁచుకొన్న
వారము మేము గువ్వలము గామయ్య.
ఏలమి రాజేంద్ర మే మెవరమో యనుచుఁ
దలఁపకు మదిలోనఁ దరమిడి మమ్ముఁ
'బంచఁగైకొని వేగ పాఱిర'మ్మనుచుఁ
బంచిన కలిమాట పాటించి యిటకుఁ
బరువున నరుదెంచి పఱికించి నిన్ను
నిరువుర మిట్టట్టు నెగిచి తూలించి
నిలుచుచు నమ్మించి నీమొల నున్న
వలువ గైకొంటిమి భళి భళీ నిన్ను
మెచ్చ వచ్చును క్షేమ మెల్లనె పోయి
వచ్చెద మిఁక'నంచుఁ బలికి 'మాయాత్మ
నెనసియుండిన కోప మింతటఁ బోదు.
పనివి నీ విఁకఁ బహుపాటులఁ జూడు'
మని యుగ్గడించుచు నాకలిదూత
లనురక్తితో మాయమై పోయె నంత.
ఆపక్షు లరిగిన నాశ్చర్య మంది

భూపాలతిలకుండు పొగిలి చిత్తమున
ఘనమైన శోకసాగరమున నుండి
తనదేవిఁ గని సిగ్గు తడఁబడఁ బలికె
'పక్షులు పలికిన పలుకులు వింటె
సాక్షిగాఁ దామరసాక్షి నీవిపుడు
కల్లజూదం బాయెఁ గటకటా నేఁటి
క్కల్లెడ నింతైన నెఱుఁగలే నైతి.
ఇంతటఁ బోవదే యెలనాఁగ మనకు.
ఎంతేసియిడుమల కిరవుగాఁ గలమొ!
కటకటా మనమీఁదఁ గరుణయు లేక
నిటు చేయఁగాఁ గలి కేమి చేసితిమొ!
తొలఁగనే నేఁ గన్న దుస్స్వప్నఫలము
పలుమఱు ననుభవింపక కాని విడదు.
కట్టఁడిదైవంబు కలరాజ్య మెల్ల
నట్టె కైకొని యరణ్యమునందుఁ ద్రోచె.
తుదను గట్టినబట్ట దోఁచుకపోయె.
ఇది యేమి మాయయో యెఱుఁగంగరాదు.
ఏమి సేయుదు నింక నేమందు విధిని?
ఈమహాటవిలోన నిద్దఱ మింక
నలివేణి యేదుఃఖ మనుభవించెదమొ
తెలియంగఁ జాల మే తెఱఁ గింక మనకు'
నని యని పలుమాఱు నడలుచుఁ బలుకఁ
దన ప్రాణవిభుతోడ దమయంతి పలికె
'ఏల యీతలపోఁత యినకులాధీశ

పోలించి చూడు మా బుద్ధిఁ గార్యంబు.
కాలకర్మంబులు [1]గడపినచోట
ఫాలలోచనుఁ డైనఁ బాపుకోఁ గలఁడె?
జలధి మేరకు మీఱి చనుదెంచెనేని
కలదె యుపాయంబు కట్టించి నిలుప?
వసుధ యీఁతకు మించి వచ్చునే లోఁతు?
విసమెక్కునే తలవెంట్రుకల్ గడచి?
మిన్ను వేగమె వచ్చిమీఁద వ్రాలినను
మన్ననఁ జేయాని మఱి నిల్పఁదగునె?
ఎంతేసి కార్యంబు లేఁగుదెంచినను
వంతనొందుచు ధృతి వదలంగఁ దగదు.
తఱుకున దైవంబు దయలేక మనల
నిటు చేసితే నింక నే మనవచ్చు?
ఇంతకు మిక్కిలి యేమి వచ్చినను
నంతయు దుస్స్వప్న మని యాత్మ నెఱుఁగు.
తలఁపకు రాజ్యంబు తలఁపకు సుఖము
తలఁపకు బిడ్డలఁ దలఁపకు పురము
వదలకు ధైర్యంబు వదలకు బుద్ధి.
వదలకు హరిచింత వదలకు నీతి.
పుట్టుభోగము లన్ని పోయిన వెనుక
బట్టకు వెఱతురే భానుకులేశ'
యనుచు నూరార్చి నెయ్యంబున నపుడు
తన కొంగు సగము నాతనిమీఁదఁ గప్పె.

1. కడపినచోట=నడపించుచోట.

ఉడుగక నిద్దఱు నొకచీర గట్టి
యుడలుచు నడవిలో నధిక దూరంబు
నడచి పోవఁగఁ జూచి నగి వారు మఱియు
నడలంగఁ గలి[1]ధరామరురూపుఁ దాల్చి
కడువేడ్క నచట మార్గంబులు నాల్గు
తడయక కల్పించి తానొక్క త్రోవఁ
దెరువరివిధమునఁ ద్రిమ్మరుచుండె.
ధరణీతలేశుండు దమయంతి యటకుఁ
జనుదేరఁ గపటవేషధరుండు పలికె
నొనరంగ నిద్దఱు నొకచీర గట్టి
యెందుఁ బోయెదరు మీ రీకానలోన
నెందుండి వచ్చితి రిట్టి దుఃఖంబు
లెందుకు వచ్చె మీవృత్తాంత మెల్లఁ
గొందల మందక గునుకక నిల్చి
యెఱుఁగంగఁ జెప్పు మీ రెవ్వ' రటన్న
ధరణీతలేశుఁ డాతని కిట్టు లనియె
'వినుము విప్రవరేణ్య విశ్వంబులోనఁ
గొనియాడఁదగు భానుకులజుఁ డావీర
సేనసుతుండ నీక్షితితలేశ్వరుఁడ.
మానిత సకల సామ్రాజ్యసంపదలఁ
గపటజూదమునఁ బుష్కరునకు నోడి
విపినంబులోపల విహరించుచుండి
చపలాక్షితోఁ గూడి సరసత నాఁగఁ

1. ధరామరురూపు=బ్రాహ్మణరూపము.

గపటమార్గంబున ఖగములు రెండు
వచ్చి పట్టుట కేను వైచినవల్లె
నిచ్చగా మింటికి నెత్తుక పోవఁ
బాలఁతి గట్టినయట్టి పుట్టంబుకొంగు
నెలమిమైఁ గట్టుక నిటు వచ్చినాఁడ.
అనఘాత్మ యే నలుం డనుపేరివాఁడ'
ననవుడుఁ గపట బ్రాహ్మణుఁ డిట్టు లనియె.
'ఇంతిని నీవెంట నిడుకొని నీవు
వంతఁ గుందుచు ఘోరవనము లోపలను
నీరీతిఁ దిరుగాడ నిది కార్య మగునె?
ఈరామ నీవెంట నిడుమలఁ బొందఁ
జాలదు మా కిది సంతాప మయ్యె.
నీలోలలోచన నిఁకఁ జూచెనేని
ఘోర మృగంబులు గూల్చి భక్షించు.
ఓరాజ యడవికి నొకఁడవే రాక
నెలనాఁగ నిచ్చటి కేల తెచ్చితివి?
వలవదు పాపంబు వచ్చు భూనాథ.
పదపడి కలిరాజు పన్నిన మాయ
యిది మాకుఁ జూడఁగ నింతటఁ దొలఁగ
దెంతేసి కష్టంబు లింక రాఁగలవొ.
ఇంతిని నిఁకఁ బుట్టినింటికి ననుపు
మిట కేల తెచ్చితి విది బుద్ధి యగునె?
కటకటా! యిఁకనైనఁ గాంత నంపింపు
మినకులంబున జనియించిన నృపులు

ఘను లంద ఱిపుడు నీ ఘన మెందుఁబోయె?
ఒకబుద్ధిఁ జెప్పెద నుర్వీతలేశ
యిఁకనైన వినుము నీ విం దుండఁ గూడ
దిదుగో నాలుగు త్రోవ లేర్పడి యున్న
వది విదర్భపురికి నరుగుచు నుండు
నది యయోధ్యాపురి కరుగుచు నుండు
నది సుబాహుని పురి కరుగుచు నుండు
నది ఋతుపర్ణ పురాధ్వంబు గాన
నిమ్మార్గములను మీ యిద్దఱు మతికి
సమ్మతం బగుత్రోవఁ జనుఁడు వేవేగ
భూప యీనాలుగు పురములలోన
దావు విదర్భాఖ్యఁ దనరిన నగర
మని చెప్పుచు నదృశ్యుఁడై పోయె నతఁడు.
మనుజేశుఁ డంతట మగువ నీక్షించి
'తొయ్యలి యీనాల్గు త్రోవలలోన
చయ్యన నేత్రోవఁ జనుదెంత' మనినఁ
'[1]కరి వృక వ్యాఘ్ర సూకర సింహ సర్ప
శరభాది బహు సత్త్వ సంభార వనులఁ
దిరుగంగ నేటికి దేవుఁడే మనకుఁ
దెరువు వైదర్భకుఁ దెలియంగఁ జెప్పె.

1. కరి...వనులఁ=ఏనుఁగులు, తోఁడేళ్లు, పులులు,పందులు, సింహములు, సర్పములు, ఎనిమిదికాళ్ల మృగములు మొదలగు పెక్కుజంతువుల గుంపులు గల అడవులందు.

'మనుజేశ యట కేఁగి మనవారియొద్ద
ననుపమగతి నుండ' మని భక్తి మ్రొక్కి
ర మ్మని పిలిచిన రమణీలలామ
కమ్మాన వేశ్వరుఁ డనియెఁ గ్రమ్మఱను
'వనజాక్షి మును నిన్ను వరియించునాఁడు
ఘను లగుమంత్రాంగకర్తలు దొరలు
కరులు తేరులు తురంగంబులు భటులు
బిరుదు వాద్యంబులు భేరులు వన్నె
పల్లకీ [1]లమిత సువాసినీ విప్ర
పల్లవాధరలు పార్శ్వమ్ముల నెదుట
నేతేర మీతండ్రి యేలు విదర్భ
కేతెంచి నాఁడ [2]బర్హిర్ముఖుల్ మెచ్చ.
చపలాక్షి కలి నన్నుఁ జలమునఁ బట్టి
కపటజూదమునఁ బుష్కరునకు నన్ను
నోడించి యిద్దఱ కొకచేలఁ జేసె.
నేఁడు లజ్జ దొఱంగి నే నీవిధమున
భామ నీతో విదర్భకు నెట్లు వత్తు?
మామ నేగతిఁ గాంతు మది సిగ్గు లేక
భూమీశు సభలోన బుధులెల్ల వినఁగ
నే మని నాభంగ మెఱఁగింతు నచట
చెడి చుట్టములచెంతఁ జేర నేఁ జాల.
కడపట నతిహీనుఁ గాఁ జూతు రబల.

1. అమిత...ధరలు=మితిలేని ముత్తైదువలగు బ్రాహ్మణస్త్రీలు.
2. బర్హిర్ముఖుల్=దేవతలు.

నీ వచటికిఁ బొమ్ము నీబిడ్డ లచట
నేవిధి నున్నారొ యెఱుంగంగఁ జాల.
నా వెంట నది గాక నడువంగ లేవు.
పో విదర్భ క'టన్నఁ బొలఁతి యిట్లనియె
'భూమీశ నినుఁ బాసి పో పొ మ్మటంచు
నేమఱు పలుకుట విహితమా నీకు?
జలములలో నున్న జలచరజంతు
నిలమీఁదఁ ద్రోచిన నెబ్భంగి బ్రతుకు?
అరుదారఁ దరువుతో నల్లిన తీఁగ
తరువుఁ బాసిన నది తా నిల్వఁ గలదె?
నినుఁ బాసి పోఁజాల నీపాద మాన
ననుఁ బాసి పోవుట న్యాయమా నీకు?
పనవెడు నాతోడఁ బలుకక కీమాట'
ననినఁ గామినిఁ జూచి యవనీశుఁ డనియె
'అలివేణి మన మిప్పు డఖిలదీనతను
నలుకుచు నిద్దఱ మొకచీర గట్టి
పోఁడిమి నేరీతిఁ బోవంగ నగును?
నేఁడు రాజ్యము పోయె నిర్నిమిత్తమునఁ
బైచీరయును బోయె పక్షులచేత.
నీచీరకొంగును నేఁగట్టినాఁడ.
నావిదర్భాపురి కట నీవు నేనుఁ
బోవంగ నప్పుడు పురజనుల్ చూచి
యిలనేడు దీవుల నేలెడువాని
చెలువెల్ల వదలి పైచీరయుఁ బోయె.

సురలను నొల్లక సాక్షి యీరాజు
వరియించిన ఫలంబు వనితకుఁ గలిగె'
నని తూల నాడెద రది గాన యటకుఁ
జనను నే నీ వైనఁ జను”మన్న బెదరి
చెదరిన మనమునఁ జెలియ యిట్లనియె
'హృదయేశ నన్ను నీ విట్లాడఁ దగునె
అడవులలో నీవు నడలుచు నుండఁ
గడువడి మావారి కడ కేట్లు పోదు?
నినుఁబాసి ప్రాణంబు నిమిషమాత్రంబుఁ
దనువున నిల్వఁగఁ దగునె ప్రాణేశ.
తొల్లి చేసినయట్టి దుష్కృతఫలము
నెల్లఁబొందక నది యేల పోనిచ్చు?
హరునకు మొదలుగా హత్య సిద్ధించె.
హరి యంతవానికి నడలంగ వలసె.
దినకర చంద్రులుఁ దిరుగంగ వలసె
నొనర నొక్కెడను గాలూఁదంగ లేక.
ఆయువు విద్యలు నఖలసంపదలు
వ్రాయఁబుట్టినవాఁడు వ[1]నజజుం డతఁడు
నుదుట వ్రాసిన వ్రాఁత నులిమితే చెడునె?
మదిలోన నీవింక మ[2]ఱుగంగ నేల'
యని పల్కె నిద్దఱు నవుడు సమ్మతిని
జనుచున్న ముందఱ [3]సహాకార [4]సాల

[1]మాలూర కరక తమాల మధూక
తాల ఖర్జూర హింతా లామ్ల పనస
సరళ కింశుక లుంగ జంబూ వటాది
తరుల మధ్యంబునఁ దగు నొక్కకొలను
గనుఁగొని సోపానగతి డిగ్గి నీరు
దనియంగఁ ద్రావి గతశ్రము లగుచుఁ
గొలను వెల్వెడలి దిక్కులు చూచి విజన
నిలయ మొక్కటిఁ గాంచి నెఱి దాని డాయ
నరిగి కూర్చుండిరి యట కలిమాయ
నెఱయంగ నొక మాయనిద్దుర గప్ప
వఱపున వాడినవల్లి చందమునఁ
బరుసనితిన్నె పైఁ బడి నిద్రవోయె.
తనకు నిద్దుర రాక దరిదాపు లేక
వనితయుఁ దా నొక్కవస్త్రంబుఁ గట్టు
కతమున నెడఁబాయఁ గాఁ గూడ కపుడు
మతి గణించుచుఁ గలిమాయచేఁ దనకుఁ
గలరాజ్య మెల్లఁ బుష్కరరాజు కోడి
కలఁగుచు శపథంబు గడవంగ లేక
తనదేవియును దానుఁ దనపురి వెడలి
చనుదెంచి మూఁడువాసరము లచ్చోట
నాఁకట నలసి ఘోరాటవులందుఁ
బైకోక కపటంపుఁ బక్షుల కిచ్చి

1. వనజజుఁడు=బ్రహ్మ. 2. మఱుఁగఁగ=దుఃఖింప. 3. తియ్యమామిళ్లు. 4. ఏపె.

1. మారేడు, దానిమ్మ, కానుఁగు, ఇప్ప, తాడి, పేరీఁదు, గిఱకతాడి, నిమ్మ, పనస, సరళము, మోదుగు, పుల్లమ్మాదిఫలము, నేరేడు, మఱ్ఱి మొదలైనవి.

తగిలి యనేక బాధలఁ గుంది కుంది
వగచుచు నచటికి వచ్చి చేరుటయు
[1]నటమట దుఃఖంబు లన్నియుఁ దలఁచి
[2]చటుల మధ్యాహ్న భాస్కర కిరణముల
[3]స్ఫుట మఱి కందిన పూఁదీఁగెఁబోలె
నటవులఁ ద్రిమ్మరి యాఁకట సొలసి
మదిరాక్షి తనదేవి మహిమీఁదఁ బండి
నిదురవోవఁగఁ జూచి నృపకుంజరుండు
'సన్నుత సకల రాజన్య కామినులు.
కన్నుసంజ్ఞల నూడిగంబులు సేయ
హంసతూలికలశయ్యను నిద్ర వోవు
హంసయానకు పానుపయ్యెఁబో నేల!
ననుఁగూడి వచ్చి కానలఁ బొందినట్టి
తనదుఃఖ మింతయుఁ దగఁ జెప్పఁగొనదు.
దీనిఘోరము చూడఁ దీఱదు నాకు.
పూని యిచ్చట డించి పోయెద నింక.
వనిత నన్గానక వనవాస ముడిగి
తనపుట్టినింటికిఁ దగఁ బోయి చేరు.
ఇటువలె దీని కే నెంతఁజెప్పినను
దిట మఱి కలఁగి వాదించు పో ననుచు'
నని పల్కి కలిదైవ మపుడు ప్రేరేపఁ
దనప్రాణనాయిక తగఁ గట్టినట్టి
చీర నగంబుగాఁ జేతులఁబట్టి

1. వంచన. 2. వేండ్రమైన పగటిసూర్యకిరణములు. 3. వికాసము పోయి

నారి మేల్కొనకుండ నడిమికి నలుఁడు
తునియించి మనమున దుఃఖంబుఁజెంది
వినకుండ మెల్లనే విలపించి 'తొలఁగి
పోయెద' నని లేచి పోయి రాజేంద్రుఁ
డామెడ మఱినాలు గడుగులు వోయి
పో లేక మదిలోనఁ బొగిలి మూర్ఛిల్లి
యాలేమ దగ్గఱ కరుదెంచి మగుడఁ
దనువుఁ బాదంబులుఁ దప్పక చూచి
తనలోన నిట్లని తలఁచి శోకించెఁ
'గటకటా నేఁ బాపకర్ముండ ననుచు
నెటు నెఱుంగక నయో యీతరలాక్షి
కోరి వచ్చిన దేవకులజుల నెల్ల
వారించి నన్నేల వరియించెనొక్కొ!
పడఁతి నోఁచిననోము ఫల మిట్టు లుండె.
ఇడుమలఁ బొండెడి నీయరణ్యమునఁ
గట్టిఁడివిధి యాజ్ఞఁ గడవంగ వశమె?
ఇట్టికాఱడవిలో నెలనాఁగ నిన్ను
నొంటిగా విడిచి నే నొగిఁ బోవఁ జాల.
వెంటఁ దోడ్కొనుచును విహరింప లేను.
కామిని నీకు నాకతమునఁ జేసి
యీమహాటవిలోన నిట్లుండఁ గలిగె.
ఎనయంగ నీభాగ్య మిట్లుండె' ననుచు
తనమది నొక్కింత ధైర్యంబు దెచ్చి
వనిత పయ్యెదకొంగు వలనొప్పఁ గప్పి

యనుమాన మేటికి నరిగెద' ననుచు
నడలుచు మఱినాలు గడుగులు పోయి
తడఁబడి పోలేక ధరణిపై వ్రాలి
దిగ్గన లేని యాదేవినిఁ జూచి
దగ్గఱ కేతెంచి తనలోనె తాను
బెగ్గలం బందుచు భీతి నిట్లనియె
'పడఁతి నీ వడవులఁబడఁ జాల వనుచుఁ
దడయక నీతల్లిదండ్రులకడకుఁ
బొమ్మని చెప్పినఁ బోఁజాల వెట్లు
నమ్మ నావెంటనే నవయంగ వత్తు
వటువంటిదాని నిన్నక్కటా నేఁడు
నిటువంటి యడవిలో నెటు డించిపోదు'
నని యమ్మహీపతి హా యని వగచి
తనమది నిట్లని తర్కించె 'నేను
బోయినవెనుక నీవూఁబోడి లేచి
పాయక నెబ్బంగిఁ బలవించునొక్కొ!
పలవించి యడవిలోపల నన్ను వెదకి
బలు వైనమృగముల పాల్పడునొక్కొ
పతిచేత నొల్లమిపడితి నే ననుచు
మతి దప్పి ప్రాణముల్ మఱి వీడు నొక్కొ
యని యని పలుమాఱు నందంద తలఁచి
తనుఁ బాయఁ జాలనితలఁపు వర్ణించి
మానిని గుణములు మానుగాఁ బొగడి
మానినీమణి మోము మఱిమఱి చూచి

చనుఁగవ వర్ణించు సన్నంపునడుము
వినుతించుఁ గన్నుల వెడలుపు నెంచు.
తేనియరుచుల నొందినపలుకు లెంచు.
తా నిచ్చువచనవులఁ దప్పక నెంచు.
మునుపటి రతిసుఖంబులఁ దలంచుచును
దనలోనఁ దాను సంతాపంబు నొందు.
మఱియును దెగువతో మానిని డించి
సరగునఁ జనుదేర సతిమీఁద మోహ
మనుతీఁగె కాళ్లకు నప్పుడు చుట్టి
పెనఁగొనఁ బోలేక పృథివిపై వ్రాలి
పుడమిఱేఁ డట మూర్ఛవోయి యొక్కింత
తడవులఁ దెలిసి యాతరలాక్షిఁ జూచి
తిరిగి యచ్చటికి నేతెంచి దుఃఖమున
నరుణకాంతులఁ జేవు రగులోచనముల
జలములు దొరుఁగ నాజననాథుఁ డనియె
'ఎలనాఁగ నినుఁ బాసి యే నెట్లు పోదు?
వనజాక్షి నినుఁగూడి వర్తించుఘోర
వనములు శృంగారవనము లై యుండు.
ఓ లేమ నీ వున్న నొగిఁ బూరిశయ్య
లీలతో హంసతూలిక పానుపయ్యె.
ఓరామ నీ వున్న నురుదుర్గములును
మీఱిన బంగారుమేడ లై యుండు.
బాలిక నినుఁగూడి వసియించుపర్ణ
శాలలు మఱిచిత్రశాలలై యుండు.

మెలఁత నీసన్నిధి మృగ గర్జనములు
వలనొప్ప సంగీతవాద్యమై యుండు.
మదిరాక్షి నీవు సమ్మతి నిచ్చు ఫలము
మదికి దివ్యాన్నసమ్మదము ఘటించు.
నీయట్టి కులసతి నీయట్టిసాధ్వి
నీయట్టి ప్రియురాలు నీయట్టిముగ్ధ
నీయట్టి కులశీల నీయట్టియబల
నీయట్టి లావణ్యనిధి యెందుఁగలదు?
తలఁచెఁగా దైవంబు దయ యింత లేక
యెలనాఁగ నే నింక నేమి సేయుదునే.'
యని యని పలవించి యామహీశ్వరుఁడు
తనమది నొక్కింత ధైర్యంబుఁదెచ్చి
'యింతగాఁ జింతింప నేటికి' ననుచుఁ
'గాంతారభూములఁ గలిగినయట్టి
కరి సింహ [1]శార్దూల గండభేరుండ
శరభ పన్నగ [2]శశ చమరీ లులాయ
కాకాది పక్షి మృగంబులచేత
నేకీడుఁబొందక యీయిందువదన
తమ తల్లిదండ్రుల దగ్గఱఁజేరు
నమరంగ హరికృప' ననుచు దీవించి
పోయెద నని లేచుఁ బోలేక మగిడి
పోయి మిక్కిలి వగఁబొంది మూర్ఛిల్లు.

1. శార్దూల= పెద్దపులి. 2. శశ...లాయ= కుందేళ్లు సవరపుమెకములు, కారెనుపోతులు.

హాయని యెలుఁగెత్తి యందంద నేడ్చు.
పోయెద నని పోయి పొక్కుచుఁ దిరిగి
చయ్యన దమయంతి సరసకుఁ జేరి
యయ్యెడ నలుఁడు మహార్తి నిట్లనియె
'ఇటు డించి పోయిన నీయిందువదన
యటు నిటుఁ బడి పోయి యమ్మాయిల్ సేరి
యడవిలో శూన్యగృహంబునఁ దన్ను
విడిచిపోయెను గూర్కువేళ నిజేశుఁ
డని తెల్పఁ దనవార లది విని నన్ను
మనమున నెటువంటి మాట లాడుదురో!
అది గాక పురజను లందఱు నన్నుఁ
'బదపడి నలుఁ డిట్టి పాతకంబునకు
నడలక యొడిగట్టె' ననుచుఁ దిట్టుదురో.
పడఁతి యిట్లిడుమలపాలైనఁ జూడఁ
జాలక విడిచెద సత్య మీమాట.
పాలించి వినవమ్మ భూదేవి నీవు
నాకాశవాణి నీ వరయంగ వినుము.
ఏకతంబున మీర లిద్దఱు సాక్షి
మెలఁత కేగతినైన మీరలే రక్ష
తలిదండ్రిదగ్గఱఁ దగఁ జేర్పవలయు'
నని యొప్పగించి చయ్యనఁ బోదు ననుచుఁ
జని చని మఱి పోవఁజాలక తిరిగి
వచ్చి యాదమయంతివదనంబుఁ జూచి
యచ్చోట నెలుఁగెత్తి హా యని యేడ్చి

పో లేక పో లేక పొగులుచు నుండ
నాలోనఁ గలిదేవుఁ డతివపైఁ గలుగు
మోహపాశంబుల మొదలంటఁబట్టి
సాహసంబునఁ ద్రుంపఁ జయ్యన నలుఁడు
‘మనమున నివి యేమి మమత లటంచుఁ’
జన నిశ్చయించి యచ్చట నిల్వ లేక
నదులు శైలంబులు నగరముల్ గడచి
పొదలుచు వేవేగ పోయె భూవిభుఁడు.
పోవంగఁ గలి తనబుద్ధిఁ జింతించి
‘వావిరి వీనిలావణ్యంబుఁ జెఱుతు’
నని యగ్నిదేవుని నర్చించి బిలిచి
కని మాఱురూపునిఁ గాఁజేయు మితని
ననిలుని నీకు సహాయంబు గాఁగఁ
బనుపుదు చను మన్నఁ బనిఁబూని పేర్చి
యుర వడి విసరు మహోగ్రవాయువులఁ
దరుశాఖ లన్నియుఁ దఱచుగా నొరసె.
నాకాఁకచే నిప్పు లరుదందఁ బొడమి
యేక మై యాకాన నేర్చుచు వచ్చె.
తగిలి పెన్మంటలు ధగధగ మండ
భుగ భుగ పొగలగుంపులు మింటి కెగయఁ
దఱచుగా మండుచుఁ దరువుల కెగసి
దరికొని పొదరిండ్లు దళముగా నుండ
మ్రాఁకులు ఫెళఫెళ మహిమీఁద వ్రాల
వీఁక మృగంబులు వెలువెలఁబాఱి

ఖగములు ఱెక్కలు గాలిన కమలి
యెగసి పోవఁగ లేక నిల వ్రాలి పొరల
నక్క డక్కడ దాఁగినట్టి సర్పములు
నక్కజంబుగ నన్ని యడలుచు మడియ
ఘన మైనసప్తసాగరము లింకించి
కనలుచు సకలలోకములు దహింప
వచ్చిన బడబాగ్ని వడువున వచ్చు
చిచ్చుఁగనుంగొని క్షితితలేశ్వరుఁడు
బోరన నది దాఁటిపోయెద ననుచు
దీనుఁడై రాఁగ నాదిక్కున నొక్క
పొదరిల్లు తగిలి యద్భుతముగా మండఁ
గర్కోటకుం డను ఘనపన్నగంబు
కక్కసపడుచు నాఘనవహ్ని నడుమ
[1]వేణు శాఖాగ్రంబు వేవేగ ప్రాఁకి
ప్రాణభీతిని మహీపతి కిట్టు లనియె
‘ఓరాజదేవేంద్ర యోదయాసాంద్ర
[2]యోరాజితాకార యోదీనరక్ష
యీవహ్ని వెడలించె నిపుడు ప్రాణముల
నీవహ్నిలోపల నిటు చిక్కినాఁడ.
కావవే రాజేంద్ర కరుణతో నన్ను’
నని దీనతను బల్క నప్పు డాపాముఁ
గనుఁగొని నలమహీకాంతుఁడు నవ్వి

1. వేణు...గ్రంబు= వెదురుకొమ్మకొన. 2. రాజితాకార=ఒప్పెడు రూపుగలవాఁడా.

'ధరణి పాముల నమ్మఁదగ దందు రుర్వి
వెఱతు నిన్నంటఁగా విషధర' యనిన
భూవరుఁ జూచి యాభుజగ మిట్లనియె
'దావాగ్ని నిప్పుడు దాఁటించి నీవు
నా కుపకారంబు నయ మొప్పఁ జేయ
నీకుఁ బ్రత్యుపకృతి నేఁ జెఱఁగింతు'
ననవుడు వేవేగ నగ్నిలోఁ జొచ్చి
జననాయకుఁడు కృపాసాగరుం డగుచు
నాపాము గొనివచ్చి యావల విడువ
భూపతిఁ గనుఁగొని భుజగ మిట్లనియె
'మనుజేశ యటువంటి మంటలోఁ జొచ్చి
నను నీవు రక్షించినావు నీమేలు
మఱువ నే నీ కొక్కమాటఁ జెప్పెదను
[1]సరణిముందఱ నొక్క సరస [2]కాసార
మున్నది యట నన్ను నొనరఁ గొంపోయి
మన్నించి విడువుము మఱి నీకు నొక్క
మేలు చేసెద' నన్న మేదినీనాథుఁ
డాలించి యాపాము నవలఁ గొంపోయి
నరగున నపుడు కాసారంబులోనఁ
గరుణతో విడిచె నాఘన పన్నగంబు
విడిచిన యప్పుడు వివర మొప్పంగఁ
గడువడి నలరాజు కాళ్లను గఱచె.
కఱచినఁ దఱచువంకలుఁ బోయె మేను

1. సరణి= దారి. 2. కాసారము= కొలను.

కుఱుచచేతులు మఱిగుజ్జుపాదములు
బిరుసువెండ్రుకలును బేడిగడ్డంబు
నర[1]యంగుళంబులు నంటుచెక్కిళ్లు
పరుసనిమీసంబు ప్రతిగుంటకనులు
కఱకునల్లని మేను ఘన మైనకడుపుఁ
గలిగినఁ జూచి భూకాంతుండు నవ్వి
కలఁగుచుఁ బలికె నక్కలిమాయఁ దలఁచి
'అప్పుడే యిట్టికార్యము సేతు వనుచుఁ
జెప్పితి నాలాగె చేసితి వహహా!
కత్తిచే నఱకిన గాయంబుమీఁదఁ
దత్తఱ పడ దెబ్బ తగిలినరీతి
నైనది యైనసే' మనుచు ధైర్యమున
ధ్యానించు నలునితో నాసర్ప మనియె
'జననాథ నీకింత సంతాప మేల?
[2]కనలక వినుము నేఁ గఱచినవిధము
మునుకొని తొలిజన్మమున బ్రహ్మఋషికి
ఘన మైనదోషంబు గావించినాఁడ
నామౌని గోపించి 'యడవిలో నిట్లు
పాముగా నుండుము పాపాత్మ' యనుచు
బలు వైనఘోర శాపం బిచ్చె నాకు
నలయుచు నే నపు డాత్మఁ జింతించి
మునినాథ యీశాప మోక్షంబు నాకు
ఘనతతో నెప్పుడు గలుగు నటన్నఁ'

1. అంగుళంబులు=వ్రేళ్లు. 2. కనలక= మండిపడక.

‘కలిరాజు మాయచేఁ గలరాజ్య మెల్ల
నలరాజు పుష్కరనరనాథు కోడి
పైనున్న వస్త్రంబు పక్షుల కిచ్చి
కానలలోఁ దనకాంతను విడిచి
నీ వున్న యెడకు నానృపుఁ డేఁగుదెంచి
భావించి యగ్నిలోఁ బడకుండ నిన్నుఁ
గాచి రక్షించిన ఘనునిపాదంబు
చూచి ముట్టిననాఁడు శుభమూర్తి వగుదు,
వని చెప్పి యతఁ డేఁగె నాతటనుండి
యినకులాధీశ నే నిచ్చట నుండి
గొనకొని నీరాకఁ గోరుచుండుదును
వనమునఁ గాలాహివలె వచ్చి నిన్నుఁ
గఱచితి నని యాత్మఁ గలఁగకు నరుల
తెఱఁ గెల్లఁ జెప్పెదఁ దెలియంగ వినుము
కాంతి కోర్వఁగ లేరు ఖలు లర్థి భూమి
కాంతులు నీచసంగతి కోర్వఁగలరు.
అటు గాన నీఘోర మైనరూపమునఁ
బటుగతి విహరింపఁ బాటి ధరిత్రి
విపులేశ నీ వింక విపినభూములను
విపరీతబుద్ధిని విహరింపఁగూడ
దరయుచు నీ వయోధ్యాపురి కేఁగి
యరుదార ఋతుపర్ణుఁ డనురాజుచెంతఁ
జేరి సారథ్యంబుఁ జేయుచుఁ బౌక
మారూఢిఁ జేయుచు నతని మెప్పించి

బాహుకుం డనుపేరు వడసి యత్యంత
సాహసం బలర నచ్చట నుండు నంతఁ
గొంతగాలమునకుఁ గోమలిఁ గలసి
సంతోషమతిని రాజ్యముఁ జేయఁగలవు.
నిషధేశ విను మింక నీశరీరమున
విష మెంతకాలంబు వెస నుండు నప్పు
డురగ రాక్షస పిశాచ చోర భూతముల
దురితంబు లేమియు దొరయవు నిన్ను
నని కరాటములోన నమరిన యొక్క
కనకవస్త్రము ధరాకాంతుని కిచ్చి
‘కరమర్థి నీరూపు గావలె ననుచు
ధరణీశ నను నీవు దలఁచి యీగోక
ధరియించి నప్పు డందము మీఱ నీకు
వరుస నీరూపలావణ్యముల్ గల్గు.
ఏపార నే నింక నేఁగెద’ ననుచు
నాపాము మాయ మై యరిగె నంతటను
జననాథుఁ డత్యంత సంతోష మడర
ఘనతర వేగుఁడై కదలి యయోధ్య
కరిగి యాఋతుపర్ణు నందంద కాంచి
కరములు ముకుళించి ఘనభక్తిఁ బలికె
‘నవనీశ బాహుకుఁ డనుపేరువాఁడ
తవిలి సారథ్యంబు తగ సేయ నేర్తు.
విశ్వంబులోపల వెలుఁగొంది యున్న

యశ్వలక్షణముల నరయంగ నేర్తు.
వారక రుచులుగా వండంగ నేర్తు.
ఈరీతి విద్యల నెఱుగంగ నేర్తు.
వలనొప్ప మిముఁ గొల్వ వచ్చితి నన్నుఁ
దలఁచి నీబంటుగాఁ దగ నేలు'మనిన
ఋతుపర్ణుఁ డాతనిరూపంబుఁ జూచి
ప్రతి గాన మీరూప భావంబులకును.
ఇట్టివాఁ డొకఁడున్న నెప్పుడు మనకుఁ
బుట్టు ముచ్చటలును బ్రొద్దుఁ బోయెడిని.
అని పల్కి నలుని నత్యాదరంబునను
మనుజేశుఁ డపుడు సమ్మతిఁ గొల్వ నిల్పె.

నలచరిత్రము.

ద్విపదకావ్యము

చతుర్థభాగము.

'అట మున్ను నలరాజు నసుఁగు బిడ్డలను
దటుకొన దమయంతి తలిదండ్రు లింట
విడిచి వార్ష్ణేయుండు 'విపినభూములకు
నేడలె నలక్షితివిభుఁ డింతిఁ గూడి'
యనుమాట విని మున్నె యాఋతుపర్ణు
నెనరంగ మఱి కొల్చియుండె. ఆనలుఁడు
నరసి వార్ష్ణేయుని యందంద చూచి
సరసత తనరథసారథి గాఁగ
నెఱేఁగి యాతనితోడ నేమాట దెలుప
కెఱుఁగనిగతి నుండె నేమియు ననక.
అక్కడ దమయంతి యదరి మేల్కాంచి
పొక్కుచుఁ దనపతిఁ బొడగాన కులికి
నలుదిక్కులును జూచి నలినాక్షి గుంది
[1]చలియించి చించిన చీరయుఁ గాంచి
దిగ్గున లేచి పూఁదీఁగకైవడిని
నగ్గలం బగు మూర్ఛ నవనిపై వ్రాలి
యూసినయామూర్ఛ యొక్కింతఁ దెలిసి
మేనెల్ల నులియుచు మెల్లనె లేచి
నేలలఁ బుణుకుచు నిగిడినవగల

1. ఇట యతి యసాధువు. వ్రాఁతప్రతుల 'చెలియించి'యని యున్నది.

వాలుఁగన్నులనీరు వఱదలై పాఱఁ
బలుదెఱంగులఁ దనప్రాణేశుఁ దలఁచి
వెలువెలపాటున విలపింపఁ దొడఁగె
"హా. రాజదేవేంద్ర హా దయాసాంద్ర
హా రాజమందార హా దయాకార
శ్రీకరఘనమూర్తి [1]రిపుసమవర్తి
నాకేశనుతకీర్తి నలచక్రవర్తి!
అక్కటా యిట్టిఘోరాటవిలోనఁ
దక్కక నను డించి తలఁగి పోఁదగునె?
ననుఁబాసి పో నని నాతోడఁ జెప్పి
పెనునిద్ర వోయినఁ బ్రియ నన్ను డించి
కటకటా నామీఁదఁ గరుణఁ జాలించి
యిటు డించి పోవ నీ కేమి సేసితిని.?
నినుఁబాయఁగా లేను నిమిషమాత్రంబు.
ననుఁబాసి పోవుట న్యాయమా నీకు.
'ఒక్కటే ప్రాణంబు లొనర నిద్దఱకు
మక్కువ లొక్కటే మనకు నిద్దఱకు.
ఓడకు' మనుచు న న్నూరడఁబలికి
పాడియే యడవిలోపల డించి పోవ?
ఇట్టికాఱడవిలో నిటు నన్ను డించి
యెట్టులు వోనఁ గా లెట్లాడె నీకు?
కైకొన కెడఁబాయఁగా నెన్నఁడైన
నీకు నేఁ జేసిన నేరంబు లేమి?

1. పగవారికి యముఁడా.

కట్టిఁడిదైవ మీకానలో నన్ను
నిట్టు లొంటిగ నుండ నేల చేసెనొకో!
ఎన్నఁడు రాదుగా యిటువంటినిదుర
నిన్ను నన్నును బాప నేఁడు వచ్చినది.
తనువునఁ బ్రాణముల్ దలఁగకున్నంతఁ
నినుఁబాసి యోర్తునె నిమిషార్ధమైన.
ఇట్టికాఱడవి న న్నేకత డించి
యెట్టుఁ బో లే వని యెంచితి మదిని.
ననుఁ బాయవచ్చునే నాప్రాణవిభుఁడ
వని నిన్ను నమ్మితి నవనీశచంద్ర.
ఇచ్చట నను డించి యేల పోయితివి?
చచ్చిన నొకచోటఁ జావమే మనము.
[1]కలపాటి నొకభంగిఁ గాలంబు నడపి
మెలఁగమే యడవుల మేదినీనాథ.
గ్రహవేధ లవి యెట్టిగతుల వచ్చినను
[2]గృహిణి వీడుట నీకుఁగృత్యమే నాథ?
నఱికినఁ ద్రొక్కిన నలియఁగొట్టినను
జెఱకు తియ్యన గాని చేఁదౌనె నాథ?
కరుణను నీదు వాక్యముల వీనులను
వెఱవక నెన్నఁడు విందునో నాథ.
కామించి కన్నులకఱవెల్లఁ దీఱ
నీమూర్తి నెన్నఁడు నేఁ జూతు నాథ.
ఏ తెరువునఁ బోయి తేను వచ్చెదను

1. కలకోఁదిని. 2. ఇల్లాలిని.

నాతోడఁ జెప్పవే నాప్రాణనాథ.
ఈవిధి మనల నేఁ డిద్దఱఁ బాప
దైవంబు నాల్గుపద్ధతులఁ గల్పించె.
ప్రాణేశ [1]కానలోపల నిన్నుఁ బాసి
ప్రాణంబు లెబ్భంగిఁ బట్టుదు నింక
భూమీశ ననుఁ బాసి పోయెడువేళ
నే మని పలవించి తే మంటి నన్ను?
ఏదేశమునకుఁ బోయితివో యెచ్చోట
నేదుఃఖ మందితో యేమిసేయుదును?
జగతీశ నేఁ బాపజాతిని గాన
నిగిడి యీయాపద నినుఁ బొందనయ్యె.
నే సర్వలక్షణాన్విత నౌదు నేని
వాసవనుత యింత వచ్చునే నీకు?
నరలోకనాయక ననుఁ [2]జెట్టవట్టి
పరఁగ రాజ్యముఁ బాసి భటులనుఁ బాసి
హయరథావళిఁ బాసి యఖిలంబుఁ బాసి
[3]భయద కాంతారంబువాలైతి వకట!
నిద్రింప కార్తిచే నీవు గూర్చున్న
నిద్ర వోవుట నాకు నీతియే తలఁప?
నేరము నామీఁద నిజముగాఁ గలుగ
నోరువ కేటు వోతి పుర్వీశ తిలక?
పతితలఁ బెఱుఁగని పడఁతి యే లనుచు
నతివేగమున డించి యరిగితి వేమొ.

1. అడవిలో. 2. పెండ్లాడి. 3. భయంకరమైన అడవి.

పున్నమచంద్రునిఁ బోలు నీమోము
నెన్నఁడు గందునో యినకులాధీశ!
ఇక్కడ నను డించి యెప్పాట నీవు
నెక్కడి కేఁగితి విటు చెప్పవయ్య.
ఇది నాకు నొంటిగా నిప్పుడు దోఁచె.
ఇది నాకు నడవి గా నిప్పుడు దోఁచె.
ఏమి సేయుదు నింక నేమందు విధిని.
ఈమహాటవి నిన్ను నెబ్భంగిఁ గాంతు.
నరనాథ యిట వచ్చి ననుఁ గావకున్నఁ
బరఁగ నాప్రాణముల్ పట్టంగఁ జాల.
మఱుఁగున నేటికి మఱి డాఁగియుండఁ
బరుగున వచ్చి నాప్రాణముల్ గావు.
క్రవఁబాసి పోయి భూకాంత నీవిపుడు
భువి నెన్ని బాధలఁ బొందుచున్నావో.
కలనైన నీమాట కాదనఁ జాల.
నలరాజచంద్ర కానల నేల డించి
తెవరికిఁ దొల్లి నే నేమి సేసితినో
భువి నిట్టిపాటెల్లఁ బొందితి నడవి.
ఎక్కడి కేఁగుదు నేమి సేయుదును?
దిక్కెవ్వ రిటమీఁదఁ దెఱఁగేది నాకు?
నీదుఃఖవార్ధి నే నేరీతిఁ గడతు?.
ఏదెస వెదకుదు నీ కానలోన?
వెదకుచుఁ గలి యిట్లు వేధింపుచుండ
హృదయేశ నీ విపు డేమి గావింతు.

వలసితి వీయరణ్యములలో నున్న
బలుమృగంబుల కగపడుదు గా" యనుచు
నలినాక్షి తనప్రాణనాథునిఁ దలఁచి
పలుదెఱంగుల నిట్లు పలవింపుచుండ
మలమలమాఁడెఁ గోమల లతా తరులు
శిలలెల్లఁ గరఁగె రాజీవాప్తుఁ డదరె.
గాలి వీవక మాని కన్నుల నీరు
రాల నేడ్చుచు నున్న రమణిని జూచి
మృగములు నిలుచుండె మేఁతలు మఱచి.
ఖగము లాధ్వని విని కలఁగుచు నుండె.
అప్పుడు దమయంతి యుఁగ్గోటు వాసి
ముప్పిరిగొను శోకమునఁ బ్రాణవిభుని
నడవిలోపల బాలహరిణియుఁబోలె
వెడవెడ నందంద వెదకంగఁ దొడఁగె.
'తరులార నాసహోదరులార మీరు
ధరణీశ్వరుని జాడ తగఁ జూపరయ్య.
సురలార మీరైన సురరాజవిభుఁడు
తరలి పోయినజాడ తగఁ జెప్పరయ్య.
భూదేవి నీవైన భూలోకనాథుఁ
డేదెసఁ బోయెనో యెఱిఁగింపవమ్మ.
ననుఁ గావరయ్య కిన్నరులార పుణ్య
ధనులార ఘనులార తాపసులార.
కరులార హరులార గవయంబులార

[1]శరభ సాళ్వము లార సర్పంబులార
మనుజేశుఁ డరిగిన మార్గంబు నాకు
నెనసిన కరుణతో నెఱిఁగింపరయ్య'
యని యని యడుగుచు నటు నటు పోయి
ఘన మైనపొదలెల్లఁ గదలించి చూచి
వీరు వా రనక నవ్విధమునఁ దిరుగ
నో రెండె ధృతిదూలె నొచ్చెఁ బ్రాణములు.
ముడి వీడి క్రొ[2]మ్ముడి మూఁపుపై జాఱ
నడుగులు దొట్రిల నందంద బడలి
పగడంపువాతెఱ పద నిఁకి వాడ
జిగి దక్కి పాపట చీకాకుపడఁగఁ.
గన్నుల జలజల గాఱెడు నీరు
చన్నుమిట్టలమీఁద జలజల దొరుఁగ
[3]నన్నువనెన్నడు మసియాడి వడఁకఁ
దన్ను దూఱుచును గద్గదకంఠి యగుచు
హా యని యెలుఁగెత్తి యఱచి 'హానాథ
మాయ జూదం బింతమట్టుకుఁ దెచ్చి
మాయత్రోవలఁ జూపె మాయురే నాథ.
పోయితే యెచటికిఁ బోయితే' యనుచు
నెడపక నిబ్బంగి నేడ్చుచు విభుని
విడువక వెదకుచు విపినంబులోనఁ
గుందుచు దమయంతి కొంత దూరంబు
సందు గొందులఁజాడఁ జనుచున్న నపుడు

1. మీఁగండ్ల మృగమును డేగలును. 2. కీలుగంటు. 3. సన్ననినడుము.

పదపడి యాసమీపంబున నొక్క
పొదరింటిలో నున్నపుట్టలో నుండి
తనతల యెత్తి యాతన్వి నీక్షించి
పెనుఁబాము చెలఁగుచు బిర బిర వచ్చి
రోఁజుచుఁ గన్నుల రోషాగ్ను లడర
రాజిల్లు విషములు రాఁజ మండుచును
గలిదేవు పనుపునఁ గామినిఁ గదియ
విలవిలఁ బ్రాణముల్ విడిచినభంగి
'హానాథ' యని మూర్ఛ నవనిపై నొఱగె.
వూని యప్పుడు పాము భూమీశు దేవి
పదములఁబట్టి తప్పక మ్రింగుచుండె.
మదిరాక్షి యప్పుడు మదిమూర్ఛఁ దెలిసి
తనుమ్రింగు నా[1] ఘోర దందశూకంబుఁ
గనుఁగొని శోకాగ్నిఁ [2]గ్రాఁగుచుఁ బలికె
'అక్కటా యీఫణి కాహార మైతి.
ఇక్కడ నా కింక నెవ్వరుదిక్కు.
పామును విడిపించు బలవంతు లెవరు!
నామేను మ్రింగుచున్నది యంతకంత.
కలరాజ్య మెల్లఁ బుష్కరున కర్పించి
కలిరాజు మాయచేఁ గానలఁజొచ్చి
యిడుమలఁబడి జీవితేశునిఁబాసి
కడపట వచ్చి యీ[3]కాలాహిచేతఁ
బడుటకు నా వ్రాఁతఫల మిట్టులుండె.

1. భయంకరమైనసర్పము. 2. ఎరియుచు. 3. కాలసర్పము.

అడలంగ నిపుడు నాయాపద మాన్ప
వడి నిట కెవ్వరు వత్తురో యింక!
పుడమిఱేఁ డెచటికిఁ బోయెనో యెఱుఁగ.
ఈవేళ నిందున్న నీపాము చేతఁ
జావ నిచ్చునె దీని సాధించుఁగాక.
దైవమా యిట్టిబాధలకు లోఁజేయ
నీవేళ నీకు నేనేమి సేసితిని?'
అని యేడ్చుచుండంగ నాయార్తరవము
విని కలిమాయచే వేవేగ యొక్క
బోయవాఁ డరుదెంచి బోరన నపుడు
పాయక తనచేతఁ బట్టిన పెద్ద
గత్తిచే నాపాము కంఠంబుఁ ద్రుంచి
యెత్తి యావల వైచి యెలనాఁగఁ జూచి
'వెఱవకు లే లెమ్ము విపినంబులోనఁ
దిరుగాడ నేల నిత్తెఱఁగున నింతి?
ఎవ్వరివనితవో యెం దుండి వచ్చి
తెవ్వని వెదకెదో యీపాముచేత
నేగతిఁ జిక్కితి విది యెల్ల నాకు
వేగంబె తెలుపు నీ వెఱపెల్ల మాన్పు'
దనవుడు లేచి యయ్యలినీలవేణి
తనదు వృత్తాంత మంతయుఁ జెప్పఁ దొడఁగ
'నోయన్న, వినర యీయుర్వి యంతయును
బాయక చక్రంబు పను లొనరింప
నేలిన నలునకు నిల్లాల ధరణిఁ

బాలించు భీమభూపతి పుత్రి యేను.
దమయంతి యనుపేరఁ దనరినదాన.
రమణతో నిషధ పురంబున నుందు.
అఱిముఱిఁ బగదాయ యైనపుష్కరుఁడు
ధర యెల్లఁ గపటజూదంబునఁ గొనియె.
అది యాది గాఁగ మహారణ్యమునకు
బెదరుచు రాఁగ నాప్రియుని చేలంబు
కపటంపుఁ బక్షులు గైకొని చనియె.
అపుడు శోకంబున నడలుచు మేము
నొనరంగ నిద్దఱ మొకచీరఁ గట్టి
చనుదెంచి యొకశూన్య సదనంబుఁ గాంచి
యరిగి కూర్చుంటిమి యంతలో నేను
మఱచి నిద్దురవ్రాల మదిలోన నలిగి
నాపతి భూపతి నాపాటుఁ జూడ
నోపక నాచీర [1]నొకసాముఁ జించి
యదిగట్టి నను విడనాడి పోయినను
గుదులుచు నే మేలుకొని లేచి విభునిఁ
గానక యేడ్చుచుఁ గడుఘోర మైన
కానలో వెదకి యెక్కడఁ గానలేక
నిక్కడి కరుదేర నీపాము నన్నుఁ
దక్కక మ్రింగ నిత్తఱి నీవు వచ్చి
యీపాముఁ జంపి నన్నెలమిఁ బ్రోచితివి.
ఆపార్థివేంద్రుఁ డెం దరిగెనో యెఱుఁగ'

1. ఒకసగము.

ననవుడు విని మనం బఱుకు ఘటిల్ల
వనజాక్షి కాబోయవాఁ డిట్టు లనియె
'నీరజానన నీవు నిసుర వ్రాఁజూచి
కోరి నీకట్టినకోక చించుకొని
యడలంగ నిట్టిఘోరాటవిలోను
విడిచి పోయినవాఁడు విభుఁడటే నీకు!
పడఁతి నిట్టి గానలపాలుగాఁ జేసి
యెడపక పోవువాఁ డెందైనఁ గలఁడె?
మగువ నిన్నిట డించి మఱిపోవువాఁడు
పగవాఁడు గాక నీపాలిటిమగఁడె?
అడవిలో నీరీతి నలజడిఁ బడుచు
విడుపక నీ వేల వెదకెదు వాని?
అలివేణి యీపాముకన్నను మంచి
బలు వైనఘోర సర్పంబులు గలవు.
అడవిలోపల నొంటి నరుగంగ నేల
నిడుమలఁ బడుచు నీ విందీవరాక్షి?
వలవదు నావెంట వలనొప్ప రమ్ము.
నలునికన్నను మంచి నాథుండ నేను.
నీ కేల చింతింప నీకోర్కు లెల్లఁ
జేకొని కొనసాగఁ జేయుదు నన్ను
నమ్మి నాయింటికి నలినాక్షి రమ్ము.
సమ్మతి నాయింట సకలసంపదలుఁ
గల వన్నిటికి నీవు కర్త్రి వై యుండు.
పలుదెఱంగుల నన్ను బంటుగా నేలు

కొనియుండు నీ కేమి కొదువలు లేవు.
ఒనరంగ నావెంట నోడక రమ్ము.
పట్టణంబును బోలుఁ బరఁగ నాపల్లె.
నెట్టనఁ గనుఁగొని నీవె మెచ్చెదవు.
మానిని నేను సామాన్యుండఁ గాను.
తేనియల్ వడియంగఁ[1] దెరువాట్లు గొట్టఁ
గడఁగి కన్నముఁ బెట్టి గడియలు దియ్యఁ
బుడమి ద్రవ్యము లెత్తి మూలల డాఁగ
ముడుపులు కతిరింప మొగి సొక్కుఁ జల్ల
నడుగు దాఁచుక పోయి యావల నడువ
వలలొడ్డ నురులొడ్డ వాగులు గట్టఁ
బులుఁగుల వాకట్టి బోరనఁ దొట్టి
గురుమృగంబులతోడఁ గూడంగఁ బాఱి
శరములఁ బడ నేయ సరి నడు గెత్త
నాయంత[2]పాలపరి నలినాయతాక్షి
బోయరాజులలోనఁ బాడగాన మెందు.
ఏ వేళఁ జూచిన నెట్టిమాంసంబు
గావలె నన్నను గలదు లే దనక.
కావున నావెంటఁ గదలి ర' మ్మనిన
విని చాలఁ గోపించి వెలువెలఁ బాఱి
తనకోప మంతయుఁ దనలోన నడఁచి
యాపాపకర్ముని నందంద చూచి
యాపుణ్యసాధ్వి నెయ్యము మీఱఁ బలికె.

1. దారికట్టికొట్టుట. 2. వేటకాఁడు.

'ఓయన్న యిది నీకు నుచితంబు గాదు
పాయక వినరాని పల్కు పల్కెదవు.
ధరణీశుసతియును దనదుతల్లియును
సరి యండ్రు పెద్దలు జగతిలో నెల్ల
ననుమాట వినవు గా యన్న నీ కిదియు
వినిపింతు నిది బుద్ధి వెలయంగ వినుము.
తనరిన యేగురు తల్లులలోనఁ
దనగురుసతి యొక్కతల్లి యై యుండు.
తనరాజుసతి యొక్కతల్లిగా నుండు.
తనయన్నసతి యొక్కతల్లిగా నుండు.
తనసతితల్లి యే తల్లిగా నుండు.
తనుఁగని చన్నిచ్చుతల్లియుఁ గాక
తనతల్లి సమ లైన తల్లులు వీరు.
ఇలలోన వీరియం దెవ్వరి నైన
సొలయక కామించి చూచినంతటనె
యాయువు చెడిపోవు నపకీర్తి చెందు.
మాయును ముఖలక్ష్మీమానంబు దూలు.
పాపంబు వర్ధిల్లు ఫల మెల్ల నడఁగు.
రూపంబు చెడిపోవు రోగంబు వచ్చు.
ఏపు రా దెన్నఁడు నెడయుఁ బుణ్యంబు.
తాపంబుఁ బొడము సంతాపంబు వచ్చు.
ఆపద లరుదెంచు నపజయం బొదవు.
చూపులు సోలియును సుఖమెల్లఁ దొలఁగు.
సంపద లెడఁబాయు సత్యంబుఁ బోవు.

పెంపెల్ల వెసఁ జనుఁ బెనుభీతి చెలఁగు.
తేఁకువ దప్పును దీనత వచ్చు.
డాఁకొను ధైర్యంబు తలఁగును మఱియు
నంతటఁ జొవక యమకింకరాళి
కుంత ముద్గర శూల ఘోర గదాది
సాధనంబుల మఱి శస్త్రాస్త్రములను
బాధింతు రిది గాక బహుపురీషాది
పూతిగంధంబులఁ బొరలింతు రుగ్ర
వైతరణీనది వడి నెట్టి త్రోతు
రుడుగక పెక్కుఁడు లుంతురు మఱియు
బడిబడి నరకకూపములఁ బాతకుల
నని వేదశాస్త్రంబు లనిశంబుఁ దెలుపు.
మనమున నిట్టిదుర్మదముల విడువు
మటుగాన నీతల్లి నగుదు నిచ్చటికిఁ
బటుగతి వచ్చి యీపామును జంపి
నన్ను రక్షించితి నాతండ్రి వైతి
వన్న నీ విటువంటి యల్పకార్యంబు
ననుఁ బల్కఁదగ'దన్న నాతిమాటలను
విని వాఁడిసూదులు వీనులలోన
గ్రుచ్చినగతి నొచ్చి కోపించి బోయ
యచ్చపలాక్షితో నప్పు డి ట్లనియె
'తరళాక్షి యిటువంటి ధర్మశాస్త్రములు
చొరవు వీనులకు నీ సుద్దులు విడువు.
మును నీవు యమలోకమున బాధలెల్ల

ననుభవించినయట్ల యరసి చెప్పెదవు.
పాపపుణ్యంబులఁ బరికింప మెప్పు
డేపార శాస్త్రంబు లెఱుఁగము మఱియుఁ
గలకంఠి యముఁడు మాకడకు రావెఱచు.
గిలిగింతలను బెట్టఁ గెరలునే శిలలు?
మాకుఁ బాపము లేదు మదిరాక్షి నిన్నుఁ
గైకొని పొందక కాని నేఁ బోవ'
నన విని యపుడు రౌద్రాకార యగుచుఁ
దనలోన మండుచుఁ దరలాయతాక్షి
'వెలయ నావృత్తంబు వీఁడేమి యెఱుఁగు.
కలుషాత్ముఁ'డని వానిఁ గనుఁగొని పలికె
'నోరి పాపాత్మ యీయురగంబుఁ జంపి
కారుణ్యమున నన్నుఁ గాచితి గాన
రయమున నినుఁ జంప రా దని యున్న
భయ మింత లేక దుర్భాష లాడెదవు.
నీవేడ నే నేడ నీమాట లేడ
నీ విందు నుండక యిపుడు పొమ్మనిన
నప్పుడు వాఁడు రౌద్రాకారుఁ డగుచు
నిప్పులు కన్నుల నిండారఁ దొరుఁగఁ
నప్పద్మలోచన నల్లన చూచి
కప్పిన కామాంధకారంబుచేతఁ
దనమేను తెలియక దగ్గఱ రాఁగ
వెనుకకుఁ బోయి యావెలఁది యి ట్లనియె

'నిం దెందు వచ్చెద వీఁకఁ జూడ రోరి
పొందిన నీగర్వము నడంతు' ననిన
'బలవంతమున నిన్నుఁ బట్టి పైఁ బడినఁ
జెలి యేమి చేసెదు చెప్పుమా యిప్పు?'
డని పట్ట గమకించునంతలోపలనె
యొనరంగ నీక నూర కుండ రా దనుచుఁ
దనలోనఁ దలఁచి యాతామరసాక్షి
'మనమున వాకున మఱి చేఁతలందు
వరునిఁ గొల్చిన పతివ్రత నౌదు వేని
నరలోకవిభుఁ డైన నాకూర్మివిభుఁడు
వరుస సత్యంబుఁ దప్పక మనునేని
హరికృపఁ బొందిన యంగననేని
బోయవాఁ డిప్పుడే పొలిసి దుర్గతిని
బాయక పడు' నని పడఁతి శపించె.
సడలని యాఘోరశాపాగ్ని దగిలి
యుడుగక నాబోయ యుబ్బెల్లఁ బొలిసి
పిడుగులువడి కొండ పృథివిపైఁ గూలు
వడువునఁ దెప్పున వసుధపైఁ గూలి
కలఁగుచుఁ బలుమాఱు గాళ్లు చేతులును
విలవిలఁదన్నుక విడిచెఁ బ్రాణముల.
అంతలో దమయంతి యచ్చోటుఁ బాసి
వంతఁ గుందుచు శోకవారి నీఁదుచును
'భూపాలు డిటు వాసి పోవుటఁ జేసి
యీపాతకుఁడు నన్ను నిట్లాడెఁ గాక.

నావిభుఁ డిం దున్న నన్ను బాధింప
భావించునే వీఁడు పలుగాకి గాన
మగదిక్కు లేకున్న మగువ ప్రాణంబు
తగదు పెట్టుకయుండ ధారుణిమీఁద.
ఇట్టిపాతకు లెంద ఱిచ్చోటఁ దెరువు
గట్టుక న న్నెంత గాసిఁ బెట్టుదురో!
పతి డించి పోయినపడఁతిని బుద్ధి
మతులు సందేహించు మాటలు నిజము.
మాటికి మగవాఁడు మహిమీఁద నరుగ
నాఁటది యొంటిగా నరుగంగఁ బోల
దాఁడుపుట్టుక పుట్టునట్టిదోషంబు
వాఁడిమి భువిఁ బగవారికి వలవ
దక్కటా యబల నీయడవిలోపలను
దిక్కుమాలినయట్లు తిరుగంగ వలసె.
కొండల నడవులఁ గ్రుమ్మరఁజాల.
ఒండేల నీకఁ బ్రాణ మునుపంగఁ దగదు.
పెనిమిటి కెక్కక ప్రియు నెడఁబాసి
చను మని యెవ్వరు శపియించిరొక్కొ!'
యని[1] తీఁగెయెలుఁగున నాకోమలాంగి
తననాథుఁ బేర్కొని తా నేడ్చుకొనుచు
నరుదార నెదురుగా ననలుండు ప్రబలి
పరువడి పొదలెల్ల భస్మీకరింపఁ
దరలాక్షిఁ గని వేడ్కఁ దావాగ్ని నడుమ

1. సన్నని నిడుద స్వరమున.

నరుదారఁ జొచ్చిన నది చల్లనయ్యె.
కరితొండములు తనకరములఁ బట్టి
కరకరిఁ బెనఁగినఁ గరు లూరకుండె.
ఎలుఁగుపిల్లలఁ బట్టి యిట్టట్టు సేయ
వలగొని యెలుఁగు లవ్వలికిని దొలఁగె.
పులు లున్నకడకు గొబ్బునఁ బోయి కదిసి
పొలియుట కెదిరినఁ బొరిగొన వెఱచె.
కంఠీరవంబులఁ గదిసి యాకంబు
కంఠి చీఱిన నవి కదియక పోయె.
అడవిపందులఁ జేరి యందంద త్రాల
నడరుచు రువ్విన నవి పాఱిపోయె.
పాముపుట్టలలోన బాహువుల్ సాఁచి
ప్రామినఁ గఱవక ఫణులు దొలంగె.
తొణఁకెడుకొలఁకుల దుమికిన జలము
[1]ఫణివేణి [2]కూరులబంటి యై యుండె.
అది చూచి హా యని యందంద యేడ్చి
'యిదియేమి మాయయో యెఱుఁగంగ రాదు.
పరువడి నే మహాపాపిని గాన
సరగున నిపు డేల చావు సిద్ధించు'
నని యని వగచుచు నాదమయంతి
చని చని మఱియును జఱియల దుమికె.
ఈరీతిఁ బ్రాణమ్ము లేమిటఁ బోక
నారామ యడవిలో నలమటఁ బడుచు

1. పామువంటి జడగలది. 2. తొడలలోఁతు.

*జను లేమి తిందురో చావు'న కనుచు
మునుకొని విషపత్రముల్ గోసి తినిన
నావిషపత్రంబు లాఁకలి దీర్పఁ
జావు రా దని యేడ్చి చనుచుఁ గట్టెదుటఁ
బనస పిప్పల నింబ పాటల వకుళ
ఘనసార సౌవర్ణ ఖర్జూరములును.
పొన్నలుఁ బాగడలుఁ బోఁకమ్రాఁకులును
గన్నేరులును మల్లికలుఁ జూతతరులు.
కదళి కుంద కదంబ కాంచన కుటజ
బదరి తింత్రిణి బిల్వ పారిభద్రములు.
తెలియంగఁ గమ్మపూఁదీగెలుఁ బ్రబలి
బలు వైనచలువ చప్పరముల నలరు
చల్లనినీడల జాతివైరంబు
లల్లన విడిచి ప్రియంబునఁ బొదలి
సింగంబుకొదములు చేరి యేనుఁగులఁ
జెంగలింపుచు ముద్దుసేయుచు నుండు.
పెనుజాడ దప్పినపెయ్యల వెదకి
కొనిపోయి మొదవులఁ గూర్చెడి పులులు.
లేడిపిల్లలను బా లిచ్చుచుఁ గూడి
యాడుచు నుండి పెం పలరు తోఁచులును.
సరసంబుగా ముంగిసలమీఁద నెక్కి
వరుసతోఁ బ్రాఁకెడి వరపన్నగములు.
ఎలుకలపిల్లల నెలమితోఁ గూడి
కులుకుచు ముద్దాడుకొనెడు పిల్లులును.

పలుచని నీళ్లలోఁ బడియున్న మీనుఁ
[1]గులుకులు వారితోఁ గూర్చుకొక్కెరలు.
కోకిలార్భకులను గూడి యందంద
చేకొని మేఁత భక్షించు కాకులును
బాలుపొంద నివ్విధంబున వినోదంబు
గలిగి యుండిన యొక్క ఘనతపోవనము
దమయంతి కనుఁగొని తనలోన మెచ్చి
'యమరిన యిట్టిపుణ్యాశ్రమ భూమి
నే మాని యుండునో యిది చూత' మనుచు
నామానినీమణి యచటి కేతెంచి
[2]పురుషప్రమాణంబు భూమి పై కెగసి
పరమాత్ము నాత్మలో భావించువారి
నొక్కపాదాంగుష్ఠ ముర్విపై నిలిపి
నిక్కి భానునిఁ జూచి నిలిచినవారిఁ
దరుశాఖలందుఁ బాదములు దగిల్చి
కరమర్థిఁ దలక్రిందుగా వ్రేలువారిఁ
బద్మాసనంబునఁ బరఁగఁ గూర్చుండి
పద్మాక్షు నుతులు దప్పక సేయువారి
స్వాహామమంత్రంబుల నుచ్చరింపుచును
హోమంబు లతిభక్తి నొగి వేల్చువారిఁ
గరములు ముకుళించి కన్నులు మూసి
చిరభక్తి జపములఁ జేసెడివారిఁ
గనుఁగొని మదిలోనఁ గడు సంతసిల్లి

1. లోఁతు నీళ్లలో. 2. ఒక మనుష్యుని పొడువు.

చని చని ముందర సన్మునీశ్వరులు
కొందఱు ముందఱఁ గూర్చుండి యచటఁ
బొందుగా వేదార్థముల వేడు కలర
నొక్కరి కొక్కరు నొగిఁ జెప్పుచుండ
నక్కామినీమణి యమ్మహాత్ములకుఁ
దప్పక సాష్టాంగ దండంబు వెట్టి,
యప్పుడు దమయంతి హా యని యేడ్వఁ
గనుఁగొని చాల యోగ ధ్యాన మహిమ
మనమున నది కలి మాయగా నెఱిఁగి
యొండొరుల్ సందడి నొనర వారించి
నిండిన కృపతోడ నెలఁత కిట్లనిరి.
'యెలనాఁగ నీ విపు డేల యేడ్చెదవు?
వలవదు కర్మంబు వచ్చినవేళ
మూఁడుకన్నులు గలమూర్తికి నైన
వాఁడిమి తప్పింప వశము గా దిలను.
మదిరాక్షి చూచితే మాయోగదృష్టి
నది నీకుఁ జెప్పెద మంతయు వినుము.
కలిరాజు పన్నిన కపటజూదమున
కలరి నీవిభుఁడు రాజ్యం బెల్లనోడి
కలకంఠి నినుఁ గూడి కానకు వచ్చి
పులుఁగులచేఁ జేలమును గోలుపోయి
చెచ్చెర నీపైఁటచెఱఁగు గట్టుకొని
వచ్చి కొలంకున వడినీరు । దావి

[1]యత్తీర విజన గేహముఁ బ్రవేశించి
నత్తి నేలకు వ్రాల్చి నీ వందు నిదుర
పోవుచు నుండంగఁ బురపురఁ బొక్కి
భావించి నినుఁ జూచి పాసి పోలేక
శోకించి శోకించి సుందరి నీదు
కోకకొం గొకయింత గొబ్బునఁ జించి
యది గట్టుకొని నిన్ను నచ్చట డించి
పదపడి పోవ భూపతి నొక్కపాము
గఱచిన నాతనికాంతియుఁ బాసి
పరువడి వికృతరూపమున నయోధ్య
కరిగి యాఋతుపర్ణు నందంద గాంచి
గురుతరభక్తితోఁ గొల్చి వసించె.
అలివేణి నీ వప్పు డానిద్ర దెలిసి
వెలువెలపాటున విభుఁ గాన లేక
విపినంబులోపల విహరించు చుండ
నపు డొకపాము సయ్యన నిన్ను మ్రింగ
నొకబోయ మూర్ఖుఁ డాయురగంబుఁ జంపి
శుకవాణి నినుఁ బట్టఁ జూచిన నీవు
కోపించి యాపాతకుని కంతలోన
శాపంబు నొసఁగి యాజముపురి కనిపి
'పతిలేనికతన నీపాపాత్ముఁ డకట
మతిదప్పి యిటువంటి మాటాడె' ననుచుఁ
జావఁ దలంచి యచ్చటి మృగావళిని

1. కానిగట్టునందలి జనులులేని గృహమును.

వేవేగ కదిసిన వెఱచె నన్నియును.
ఎలనాఁగ నీ వంత నిటకు వచ్చితివి.
కలిరాజు మిముఁ బట్టి కలఁచి యీరీతి
వెఱపించుచున్నాఁడు వెఱవకు మింక.
తరుణి నీవిభుఁడు మోదమున నున్నాఁడు.
లోలాక్షి యీరేడు లోకంబు లందు
నేలీల నైన నీకెవ్వరు సములు.
సరస పతివ్రతా జనులు వీక్షింప
నరుదార సౌఖ్యంబు లనుభవించెదవు.
మఱవకు నీకొక మాటఁ జెప్పెదము.
ఉరుతరాటవిలోన నుండకు మింక.
పుడమి సుబాహుని పురమున కరిగి
తడయక యారాజు తరుణి దగ్గఱను
సైరంధ్రివై కొల్చి సరసత నుండు.
వారక యిఁకమూఁడు వత్సరంబులకు
నీనాథుఁడును నీవు నెమ్మదిఁ గూడి
మానిత సకల సామ్రాజ్య సౌభాగ్య
మనుభవించెదవు నీ వడలకు మమ్మ.
పెనుపొంద మేము సెప్పిన మాట వినుము.
నీవు వచ్చినదాఁక నిలిచితి మిచట
సావధానత సమస్తము నీకుఁ దెలిసె.
తరలాయతాక్షి మాతపము లీడేఱె.
పరువడి నిఁక మేము బ్రహ్మలోకమున
కరిగెద మిపు' డన్న నామాట లెల్ల

వెర వొప్ప విని చాల విస్మయం బంది
కలఁగినచిత్త మొక్కటి గాఁగఁ జేర్చి
యలినీలవేణి యి ట్లని విన్నవించె
'పరమపావనులార ప్రణుతాత్ములార
నరలోకనుతులార నాతండ్రులార
ఘన మగుమీపాద కమలంబు లేను
గనుఁగొని సేవింపఁ గలిగె నాభాగ్య
వశమున నేఁ బుణ్యవర్తన నైతి.
విశదంబుగా నేను విపినంబులోన
నడలిన విధమెల్ల నానతిచ్చితిరి.
కడువేడ్క పుట్టె నాకలుషంబు లడఁగె.
వేడుక మూఁడేండ్ల వెనుక నావిభునిఁ
గూడియుండుదు నంచుఁ గోరి చెప్పితిరి.
ఇది నమ్మఁజాల నా కిది నిజం బనుచు
సదయత నాశిరఃస్థలి నంటుఁడనిన
'నెలనాఁగ యింక మూఁ డేండ్లకు వెనుక
బలవంతుఁ డైన నీప్రాణనాయకునిఁ
గలసి నెమ్మదిని సౌఖ్యమునొందఁ గలవు.
సలలితంబుగ నిది సత్య'మటంచుఁ
కరములు చాఁచిరి కమలాయతాక్షి
శిరముమీఁదికి మునిసింహులు పిదప
నొనరంగ నా సుబాహునిపట్టణమ్మున
కనుపమగతి మార్గ మప్పుడు చూపి
కడువేగ బ్రహ్మలోకమునకుఁ జనిరి.

తడయక దమయంతి తనచింత కొంత
మదిలోన నడఁచి యామార్గంబునందు
బెదరక చనుచున్న పెటికలవారు
దమయంతిచంద మంతయుఁ జూచి వగచి
'క్రమమైన రూపురేఖలఁ గాంచి చాల
నుడుగని వగపున నొంటిగా నీవు
నడచె దెచ్చటికిఁ దిన్నగఁ జెప్పవమ్మ.
నాతి నీపే రేమి? నాథుఁ డెవ్వాఁడు?
మాతోడఁ జెప్పవే మాతల్లి నీవు
వనజాక్షి' యన విని వారలఁ జూచి
తనదు వృత్తాంత మంతయుఁ జెప్పఁ దొడఁగె
'వినరయ్య చెప్పెద విశ్వంబులోన
వినుతి కెక్కిన నలోర్వీపతిసతిని.
ధరణిలో నాపేరు దమయంతి యండ్రు
నరలోక నుతుఁ డైన నాప్రాణనాథుఁ
డెసఁగంగ జూదంబు నెలమితో నాడి
వసుమతి దాయాదివారల కోడ
నడవులఁ జరియింత మని వచ్చి మేము
పడరాని యిడుమలఁ బడి యొక్కచోట
నిలిచి యక్కట నేను నిదుర వోవంగఁ
గలిమాయచే నన్నుఁ గానలో డించి
భూనాథుఁ డెక్కడఁ బోయెనో యెఱుఁగ.
కానరే నలమహీకాంతుని మీర
లిల నేడు దీవుల నేలెడివాని

నలరి కృష్ణప్రీతికై బ్రాహ్మణులకు
భయభక్తి మీఱంగ బహుళసంపదలఁ
బ్రియ మొప్పఁగా సమర్పించినవాని
నిత్య సత్కీర్తుల నెగడెడివాని
నత్యంత హరిభక్తి నమరినవాని
జగతి నిక్ష్వాకువంశజుల కందఱకుఁ
బొగడొందుకీర్తులఁ బుట్టించువాని
నోతండ్రులార మీ రుర్వి నెందైనఁ
బ్రీతిఁ జూడరు గదా పృథివీతలేశు'
ననవుడు విని వార లాత్మలో వగచి
పనివడి మాతగా భావించు కొనుచుఁ
'[1]దోయజహితదీప్తి దూఱనియట్టి
యీయరణ్యంబుల నేల వేగింప?
పురములలోఁగాని భూలోకనాథుఁ
[2]డురుతరాటవిలోన నుండంగఁ బోఁడు.
సతి నీవు మా వెంటఁ జను దెమ్ము భూమి
పతి యాసుబాహుని పట్టణంబునకుఁ
బోవుచున్నార మో పూఁబోఁడి' యనుచు
వావిరిఁ దోడ్కొని వడి వడి నరుగఁ
బెదరక తాము చేసినపుణ్య మహిమ
నెదుట నొక్కతటాక మింపొప్పి యున్న
నది గని [3]చనుపవా రంద ఱాకొలనుఁ
గదిసి గోనెల నొక్కకడఁ బడఁద్రోచి

1. సూర్యకాంతి. 2. మిక్కిలిగొప్పయడవి. 3. బిడారు.

తనర నెద్దుల నీరు ద్రావించి మఱియుఁ
దనివి నింపార నందఱు నీరు ద్రావి
వేడుక నాచెంత వెలసిన మ్రాఁకు
నీడల నందఱు నిలిచి కూర్చుండి
తమతమబడలికల్ తారె చెప్పుచును
దమయంతిఁ జూచి 'యోతల్లి నీ విపుడు
[1]కొదుకక యుదకంబు గ్రోలు' మటన్న
మదిరాక్షి పోయి యామంచిజలంబు
లొక కొన్నిటిని గ్రోలి యొగి మూర్ఛవోయి
వికలత్వమున లేచి విభునిఁ దలంచి
'యెటుపోయితివి నాథ యిడుమల నొంద
నిటు నను డించి నీ వెం దున్నవాఁడ?'
వనుచు హా యని శోక మందుచు నుండె.
చనుపవా రప్పు డాజలజాయతాక్షి
శోకంబు మాన్ప నచ్చో నొక్కచల్ల
మ్రాఁకునీడను జేరి మగువ కూర్చుండె.
తనవంశభవుఁడు భూధవుఁడైన నలుని
వనితకష్టముఁ జూడ వశము గా కస్త
గిరిఁ జేరె నన్నభంగిని బ్రొద్దు గగన
సరణిని బశ్చిమాచలమున కరిగె.
తడఁబడ మింట సంధ్యా రాగ మొప్పె.
కడువడిఁ జుక్కలు గనుపట్టె మింట.
అది నభం బిట భూమి యని యెన్న కుండఁ

1. సంకోచింప.

గదిసి యంతంతఁ జీఁకటి నిండఁ బర్వె.
మెండుగా ఘూకముల్ మెలఁగంగఁ జొచ్చె.
దండి భూతంబు లుద్దండతఁ దిరిగె.
బేతాళు భూమి గంపింపఁగాఁ గొలిచి
భూతంబు లందంద పొడచూపఁ దొడఁగె.
సరగున నప్పు డాచనుపనా రెల్ల
మఱచి నిద్దురప్రోవ [1]మత్త సామజము
లరుదెంచి యెద్దుల నట కొన్నిఁ జంపి
[2]పెఱికలవారల పీఁచ మడంచి
కొందల మందింపఁ గూయుచు లేచి
కొందఱు సందులు గొందులుఁ జొచ్చి
తమతమ ప్రాణముల్ దప్పించుకొనిరి.
అమరంగ మఱి కొంద ఱటు పోవ లేక
చరణముల్ తడఁబడి చనలేక యచటఁ
గరులచే మడిసి రా కల్లోల మైన
రవళి డిగ్గన లేచి రాజేంద్రు దేవి
వివశ యై 'యిది యేమి విధ మొకో' యనుచుఁ
గరులఁ గన్గొని చావు గల్గె నటంచు
దఱియఁ బోయిన నవి తలఁగిన మరలి
వసుధపైఁ జచ్చినవారలఁ జూచి
విసువక యేడ్చుచు వెలఁది యిట్లనియె
'నక్కటా యీపాప మంతయు నాకుఁ
గక్కసంబునఁ జూడఁగలిగె నేదోషి

1. మదించిన యేనుఁగులు. 2. పెఱిక = ఎద్దు మొదలగువానిపై వేయు గోనెమూట.

కారిణిఁ గాన నీకర్మంబు మీకుఁ
జేరెఁగా యిఁక నేమి సేయుదు నకట.
నేను మీ వెంబడి నెఱివచ్చు కతన
నేనుఁగుల్ వచ్చి మి మ్మిట చంపిపోయె.
నా కేల సిద్ధించు నలి నిట్టిచావు.
చేకొని యిఁక నేమి సేయ నున్నదియొ!
కలిరాజు చేసెడి కపటవర్తనము
నలరంగఁ దెలియరా' దని యేడ్చుచుండె.
చావక తప్పిన [1]చనుపవా రప్పు
డా వెలందుక దుఃఖమంతయు మాన్చి
'నీ వేమి సేతువు నీరజవదన
యీ విధ మట్లుండె నడలంగ నేల
మన్నన నినుఁజూచి మమ్ముఁ గొందఱను
మన్నించి పోయె నామదసామజమ్ము'
లని పల్కుచుండఁగా నంతలో భానుఁ
డనురక్తిఁ బూర్వాద్రి కరుదెంచె నంత
[2]నామత్తగజయాన యచ్చోటు వాసి
యామార్గమునఁ బోవ నట కొంతదూర

—(దమయంతి సైరంధ్రివేషమున సుబాహుపురముఁ జేరుట.)—

మునఁ గనుపించె గోపుర కాంతి రుచులు
ఘనమైన మేడలు కనకహర్మ్యములు
కోట లుప్పరిగ లాకోమలి చూచి
పాటించి సైరంధ్రి భామ వేషమునఁ

1 ఇది యిందు సరళాదిగా నే కనఁబడుచున్నది. 2. మదించినఏనుఁగు నడగలది.

పురములోఁ జొచ్చి యప్పుడు మేను కుంచి
వెరవొప్ప నారాజవీథి నీరీతిఁ
గువలయేశ్వరుఁ బాసి కుందుచు వచ్చు
కువలయాక్షిని గుంపుగూడి చూచుచును
[1]కువలయహితబింబ కోమ లాననలు
తవిలి యిట్లని రంతఁ దమలోనె తాము
'చూడరో యమ్మ యీసుదతిరూపంబు
వేడుక లూరెడు వెసఁ జూడఁ జూడ.
ఈవనితామణి యెవ్వరో కాని
భావింపఁ బతికిఁ దప్పని యరుంధతియొ.
అనిశంబుఁ గొనియాడ నగుచంద్రమతియొ
మనసిజాతుని వధూమణియొ రోహిణియొ
[2]అమరేంద్రమణియొప్పు నన తగుకొప్పు.
[3]కమలారిబింబంబు గదు[illegible] నెన్నుదురు.
అరవిందపత్రము లట్ల నేత్రములు.
మెఱుఁగుటద్దముజోడు మించు చెక్కిళ్లు.
కంతుశంఖంబు పొంకంబు కంఠంబు.
వింతపువ్వులచెండ్లు వెలఁదిపాలిండ్లు.
చిగురుటాకులబాగు చేతులలాగు.
బిగియింప సాధ్యంబు పేదమధ్యంబు.
[4]స్ఫుటసైకతనిభంబు శ్రోణితలంబు.

1. చంద్రబింబమువంటి కోమలముఖములు గలవారు-స్త్రీలు. 2. ఇంద్రనీలమణి సొగసుచేతనే తగునట్టి. 3. చంద్రబింబము. 4. శ్రోణితలంబు=పిఱుఁదుపట్టు, స్ఫుటసైకతనిభంబు=స్పష్టమగు ఇసుకదిన్నె వంటిది.

పటుతర[1]కదళికా ప్రభనొప్పు తొడలు
తలిరులచొప్పు పాదంబుల యొప్పు
కలహంసనడలు చక్కని నాతినడలు
నింగి తళుక్కన నెగయు మెఱుంగో!
బంగారు బొమ్మయో పగడంపు లతికో!
కలికి రా చిలుకయో [2]కాయజు శరమొ!
అలరుల బంతియొ యాణిముత్తియమొ!'
అని యిట్లు వినుతింప నాదమయంతి
గని పురసతులు డగ్గఱి మఱిమఱియుఁ
జూచుచుండంగ నాసుందరి యపుడు
సైఁచనివెత రాజసరణిఁ బోవంగ
నల్లన పురనాథుఁ డైనసుబాహు
తల్లి శిరోగృహస్థలి నుండి చూచి
తన చెంత నుండిన తరుణి కిట్లనియె
'వనజాక్షి చూచితే వచ్చెడుదాని
[3]నలినారిఁ బోలు [4]నానన కాంతి మించి
వలనొప్ప శ్రీలక్ష్మి వడువున నున్న
దీయింతి యెవ్వరో యెఱుఁగంగ రాదు.
పోయి నీ వచటికిఁ బొలఁతిని దోడు
కొని రమ్మటన్న నా కోమలి పోయి
మనుజేశుసతిఁ జూచి 'మాయమ్మ నిన్ను

1. కదళికా=అరఁటి. 2. మన్మథబాణమో. 3. నలినారి=చంద్రుని. 4. ఆననకాంతి=ముఖముకాంతి.

నతివేగ దోడితె మ్మని నన్నుఁ బంచె.
అతివ నా వెంట రమ్మని తోడుకొనుచుఁ
జనుదేర నమ్మహీశ్వరుదేవిఁ జూచి
మనమార నారాజమాత యిట్లనియె
'నిందీవరాక్షి నీ విటువంటివగల
నెందుఁ బోయెదవు నీ వెవ్వరిదాన?
విలలోన నీకుఁ బ్రాణేశుఁ డెవ్వాఁడు?
కలకంఠి నీమేనఁ గలలక్షణమ్ము
లరసి చూచినఁ జోద్య మగుచున్న దిప్పు
డెఱిఁగింపు నీవిధం బెల్ల నా'కనిన
జలజాక్షి సైరంధ్రిజాతి కోమలిని
నలుఁ డనుపేరి గంధర్వుఁడు విభుఁడు
నభమునఁ జరియించు నన్ను నేమఱఁడు
ప్రభురాణి యనుపేరఁ బరఁగితి ధాత్రిఁ
గలిగిన సైరంధ్రి కాంతలలోనఁ
గలపంబు గమలెస్సగాఁ గూర్పఁగలను.
కోకలు గట్టను గుంకుము వెట్టఁ
బోకలు వర్ణింపఁ బువ్వులు గట్టఁ
గాటుకఁ బెట్టను గంధంబుఁ బూయఁ
బాటించి నూటిగాఁ బాపట దీయఁ
గురులెల్ల సవరించి కొప్పు గీలింపఁ
దెఱఁగొప్పఁ గస్తూరి తిలకంబు దీర్ప
నవరత్నములు దెచ్చి నవ్యసూత్రములఁ
దవిలించి గళమునఁ దగిలింప నేర్తు.

పనిఁబూని యిటువంటి పను లొనరింప
ననువుగా నాచేత నౌను గా దనకు.
మఱవక నే నొకమాటఁ జెప్పెదను.
పొరుగిండ్లపనులకుఁ బోవ నెన్నఁడును.
చెలరేఁగి మగవారి చెంతకుఁ బోవ.
పలువిచ్చి నగ నోపఁ బలు మాట లాడ.
కొఱఁత నేఁ గట్టిన కోకయె కాని
మఱియేమి యొల్ల సమ్మదము దైవాఱఁ
దలఁపున నన్ను నీదాసిగా నేలి
నిలుపుము నిలిచెద నీవద్ద' ననిన
నారాజమాత యయ్యవనీశు సతిని
గారుణ్యరస మొల్కఁగాఁ జూచి మెచ్చి
'యాదిలక్ష్మీదేవి యమ్మరినయట్లు
ప్రోదిగా మాకెల్ల బుద్ధిఁ జెప్పుచును
నెనరంగ నావద్ద నుండవే యమ్మ.
అనురక్తి నీ కిష్ట మైనచందమున'
ననుచుఁ గూఁతు సునంద యను కన్యఁ బిలిచి
యనిశంబు సతిఁ బ్రోవు మని యొప్పగించె.
దమయంతి యచ్చోటఁ దా నేర్చు పనులఁ
గ్రమ మొప్పఁ జేయుచుఁ గలఁగుచు నుండె.

ఇది

చతుర్థభాగము.

నలచరిత్రము.

ద్విపదకావ్యము

పంచమభాగము.

అక్కడ నలుఁ డయోధ్యాపురంబునను
మక్కువ మీఱ నమ్మనుజేశుఁ గొల్చి
పలికి సమ్మద మైనపనులఁ జేయుచును
మెలఁగుచు నానలమేదినీనాథుఁ
డొకనాఁడు వెన్నెల యొగిఁ గాయుచుండ
నకలంక మతితోడ నట పవ్వళించి
తనప్రాణనాయికఁ దలఁచి చిత్తమునఁ

—(నలుఁ డయోధ్యయందు దమయంతిని దలఁచుకొని చింతించుట.)—

దనలోనఁ దా నిట్లు తలపోయఁ దొడఁగె.
'నక్కటా నిన్ను ఘోరాటవి డించి
పొక్కుచు వచ్చి యీపురిఁ జేరినాఁడ.
నను నీవు వెదకి కానలలోనఁ దిరిగి
కనలేక యెట్టిదుఃఖముఁ బొందినావొ!
గిరిగృహంబుల నన్నుఁ గెరలుచు వెదకి
గురుమృగంబులచేతఁ గూలితి వేమొ!
పన్నుగాఁ బొదలలోపల నన్ను వెదకి
పన్నగంబుల కగపడితివొ యేమొ!
ఆయెడ ననుఁ గాన కడలుచు నుండ
బోయల మాయలఁ బోయితో భామ!
వెలువెలపాటున వెదకుచు నన్నుఁ
బలుమాఱు నీ వెంత బడలితో చెలియ!

విడువక నను నీవు వెదకంగ వచ్చి
యిడుమలఁ బడుచు నె ట్లేఁగితో తరుణి!
కలనైన ననుఁ బాయఁగాఁ జాల నంచుఁ
బలికితి విపు డెట్లు పాసితో లలన!
నిదుర మేల్కొని నన్ను నెమ్మిఁ గాన
కదరి యొంటిగ మూర్ఛ నందితో తరుణి!
ఏదేశముల కేఁగి యెందున్నదాన
వీదెస పాటిల్లె నిద్దఱ 'కనుచుఁ
దనుఁ గొల్చురాజులఁ దాను సేవింపఁ
బనిచిన తనప్రాంత ఫలము నెన్నుచును
దనలోన నీరీతిఁ దలపోయుచుండ
విని ఋతుపర్ణుఁడు విస్మయం బంది
"ఇది యేమి బాహుక యెన్నఁడు నీవు
మదిరాక్షి కల దని మదిలోనఁ దలఁప
విప్పుడు దలఁచి నీ వేల శోకించె
దప్పు డాయింతిని నడవిలో విడిచి
వచ్చితి వెంత లావణ్యంబు గలదొ
యచ్చపలాక్షి నీ కన్నను మఱియు
నెట్టిరూపము గల యింతియో దాని
నెట్టన నడవిలో నిల్పి రాఁదగునె?
కంతుఁడు నీమీఁదఁ గదిసెఁ గాఁబోలు.
ఇంతిని దలఁచి నీ వి ట్లేడ్చుచున్న
నది నిన్నుఁ దలఁచి [1]పుష్పాస్త్రనిబాధ

1. మన్మథునిబాధ.

మదిలోన నేమని మఱుగుచున్నదియొ!
హరి హర బ్రహ్మాదు లంతటివారు
మరునికి వెఱచి భామల నురంబునను
శిరమున వాక్కునఁ జేర్చుకొన్నారు.
నరపతి నీయంత చక్కనివాఁడు
పుక్కిట నిల్లాలిఁ బూనంగ లేక
నొక్కఁడ విల్లుండ నుచితమే' యనిన
విని వెలవెలఁబాఱి వెఱచి నలుండు
'జననాథ నాకేల సతి నన్నుఁ జూచి
రోయక సతులు గోరుదురె నాపొందు?
కాయజుఁ డిపుడు నా కడ కేల వచ్చు?
నావగఁ జూచిన నగుదురు జనులు.
భూవర నేఁ బ్రొద్దు పుచ్చెడి కొఱకు
సొలయక నొకరాజు సుద్దులు మదిని
దలఁపింప నుడివితిఁ దప్పది నాకు.
నను గేలిసేయకు నరనాథ' యనినఁ
దనలోన నవ్వుచు ధరణీశుఁ డరుగఁ
జచ్చినచావుగా జనలోకనాథుఁ
డచ్చోట నాత్మలో నడలుచు నుండె.

—(భీముఁడు నలదమయంతులను వెదకఁబంపుట.)—

అక్కడ నంత భీమావనీనాథుఁ
'డెక్కడఁ బోయిరో యింతియు నలుఁడు!
పొక్కుచు నేదేశమున నున్నవారొ!
యక్కటా' యని యాత్మ నందంద పొగిలి

తనమంత్రివరుల బాంధవుల భూసురుల
ననుమతి వసుదేవుఁ డనుపురోహితునిఁ
బిలిపించి యతనికిఁ బ్రియము సంధిల్లఁ
బలికి [1] హేమపటాది బహుమాన మిచ్చి
'యనఘాత్మ నాకూఁతు రల్లుఁ డేదేశ
మున నున్నవారొకో భూదేవ నీవు
వేవేగ చని వారివిధ మెల్లఁ దెలిసి
రావలె' నని తన్నుఁ బ్రార్థించుకతనఁ
బనిపూని యప్పు డాబ్రాహ్మణోత్తముఁడు
తనవారితోఁ గూడఁ దడయక యరిగె.
గౌళదేశంబు బంగాళదేశంబు
మాళవదేశంబు మత్స్యదేశంబు
సౌరాష్ట్ర మగధ ఘూర్జర మహారాష్ట్ర
శూరసేన పుళింద చోళ లాటాది
దేశంబులం దెల్లఁ ద్రిమ్మరి కాశి
కాంచీ ప్రయాగాది ఘనపట్టణములఁ
బుణ్యాశ్రమంబులఁ బుణ్యఘట్టములఁ
బుణ్యతీర్థంబులఁ బుణ్యభూములను
గ్రమ మొప్ప వెదకి యెక్కడఁ గాన లేక
తమలోనఁ దాము సంతాపంబు నొంది
యరవడి నానుబాహునిపట్టణమున
నరయుద మని యప్పు డాపురిఁ జేరి
యరయుచు నుండిరి యట కొన్నినాళ్లు

1. బంగారు వస్త్రములు మొదలైన.

గురుభక్తి నాసుబాహుం డొక్కనాఁడు
దానముల్ సేయంగఁ దలఁచిన ద్విజులు
భూనాథుఁ గనుఁగొనఁ బోవంగఁ జూచి
వసుదేవముఖ్యులు వారితోఁగూడి
పోసఁగ దానము పట్టఁబోవుచందమునఁ
జని రాజు నిలయంబు చయ్యనఁ జొచ్చి

వసుదేవుఁడను బ్రాహ్మణుఁడు దమయంతిని సుబాహుపురమునఁ గనిపెట్టుట.

యొనరువింతలఁ జూచుచుండఁగా నచట
నెరయఁ జిక్కొదవిన నెఱివేణితోడఁ
బరికించి నడచెడిపదములతోడ
నుడుగక వెడలు నిట్టూర్పులతోడ
గుడుగుడుక్కన మ్రింగుగ్రుక్కిళ్లతోడ
వన్నె జాఱిన యట్టివాతెఱతోడఁ
జెన్ను దొలంగి డస్సినమోముతోడ
లలి దప్పి మొలకుఁ జాలని చీరతోడ
నలుకుచు నొకచోట నుండఁగాఁ జూచి
యవనీశుసతి యైనయాదమయంతి
యవునొకో కాదొకో యని సంశయమున
వసుదేవుఁ డప్పు డావనిత దగ్గఱికి
నెసఁజేర రాఁ జూచి వెలువెలఁ బోయి
తనతండ్రి సన్నిధిఁ దగువిప్రుఁ డనుచుఁ
తనలోనఁ దెలిసి యత్తఱిఁ జూడ నెఱచి
యొనసినవగలతో నిలఁ జూచుచుండఁ
గనుఁగొని దమయంతిగా మనంబునను

దలఁచి యావిప్రుండు తరలాక్షిఁ గదిసి
[1]కలఁగిననీళ్లలోఁ [2]గమలినిఁబోలి
[2]జలధరంబులలోని శశిరేఖఁబోలి
[3]మలినాంబరములోని మణియునుబోలి
[4]చలిత ధూమావృతజ్వాలికఁ బోలి
యోచంద్రవదన యిందున్నావె నీవు.
రాచపుట్టుక పుట్టి రాయిడిఁ బడితె!
దమయంతి వినుము నీధవుఁ డొందుఁబోయె.
మముఁ బంచె మీతండ్రి మహియెల్ల వెదకఁ'
ననుడుఁ బేరెలుఁగెత్తి యాదమయంతి
తన మొగంబునఁ జీర తగఁజేర్చి యేడ్వ
విని కలంగి సునంద వేవేగ కదలి
జననిదగ్గఱి కేఁగి చయ్యనఁ బలికె
'మనప్రభురాణి [5]యేమకొ కాని తెలియ
దెనలేని దీనత నేడ్చుచు నున్న
దొకభూసురునిఁ జూచి యుడుగక' యనిన
నకలంకగతితోడ నారాజమాత
గ్రక్కన వచ్చి యాకాంతాలలామ
నక్కునఁ జేర్చి యూరార్చి వాక్రుచ్చి
యచ్చట నున్న బ్రాహ్మణు విలోకించి
'యిచ్చపలాక్షి యిట్లేల శోకింప?

1. తామరతీఁగ. 2. మబ్బులలోని చంద్రరేఖ. 3. మురికిగుడ్డ. 4. కదలుచున్న పొగక్రమ్మినమంట. 5. ఇట 'ఏమకో' అను రూప మసాధువు. అయినను యతిమైత్రి కిట్లు గ్రహింపవలసియున్నది.

ఇటకుఁ బంచినవార లెవ్వరు మిమ్ము?
తటుకున నిప్పు డంతయుఁ జెప్పు'మనిన
విని వసుదేవుఁ డావెలఁది నీక్షించి
మనమున నలరి యామగువ కిట్లనియె
'వినుము విదర్భ భూవిభు పురోహితుఁడ
ననురక్తి వసుదేవుఁ డనుపేరివాఁడ
నీరేజవదన యానృపశేఖరునకుఁ
గూరిమిపుత్రి మక్కువ దమయంతి
యనుపేరు గలిగిన యలినీలవేణి
[1]కనక శోభన గాత్రి కంజాతనేత్రి
నలునిపట్టపురాణి నయకీరవాణి
విలసితకల్యాణి విమలాబ్జపాణి
పూర్వకర్మంబునఁ బుష్కరేంద్రునకు
సర్వ మహీరాజ్య సంపద లెల్ల
జూదంబులో నోడి సుదతితో నలుఁడు
మోదంబు దప్పి యిమ్ములఁ గానకరిగె.
ననువార్త విని మమ్ము నరసి రమ్మనుచు
ననిచె భీముఁడు మేము నందంద వెదకి
యెచ్చటఁ గానక నేము చింతించి
యిచ్చటఁ గనుఁగొంటి మీదమయంతి'
నని చెప్ప విని వారి నగ్గించి కరుణఁ
గనుఁగొని దమయంతిఁ గౌఁగిటఁ జేర్చి
యారాజమాత యిట్లని యేడ్వఁ దొడఁగె

1. బంగారువలె ఒప్పెడి దేహముగలది.

'ధారుణీశునిఁ బాసి తల్లడింపుచును
బడఁతి నీ వెట్టిబాధలఁ బొందినావో?
పుడమిఱేఁ డెక్కడఁ బోయినాఁడమ్మ,
ఎలనాఁగ యొంటిగా నెట్లు వచ్చితివి?
ఇలయేడుదీవుల నేలు భూపతికిఁ
దరుణి నై యిటువంటి తగని వేషంబు
ధరియింపవలసె నాతల్లిరో నీకు.
అవనిలోఁ బాపాత్మురాలను గాన
కవఁ బాసినట్టి దుఃఖముఁ జూడవలసె.
నాతల్లి నాయమ్మ నాముద్దుచిల్క.
యీతెఱంగెల్ల నా కెఱిఁగింప కప్పు
డేల దాఁచితివి నన్నెఱుఁగవే తల్లి.
పోలింప నీవు నాపుత్రివ నీదు
తల్లియు నే నొక్కతల్లిబిడ్డలము.
తల్లి నీ కేఁ బినతల్లిని జుమ్ము.
చెప్పవే యిటకు వచ్చిన తెఱంగనిన
నప్పుడు దమయంతి యతివ కిట్లనియె
'ధర యెల్ల నోడి నాధవుఁడును నేను
నురుతరాటవులకు నోగిఁ బోవుచుండఁ
బతికట్టుపుట్టంబు పక్షు లేతెంచి
యతివేగ గైకొని యరిగె నంతటను.
నాశోకకాంగు భూనాథుండుఁ గట్ట
శోకంబుతో నొక్క శూన్య గేహంబుఁ
జేరితి మట నిద్రఁ జెందిన నన్నుఁ

దేటిపాఱఁగఁ జూచి ధృతి దిగనాడి
నాపతి భూపతి నాపాటుఁ జూడ
నోపక నాచీర నొక కొంత చించి
తా నది గట్టుక తలఁగిన లేచి
నానాథు నెచటఁ గానక యరణ్యములఁ
బడరాని బాధలఁ బడి సిగ్గు కొంత
విడువక సైరంధ్రి వేషంబుఁ దాల్చి
నీతోడఁ జెప్పక నేఁ గొల్చి యుంటి.
భూతలాధిపుఁ డెందుఁ బోయెనో యెఱుఁగ.
కనకాంగి మ మ్మిట్లు కలి యేఁచఁ దొడఁగె'
ననవుండు వగచి 'ము న్నక్కటా యెవరుఁ
బొందని బాధలఁ బొందితే' యనుచు
మందయానకు వేగ మణిభూషణములు
కనకవస్త్రము లొసంగఁ దలంచి 'నీదు
పెనిమిటి నే నింక వెదకఁబంచెదను.
చేకొని యిప్పు డీచీర ధరింపు.
శోకంబు వల' దన్న సుందరిఁ జూచి
చిఱునవ్వు నవ్వి యాచిగురాకుఁబోఁడి
యగుదారఁ దనశోక మడఁచి యి ట్లనియె
'నాసరివారిలో నగుఁబాటు గాఁగ
నీసొమ్ము ధరియింప నె ట్లొప్పుదాన.
పతి నరణ్యంబునఁ బాసి యేతెంచి
యతివేడ్క సౌఖ్యంబు లందె నటంచు

[1]నవని జనావళి న న్నాడుకొనరె ?
ఇవి యేల నాజీవితేశుండు లేని
వెనుక సౌఖ్యము లేల వేడుక లేల !
ఇనవంశతిలకుండు హృదయేశ్వరుండు
నాపాలిదైవంబు నాప్రాణపదము
నాపెంపు నాసొంపు [2]నాపట్టుఁగొమ్ము
నామేలిచెలికాఁడు నానోముఫలము
నామెచ్చువలరాజు నన్నేలురాజు
ననుఁగూడి యుండిననాఁటికి సౌఖ్య
మనుభవించెదఁగాక యమ్మ నేఁడేల'
యనవుండు దమయంతి నట్లూరడించి
తనయున కెఱిఁగించి తద్దయు భక్తి
వసుదేవ ముఖ్యుల వరుసఁ బూజించి
పస గలబంగారు పల్లకి నుంచి

దమయంతి విదర్భకుఁబోవుట.

తామరసాక్షిని దగువారిఁగూర్చి
భీమునిపురికి నంపినఁ బోయి చేరి
నలినాక్షి యప్పు డానగరిలోపలను
బలవరింపుచు వేగ పల్లకి డిగ్గి
తనతండ్రి పదములఁ దప్పక వ్రాలి
ఘన మైనశోకాగ్నిఁ గ్రాఁగుచు నుండఁ
దల్లి వేగమె వచ్చి తనయతో వగపు

1. ఇట యతిమైత్రి విచార్యము. 2. పట్టుఁగొమ్మయని యచ్చుప్రతుల నున్నను 'పట్టుఁగొమ్మ' అనియె వ్రాఁతప్రతులందుఁ గనఁబడుచున్నది.

వెల్లువ మునిఁగి యీవెలఁది యిట్లనియెఁ
'బట్టబద్ధునిఁ జెట్టపట్టి యీరీతిఁ
గట్టుబట్టయు లేక కలఁగితే తల్లి.
నీతోడివారెల్ల నెమ్మది బ్రతుక
నాతి నీ కిటు వ్రాసెనా పద్మభవుఁడు.
యొద్ద బిడ్డలు లేకయుండెడి నీకుఁ
దద్దయుఁ గష్టంబు దాఁర్కొనఁజేసె.
తల్లి నేఁ డిటువంటి తగనివేషంబు
లెల్ల ధరించి నీ వె ట్లోర్చితమ్మ?
సరసిజానన భద్రశాలల డించి
[1]యురుశైలముల నెట్టు లుంటివో యమ్మ?
చపలాక్షి సౌధసంచారంబు విడిచి
[2]విపినభూముల నెట్లు విహరించితమ్మ?
నెలఁత నీబంగారు నిలయముల్ డించి
యిలఁ బర్ణశాలల నె ట్లుంటివమ్మ?
చెలియ నీమృదు పైనశయ్యలు డించి
శిలలపై నెట్లు వసించితి వమ్మ?
నలినాక్షి నీప్రాణనాథునిఁ బాసి
యొలనాఁగ యడవుల నె ట్లుంటివమ్మ?
మగువ నీ కైన మైనముగువల డించి
మృగసంఘముల నెట్లు మెలఁగితివమ్మ?
నీనావు నీచూపు నీసొంపు పెంపు
నీరాజ్యవిభవంబు నేఁడెందుఁ బోయె.

1. గొప్పకొండలు. 2. అడవి ప్రదేశములు.

నెలఁత నీబిడ్డల నిద్దఱఁ జూచి
విలపించు చుండుమో వెలఁది యేవేళ.
నలమహీశుఁడు తననగరంబుఁ బాసి
పొలఁతితోఁ గానన భూమికిఁ బోయె
ననువార్త దెలిసి మీయయ్య యింతింత
యనరాని ఘోరశోకాబ్ధిలో మునిఁగి
యున్నాఁడు కొలువున కొక్కనాఁ డరుగఁ
డన్న దమనుఁడు మి మ్మందంద తలఁచి
తనలోనఁ దాను సంతాపంబు నొందు'
నని యేడ్చి బిడ్డల నపుడు దెప్పించి
తనయ కొప్పించిన దమయంతి చనులు
పెనుపొందఁ జేఁపియు బిడ్డలమీఁద
[1]గరగలలోఁ బాలకై వడిఁ గురిసె.
ధరణీశుసతి యంతఁ దనలోనె తాను
దనబిడ్డలను జూచి తనయన్నఁ జూచి
పెనఁగొన్న వగలతో విలపింపఁ దొడఁగె.
భూకాంతుఁ డప్పుడు పుత్రుండుఁ దాను
శోకంబు వారించి సుత నాదరించి
'యేల యేడ్చెదవమ్మ యినకులాధిపుని
నేలీల నైనను నిటకు రప్పింతు'
నని పుత్రివృత్తాంత మంతయు నడిగి
విని 'యిట్టివగలచే వేగితే తల్లి'
యని చాల విలపించి యారాజమాత

1. చిన్న కుండలు.

పనిచిన పల్లకీభటులను మగుడ
ననిచి యావసుదేవు నర్చించి మ్రొక్కి
కనకవస్త్రము లిచ్చి కడుభక్తిఁ బలికె
'ధరణీసురేంద్ర మీదయచేతఁ బుత్రి
నరయంగఁ గంటిమి నవనిలో నింక
నలుఁ డెందు నిలిచియున్నాఁడో కాని
తెలియరా దింక నే తెఱఁగుననైన
గొనకొని వెదకి తోడ్కొని రమ్మ' టంచు
నన విని దమయంతి యతని కిట్లనియె

—(దమయంతి నలుని వెదకుటకై వసుదేవు నయోధ్యకుఁ బంపుట.)—

"ధరణీనిర్జర యయోధ్యాపట్టణమున
నరయంగ ఋతుపర్ణుఁ డను రాజు చెంత
నావిభుం డార్తి నున్నాఁ డామహాత్ము
భావించి గుర్తింప వశముగా దెవరి
కందుల కొకయుపాయము దెల్పుదాన.
పొందుగా మీర లాపురమున కరిగి
యాఋతుపర్ణుని యాస్థానమునకుఁ
జేరి యిట్లని మాటి చెప్పుఁ 'డానలుఁడు
సత్యవ్రతుండు భూచక్రేశ్వరుండు
నత్యంతధార్మికుఁ డైనభూవిభుఁడు
నిత్యదానవినోది నిఖిలార్థవేది
యత్యుత్తముండు దయాపరమూర్తి
యట్టిమహామహుం డడవిలోఁ దరుణి
కట్టినవస్త్రంబు కడు వేగ చించి

కొని నిద్రవోవఁగా ఘోరదుర్గముల
నునిచిపోఁ దగునె యాయువిద' నటంచుఁ
బలుకుఁ డామాటకుఁ బ్రతిమాట మీకు
పలికిన నాతని భావంబుఁ జూచి
చను[1]దెంచుఁ డే నొక్కచందంబు మీకు
వెనుకఁ జెప్పెదఁ గాక వేంచేయుఁ' డనుచుఁ
బలికిన నప్పు డాబ్రాహ్మణుం డాత్మఁ

—(వసుదేవుఁ డయోధ్యకుఁ బోవుట.)—

దలఁచినగతి నయోధ్యాపురి కరిగి
సరగున ఋతుపర్ణు సభఁ గాంచి యొక్క
తెఱఁగున నావసుదేవుఁ డిట్లనియె
'క్షితినాధ నలరాజు చేసినచేఁత!
వితతంబుగా నొప్పు విభవంబు చేతఁ
దనమేను తెలియక దాయతో జూద
మనురక్తితో నాడి యన్నియు నోడి
యడవికిఁ జని చని యట నొక్కచోటఁ
బడఁతి నిద్రింపఁగఁ బైనున్న కోక
సగము చించుకొని యెచ్చటి కేఁగినాఁడో!
పగవానిగతి నెడఁబాయ రాదనక
[2]ఘోరకానలలోనఁ గులకాంత విడిచి
పాఱిపోవుట యేటిపౌరుషం బిలను?

---

1. 'చనుదెంచుఁడు' ఇదియసాధువు. 'చనుదెండు' అనియుండవలెను.
2. 'ఘోరకానలు' ఇది అసమంజసము. 'ఘోరకాననముల' ననవలెను.

తరలాక్షి తనకేమి తప్పు గావించె
నురు దుర్గ భూముల నునిచి పోవుటకు?
నలుఁ డిట్టి పాపంబునకుఁ బూను ననుచుఁ
దొలుత నెఱింగినఁ దొయ్యలి నియ్యఁ
దలఁచునే మాభీమధరణీశ్వరుండు?
వలనొప్పఁ దనవంటివాఁ డీవిధంబుఁ
జేసిన నిఁక నేమి సేయంగ వచ్చు.
వాసవాదుల నెల్ల వల దంచుఁ దన్నుఁ
గోరి పెండ్లాడిన కువలయగంధి
నీరీతి సేయంగ నిది కార్య మగునె?
విడిచి పోఁదలఁచిన వెలఁదిఁ దోడ్కొనుచుఁ
దడయక నాలేమ తల్లి యిల్ చేర్చి
పోవలెఁ గాక నీపోల్కిఁ గావించి
పోవచ్చునే యల్పబుద్ధిఁ జింతించి?
పెనిమిటి క్షమియించుఁ బ్రియురాలి తప్పు
లనపరాధిని విడ నగునె రాసుతను?
దైవయత్నంబున దమయంతిదేవి
వావిరిఁ దమతల్లివారి యిల్ సేరె.
వెలఁది నీయడవిలో విడిచితి ననుచుఁ
దలఁపక యున్నాఁడు తపసిచందమున.
కటకటా మది బాయిగాఁ జేసికొనుచు
నెట నున్నవాఁడొకో యెఱుఁగంగనేర
మవనిలోఁ గలిగిన యట్టిదేశంబు
లవలీల గాఁగ మే మరసి వచ్చితిమి.

ఖలుఁడైనఁ గామినిఁ గానలో విడిచి
తలఁగునే? కూర్చిన తరుణినిఁ బాసి
తెలియకయున్నాఁడు ధీరత్వమునను.
ఎలనాఁగ దిన మొక్క యేఁడుగాఁ దన్నుఁ
దలఁచి వర్తించుచుఁ దలఁకుచున్నదియు.
తలితండ్రు లాయింతి తాపంబు చూచి
ఘోరదుఃఖంబునఁ గుందు చున్నారు.
కారుణ్యజలనిధి గాంభీర్యకలితుఁ
డేరీతి నున్నాఁడొ యెట్టియాపదల
బోరన నెచ్చోటఁ బొందుచున్నాఁడొ!'
యని యని తమలోన నడలుచు నుండ
విని ఋతుపర్ణుండు వీక్షించి పలికె
'ధారుణీసురులార తడయక యిట్లు
మాఱుఁగఁ దగదు నిర్దోషుఁ డానలుఁడు.
క్షితిలోనఁ దాము చేసిన పాతకంబు
వెతలఁ బెట్టక పోదు విష్ణువునైన.
ఊరక మీ రెల్ల నూరూరు దిరిగి
యీరీతి వెదకంగ నేల మీ, కనుచుఁ
‘గర మొప్ప నలుని భాగ్యంబునఁ జేసి
తరళాక్షి తమ తల్లిదండ్రులఁ జేరె.
అది యొక్కటే చాలు నాతని కేమి
విదితుఁడై యెంతైన విహరించి యటకుఁ
జనుదెంచుఁ గాక యేచందాన నైన.
చనుఁడు మీ' రనిన నాచంద మంతయును

బాహుకుఁడు దమయంతి సందేశమును నిందించుట.

విని బాహుకుఁడు నవ్వి విప్రుల కపుడు
పనివడి తనకింత పని లేనియట్లు
తను మోవ నీయక తా నొక్కమాట
ననుమానబుద్ధితో నప్పు డిట్లనియె
'నలునిగుణంబు నానలివాయతాక్షి
తెలిసియుఁ దెలియని తెఱఁగున నిల్లు
జననాథచంద్రుల సభలకు మిమ్ముఁ
బనిచి దూఱించెను బాడియే తనకు.
పతివల్ల నేరమి ప్రాప్తించి యున్నఁ
సతి తనయాత్మలో సైరించెనేని
యిహ పర సౌఖ్యంబు లింతికిఁ గల్గు
మహిమీఁద నన మహామానీంద్రు లెల్ల
నిట్టిధర్మము డించి యింతి యాత్మేశు
రట్టు సేయింతురా రాజులయొద్ద ?'
నని యప్పు డామాట లాడిన నానిఁ
గనుఁగొని నవ్వుచుఁ గడువేగ మరలి

బ్రాహ్మణులు విదర్భపురమునకు మరలి వచ్చుట.

రమణ విదర్భపురంబున కరిగి
దమయంతిఁ గనుఁగొని తగ నిట్టు లనిరి
''వినవమ్మ ధర నెల్ల వెదకుచు మరలి
చనుదెంచి ఋతుపర్ణుసభఁ గాంచి యపుడు
దొరసి నీనాథుని దూఱ నచ్చుటను
గఱకు నల్లని రూపు ఘన మైనవాఁడు

కడు భయంకర మైనకన్నులవాఁడు
తడయక గొప్పదంతంబులవాఁడు
సరసత ముదురుమీసంబులవాఁడు
చిఱుతవస్త్రము చేతఁ జెలువైనవాఁడు
నెడఁద యాశిరమున వెలుఁగొందువాఁడు
బడలుచు మెత్తని పలుకులవాఁడు
మముఁ జూచి చూచి 'యామానవేశ్వరుని
క్రమ మెఱుంగక ధరాకాంతుల సభల
నీరీతి దూఱంగ నిది యుక్త మగునె ?
ఆరాజవదన ఘోరాటవిలోన
నడలుచుండఁగ నాతఁ డవి చూడ లేక
విడిచిపోయిన మీరు వెఱ్ఱి సేయుదురె ?
పతివల్ల నేరమి ప్రాప్తించి నపుడు
సతి తనయాత్మలో సైరించెనేని
యిహ పరసౌఖ్యంబు లింతికిఁ గల్గు
మహిమీఁద నన మహామానీంద్రు లెల్ల
నిట్టిధర్మము డించి యింతి యాత్మేశు
రట్టు సేయింతురే రాజులయొద్ద'
నని పల్కి మఱి మాటలాడకయుండె.
విని వచ్చితి మది యెవ్విధ మొకో" యనిన
నతఁడె నలోర్వీశుఁ డని యింతి యెఱిఁగి
హితబుద్ధిఁ దనతండ్రి కి ట్లని పలికె
"నతఁడె నాప్రాణేశుఁ డందు కెంతైన
మతిలోన నా కనుమానంబు లేదు.

రమణతో నాతని రప్పించ నొక్క
[1]క్రమ మెఱిఁగించెద గేలిసేయకుఁడీ.
విరసరూపంబున విభుఁ డిందు రాఁడు
సరసత నలుని భూచక్ర మంతయును
నరసి యెక్కడఁ గాన కాత్మజ కిపుడు
వరుస రెండవ స్వయంవర మని నీవు
ధారుణిలో నయోధ్యాపురీశునకు
నారూఢిగాఁ జెప్ప నతనితోఁగూడఁ
జనుదెంచు నాథుఁ డేచందాననైన
ననవుండు నిది కార్య మా నని మెచ్చి
వరుసతోఁ దనమంత్రి వరులకుఁ జెప్పి
యరుదుగా వారల యనుమతి వడసి
వసుదేవు రప్పించి వసుధేశుఁ డనియె
'వినువ కయోధ్యకు వేంచేసి మీరు
పలుదెఱంగులఁ గాంచి పరికించి చూచి
నలమహీపాలుని నయముగా వెదకఁ
బుత్తెంచి యెక్కడఁ బొడగాన లేక
తత్తనూభవయైన దమయంతి కిపుడు
వరుస రెండవ స్వయంవర మని భీమ
నరపతి చాటించినాఁ డని చెప్పి
చనుదెండు కదలుఁ డీక్షణమున' ననిన
విని బ్రాహ్మణోత్తముల్ వేవేగ పోయి
పరఁగంగ నాఋతుపర్ణునిఁ గాంచి

1. ఇట యతిమైత్రి విచార్యము.

సరగ ని ట్లనిరి యోజగదీశ వినుము

దమయంతి రెండవ స్వయంవరము.

నలమహీశ్వరుని నానాదేశములను
దెలియంగ వెదకి యేదెసఁ గానలేక
గురువుల యనుమతిఁ గూర్మినందనకు
వరుస రెండవస్వయంవరము గావించె.
భూమీశ మా భీమ భూపాలకుండు
ధీమంతు లగుసర్వ దేశాధిపతుల
సొగిదిఁ బిల్వంగ భూసురులను బంపె.
మెఱసి యీకార్యంబు మీ కెఱిఁగింప
వచ్చితి మీస్వయంవరమున కిప్పు
డచ్చుగా వేంచేయుఁ'డని చెప్పి వారు
తరలి వేవేగ విదర్భపురంబు
పఱతెంచి రంత నా[1]బ్రాహ్మలమాట
విని వేగ ఋతుపర్ణవిభుఁడు బాహుకునిఁ
గని ప్రీతిఁ జూచి 'యీకార్య మంతయును
దెలియంగ వింటివే తెఱఁగొప్ప నిదియుఁ
దెలియంగ వలయు నాదెస కేఁగి మనము.
అరదంబునకు మంచి యశ్వరత్నములఁ
దెఱఁగొప్ప నవరించి తెమ్ము పొమ్మనిన
సరగ బాహుకుఁ డశ్వశాలకు నరిగి
సరి లేని కుటియశ్వంబుల నరయ
నరిమురి వార్ష్ణేయుఁ డయ్యెడనుండి

1. 'బ్రాహ్మలు. ఈరూపము విచార్యము.'

యుఱుతరయుక్తి బాహుకున కిట్లనియె
'ఇది యేమి బాహుక యీవు మున్నశ్వ
హృదయ మొఱింగి వీ[1] నేల నేర్పఱప'
ననవుడు బాహుకుం డతని కిట్లనియె
"వినవుగా యొకవింత విశ్వంబులోన
నలరాజుపై భీమనరనాయకుండు
కలవి లేనివి కొన్ని కాఱులు వలికి
'విపినభూములఁ బుత్రి విడువంగఁ దగునె
కుపితాత్ముఁ డని తిట్టి కోపించి వాని
నిలలోన వెదకంగ నేల యటంచుఁ
దలఁచి యాత్మజ యైనదమయంతి కిపుడు
వరుస రెండవస్వయంవరము గావించె.
పోఱిఁబోఱి రాజులుఁ బోవుచున్నారు.
మనరాజుఁ బోవంగ మదిలోనఁ దలఁచి
ఘనరథంబునఁ దురంగముల నేర్పఱిచి
సవరింపు మన్నను సవరింతు' ననుఁడు
వివశుఁడై యాతఁడు వెడఁదకన్నీరు
దొరుఁగ నాబాహుకుతో నిట్టులనియె
'నరలోకనుతుఁడైన నలమహీశ్వరున
కక్కటా యిట్టి మహాపవాదంబు
తక్కక వచ్చె నిద్ధరణిలో నిందు
కేమి సేయఁగ వచ్చు నెవ్వరికైన

1. 'వీనిఁ + ఏల' = వీనేల. ఈసంధిదుష్టము.

నామహానృపతి యెం దరిగెనో కాక
నతని నమ్మినవారి నక్కటా యిట్టి
వెతల నొందఁగఁ జేసె విధిమాయ కాఁడు.
వినుము చెప్పెద నాదు వృత్తాంత మెల్ల
నెనయంగ నలుఁడు న న్నేలినసామి
క్షితితలాధిపు లెల్ల సేవింపఁ దనరు
నతనికి సారథి నై యున్నవాఁడ.
అతఁడు జూదం బాడునట్టికాలమున
నతనిబిడ్డలను భీమావనీశ్వరుని
కడ నిల్పి భూపతిఁ గానంగ లేక
కడు దుఃఖపడుచు నిక్కడ నున్నవాఁడ'
ననవుడు నామాట కాత్మలో వగచి
'వెనుకొని కలి యిట్లు వేధింప నతఁడు
మనము సేసెడిదేమి మాట లేమిటికి?'
ననుచు వార్ష్ణేయుని నప్పు డూరార్చి
యనిలవేగము గల్గినట్టిగుఱ్ఱములఁ
గొనివచ్చి యాదిత్యకోటి తేజంబు
గలయరదంబున గ్రక్కునఁ గట్టి
పొలుపు మీఱిన టెక్కెములు సవరించి
సకలాయుధంబుల సరసత నిల్పి
యకలంక మహిమ నిట్లాయత్తపఱిచి
ధరణీశునకుఁ దెల్పఁ దద్దయు మెచ్చి
యరుదెంచి యప్పు డాయరదంబుఁ జూచి

చతురంగబలము లసంఖ్యముల్ గొలువ
నతి వేడ్క రథమెక్కి యా బాహుకుండు

ఋతుపర్ణుఁడు విదర్భకుఁబోవుట.

నరదంబు నడపింప నరుగుడు నడుమ
నరద మెక్కింతయు నట పోక నిలిచె.
అది చూచి బాహుకు నదలించి నృపతి
'యిదియేమి బాహుక యీ వశ్వహృదయ
మెడరంగ నెఱుఁగుదు నని చెప్పి యిట్టి
బడుగుగుఱ్ఱముల నేర్పఱచి కట్టితివి?
నడచునే శతయోజనంబుల దేశ
మెడము భీముని పురి కీపురంబునకు'
ననవుండు 'భూనాథ యశ్వరత్నంబు
లనిలవేగంబున నరిగెడు చూడు
మినుఁ డస్తశిఖరికి నేఁగక మున్నె
మనము విదర్భకు మఱి పోద' మనుచుఁ
దఱిమె నారథము భూతల మెల్ల వడఁక
నరిగె ఘోరాటవి నధికదూరంబు.
ఈభంగిఁ దారథం బేఁగెడుచోట
నాభూమిపాలకుఁ డాత్మోత్తరీయ
మిలమీఁదఁ బడుటయు నిట్లను విభుఁడు
'నిలుపు బాహుక తేరు నిమిషమాత్రంబు
నవనిపై నుత్తరీయము జాఱిపడియె.
తివిరి నీ వది యెత్తి తెచ్చి యి' మ్మన్న
నవ్విబాహుకుఁడు భూనాథునిఁ జూచి

'యెవ్విధి చేల మేనెత్తి యిత్తు?
నురు వేగమున నొకయోజనదూర
మరిగితి ముత్తరీయము చిక్కు నెట్టు?'
లని పల్కుచును రథ మనిలవేగమునఁ
దనుఁదానె మెచ్చుచుఁ దఱుముచునుండె.
అరసి భూపతి వాని నాత్మలో మెచ్చి
'యరిది బాహుక యిది' యనుచు నిట్లనియె
'విశ్వంబులోపల వెలుఁగొందునట్టి
యశ్వలక్షణముల కధిపతి నీవు.
నిక్కము నామాట నీవంటి వాని
నెక్కడఁ గని విని యెఱుఁగ మెన్నఁడును.
కరమర్థితోఁ దురంగంబులవిధము
నెఱిఁగి యీమర్మంబు నెఱుఁగ లేనైతి.
అరుదైననాకు నీయశ్వలక్షణము
నెఱిఁగింపు నీకొక తెఱఁగింతుఁ జూడు
మల్లదే ముందర నతిరమ్యమైన
పల్లవంబులచేతఁ బ్రబలిన యొక్క
తాడిమ్రా నున్నది దానిలో రెండు
కూడి యున్నవి పెద్దకొమ్మలం దొక్క
కొమ్మకు మూఁడేసి కొమ్మలు గలవు.
కొమ్మకొమ్మకుఁ బువ్వుగుత్తులు రెండు
వెలుఁగుచున్నవి దాని వేళ్లైదు నూఱు

లలరుచున్నవి దాని యమలపత్రములు
[1]వెళుపులై సోగలై వెలుఁగుచున్నవియు.

—(ఋతుపర్ణుని వృక్షహృదయము.)—

ఫలములు కొమ్మకుఁ బదివేలు గలుగు
నది చూచి రమ్ము నే నవనీరుహముల
హృదయం బెఱుంగుదు నీవిద్య నీకు
వినిపింతు నాకు నీవిద్య యొసంగు'
మనవుండు వెఱఁగంది యాబాహుకుండు
నరదంబు డిగ్గి చయ్యన తాడిమ్రాఁకు
నరయంగ నలవిభుం డచటికిఁ జనియె.
అరదంబు ఋతుపర్ణుఁ డట దోడుకొనుచు
నరుగుచునుండె నలావనీనాథుఁ
డాతాటిచెంతకు నతివేగ మరిగి
భూతలాధీశుఁ డప్పుడు చెప్పినట్టు
లుండంగ నంతయు నొనరంగఁ జూచి
నిండు వేడుకతోడ నిలుచున్న నంత

—(నలునకుఁ గలి ప్రత్యక్షమగుట.)—

ధరణీతలేశుని తలనాఁడు పాము
గఱచినవిషమెల్లఁ గలయంగఁ బర్వి
కడఁగి యంతంతకుఁ గమలింప నలుని
యొడలిలోపల నుండ నోరువలేక
బొళుకుబొళుక్కన రక్తమును గ్రక్కుకొనుచు
నలరాజు ముందర నయముగా నిలిచి

1. ఈరూపమును విచార్యము.

కరములు ముకుళించి కలి యిట్టు లనియె
'నరనాథచంద్ర యోనలమానవేంద్ర
యలనాఁడు నన్నుఁ గాదని దమయంతి
వలనొప్ప వరియింప వచ్చునా యనుచు
నెఱుఁగక నినుఁబట్టి యింత కాలంబు
కరకరిఁ జేసితి గర్వంబుతోడ
నీసత్య సంపద నెమ్మితో నాకు
వాసవుం డప్పుడే వర్ణించి చెప్పె
అవనీతలేశ నే నదియును వినక
కువలయాక్షిని నిన్ను ఘోరాటవులకు
నెడఁబాపి చొరరాని యిడుమలఁ బఱపి
కడుఁదప్పుఁ జేసితిఁ గరుణింపు నన్నుఁ
దరుణి పతివ్రతాధర్మ మింతైన
నెఱుఁగక మిముఁబట్టి యింతఁ జేసితిని.
ధరణీతలేశ యాతప్పులు మఱచి
కరుణింపవే నన్నుఁ గమలాప్తకులజ
సరసత నీసత్యసంపద కిపుడు
వెఱచి నిన్నభయంబు వేఁడుచున్నాఁడ.
నల నీవు ఋతుపర్ణనరనాథుచెంతఁ
గలఁగుచుఁ గాలంబుఁ గడపుచునుండు
కొఱఁగి యాదమయంతి యీవు వచ్చుటకు
వరుస రెండవస్వయంవర మని తెలిపె.
అదియుఁ దప్పనుచు నీయాత్మలో నిడకు.
మదిరాక్షిఁ గైకొన మహితసంపదలు

వరునతో నెప్పటివలె వచ్చు నిన్నుఁ
గఱచినపాముచేఁ గైకొన్నకోక
ధరియించినప్పుడే తనరు నీరూపు.
వర మిత్త్ర నడుగుము వసుధేశ' యనినఁ
బుడమిఱేఁ డప్పుడు భువిఁ జాఁగి మ్రొక్కి
కడుభక్తి మీఱ నాకలికిట్టులనియె
'కలిదేవ సకలలోకముల నీవంటి
బలవంత మైనదైవము లేదు దెలియ
నది గాన లోకత్రయమున నాపేరు
విదితంబు గావించి విఖ్యాతి నించి
చిరకీర్తి నొందంగఁ జేసితి వరసి.
కరుణతో నీయుపకారంబునకును
గడఁగి యేప్రత్యుపకారంబుఁ జేతు.
తడయక యిది యేనుఁ దలఁపులోపలను
మఱవక తలఁతు సమ్మదమున నొక్క
వర మిమ్ము యిది నీకు వరుసఁ జెప్పెదను.
వినుఁడు ధారుణి నలోర్వీవిభుఁ డంచు
నన్నుఁ దలంచెడునట్టి నరులఁ జేరకుమి.
సరసత నెపుడు నాచరిత మెవ్వారు
వరుసఁ జెప్పుదు రట్టివారిఁ జేరకుమి.
వరభక్తిచే వినువారిఁ జేరకుమి.
పరమాస్థ వ్రాసినవారిఁ జేరకుమి
మసల కెప్పుడు తాడి మ్రానున నీవు
వసియింపుచుండు మీవరము దక్కఁగను

వరునతో నింకొక్క వర మొల్ల నిపుడు.
కరుణాత్మ నీపాదకమలంబు లాన'
యనవుడు 'భూనాథ యాలాగె సేతు'
నని తాటిమ్రానున నాకలి నిలిచె.
మనుజేశ యాతాటి మ్రానున నెప్పు
డానరంగ నాకలి యుండుటఁ జేసి
ధరణీసురుల్ చూచి తలఁగిపోవుదురు
నరనాథుఁ డైన యానలుని మేనెల్లఁ
జలుకనై యుంటకుఁ జోద్యంబు నొంది
కలికి మ్రొక్కి యనుజ్ఞ గైకొని మరలి
యాఋతుపర్ణుని యరదంబు నెక్కి
యారసి వచ్చిన నాతాడి మ్రాను
చందంబుఁ జెప్పి యాజననాథుచేత
నందంద తరుహృదయంబు నెఱింగి
యరుదారఁ దనయశ్వహృదయంబు నతని
కెఱిఁగించి యరద మాయతముగా నడిపి
పరువడి నావిదర్భపురంబు చెంత

నలుఁడు విదర్భను జేరుట.

కరుగంగ నంతంత నారథధ్వనిని
దమయంతి వినుచు మోదంబునఁ జెంది
క్రమమున నవహేమఖచిత మైనట్టి
ఘనమైన సౌధంబు గ్రక్కున నెక్కి
యనుపమగతి వచ్చునరదంబుఁ జూచి
యిట్టివేగంబున నీతేరు నడుప

గట్టిగా నలమహీకాంతుఁడు గాక
నితరులచేతఁ గా వీనేర్పు'లనుచు
మతిలోనఁ దలఁచి ప్రేమంబున మున్ను
మును లానతిచ్చిన మూఁడువత్సరము
లనుపమగతి నేఁటి కవి పూర్ణమయ్యె'
నని తండ్రికడకుఁ జయ్యన నేఁగుదెంచి
పనిఁబూని యాఋతుపర్ణుని తేరుఁ
గడపఁగా సూతుఁడై గాడ్పువేగమున
వడిగ నీయల్లుఁడు వచ్చుచున్నాఁడు.
బోరన నెదురుగాఁ బోయి నీ విపుడు
వారక తోడ్కొని వచ్చి వారలకు
విడిదిఁ జూపు మటన్న విని భీమనృపతి
తడయక యపు డమాత్యగణంబుతోడ
నెదురేఁగి వారల నెలమిఁ దోడ్కొనుచు
విదితమై యొప్పిన విడిదిఁ జూపుటయు
ఋతుపర్ణుఁ డప్పు డారూఢమోదమున
వితతసంపద నొప్పు విడిదిని దిగియె.
భీముఁ డంతట వచ్చి ప్రియతనూజాత
కామాట లెఱిఁగింప నతివ మోదించి
తనచెలికత్తెలఁ దప్పక చూచి
'చని మీరు ఋతుపర్ణుసారథిఁ గాంచి
నలినాక్షులార నానాయకుం డతఁడు
నలుఁడు దుర్వేషంబు నయముగాఁ దాల్చి
చనుదెంచె నిటకు నెచ్చట నున్నవాఁడొ.

పనిఁబూని యతనిఁ దప్పక మీరు వెదకి
కని మాటలాడి వేగమె రం' డటంచు

దమయంతిచెలికత్తెలు నలునితో సంభాషించుట.

ననిచిన జలజాక్షు లాఋతుపర్ణు
విడిదికి నరిగి యా[1] వెడరూపధరుని
పొడగానలేక యప్పుడె యింటివారిఁ
గనుఁగొని 'యాధరాకాంతుని యరద
మనురక్తి నడపెడి యతనిరూపంబు
చూడ వచ్చితిమి యాశూరుఁ డెచ్చోట
వేడుక నున్నాఁడొ వినిపింపుఁ డనిన
'వాఁ డదె వంటలు వండుచున్నాఁడు.
చూడు పొం' డనిన నాసుదతులు పోయి
వెడరూపధరుఁ గాంచి వికవిక నవ్వి
తడయక వారి లాతని కిట్టు లనిరి.
'ఈయెడ కేతెంచి యెన్నివత్సరము
లాయె నీనామ మేమంగురు మున్ను.
నలుఁడవు గావె యీయవరనాథునొద్ద
నలమహీనాథుఁ డున్నాఁ డంచుఁ జెప్ప
విని భీమభూపాలవిభుఁడు పుత్రికకుఁ
బెనుపొంద రెండవపెండ్లిఁ గావింతు
ననుచు నూరక యయోధ్యా పురీశునకు
వినిపించె నలమహీ విభుఁడు వచ్చుటకు.

---

1. వెడరూప=వికారరూపము.

ఇంతయే కాని యేనృపునకు నైన
నింతయు వినిపింపఁ డీస్వయంవరము.
ఇట్టి వేషముఁ దాల్చి యీరాజమహా
నెట్టనఁ గొలువగా నీ కేల నయ్య?
ఇటువంటి రూపు నీ కేలాగు గలిగె?
తటుకున నిన్ను మాదమయంతి వేగ
తోడుక రమ్మని [1]తోఁతెంచె మమ్ము.
వేడుక నిప్పుడు వేంచేయరయ్య
విపినంబులో నీవు విడినది మొదలు
విపులదుఃఖంబున వేఁగుచున్నదియు.
చెలు వెల్లఁ దక్కి నీశిశువు లిద్దఱును
గలఁగుచున్నారు శోకంబున నిపుడు.
దమయంతి పడుఘోరతాప మంతయును
క్రమముతోఁ జెప్పెదఁ గరుణతో వినుము.
కుడువక కట్టక ఘోరదుఃఖములఁ
బడుచు నేవేళ నీపాదపద్మములఁ
దలఁపుచుఁ దనలోనఁ దల్లడింపుచును
నెలమి నీరాకకు నెదురు చూచుచును
నున్నది మీమామ యొక్కనాఁడైన
నన్నంబు రుచిమీఁద నారగింపండు.
కొలువున నుండక కుందుచున్నాఁడు.
తలఁపులోపల నీవు దమయంతి నింతఁ
దలఁపక బిడ్డలఁ దలఁపక యిట్టి

1. ఇందులకు 'పంపె' నని యర్థము విచార్యము.

బలు వైననిరసరూపమున నున్నావు.
రయమున మది నీవు ఱాయిచేసికొని
దయ లేక యిట్లుండఁ దగునయ్య నీకు?
పడఁతికి రెండవపరిణయం బనుచు
నడర భీముఁడు చెప్పె నని తలంపకుము.
నీవు రావలె నంచు నెమ్మి నీరాజు
నీవిధిఁ జెప్పించె నింతియె కాని
కుతలేశ నీమీఁదఁ గోపంబు కాదు.
హిత వొంద మా వెంట నిపుడు రమ్మనిన
విని ధరాకాంతుండు వెలఁదుల నపుడు
గని నవ్వి తెలియనిగతి నిట్లు బలికె
'పోపొండు మఱి యేటిబుద్ధులు మీకుఁ
బ్రాపించె నను జూచి భ్రమనొందినారొ!
నలుఁడు నలుం డని నయముగా నన్నుఁ
బలికెద రిట్టిరూపంబున నలుఁడు
నుండునే యిట్లాడ నుచితంబు గాదు.
పొం డింక నిద్దుండఁ బోలదు మీకు
నలుఁ డేడ నేనేడ నాతి నన్నేల
పిలువ నంపెను నాదు పేరు బాహుకుఁడు.
వాయెత్తి నెఱతు నే వంటలవాఁడ
నై యుందు ఋతుపర్ణ నడుగుఁడు మీరు.
నలుఁడు లేఁడంచు మీనలినాక్షి దొరల
నెలమితోఁ బిలిపించె నిఁక నేటి నలుఁడు.
వానిఁ దలంపఁగా వల దింక నిపుడు.

నానలే కతఁ డేల నగరికి వచ్చు?
విపినంబులోపల విడిచిన విభుని
నిపు డేల దలఁచు మీ యిందీవరాక్షి?
ఈరాజువర్తనం బెల్ల మీ యింతి
యారసి రమ్మన్న నటఁ బోక మీరు
వల నొప్ప నిట కేల వచ్చితి రిపుడు?
బలవంతుఁ డగుఋతుపర్ణు వరించి
సంతోషమునను మీ చందనగంధి
యెంతయు మది సుఖయించును గాక
యీరీతి నగడు సేయింపంగఁ దగునె?
యోరాజముఖులార యూరక నేను
బలికితి నని తప్పుఁ బట్టకుఁ డింక
నలుఁడు నేఁ గాను మీ నాతిదగ్గఱకు
నరుగుఁడు మీ'రన్న నతివ లిట్లనిరి.
'మఱుఁగు గా నిటువంటిమాటలు పల్కఁ
దలఁతు రా యిటువంటి తప్పులు మఱవు.
సొలయక బిడ్డలఁ జూడంగవలదె
నలుఁడఁ గా నంచు మానక మీర లిట్లు
పలుకంగఁ దగు నయ్య పార్థివనాథ
[1]ఋతుపర్ణుకడ మాఱురూపంబుతోడ
నతివేడ్క సారథివై నీవు కొల్చి
యున్నా వటంచు మాయువిదతో మునులు

1. 'ఋ' కు యతిస్థానమున 'రు' పెట్టుట విచార్యము. ఇట్లు రెండు మూఁడుచోట్లఁ బెట్టఁబడియున్నది.

పన్నుగా మున్ను నేర్పడఁ జెప్పి రంచుఁ
దొయ్యలి తమతండ్రితోఁ జెప్ప నతఁడు
చయ్యన మీర లిచ్చటికి వచ్చుటకు
దమయంతి వల దన్నఁ దా నది వినక
ప్రముదితమతిని నెపమ్ము గల్పించి
యీ ఋతుపర్ణుని నిటకు రప్పించె.
ధారుణీశ్వర నీకుఁ దప్పయ్యె నిదియు
ఇరవంద దమయంతిహృదయంబు నీవు
నెఱిఁగియు నిటువంటి యెడ మాటలాడ
వల' దంచుఁ జెప్పి యవ్వనిత లందఱును
గలకంఠి దమయంతికడ కేఁగుదెంచి
యతఁడు సెప్పినయట్టి యాచంద మెల్ల
నతివేడ్కతోఁ జెప్ప నాదమయంతి
యతఁడె నలుం డని యాత్మలో నెఱిఁగి
మతిలోన సంతోషమగ్న యై యప్పు
డతివలఁ జూచి మీ రచ్చటి కేఁగి
'యతఁడు వండినయట్టి యన్నంబు కూర
లొకయింతఁ గైకొని యొయ్యన రండు.
అకలంకమతితోడ' నని చెప్పి పంపె.
వారలుఁ జనుదెంచి వంటలవాని
బోరనఁ జూచి 'యోపుణ్యాత్మ యిపుడు
వారక మఱి నీవు వండినయట్టి
కూర కూ డొకయింతఁ గొని రం డటంచు
దమయంతి మముఁ బంచె దయసేయు మింత.

విమలాత్మ నీమది వేసారఁ గూడ
దడరంగ నలుఁడఁ గాదన్నను నిన్ను
విడువ మీవేళ నేవెరవున నైన.
గట్టిగా నినుఁ బట్టి కడఁగి మాయింటి
కిట్టె కొంపోయెద మిది కల్ల గాదు.
పడఁతు లీగతి నన్నుఁ బల్కి రటంచుఁ
బుడమినాయక చిత్తమున నుంచ వలదు.
పరఁగ నీవును మాకు బావవు గాన
సరస మాడితిమి ముచ్చట దీర' ననుడుఁ
జిఱునవ్వు నవ్వి మచ్చికఁ బైఁడిగిన్నెఁ
బరమాన్న మిడి మంచిపస గల కూర
పెట్టి వారల నెల్ల బెదరించి తఱుమ
నెట్టనఁ జనుదెంచి నీరజాననలు
పరమాన్న శాకముల్ భైమి కొసంగ
నిరువుర బిడ్డల కింత యొసంగి
పొరిఁబొరిఁ దా నింత భుజియించి మెచ్చి
తరుణుల కొకయింత తగఁ బంచి పెట్టి
పరఁగ నీగతి రుచిపాకంబు సేయఁ
దరుణులకైనను దరముగా దిట్టు
లెక్కడ నేర్చెనో యిటువంటివంట
లక్కజంబుగ వండె నవనీత లేశుఁ
డక్కటా యిట్లు సేయంగ నాకలికిఁ
దక్కక మే మేమి తప్పుఁ జేసితిమొ'
యని పల్కి యంతుల నపుడు వీక్షించి

పెను పొంద నిఁక మీరు బిడ్డల నతని
కడకుఁ దోడుక పొందు గ్రక్కున' ననినఁ

దమయంతి నలునికడకు బిడ్డలనంపుట.

బడతు లాసతితనూభవను దనూజు
నిరువుర నాతని యెడకుఁ గొంపోవఁ
బరువడి బిడ్డల భావించి చూచి
జననాథుఁ డాత్మలోఁ జాలఁ జింతించి
యెనయంగ బిడ్డల నెత్తి లాలించి
యక్కునఁ గదియించి యాదలల్ నిమిరి
చెక్కిలి నొక్కి మచ్చిక ముద్దువెట్టి
తొడలపై నిడుకొని దుఃఖంపు చుండఁ
బడఁతు లిట్లనిరి 'యోపావన చరిత
యేమిటి కేడ్చెద వింతలో నీవు
వేమాఱు నలమహా విభుఁడను నేను
గాదంచు బిడ్డలఁ గనుఁగొని యిప్పు
డాదరంబున నెత్తి యాందంద మదిని
శోకింపుచున్నావు సుముఖత మేము
ప్రాకటంబుగ మిమ్ముఁ బ్రార్థించి తెలియ
నడిగిన నలుఁడ నేనని చెప్పరాదె?
తడయక యింతలో దాఁచితే నిన్ను
నలుఁడని యెఱుఁగమే నరనాథ చంద్ర
బలు నైనవిరసరూపముఁ దాల్చి యుండి'
ననవుడు వారితో నాతఁ డిట్లనియె
'వనజాక్షులార యీవడువున నాకుఁ

పెనుపొంద నిద్దఱుబిడ్డలు గలరు.
మునుకొని యిట వచ్చి మూఁడువత్సరము
లాయె నాబిడ్డల నతివను జూడఁ
బోయి వచ్చెద నన్నఁ బోఁగూడ దిప్పు
డనయ నీబిడ్డల నిద్దఱఁ దెలియఁ
గనుఁగొన్న యంత దుఃఖము వచ్చె నాకు.
నీముద్దుబిడ్డల నెత్తుక మీరు
తామసించక పొండు తల్లి దగ్గఱికి'
ననిన బిడ్డలఁ గొంచు నాయిందుముఖులు
చని చని దమయంతి సంగడి నిల్పి
యతఁడు బిడ్డలఁ జూచి యాత్మ లోనప్పు
డతిదుఃఖ మొందిన యలమటఁ దెలుప
విని తండ్రి నచటికి వేగ రప్పించి
యెనయంగ దమయంతి యిట్లని పలికె
'నావిభుచందమంతయుఁ దలోదరులు
భావించి యిప్పుడు పఱతెంచినారు.
ప్రియ మొప్ప నాతనిఁ బిలిపింపు' మనిన
రయమున నాభీమరాజేంద్రుఁ డొక్క
ధరణీసురునిఁ బిల్చి తగ గారవించి
'పరువడి నాఋతుపర్ణునికడకుఁ
జని నీవు నీరథసారథిఁ జూడ
ననురక్తిఁ బుట్టి భీమావనీశ్వరుఁడు
వెలయ నీ కాఱఁగించి వెడరూపధరుని
నలరంగఁ దోడి తెమ్మనె నని పలికి

యతనియనుజ్ఞ నీయంత నిచ్చటికి
నతివేగ తోడి తెమ్మనిన' నావిప్రుఁ
డరిగి యానరపతి కవ్విధం బెల్ల
వెరవొప్పఁ దెలిపిన విని ఋతుపర్ణుఁ
'డిది యేమి చిత్రమో యెఱుఁగంగరాదు.
పదపడి రెండవపరిణయం బనుచుఁ
బిలిపించె నన్ను నీభీమభూపాలుఁ
డెలమి భూపతు లెవ్వ రిందు రారైరి'
యని పల్కి బాహుకు నపుడు రప్పించి
'పెనుపొంద భీముండు పిలిపించె నిన్ను.

భీముఁడు నలుని దమయంతికడకు రప్పించుట.

సరగునఁ బోయి యచ్చటి కార్య మెల్ల
నెఱిఁగి రమ్మన భూసురేశుని వెంటఁ
జనియె భీమునిఁ జూడ [1]సత్రపుఁ డగుచుఁ
బనిఁ బూని నిషధభూపాలశేఖరుఁడు.
సరగున నా భీమజననాయకుండు
పఱతెంచి యట నొక్కబంగారుపీఁట
పెట్టించి యాతని బిగికౌఁగిలించి
పట్టి 'కూర్చుండుము పార్థివ' యనిన
విని నవ్వి భీమభూవిభుఁ జూచి నలుఁడు
'ఘనమైన దొరవు లోకమున నీ విప్పు
డొకరాజుఁ గొల్చినయాఁడిగం బేను.
అకలంక మైనసింహాసనం బెక్క

1. సిగ్గుతోఁ గూడినవాఁడు.

వసుధేశ నీయంత వానికిఁ గాక
పొసఁగునే నావంటిపుణ్యహీనునకు?
ఇంపుతో మీరు న న్నిప్పుడు పిల్వ
నంపినపని యెల్ల నాసతీవలయు'
నని పల్కుచుండఁగా నాదమయంతి
చనుదెంచి యాతనిచందరంబుఁ జూచి
యురుదంది కుంది హాయని యేడ్చుచుండ
ధరణీతలేశుఁ డాదమయంతిఁ జూచి
'యిందీవరాక్షి నీవేల యేడ్చెదవు?
పొందుగా నీభీమ భూపతి నీకు
భావింప రెండవ పరిణయం బిపుడు
గావించు నింతలోఁ గళవళ పడుచుఁ
గలఁగంగ నేల భూకాంతు లందఱును
వలనొప్ప నిచటికి వచ్చుచున్నారు.
జలజాక్షి నీమది సరిపోవు నతని
నలరంగ మఱి పెండ్లియాడుదుగాక.
నాఁ డరణ్యంబుల నలుఁడు ని న్నొంటి
వీడిన నీకు నావిభునిపొం దేల?'
యని నిష్ఠురోక్తుల నాడిన వాని

భీముఁడును దమయంతియు నలునిఁ బ్రసన్నుఁడగుటకు వేఁడుట.

విని భీముఁ డాతని వీక్షించి పలికె
'భూమీశ నే నంతబుద్ధిహీనుఁడనె
ఈమాట నుడువ ని న్నిటకు రప్పింప
వలసి నే నిట్టి దుర్వార్తఁ బల్కితిని.

నలమహీనాయక నను దయఁజూడు'
మని వేఁడుచుండ నయ్యవనీశుఁ డనియె
'నను నలుం డని పల్క నాయమా నీకు
నెఱుఁగవే నలుని నీ వి ప్పుడు బ్రమసి
మఱి పల్కుచున్నావు మానవాధీశ.
పో పొమ్ము పెద్దలై బుద్ధులు లేవె.
నీ పుత్రి యైన యీనీలాభ్రవేణి
ననుఁ బెండ్లియాడెనె నలి రేఁగి మున్ను?
ఎనయ నీ వేగతి నిచ్చితి విట్లు
బలు వైనవికృతరూపము గలవాని
కలరంగ నాకును నాదయంతి'
నని పల్కె దమయంతి నప్పుడు చూచి
'వనజాక్షి నను నీవు వరియించినావె?
తన పతి నెఱుఁగనితరుణియుఁ గలదె!
నను నలుం డని పల్క నగరె లోకములఁ
గనకాంగి నలుఁడ నేఁ గాదని' పల్క
విని దమయంతి యావిభుఁ జీర వచ్చి
యతఁడు గట్టిన యట్టి యాకోకఁ జూచి
మతి నీతఁడే తనమగఁ డని యెఱిఁగి
పనవుచు నలమహీపాలునిపాద
వనరుహంబులమీఁద వ్రాలి యేడ్చుచును
'రూపకందర్ప యీరూపంబు నీకుఁ
బ్రాపించెనే నాదు పాప మెట్టిదియొ!
నీరూపవిభవంబు నీవిలాసంబు

నీరాజతేజంబు నీప్రతాపంబు
నీరాజ్యభోగంబు నీమహత్త్వంబు
నీరసికత్వంబు నీరాజసంబు
నెక్కడఁ బోయెనో యెక్కడ నణఁగె?
ఎక్కడ దాఁచితి ఖిషకులాధీశ'
యని యని శోకింప నమ్మహీవిభుఁడు
తనదేవి శోకమంతయుఁ జూడ లేక
నెలుఁగెత్తి హాయని యేడ్చె నేడ్పుటయుఁ
దలకొని దమయంతి తల్లియుఁ దండ్రి
దమనుండు దాదు లందఱు నొక్కరీతి
బ్రమసినగతి విలాపమునొంద నలుఁడు
తనశోక మడఁచి యాదమయంతిఁ జూచి
'విను కలిమాయ నీవిధ మయ్యె నిన్ను
విపినభూములలోను విడిచి పోయినను
విపులాధిపతులకు వినరానిమాట
పలుకవచ్చునె యెంతపని వచ్చి యున్న
నిలలోన నీమాట హీనంబు గాదె'
నావుడు 'భూనాథ నాచిత్తశుద్ధి
నీ వెఱుంగవె నేను నిన్నుఁ గాదనుచుఁ
బలికితి నేని నాపంతంబు వినుము.
ఎలమి భూనభములు నింద్రాది సురలు
ననఘాత్ము లగుమునుల్ హరిహరబ్రహ్మ
లిన చంద్రు లెఱుఁగంగ నీవు మెచ్చంగ
ననలంబుఁ జొచ్చెద' ననుచు నలుండు

విని 'యట్లు గావింపు వెలఁది' యటన్న
దమయంతి యాతల్లి తండ్రులఁ జూచి
'క్రమమున ననలంబు గావింపుఁ' డనిన

దమయంతి యగ్నిప్రవేశముచేఁ దనపాతివ్రత్యము చూపించుట.

విని భీమభూపతి వేవేగ మంత్రి
జనుల కాజ్ఞాపింపఁ జయ్యన వారు
కనుఁగొనువార లక్కజ మొంది వగవ
ననలకుండమును నెయ్యమునఁ గావింప
భగభగ మండెడు పావక శిఖలు
జగమెల్ల వెలుఁగ నాశ్చర్యమై యుండె.
అప్పుడు దమయంతి యాత్మేశుకడకుఁ
దప్పక వచ్చి యాదహనునిఁ గాంచి
తనపతి పాదపద్మములకు మ్రొక్కి
ఘనభక్తి మీఱంగఁ గరములు మొగిచి
చేరి యగ్నికిఁ బ్రదక్షిణముగా వచ్చి
'నారుల కిది ప్రమాణం' బని పలికి
'యోపావక మహాత్మ యోదయాంబోధి
శ్రీపతి సాక్షిగా జీవితేశునకుఁ
దప్పి వాకునను జిత్తమునఁ గర్మమున
నొప్పని పనుల నే నూహించితేని
ప్రాకటంబుగ నన్నుఁ బట్టి దహింపు.
లేకున్న నన్నుఁ బాలింపవే' యంచుఁ
జెలువైన కలహంస చెంగల్వ కొలను
వలనొప్పఁ జొచ్చిన వడువునఁ జిచ్చుఁ

జొచ్చిన దివి నున్న సురలది చూచి
యచ్చుగా మఱి యప్పు డలరుల వాన
లందులఁ గురియించు నప్పు డాయగ్ని
చంద మంతయు మాని చల్లనై యుండె.

నలునకుఁ విష్ణువు దేవగణముతోఁ బ్రత్యక్షమగుట.

ఆవేళ మోదించి యా రమావిభుఁడు
వేవేగ పులుఁగులవిభునిపై నెక్కి
కరముల శంఖచక్రంబులు దాల్చి
యురమున నిందిర నుంచి బంగారు
వన్నెదుప్పటి మీఁద వైచి నెన్నుదుటఁ
దిన్నగాఁ గస్తూరితిలకంబు దీర్చి
మకరకుండలములు మహిమతోఁ దాల్చి
యకలంకమణిమయం బగుకిరీటంబు
సవరించి వన్నెభూషణములు పెట్టి
యవిరళ దివ్యమాల్యములు ధరించి
యింద్రాదిదేవత లెల్ల మోదమున
సాంద్రసైన్యములఁ బార్శ్వముల నేతేర
వనజాసనుండు కైవారంబు సేయ
నినచంద్రు లక్షులై యిరుపార్శ్వములను
రయ గతి నడచి బరాబరుల్ సేయ
నయముగాఁ దుంబురు నారదాదులును
బంతగింపుచు మేటి పాటలు పాడ
వింతగాఁ బదివేలవేల్పులు గొల్వ
సనక సనందనుల్ సన్నుతి సేయ

ననురక్తితో ధవళాతపత్రములు
పనిఁబూని వెంట దిక్పతులు గ్రహించి
చనుదేరఁ గింకరజనులు సేవింపఁ
గారుణ్య మలర నీగతి వచ్చి నిషధ
ధారుణీపతికిఁ బ్రత్యక్షమై నిలిచె
నిలిచినఁ గనుఁగొని నెమ్మది నలుఁడు
చెలఁగి చేతులుమోడ్చి శ్రీహరి కనియె

నలుఁడు విష్ణునిస్తుతించుట.

"జయ పుండరీకాక్ష జయ రమావక్ష
జయ దైత్యకులశిక్ష జయ భక్తరక్ష
జయ కరుణాపాంగ జయ మాని సంగ
జయ సురవినుతాంగ జయ పాపభంగ
జయ సకలాధార జయ కీర్తిహార
జయ నిత్యశృంగార జయ మహోదార
మునులందు సురలందు ముక్కంటియందు
జనులందు నీ కేడు జగములయందు
నగములయందుఁ గాననములయందు
నిగమంబులందుఁ బానీయములందుఁ
గమలజునందు సాగరములయందుఁ
గమలమిత్రునియందుఁ గమలారియందు
సర్వశాస్త్రములందు సర్వంబునందు
సర్వమయుండవై సంచరింపుదువు
గావున నీపాదకమలముల్ నాకు
సేవింపఁగా దయ సేసితి విభుఁడ.

కరుణాత్మ నాదు భాగ్యంబున మీరు
చిరలీల నన్ను రక్షింపంగఁ దలఁచి
వేడుక లలరంగ వేంచేసినారు.
పోఁడిమి నే మహా పుణ్యుండ నైతి.
కమలాక్ష నాభాగ్యగరిమ యెట్టిదియొ!
విమలతపం బెల్ల వెలయ ఫలించె'
నని సన్నుతులు సేయ నావిష్ణుమూర్తి
విని సంతసించి యావిభున కిట్లనియె
'నలరాజ నీనెమ్మనము గాన లేక
కలి యంటి మి మ్మింతకష్ట మొందించె.
కరకరిఁ జేసెను గర్వంబుచేత.
నరనాథ ఘోర కానన భూమిలోనఁ
బడఁతియు నీవును బడలితి రకట!
యడవులనైన గేహంబులనైన
నెఱిఁ జరించెడి వేళ నీమీఁదిభక్తి
మఱవదు దమయంతి మహిమచే నొప్ప
నట్టి [1]గుణావతి నట్టిసుశీల
నట్టి పుణ్యాంగన నక్కటా నీవ
యీచిచ్చు చొరు మని యెట్లు చూసితివి
ఈచంద్రముఖి మన సెఱుఁగనియట్లు!
భూనాథ మును నీకు భుజగవల్లభుఁడు
మానుగా నిచ్చిన మహితాంబరంబు
ధరియించి నీరూపు తరుణికిఁ జూపు.

1. 'గుణవతి' యనుట సమంజసము.

కేరలి నీపగతుని గెల్చి రాజ్యంబు
సంపదఁ గైకొని జనులఁ బాలింపు
మింపార నడుగు నీ కే వరంబైన
నిచ్చెద' నన నలుం డిచ్చ నుప్పొంగి
యచ్చుగా నెన్నుచు ననియె శ్రీపతికి
'బరమాత్మ నీపాదపద్మంబు లేను
నురుభక్తి సేవించుచుండు నీరాజ్య
సుఖము లింతే చాలు సుదతితోఁ గూడ
నఖిలేశ నినుఁ గొల్చి యలరుచు నెంట
నే తెంతు నీవరం బిచ్చి రక్షింపు
మోతండ్రి యిందుండ నోప మీయాన'
యనవుండు మోదించి యావాసుదేవుఁ
డినకులాధిపునకు నిట్లని పలికె
'జననాథచంద్ర యీజనలోక మెల్ల
ఘనతతో నిట కొంతకాలంబు నేలు
మటమీఁద నీవు స్వర్గాదిభోగములు
తటుకునఁ బొందెదు తరుణితోఁ గూడ.
లక్షణాకార నీలావణ్య మిపుడు
వీక్షింపవలె' నన్న విని నలుం డపుడు
భుజగేంద్రుఁ డిచ్చినపుట్టంబు గట్టి
నిజరూపు ధరియించె నెమ్మి నలుండు.
దివినుండి ఘోషించె దేవదుందుభులు.
ప్రవిమల నృత్యముల్ పరఁగె గీతములు.

క్షీరసాగరపుత్రి శృంగారగాత్రి

శ్రీదేవి సాక్షాత్కరించుట.

సారంగనిభవేణి సైకతశ్రోణి
సకలజగన్మాత సద్గుణోపేత
శుకవాహనునితల్లి శుభకల్పవల్లి
యగునిందిరాదేవి యాదమయంతి
నగుమోముతోడ మన్ననఁ గౌఁగిలించి
తిలకించి 'నీసుపాతివ్రత్యమహిమ
కలకంఠి సకలలోకమ్ముల నిండె.
నీవంటిగుణవతి నిఖిలలోకముల
నేవిధిఁ గని విని యెఱుఁగ మెన్నఁడును.
పెక్కుకాలంబులు ప్రియుఁడును నీవు
మక్కువ సకలసామ్రాజ్య వైభవము
లనుభవించుచునుండుఁ డటమీఁద మీరు
ఘనలీల స్వర్గభోగములు ప్రాపించు'
నని యూరడించిన నాదమయంతి
మనమున హర్షించె మాధవుఁడంత
ధరణీతలేశుని దమయంతి నపుడు
కరుణతో దీవించి కమలతోఁగూడ
హర పద్మజాది మహాత్ములు గొల్వ
[1]దర మూఁడి పరమపదంబున కరిగె.
అంతట నలుఁడు పూర్వాకృతిఁ బొదలి
సంతసం బలర నచ్చట నున్నయట్టి

1. దరము=శంఖము.

గురుగుణోన్నతుఁ గులగురువు వసిష్ఠు
వరభక్తి వలగొని వచ్చి కేల్మోగిచి
వేవేలతెఱఁగుల వినుతు లొనర్చి
సేవింప నలరి వసిష్ఠుఁ డిట్లనియె.
'జననాథ నీసత్యసంపద కలరి
ఘనతరం బగురమాకాంతుఁ డేతెంచె.
ప్రత్యక్షమయ్యె నీభాగ్యమూలమున.
సత్యమే ధర్మము సత్యమే జయము.
సత్యమే పెన్నిధి సత్యమే కలిమి.
సత్యంబు గలిగినఁ జాలు వేయేల.
అటుగాన నీకీర్తి యఖిలలోకములఁ
బటుతరంబుగ నిండి ప్రబలెను మఱియు
వసుధలో మావంటివారికి నెల్ల
వసుమతీ నాయక వన్నె దెచ్చితివి.
ఇది యొక్కటే చాలు నిఁక మాటలేల.
పొదలిన వేడ్కతోఁ బుష్కరాధిపుని
నవలీల గెల్చి యీయవని యంతయును
ప్రవిమలగతితోడఁ బాలింపు' మనియె.
అప్పుడు ఋతుపర్ణుఁ డరుదెంచి నలునిఁ
దప్పక కనుఁగొనిఁ ధరఁ జాఁగి మ్రొక్కి
'యినకులాధీశ నిన్నెఱుఁగంగ లేక
మునుకొని నీచేత మ్రొక్కు లందితిని.
నీమహామహిమ వర్ణింప నావంటి
సామాన్యు లగువారు చాలరు ధాత్రి.

నీదివ్యమహిమచే నీరజోదరుని
పాదాబ్జములు చూచి ప్రణుతింపఁ గలిగె.
తనర నే నందున ధన్యుండ నైతి.
మనుజేశ యాతప్పు మన్నించి నన్నుఁ
గరుణ నీబంటుగాఁ గాచి కొ' మ్మనిన
నరనాథుఁడైన యానలచక్రవర్తి
వెరవొప్ప ఋతుపర్ణు వీక్షించి పలికె
'ధరణీశ కలిమాయఁ దగిలి నీయొద్ద
నిలిచిన మూఁడేండ్లు నెమ్మి సౌఖ్యములు
కలిగించి ప్రోచితి కరుణతో నన్ను.
నీవు పుణ్యుండవు నీవు ధన్యుఁడవు.
కావున నిను గొల్వఁ గలిగె భాగ్యములు.
వసుధేశ నీ విందు వచ్చుటఁ జేసి
యసదృశ కోటిసూర్య ప్రభా పటల
కలితుఁ డౌహరిఁ జూడఁ గలిగె సత్కీర్తి
వెలసె సామాన్యుండ వే నీ' వటన్న
విని ఋతుపర్ణుండు విభునకు మ్రొక్కి
తనబలంబును గొని తన పురి కరిగె.
దమయంతిని గుమారుఁ దనయ నూరార్చి
క్రమమునఁ బౌరలి సుఖంబుండి యంత
నలమహీపాలుఁ డున్నతభక్తి లేమి
తెలిపినరిపుని వధింపఁగాఁ దలఁచి

నలుఁడు పుష్కరునోడించి నిజరాజ్యంబుఁ బొందుట.

కరులు రథంబులు ఘనతురంగములు

దొరలు సామంతమంత్రులు భటుల్ గొలువ
నాదిత్యసంకాశ మగురథం బెక్కి
మోదంబుతో వాద్యములు పెక్కు మ్రోయఁ
జనదేవి నట నుంచి తనర వసిష్ఠుఁ
డనురక్తి దీవింప నతనితోఁ గూడ
రయమున నిషధపురంబున కరిగి
నయ మొప్పఁ బుష్కరనరనాథుఁ గాంచి
ధారుణీనాథుండు తప్పక బలికె
'నారూఢి మున్ను నే నాకలిదేవు
మాయచే నోడితి మహియెల్ల నీకు.
ఆయతంబుగ నిప్పు డట్టిజూదంబు.
నాడుము నీ వన్న' నాతఁడి ట్లనియె
'ఆశంకఁ దగ దిప్పు డాకలిదేవు
ననుమతి లేక నలాధిప' యనిన
విని నవ్వి నలమహీవిభుఁ డిట్టులనియెఁ
'దడయక నీవు జూదం బాడ వేని
విడువుము రాజ్యంబు వేగంబె యిపుడు.
కాకున్న నాతోడఁ గయ్య మొనర్పు
మాకలి యిట కింక నరుదేరఁ' డనిన
నలునితోఁ దొడరి యంతట జూదమాడి
కలితోడు లేమి భాగ్యము నెల్ల నోడి
నగరంబు నెడఁ బాసి నాతియుఁ దానుఁ
బోగులుచుఁ బుష్కరభూపాలుఁ డరిగె.
అప్పుడు వార్ష్ణేయుఁ డయ్యెడ కెలమి

యొప్పఁగాఁ జనుదెంచి యొగిఁ గొల్చియుండె.
ఆవసిష్ఠమునీంద్రుఁ డపుడు భూసురుల
రావించి 'భీమభూరమణునికడకుఁ
జని మీర లిక్కడిచంద మంతయును
వినిపించి దమయంతి వేవేగ దెండు
చనుఁ డంచుఁ' బంపిన జగతీసురేంద్రు
లనురక్తితోఁ బోయి యావిదర్భేశుఁ
గని యది వినిపించి కడు సంతసించి
'యనఘాత్మ నీపుత్రి నంపింపు' మనిన
విని భీమభూపతి వేవేగ తనదు
తనయునితోఁగూడఁ దగురథం బెక్కి
నిద్దంపు రత్నాల నిగనిగల్ గల్గు
పెద్దపల్లకిలోన బిడ్డలతోడ
దమయంతి నిడికొని తనవారు గొల్వ
రమణతో నిషధపురంబున కరిగి
నలరాజచంద్రుని నగరికిఁ బోయె.
అలరుచు నంతలో నావసిష్ఠుండు
కర మొప్పఁ బురము శృంగారింపఁ బనిచి

వసిష్ఠుఁడు నలున కభిషేకము గావించుట.

యరయంగ నేఁబదియాఱుదేశముల
రాజుల రప్పించి రహి నదీనదుల
యాజలనిధి జలం బర్థిఁ దెప్పించి
నలరాజు సింహాసనంబున నిలిపి
యెలమి మంత్రులుఁ బురోహితులును గొలువ

మంగళతూర్యముల్ మద్దెలల్ మ్రోయ
శృంగారవతు లయినచెలులు సేవింప
నరు దైనరత్నసింహాసనంబునను
ధరణీశ్వరునిచెంత దమయంతి నునిచి
హోమాది కృత్యంబు లొనరఁ జేయించి
శ్రీమించఁగా నభిషేకంబుఁ జేసి
కర మొప్పఁ బట్టంబు గట్టినయంతఁ
జిరలీల రాజ్యంబు సేయుచునుండె.
ఆవిదర్భేశున కానలరాజు
హావిరి సాష్టాంగవందన మిడిన
మనమార గీవించి మన్నన వడసి
తనయునిఁగూడి విదర్భేశుఁ డరిగె.
నలుఁ డంతఁ దనగురునాథుని పాద
జలజంబులకు మ్రొక్కి సన్నుతిఁ జేయఁ
గనుఁగొని సంతోషకలితుఁడై యతఁడు
ఘనకృపారస మొల్కఁగాను దీవించి
వలనొప్పఁ దనతపోవనమున కరిగె.
అలరుచు నపుడు దేశాధినాయకులు
వినయంబుతో నలవిభునకు మ్రొక్కి
వినుతులు మఱియుఁ గావింప మోదించి
బహురత్నభూషణాంబరము లొసంగ
మహినాథు లెల్ల సమ్మదమును బొంది
పొందుగాఁ దమతమపురవరంబులకు
నందఱుఁ జని రంత నారాజవిభుఁడు

దమయంతి దాను మోదంబున మించి
సుమబాణుకేళిలో సొంపు దీపింప
నాచంద్రధర సురేంద్రాదులుఁ బొగడ
భూచక్రమెల్ల నేర్పున నేలుచుండె.
అని యిట్లు బృహదశ్వుఁ డాధర్మజునకు
వినిపించెఁ దా మున్ను విన్నమార్గమును
వరుసతో నలచక్రవర్తిచారిత్ర
సరసత గ్రంథ విస్తారంబు గాఁగ
వినుతవాక్యంబుల వెలయంగఁ జెప్పె
ననుచు వాధూలగోత్రాబ్ధిచంద్రుండు
చిరకీర్తిమంతుఁ డాశ్రితహితోదయుఁడు
కరుణాపయోనిధి కందాళదొడ్డ
యాచార్యునకు శిష్యుఁ డైనట్టివైష్ణ
వాచారమూర్తి సత్యదయాపరుండు
పొలుపు మీఱినచక్రపురి దొడ్డఘనుఁడు.
వలనొప్ప నతనికి వర కూర్మితనయుఁ
డకలంకమానసుఁ డతిసత్యధనుఁడు
సకలకవిత్వ వాచావిశారదుఁడు.
తనర నాతనికి విద్యాప్రవీణుండు
జనలోకనుతుఁడు సజ్జనలోకహితుఁడు
తిరువేంగడాచార్య ధీరాగ్రగణ్యుఁ
డరయ నాతనికి నే నాత్మసంభవుఁడ
నమలమానసుఁడ విద్యావిశారదుఁడ.
రమణ నే వరకవి రాఘవాహ్వయుఁడ.

నరహరిఘటికాద్రి నాథునిపేరఁ
బరువడి నే నాంధ్రభాషల వెలయ
నవని లోఁ గవిరాజు లయినట్టి సరస
కవుల సత్కృప నాకుఁ గలుగుటఁ జేసి
యలరార నీ నలాహ్వాయు సచ్చరిత్ర
తలఁచి చెప్పితిఁ బంచతతభాగములుగ
మన మొప్పఁ జదివిన వ్రాసిన వినిన
జనుల కాయుర్భాగ్య సంతతుల్ గలుగు.
ఈచక్రవర్తి నలేంద్రు చారిత్ర
మాచంద్రతారార్కమై యొప్పుఁగాత.

నలచరిత్రము - ద్విపదకావ్యము

సంపూర్ణము.

END OF
TITLE